

ఈనాడు

విజయవాడ 23-7-2025 బుధవారం సిటీ సంపుటి 51 . సంచిక 344

THE LARGEST CIRCULATED TELUGU DAILY

రూ. 6-50 పేజీలు 14

www.eenadu.net

Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



స్థిరాస్తి రంగానికి ఊతం

డెవలప్‌మెంట్ అగ్రిమెంట్, సేల్ కం జీపీఏ స్టాంపు డ్యూటీ తగ్గింపు

4 నుంచి 1 శాతానికి

ప్రభుత్వ ఉత్తర్వులు



ఈనాడు, అమరావతి: స్థిరాస్తి రంగానికి ఊతమిచ్చేలా కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. భూ యజమానులతో చేసుకునే అభివృద్ధి ఒప్పందం (డెవలప్‌మెంట్ అగ్రిమెంట్), సేల్ కం జీపీఏ కింద 4% వరకు చెల్లించాల్సిన స్టాంపు డ్యూటీని ఒక శాతానికి పరిమితం చేస్తూ మంగళవారం ఉత్తర్వులిచ్చింది. ఈ స్టాంపు డ్యూటీని వైకాపా ప్రభుత్వ హయాంలో పెంచారు. భూ యజమానులు, బిల్డర్ల మధ్య జరిగే ఒప్పందాల (ఫ్లాట్లు, పాట్ల కేటాయింపుల నిష్పత్తి, ఇతర షరతులు)ను అనుసరించి 1% నుంచి 4% వరకు (మిగతా 3లో)



క్వార్ట్జ దోచేసిన కాకాణి, అనిల్‌కుమార్




- **అక్రమ మైనింగ్‌తో అడ్డంగా దొరికిన మాజీ మంత్రులు**
- **రుస్తుం మైన్స్‌లో తవ్వి రూ.వందల కోట్ల ఖనిజం దోపిడీ**
- **ఎగుమతిదార్లను బెదిరించి, భారీగా వసూలు చేయించిన అనిల్**
- **మాజీ మంత్రుల ముఖ్య అనుచరుడు శ్రీకాంత్‌రెడ్డి వాంగ్మూలం**

ఈనాడు - అమరావతి, నెల్లూరు: వైకాపా ప్రభుత్వ హయాంలో పలువురు అమాత్యులు అధికారమే అండగా చెలరేగిపోయారు. సహజవనరుల్ని చెరబట్టి, అందినకాడికి దోచేశారు. అదే కోవలో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలోనూ అప్పట్లో మంత్రులుగా ఉన్న కాకాణి గోవర్ధన్‌రెడ్డి, అనిల్‌కుమార్ యాదవ్ ఇలాగే ఇష్టారాజ్యంగా దోపిడీకి తెగబడ్డారు. రూ.వందల కోట్ల విలువైన క్వార్ట్జ్ ఖనిజాన్ని అనుమతుల్లేకుండా తవ్వేసి, విదేశాలకు ఎగుమతి చేసిన కేసులో వీరిద్దరూ అడ్డంగా దొరికిపోయారు. క్వార్ట్జ్ తవ్వకాల్లో నిబంధనలకు విరుద్ధంగా పేలుడు పదార్థాలు వినియోగించడం, అభ్యంతరం వ్యక్తం చేసిన గిరిజనులపై బెదిరింపులకు తెగబడటం వంటి అరాచకాలకూ పాల్పడ్డారు. అనిల్‌కుమార్ యాదవ్ క్వార్ట్జ్ అక్రమ రవాణా, ఎగుమతులతో పాటు, ఇతర ఎగుమతిదారుల్ని బెదిరించి టన్నుకు రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు మామూళ్లు వసూలు చేయించారు. కాకాణి, అనిల్‌కుమార్ యాదవ్‌ల వ్యాపార, ఆర్థిక వ్యవహారాల్లో కీలక పాత్రధారి, వారితో కలిసి ఈ దందాలో పాలుపంచుకున్న ముఖ్య అనుచరుడు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి పోలీసులకు ఇచ్చిన వాంగ్మూలంలో ఈ మొత్తం కుట్రను బయటపెట్టారు. పొదలకూరు మండలం తాటిపర్తి సమీపంలోని రుస్తుం మైన్స్‌లో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై గనులశాఖ ఉప సంచాలకుడు బాలాజీనాయక్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఫిబ్రవరి 16న కేసు నమోదైంది. కాకాణితో పాటు తూర్పు రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైకాపా అభ్యర్థిగా పోటీ చేసిన పేర్నాటి శ్యాంప్రసాద్‌రెడ్డి, ఆ పార్టీ నేతలు వాకాటి శివారెడ్డి, శ్రీనివాసులరెడ్డి సహా మరికొందరిని నిందితులుగా చేర్చారు. ఏ4గా ఉన్న కాకాణి సహా ఇప్పటి వరకు ఆరుగురు అరెస్టయ్యారు. ఏ12గా ఉన్న శ్రీకాంత్‌రెడ్డిని సోమవారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేశారు. ఏ11 ఏనుగు శశిధర్‌రెడ్డి కూడా నెల్లూరు డీఎస్పీకి (మిగతా 3లో)



క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో నిందితుడు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డిని కోర్టుకు తరలిస్తున్న పోలీసులు

అభిశంసనే చిచ్చురేపిందా?



- **ధన్‌ఖడ్ రాజీనామాపై అనేక ప్రశ్నలు**
- **2027లో పదవీ విరమణ చేస్తానన్న కొద్ది రోజుల్లోనే రాజీనామా**
- **సోమవారం సాయంత్రం బీఏసీ సమావేశానికి హాజరుకాని నడ్డా, రిజిజు**
- **బలవంతపు రాజీనామా అన్న కాంగ్రెస్**

ఈనాడు ప్రత్యేక విభాగం

ఉప రాష్ట్రపతిగా ఇంకా రెండేళ్ల పదవీ కాలం ఉన్నప్పటికీ రాజీనామా చేస్తూ జగదీప్ ధన్‌ఖడ్ తీసుకున్న అనూహ్య నిర్ణయం దేశ రాజకీయాల్లో సంచలనం రేపుతోంది. అనారోగ్య కారణాలతోనే రాజీనామా చేసినట్లు ఆయన పేర్కొన్నప్పటికీ విపక్షాలు వ్యక్తం చేస్తున్న అనుమానాలతో మరింకేవైనా కారణాలున్నాయా అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై అధికార కూటమి నేతలు పెద్దగా స్పందించలేదు. ప్రతిపక్షాలు మాత్రం దీని వెనుక ఏదో ఉందని అంటున్నాయి. ఇప్పటివరకైతే అసలు కారణమేంటనేది ధన్‌ఖడ్‌కే తెలుసని అభిప్రాయపడుతున్నాయి. ఇది కచ్చితంగా బలవంతపు రాజీనామాయేనని కాంగ్రెస్ వ్యాఖ్యానించింది. ధన్‌ఖడ్ రాజీనామాకు వివిధ కారణాలు ప్రచారంలో ఉన్నాయి. అందులో..

1. జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసన కోసం అధికార పక్షం ప్రమేయం లేకుండా కేవలం ప్రతిపక్షాలు ఇచ్చిన నోటీసునే పరిగణనలోకి తీసుకోవడం.

2. వీహెచ్‌పీ కార్యక్రమంలో వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి అభిశంసనకు అధికార పక్షం అంగీకరించకపోయినా ప్రతిపక్షాలు (మిగతా 3లో)

ధన్‌ఖడ్ రాజీనామా ఆమోదం

రాష్ట్రపతి ముర్ము నిర్ణయం

నోటిపై చేసిన కేంద్ర హోంశాఖ

3లో

దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్య కేసులో సమగ్ర విచారణకు అనుమతి

90 రోజుల్లో అనుబంధ అభియోగ పత్రం దాఖలు చేయాలి

రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి ఆదేశం

కేసులో తేలనున్న వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు పాత్ర

2లో

కాలువలకు నీటిని విడుదల చేయండి



కవర్లు కట్టి పండించిన మామిడి పండ్లను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు

- **ఆగస్టు 20లోగా బర్లీ పొగాకు కొనుగోలు పూర్తిచేయాలి**
- **ఆగస్టు 15లోగా మామిడి రైతులకు చెల్లింపులు చేయాలి**
- **అపార్ట్‌మెంట్ల ముంగిటకే మొబైల్ రైతుబజార్లు**
- **వ్యవసాయ, అనుబంధ రంగాల సమీక్షలో సీఎం చంద్రబాబు**

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని అన్ని కాలువల ద్వారా సాగు అవసరాలకు నీటిని విడుదల చేయాలని.. చివరి ఆయకట్టు వరకూ అందేలా చూడాలని జలవనరులశాఖ అధికారులను సీఎం చంద్రబాబు ఆదేశించారు. 'నాగార్జునసాగర్ కుడికాలువకు నీటిని విడుదల చేయండి. కాలువల్లో పూడిక తీయించి ప్రవాహాలకు అంతరాయం లేకుండా చూడాలి. సాగునీటి సంఘాల ప్రతినిధులతో వర్చువల్ సమావేశాలు నిర్వహిస్తాం' అని చెప్పారు. వ్యవసాయ అధికారులు, సిబ్బందికి సీజన్‌లో.. వ్యవసాయేతర పనులు అప్పగించవద్దని కలెక్టర్లకు సీఎం స్పష్టం చేశారు. 'ఆగస్టు 20లోగా (మిగతా 3లో)

కోసేస్తాం.. నరికేస్తాం.. అంటే చేతులు కట్టుకుని కూర్చోం!



- **వైకాపావాళ్ల తాటాకు చప్పుళ్లకు బెదిరేవాళ్లెవరూ లేరిక్కడ**
- **సినిమాలు చేస్తున్నానని నన్ను విమర్శిస్తారా?**
- **వాళ్లలా నాకు పత్రికలు, టీవీలు, సిమెంట్ ఫ్యాక్టరీలు, బినామీ వ్యాపారాలు లేవు**
- **వైకాపా నేతలపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మండిపాటు**

3లో

28న జస్టిస్ దేవానంద్ ప్రమాణం

ఈనాడు, అమరావతి: ఏపీ హైకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ బట్టు దేవానంద్ ఈ నెల 28న (సోమవారం) ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఆ రోజు హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్.. జస్టిస్ దేవానంద్‌తో ప్రమాణం చేయించనున్నారు. ఈ మేరకు హైకోర్టు సీజేకు అధికారం కల్పిస్తూ గవర్నర్ ఆమోదం తెలిపారు. దీనిపై రాష్ట్ర న్యాయశాఖ ఇప్పటికే ఉత్తర్వులు జారీ చేసింది. మద్రాస్ హైకోర్టు న్యాయమూర్తిగా పనిచేస్తున్న జస్టిస్ దేవానంద్‌ను తిరిగి ఏపీ హైకోర్టుకు బదిలీ చేస్తూ కేంద్ర న్యాయశాఖ ఇటీవల నోటిఫికేషన్ జారీ చేసిన విషయం తెలిసిందే.

100 సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

28 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర అటవీ శాఖలో 100 సెక్షన్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నెల 28 నుంచి వచ్చే నెల 17 వరకు దరఖాస్తులు స్వీకరించనుంది. 2025 సెప్టెంబరు 7న ఆఫ్‌లైన్‌లో ప్రాథమిక పరీక్ష జరగనుంది. ప్రధాన పరీక్ష తేదీ తర్వాత వెల్లడిస్తారు. అర్హతలు, సిలబస్, మెడికల్ టెస్టు తదితర పూర్తి వివరాలు ఏపీపీఎస్సీ వెబ్‌సైట్లో ఉన్నాయని కార్యదర్శి రాజబాబు ఓ ప్రకటనలో తెలిపారు. అటవీ శాఖలో ఫారెస్ట్ బీట్ ఆఫీసర్, అసిస్టెంట్ బీట్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీ (మొత్తం పోస్టులు-691)కి ఈ నెల 14న నోటిఫికేషన్ ఇచ్చిన విషయం తెలిసిందే. ఏపీపీఎస్సీ నుంచి త్వరలో మరిన్ని నోటిఫికేషన్లు వచ్చే అవకాశం ఉంది.

ప్రతి పీహెచ్‌సీకీ ప్రసూతి సహాయకురాలు

- సహజ ప్రసవాలు పెంచేందుకు కార్యాచరణ
- వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో సిజేరియన్ ప్రసవాలు తగ్గించాలని వైద్య ఆరోగ్య శాఖ నిర్ణయించింది. తొలి దశలో 86 ప్రభుత్వ ఆసుపత్రుల్లో సుశిక్షితులైన 1,264 మంది ప్రసూతి సహాయకులను నియమించేందుకు సిద్ధమవుతోంది. గిరిజన, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఒక ప్రసూతి సహాయకురాలు చొప్పున ఉండేలా చర్యలు చేపడుతోంది. ప్రసూతి సేవల్లో నాణ్యత పెంచేలా మిడ్‌వైఫ్ లెడ్ కేర్ యూనిట్ (ఎంఎల్‌సీయూ) పథకం ద్వారా సమర్థ సేవలు అందించే దిశగా ఈ చర్యలు చేపట్టింది. ఆరోగ్య మిషన్ కింద ప్రసూతి సహాయకుల ద్వారా సహజ ప్రసవాలను ప్రోత్సహించే పథకంపై చర్చించి ఆమోదం తెలిపినట్లు వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మంగళవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ప్రసూతి సహాయకులు అందించాల్సిన సేవలపై జాబ్‌చార్ట్ రూపొందించి ప్రసూతి సేవల నాణ్యతను పెంచేలా చూడాలని ఆదేశించారు. ప్రస్తుతం ప్రసవ సమయాల్లో ప్రభుత్వ ఆసుపత్రుల్లోని స్టాఫ్ నర్సులే ప్రసూతి సేవలను అందిస్తున్నారని.. వీరికి వివిధ అంశాల్లో సరైన పరిజ్ఞానం, శిక్షణ లేకపోవడం సమస్యగా మారిందని పేర్కొన్నారు. ఎంపిక చేసిన స్టాఫ్ నర్సులకు 'ప్రసవానికి ముందు- ప్రసవ సమయం- ప్రసవం అనంతరం' సేవలపై 18 నెలల పాటు సమగ్ర శిక్షణ ఇస్తామని వెల్లడించారు.

ఈఏపీసెట్ సీట్ల కేటాయింపు నేడు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఇంజినీరింగ్ ప్రవేశాలకు నిర్వహించిన ఈఏపీసెట్ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు జాబితాను బుధవారం మధ్యాహ్నం విడుదల చేయనున్నారు. మొదట ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం మంగళవారం విడుదల చేయాల్సి ఉండగా.. సీట్ల కేటాయింపు ప్రోగ్రామ్ రన్నింగ్‌కు ఎక్కువ సమయం పట్టడంతో బుధవారం విడుదల చేయాలని నిర్ణయించారు. కౌన్సెలింగ్‌లో దాదాపు 1.20 లక్షల మంది బ్రాంచీలు, కళాశాలల ఎంపికకు వెబ్ ఐచ్ఛికాలు నమోదు చేసుకున్నారు.

మాజీ ఎమ్మెల్యే గిరిధర్‌పై ఆర్ఆర్ యాక్ట్ అమలుకు చర్యలు

రూ.43.5 కోట్ల బకాయిల వసూలుకు ఆస్తుల వేలం?

గుంటూరు విద్యుత్తు, న్యూస్‌టుడే: గుంటూరు పశ్చిమ నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్‌కు చెందిన రెండు స్పిన్నింగ్ మిల్లుల విద్యుత్తు బిల్లుల బకాయిలు రూ.43.5 కోట్ల వసూలుకు రెవెన్యూ రికవరీ చట్టం అమలుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ఆస్తులను జప్తు చేసేందుకు విద్యుత్తు సంస్థ అధికారులు కలెక్టరుకు మంగళవారం దస్త్రం పంపారు. ప్రతిపాదనలు జారీచేసి ఆస్తుల వేలం వేయడంపై కలెక్టర్ నిర్ణయం తీసుకుంటారు. గత ప్రభుత్వ హయాంలో బకాయిలను వాయిదాల్లో చెల్లించేందుకు గిరిధర్ ప్రత్యేక ఉత్తర్వులు తెచ్చుకున్నారు. ఆ నిబంధనలను పాటించలేదు. వైకాపా అధికారంలో ఉన్నంతకాలం బకాయిల వసూలుకు అధికారులు చర్యలు చేపట్టలేదు. కూటమి అధికారంలోకి వచ్చాక జనవరిలో చెల్లించాలని నోటీసులు పంపినా స్పందించలేదు. పరిధిలోని ఆ రెండు మిల్లుల మీటర్లు తొలగించి సరఫరా నిలిపివేశారు.

దళిత యువకుడు సుబ్రహ్మణ్యం హత్య కేసులో సమగ్ర విచారణకు అనుమతి

ఈనాడు-రాజమహేంద్రవరం, న్యూస్‌టుడే-కంబాలచెరువు: కాకినాడకు చెందిన దళిత యువకుడు, ఎమ్మెల్సీ అనంత సత్య ఉదయభాస్కర్ ఎలియాస్ అనంతబాబు మాజీ డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యాన్ని కిరాతకంగా హత్యచేసి మృతదేహాన్ని డోర్ డెలివరీ చేసిన కేసులో కీలక కదలిక వచ్చింది. ఈ కేసు తదుపరి విచారణకు అనుమతిస్తూ, 90 రోజుల్లో అనుబంధ (సప్లిమెంటరీ) అభియోగపత్రం దాఖలు చేయాలని రాజమహేంద్రవరం ఎస్సీ, ఎస్టీ కోర్టు న్యాయమూర్తి సింగవరపు ఉమా సునంద మంగళవారం ఆదేశాలిచ్చారు. వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి పోలీసు అధికారులు సమగ్రంగా దర్యాప్తు చేయకుండా కేవలం ఎమ్మెల్సీ అనంతబాబునే నిందితుడిగా చేర్చారని.. ఇందులో మరింతమంది పాత్ర ఉందనే అనుమానాలు ఉన్నాయని సుబ్రహ్మణ్యం తల్లిదండ్రులు రాష్ట్ర ప్రభుత్వానికి గతంలో విన్నవించారు. సమగ్ర దర్యాప్తు చేసి బాధ్యులపై చర్యలు తీసుకుని తమకు న్యాయం చేయాలని కోరారు.


వైకాపా ఎమ్మెల్సీ అనంతబాబు


వీధి సుబ్రహ్మణ్యం

ఈ మేరకు కూటమి ప్రభుత్వం కేసు విచారణకు ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుతోపాటు, ప్రాసిక్యూషన్‌కు సహకరించేందుకు ప్రముఖ న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావును నియమించింది. కేసు సమగ్ర దర్యాప్తునకు అనుమతి కోరుతూ ప్రాసిక్యూషన్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఈ నెల 18న విచారించిన న్యాయస్థానం మంగళవారం తీర్పు ఇచ్చింది.

కీలక పాత్రధారుల చుట్టూ బిగుస్తున్న ఉచ్చు

కాకినాడలో 2022 మే 19న వీధి సుబ్రహ్మణ్యం హత్య జరిగింది. తానే ఈ హత్య చేశానని అనంతబాబు పోలీసుల సమక్షంలో అంగీకరించి జైలుకు వెళ్లారు. మధ్యంతర బెయిల్ పొందిన ఆయన రెండేళ్లుగా బయట తిరుగుతున్నారు. హత్య జరిగినప్పుడు.. అంతకుముందు, తరువాత నిందితుడు ఎవరెవరితో ఏం మాట్లాడారు? ఘటనా ప్రదేశంలో ఎవరెవరు ఉన్నారనే అంశాన్ని గూగుల్ టేక్ అవుట్, టవర్ లొకేషన్, సీసీ ఫుటేజీలు, కాల్ డేటా ఆధారంగా గుర్తించి విచారించాల్సి ఉంది. ఎమ్మెల్సీ గన్‌మెన్‌ను నాడు సమగ్రంగా విచారించలేదనే ఆరోపణలున్నాయి. సుబ్రహ్మణ్యం శరీరంపైన 31, అంతర్గతంగా మరో మూడు బలమైన గాయాలు ఉన్నాయి. ఇవన్నీ చేయడం ఒక్క అనంతబాబు వల్ల సాధ్యమా? మృతదేహాన్ని ఎవరి సహాయం లేకుండా ఒక్కరే కారులో వేశారా? అనే అనుమానాలు ఉన్నట్లు.. ముప్పాళ్ల సుబ్బారావు పేర్కొన్నారు. సిట్ అధికారులు సమగ్ర దర్యాప్తు చేసి గత అధికారుల విచారణలోని లోపాలు వెలికితీసి, హత్యలో ఎవరెవరి పాత్ర ఉందో బయటపెట్టాలని కోరారు. ప్రాసిక్యూషన్ తరఫున కె.రాధాకృష్ణరాజు, డి.శ్రీవాణీభాయ్ వాదనలు వినిపించారు. ఎమ్మెల్సీతోపాటు ఇతర పాత్రధారుల ప్రమేయం కూడా త్వరలో బయటపడనుందని ఈ సందర్భంగా ముప్పాళ్ల సుబ్బారావు స్పష్టం చేశారు.


వివరాలు వెల్లడిస్తున్న న్యాయవాది ముప్పాళ్ల సుబ్బారావు

ఖండాంతరాలు దాటిన మద్యం కుంభకోణం

- విచారణకు ఇంటర్‌పోల్, సీబీఐ సాయం తీసుకోవాలి
- వాదనలు వినిపించిన ప్రాసిక్యూషన్స్ జేడీ
- చెవిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై ముగిసిన వాదనలు
- తీర్పు వాయిదా వేసిన విజయవాడ ఏసీబీ కోర్టు

ఈనాడు, అమరావతి: 'వైకాపా హయాంలో జరిగిన మద్యం కుంభకోణం ఖండాంతరాలు దాటింది. ఏపీలో దోచుకున్న డబ్బు చాలా దేశాలకు తరలింది. వాటి మూలాలను వెలికితీయడానికి ఇంటర్‌పోల్, సీబీఐ సాయం తీసుకుంటాం. మద్యం దందాలో దోచుకున్న సొమ్మును చెవిరెడ్డి.. ఎన్నికల సమయంలో వైకాపా అభ్యర్థులకు చేరవేయడంలో కీలక పాత్ర పోషించారు' అని ప్రాసిక్యూషన్స్ జేడీ రాజేంద్రప్రసాద్ వాదించారు. వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి బెయిల్ పిటిషన్‌పై మంగళవారం విజయవాడలోని ఏసీబీ కోర్టులో వాదనలు జరిగాయి. రాజేంద్రప్రసాద్ వాదనలు కొనసాగిస్తూ.. 'హైదరాబాద్ నుంచి విజయవాడకు రూ.8 కోట్ల నగదును సరకు రవాణా వాహనంలో ప్రత్యేక అరలు ఏర్పాటు చేసి, తరలిస్తుండగా ఎన్టీఆర్ జిల్లా సరిహద్దులో గరికపాడు చెక్‌పోస్టు వద్ద పట్టుకున్నారు. అప్పుడు ఫోన్ ధ్వంసం చేసి, పారిపోవాలని చెవిరెడ్డి.. తన గన్‌మన్ గిరికి ఆదేశాలు ఇచ్చారు. దీన్ని గన్‌మన్ తన స్టేట్‌మెంట్‌లో పేర్కొన్నారు. సాక్షులు, సహ నిందితులు ఇచ్చిన వాంగ్మూలం, కాల్ డేటా రికార్డ్, టవర్ లొకేషన్లను విశ్లేషించాక చెవిరెడ్డి భాస్కరరెడ్డి నేరానికి పాల్పడ్డారని తేలింది. సాంకేతిక సాక్ష్యాధారాలు ఒకదానితో మరొకటి సరిపోలుతున్నాయి. మద్యం ముడుపుల సొమ్మును తిరుపతి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (తుడా) వాహనాల్లో తరలించారు. టోల్‌ప్లాజాల్లోని సీసీ కెమెరాల దృశ్యాలే ఇందుకు సాక్ష్యం. కుంభకోణం ద్వారా వచ్చిన ముడుపుల సొమ్మును ఒక చోట నుంచి మరోచోటికి తరలించడంలో చెవిరెడ్డి కీలకంగా వ్యవహరించారు. కేసు దర్యాప్తు ఇంకా పూర్తి కాలేదు. చెవిరెడ్డి పాత్రపై ఇంకా ఛార్జిషీట్ దాఖలు చేయనందున బెయిల్ పిటిషన్‌ను డిస్మిస్ చేయండి' అని వాదించారు.

ఆధారాల్లేకుండానే కేసు
నమోదు: చెవిరెడ్డి న్యాయవాది

కుంభకోణం జరిగిందంటూ ఎటువంటి ఆధారాల్లేకుండానే సిట్ కేసు నమోదు చేసిందని నిందితుడి తరఫు న్యాయవాది నాగేశ్వరరావు వాదించారు. పిటిషనర్ ఇప్పటికే 34 రోజులుగా రిమాండ్‌లో ఉన్నారని, తీవ్ర వెన్నునొప్పి సమస్యతో ఇబ్బంది పడుతున్నారని అన్నారు. ఈ కేసులో సిట్ ఇప్పటి వరకు ఎలాంటి కీలక ఆధారాలను కోర్టు ముందు ఉంచలేకపోయిందన్నారు. ఇరుపక్షాల వాదనలు విన్న ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు.. తుది తీర్పు నిమిత్తం ఈ నెల 28కి వాయిదా వేశారు.

ఏ8, ఏ30 బెయిల్ పిటిషన్లపైనా..

చాణక్య (ఏ8), దిలీప్ (ఏ30) దాఖలు చేసిన బెయిల్ పిటిషన్లపైనా కోర్టులో వాదనలు జరిగాయి. తీర్పు నిమిత్తం న్యాయాధికారి ఈ నెల 25కి వాయిదా వేశారు. తమకు బెయిల్ మంజూరు చేయాలని ధనుంజయరెడ్డి (ఏ31), పి.కృష్ణమోహనరెడ్డి (ఏ32), బాలాజీ గోవిందప్ప (ఏ33)లు మంగళవారం దాఖలు చేసిన పిటిషన్లను కోర్టు అనుమతించింది. విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది.

వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డికి అడిగినవన్నీ ఇచ్చారు

- ప్రత్యేక గది, కూలర్, బయటి భోజనం
- సహాయకుడు, మినరల్ వాటర్, టీవీ..
- ప్రత్యేక వసతులకు కోర్టు అనుమతి

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణంలో అరెస్టయి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి ప్రత్యేక వసతుల కోసం దాఖలు చేసుకున్న పిటిషన్లను కోర్టు అనుమతించింది. నిందితుడు కోరిన వసతులకు అంగీకరిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయాధికారి భాస్కరరావు.. మంగళవారం రాత్రి ఆదేశాలు జారీ చేశారు. వెస్ట్రన్ కమోడ్ ఉన్న ప్రత్యేక గది, కూలర్, సహాయకుడు, ఇనుప మంచం, దిండు, దుప్పటి, బెడ్, మినరల్ వాటర్, కుర్చీ, టేబుల్, పెన్ను, కాగితాలు, వార్తా పత్రికలు, నిబంధనలు అనుమతిస్తే పార్లమెంట్ సమావేశాలను చూడ్డానికి టీవీ ఏర్పాటు చేయవచ్చని ఆ ఆదేశాల్లో పేర్కొన్నారు. అలాగే బయటి నుంచి భోజనం తెప్పించుకునేందుకు అనుమతించారు. దీనికి సరఫరాదారు నుంచి అండర్‌టేకింగ్ లెటర్ ఇవ్వాలని ఆదేశించారు. దోమల కాయిల్స్ వినియోగించుకోవచ్చుని, అవసరమైన మందులు జైలులో లేకపోతే బయట తీసుకోవచ్చని తెలిపారు. ఇద్దరు న్యాయవాదులు, బంధువులతో వారానికి మూడు ములాఖత్‌లకు అనుమతించారు. ఈ వసతులకు అయ్యే ఖర్చును పిటిషనర్ భరించాలని ఆ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అంతక్రితం మంగళవారం ఉదయం రాజమహేంద్రవరం కేంద్ర కారాగారం డిప్యూటీ సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు కోర్టుకు హాజరయ్యారు. మిథున్‌రెడ్డికి వసతుల విషయంలో తాము సుప్రీం కోర్టు మార్గదర్శకాల ప్రకారం నడుచుకుంటామని తెలిపారు. బయటి నుంచి ఆహారానికి అనుమతిస్తే సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుందన్నారు. ప్రత్యేక వసతులపై కోర్టు ఆదేశాలిస్తే వాటిని పాటిస్తామని తెలిపారు.

మిథున్‌రెడ్డితో మాజీ మంత్రి వేణు ములాఖత్

రాజమహేంద్రవరం (కంబాలచెరువు), న్యూస్‌టుడే: మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో ఉన్న వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డితో మాజీ మంత్రి చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, మాజీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు మంగళవారం ములాఖత్ అయ్యారు. అనంతరం వారు జైలు బయట విలేకర్లతో మాట్లాడారు. ప్రభుత్వం కక్షపూరితంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఒక ఎంపీగా ఉన్న వ్యక్తి అడిగిన కనీస వసతులు కల్పించకుండా సాధారణ ఖైదీగానే చూస్తున్నారన్నారు. న్యాయవాది హుస్సేన్ సైతం మిథున్‌రెడ్డిని కలిశారు. మిథున్‌రెడ్డి వర్గం రాజమహేంద్రవరంలోని ఆర్వీనగర్‌లో ఓ విల్లాను.. ఏవీఏ రోడ్డు, జేఎన్ రోడ్డులో అపార్ట్‌మెంట్లను అద్దెకు తీసుకున్నారు. మిథున్‌రెడ్డిని అక్రమంగా అరెస్టు చేశారని మాజీ ఎంపీ, వైకాపా రాష్ట్ర అధికార ప్రతినిధి మార్గాని భరత్‌రామ్ ఆరోపించారు. కేంద్ర కారాగారం వద్ద ఆయన మాట్లాడారు. ప్రభుత్వం మద్యం అమ్మకాలు చేస్తే అవినీతికి ఆస్కారం ఎక్కడుంటుందన్నారు. పార్లమెంటు వర్షాకాల సమావేశాల ప్రారంభం సందర్భంగా వైకాపా ఎంపీ అరెస్టుతో ప్రభుత్వం సంచలనం సృష్టించాలనుకుందని విమర్శించారు.


రాజమహేంద్రవరం కేంద్ర కారాగారంలో మిథున్‌రెడ్డితో ములాఖత్ అనంతరం బయటకొస్తున్న మాజీ మంత్రి వేణు

మద్యం కుంభకోణం నిందితులు దుబాయ్ పారామౌంట్ టవర్‌లో ఉన్నారు

- ఫోన్ ట్యాపింగ్ నిందితుడు శ్రవణ్‌రావుతో కలిసే గడిపారు
- సిట్‌కు వ్యాపారవేత్త ఆకర్ష్ కృష్ణ వాంగ్మూలం

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో నిందితులైన బూనేటి చాణక్య (ఏ8), పురుషోత్తం వరుణ్‌కుమార్ (ఏ40) సహా ఈ ముఠాలోని మరికొంతమంది దుబాయ్ బిజినెస్ బే ప్రాంతంలోని పారామౌంట్ టవర్ హోటల్ అండ్ రెసిడెన్సీస్ భవనాన్ని డెన్‌గా మార్చుకున్నారని ఈ కేసులో కీలక సాక్షి హైదరాబాద్‌కు చెందిన వ్యాపారవేత్త ఆకర్ష్ కృష్ణ సిట్‌కు వాంగ్మూలమిచ్చారు. తెలంగాణలో నమోదైన ఫోన్ ట్యాపింగ్ కేసు నిందితుడు శ్రవణ్‌రావుతో కలిసి వీరు ఈ భవనంలోని 5801 నంబరు ఫ్లాట్‌లో కొన్నాళ్లు ఉన్నారని వివరించారు. ఫిబ్రవరి 27 నుంచి ఏప్రిల్ 27 వరకూ రెండు నెలలపాటు వీరు ఈ ఫ్లాట్‌లో గడిపారని తెలిపారు. ఈ ఫ్లాట్ సహ యజమాని అయిన ఆకర్ష్ కృష్ణ మంగళవారం విజయవాడలోని సిట్ కార్యాలయంలో విచారణకు హాజరయ్యారు. మద్యం కుంభకోణం నిందితులు, శ్రవణ్‌రావు ఆ ఫ్లాట్‌లో కలిసి ఉన్నట్లు నిరూపించే ఆధారాల్ని సిట్‌కు సమర్పించారు. కొన్ని కీలక పత్రాల్ని అందజేసి వాంగ్మూలమిచ్చారు. విశ్వసనీయ సమాచారం మేరకు అందులోని ప్రధానాంశాలివి. 'శ్రవణ్‌రావుతో కలిసి 2023లో దుబాయ్‌లోని పారామౌంట్ టవర్ హోటల్‌లో 1,340 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉన్న ఫ్లాట్ కొన్నా. నా భార్య ఆర్.కావ్య, శ్రవణ్‌రావు భార్య స్వాతిరావుకు చెరి సగం వాటాలతో ఈ ఫ్లాట్ రిజిస్టరైంది. ఆ వెంటనే డీలక్స్ హాలిడే హోమ్స్ సంస్థకు ఫ్లాట్ అద్దెకు ఇచ్చారు. అయితే శ్రవణ్‌రావు మమ్మల్ని పూర్తిగా పక్కనపెట్టేసి స్వాతిరావు పేరుతో అద్దె ఒప్పందం చేసుకుని ఫ్లాట్‌ను ఆయన ఆధీనంలో పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలోనే డీలక్స్ హాలిడే హోమ్స్ ద్వారా ఆ ఫ్లాట్‌లో ఎవరెవరు అద్దెకు దిగుతున్నారనే వివరాలను సేకరించగా.. మద్యం కుంభకోణం నిందితులతో కలిసి శ్రవణ్‌రావు ఉన్నట్లు తేలింది' అని ఆకర్ష్ కృష్ణ సిట్‌కు వాంగ్మూలమిచ్చారు. దాదాపు 6 గంటలపాటు సిట్ అధికారులు ఆయన్ను విచారించారు.

మిథున్‌రెడ్డి అరెస్టు గురించి బులెటిన్‌లో వెల్లడించిన లోక్‌సభ

ఈనాడు, దిల్లీ: మద్యం కుంభకోణం కేసులో వైకాపా ఎంపీ పీవీ మిథున్‌రెడ్డి అరెస్టు గురించి లోక్‌సభ సచివాలయం మంగళవారం లోక్‌సభ బులెటిన్‌లో వెల్లడించింది. విజయవాడలోని సిట్ ఐఓగా ఉన్న అదనపు ఎస్పీ ఈ నెల 19న పంపిన ఈ అరెస్టు సమాచారం తమకు 21న అందినట్లు ఇందులో పేర్కొంది. "2019-24 మధ్య ఏపీ స్టేట్ బెవరేజెస్ కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న అవకతవకలపై సీఐడీ పోలీస్‌స్టేషన్‌లో నమోదుచేసిన కేసులో ఆయన పాత్రపై విజయవాడ సిట్/సీఐడీ పోలీస్‌స్టేషన్ అధికారులు లోక్‌సభ సభ్యుడు పీవీ మిథున్‌రెడ్డిని ఈ నెల 19న రాత్రి 8.45 గంటలకు అరెస్టు చేశారు" అని లోక్‌సభ సచివాలయం పేర్కొంది.

గ్రహం అనుగ్రహం

23–7–2025 బుధవారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; గ్రీష్మ రుతువు, ఆషాఢ మాసం, బహుళపక్షం
చతుర్దశి: రా. 2-30 తదుపరి అమావాస్య
ఆర్ద్ర: సా. 6-38 తదుపరి పునర్వసు
వర్జ్యం: లేదు
అమృత ఘడియలు: ఉ. 9-05 నుంచి 10-37 వరకు
దుర్ముహూర్తం: ఉ. 11-40 నుంచి 12-31 వరకు
రాహుకాలం: మ. 12-00 నుంచి 1-30 వరకు
సూర్యోదయం: ఉ.5.39; సూర్యాస్తమయం: సా.6.33
మాసశివరాత్రి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
విజయనగరం	35.0	25.0
తాడేపల్లిగూడెం	34.2	26.7
విశాఖపట్నం	34.0	25.8
రాజమహేంద్రవరం	33.5	24.5
నెల్లూరు	32.8	26.8
తిరుపతి	32.6	25.8
కర్నూలు	32.4	24.2
శ్రీకాకుళం	32.0	26.0
విజయవాడ	32.0	25.0
ఖమ్మం	31.8	23.4
హైదరాబాద్	31.8	23.1
ఒంగోలు	31.7	25.0
నిజామాబాద్	31.5	24.9
అనంతపురం	31.3	23.2
గుంటూరు	31.0	26.0
కరీంనగర్	31.0	24.0
కడప	30.0	24.0
నరసాపురం	28.4	24.4

మున్సిపల్ కార్మికుల సమ్మె తాత్కాలిక వాయిదా


విలేకరులతో మాట్లాడుతున్న ఉమామహేశ్వరరావు తదితరులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే: మున్సిపల్ కార్మికులకు జీతాలు పెంచుతామని రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇవ్వడంతో సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ఉమామహేశ్వరరావు తెలిపారు. మంగళవారం ఆయన విజయవాడలో విలేకరులతో మాట్లాడుతూ.. "డిమాండ్ల సాధనకు నిర్బంధాలు, బెదిరింపులను ఎదుర్కొని పది రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా, 28 రోజులుగా విజయవాడలో పోరాడిన మున్సిపల్, ఇంజినీరింగ్, పారిశుద్ధ్య కార్మికులకు కృతజ్ఞతలు. పారిశుద్ధ్య కార్మికులకు తల్లికి వందనం పథకం అమలు కాకపోవడంతో ఆ విషయాన్ని ఫెడరేషన్ నాయకత్వం మంత్రి నారాయణ దృష్టికి తీసుకెళ్లింది. ఆయన స్పందిస్తూ కార్మిక కుటుంబాలకు ఆ పథకం అమలు చేస్తామని హామీ ఇచ్చారు" అని పేర్కొన్నారు. సమావేశంలో ఫెడరేషన్ కోశాధికారి ఎస్.జ్యోతిబసు, నాయకులు టి.తిరుపతమ్మ, టి.చిన్న పాల్గొన్నారు.

మద్యం ముఠాకు రిమాండ్ పొడిగింపు


మద్యం కేసుకు సంబంధించి ఏసీబీ ప్రత్యేక కోర్టులో విచారణకు హాజరైన రాజ్ కెసిరెడ్డి, గోవిందప్ప బాలాజీ, పైలా దిలీప్, చాణక్య, కృష్ణమోహన్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, చెవిరెడ్డి భాస్కరరెడ్డి, నవీన్‌కృష్ణ

- ఆగస్టు 1 వరకు పెంచుతూ ఏసీబీ కోర్టు ఉత్తర్వులు

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం నిందితులకు వచ్చే నెల 1 వరకు జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగిస్తూ విజయవాడలోని ఏసీబీ ప్రత్యేక కోర్టు మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రధాన నిందితుడు రాజ్ కెసిరెడ్డి, సీఎంవో మాజీ కార్యదర్శి ధనుంజయరెడ్డి, జగన్ ఓఎస్డీ కృష్ణమోహన్‌రెడ్డి, భారతి సిమెంట్స్ డైరెక్టర్ గోవిందప్ప బాలాజీ, ఎస్పీవై డిస్టిలరీస్ మాజీ డైరెక్టర్ సజ్జల శ్రీధర్‌రెడ్డి, బూనేటి చాణక్య, పైలా దిలీప్, వైకాపా నేత చెవిరెడ్డి భాస్కరరెడ్డి, వెంకటేశ్ నాయుడు, నవీన్ కృష్ణ, బాలాజీ యాదవ్‌లను కోర్టులో హాజరుపరచగా, వారందరికీ రిమాండ్‌ను పొడిగిస్తూ న్యాయాధికారి భాస్కర్‌రావు ఉత్తర్వులిచ్చారు. గుంటూరు జిల్లా కారాగారం నుంచి చెవిరెడ్డి పీఏలు నవీన్ కృష్ణ, బాలాజీ యాదవ్‌లను ఎస్కార్ట్‌తో తీసుకురాగా, మిగిలిన తొమ్మిది మందిని విజయవాడ కారాగారం నుంచి తీసుకువచ్చారు. తిరుపతిలోని స్విమ్స్‌లో చికిత్స తీసుకునేందుకు అనుమతించాలని వైకాపా నేత చెవిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై బుధవారం నిర్ణయం వెలువరించనున్నట్లు న్యాయాధికారి ప్రకటించారు.

బాలాజీ యాదవ్‌కు నోటీసులు


చెవిరెడ్డి పీఏ బాలాజీ యాదవ్‌కు సిట్ నోటీసులు జారీ చేసింది. అరెస్టు సమయంలో బాలాజీ వద్ద సీజ్ చేసిన రూ.3.5 లక్షల నగదు, మద్యం కుంభకోణంలోని సొత్తుగా పరిగణిస్తున్నామని, దానిపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే తెలపాలని సిట్ అధికారులు పేర్కొన్నారు.

కడప జైల్లో ఐదుగురు సిబ్బందిపై వేటు

- ఖైదీలకు ఫోన్లు అందిస్తుండటంపై చర్యలు

ఈనాడు-కడప, న్యూస్‌టుడే-కడప నేరవార్తలు: కడప కేంద్ర కారాగారంలో ఐదుగురు సిబ్బందిపై సస్పెన్షన్ వేటు పడింది. జైల్లో ఖైదీలకు ఫోన్లు ఇస్తున్నారనే అభియోగాలపై జైలర్ గోవిందరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ కమలాకర్, వార్డెన్లు వర్మ, అప్పారావు, నారాయణరావులను సస్పెండ్ చేస్తూ జైళ్ల శాఖ డీజీ అంజనాకుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. వైఎస్సార్ కడప జిల్లా చాపాడుకు చెందిన ఎర్రచందనం స్మగ్లర్ జాకీర్.. పీడీ చట్టం కింద గత నాలుగు నెలలుగా జైల్లో ఉన్నారు. ఈ క్రమంలో అతడికి బయటి నుంచి ఫోన్లు అందిస్తున్నారు. అందుకు ప్రతిఫలంగా జైలు అధికారులు, సిబ్బందికి భారీగా మామూళ్లు లభిస్తున్నాయనే ఆరోపణలున్నాయి. స్మగ్లర్ జాకీర్ వద్ద జైల్లో వరుసగా 11 ఫోన్లు దొరికాయి. ఈ నేపథ్యంలోనే అతడు జైలు నుంచి ఎర్రచందనం స్మగ్లింగ్ కార్యకలాపాలు ఫోన్ల ద్వారా నడిపిస్తున్నారనే విమర్శలున్నాయి. వీటితో పాటు జైల్లో ఇతరత్రా అక్రమాలు చోటుచేసుకుంటున్నాయనే ఆరోపణలూ ఉన్నాయి. వీటన్నింటిపై ఇటీవల కడప జైల్లో డీఐజీ రవికిరణ్ విచారణ చేపట్టారు. ఆయన ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా ఐదుగురిపై చర్యలు తీసుకున్నారు. పూర్తి విచారణ అనంతరం మరికొందరి పైనా చర్యలు తీసుకునే అవకాశం ఉందని తెలిసింది.

ఇదీ సంగతి!



నువ్వే తేల్చుకో.. మాలో ఎవరికి ఆహారమవుతావో!

ధన్‌ఖడ్ రాజీనామా ఆమోదం

దిల్లీ: ఉప రాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ చేసిన రాజీనామాను మంగళవారం రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదించారు. అనంతరం హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సంతకంతో కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్‌ను జారీ చేసింది. ఆ తరువాత ఈ విషయాన్ని రాజ్యసభలో సభాధ్యక్ష స్థానంలో ఉన్న ఘన్‌శ్యాం తివారీ ప్రకటించారు. రాజ్యసభ ఎక్స్ అఫీషియో ఛైర్మన్‌గా ఉప రాష్ట్రపతి వ్యవహరిస్తారు. ధన్‌ఖడ్ రాజీనామాపై ప్రధాని మోదీ స్పందించారు. ఆయన ఆరోగ్యం బాగుండాలని ఆకాంక్షించారు. మరోవైపు రాష్ట్రపతి ముర్ముతో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ భేటీ అయ్యారు. మధ్యాహ్నం 12 గంటలకు రాజ్యసభ సమావేశం కాగానే.. హోంశాఖ నోటిఫికేషన్ గురించి సభ్యులకు ఘన్‌శ్యాం తివారీ వివరించారు. 'రాజ్యాంగంలోని ఆర్టికల్ 67(ఏ) కింద ధన్‌ఖడ్ చేసిన రాజీనామా వెంటనే అమల్లోకి వస్తుందని హోంశాఖ నోటిఫికేషన్ వెల్లడిస్తోంది' అని తెలిపారు.

■ రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముతో రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ మంగళవారం భేటీ అయినట్లు రాష్ట్రపతి కార్యాలయం వెల్లడించింది. ధన్‌ఖడ్ రాజీనామాతో కొత్త ఉప రాష్ట్రపతి వచ్చే దాకా ఇక రాజ్యసభను హరివంశ్ నడపనున్నారు.

క్వార్ట్జ సొమ్ముతో అనిల్ రియల్ దందా

గూడూరు, నాయుడుపేటల్లో 150 ఎకరాల వెంచర్లు

అనుచరుడు శ్రీకాంత్‌రెడ్డి వాంగ్మూలంతో వెలుగులోకి

ఈనాడు–అమరావతి, నెల్లూరు: క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలతో, ఎగుమతిదార్ల నుంచి ముక్కుపిండి మామూళ్లు వసూలు చేయగా వచ్చిన సొమ్ముతో అనిల్‌కుమార్ యాదవ్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేశారు. ఆయన ముఖ్య అనుచరుడు బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డి వాంగ్మూలంలో అనిల్ 'రియల్' గుట్టు బయటపెట్టారు. వీరి ముఠా ఎన్నికల ముందు వరకు క్వార్ట్జ్ ఎగుమతిదార్ల నుంచి టన్నుకు రూ.7 వేల నుంచి రూ.10 వేల చొప్పున వసూలు చేసింది. ఆ సొమ్ముతో గూడూరు వద్ద చెన్నూరు రోడ్డులో 100 ఎకరాలు కొని 'గ్రీన్ మెడోస్' పేరుతో వెంచర్ వేశారు. నాయుడుపేట వద్ద 50 ఎకరాలు కొని 'స్వర్ణముఖి స్మార్ట్ సిటీ' పేరుతో మరో వెంచర్ వేసి అభివృద్ధి చేశారు.

హైదరాబాద్‌లో విల్లాల నిర్మాణం: అనిల్‌కుమార్ హైదరాబాద్‌లో పెట్టుబడులు పెట్టారు. మణికొండలోని అల్కాపురి సమీపంలో 'హెవెన్లీ హోమ్స్' పేరిట, తుర్కయాంజాల్ వద్ద 'గ్రీన్ మెడోస్' పేరుతో విలాసవంతమైన ఇళ్ల నిర్మాణ ప్రాజెక్టుల్లో ఖర్చు చేశారు. వీటన్నింటిలో అనిల్‌తోపాటు తాను భాగస్వామి నేనని శ్రీకాంత్‌రెడ్డి వాంగ్మూలంలో అంగీకరించారు. గత ఏడాది ప్రభుత్వం మారడంతో క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలపై కేసులు నమోదవడం, పోలీసులు ముమ్మర దర్యాప్తు చేస్తుండటంతో.. తన పాత్ర బయటకొస్తుందనే భయంతో శ్రీకాంత్‌రెడ్డి కుటుంబంతో హైదరాబాద్‌కు మకాం మార్చారు. క్వార్ట్జ్ అక్రమ తవ్వకాల కేసులో అతడి ప్రమేయం ఉన్నట్లు తేలడంతో పోలీసులు సోమవారం హైదరాబాద్‌లో అరెస్టు చేసి, నెల్లూరు తీసుకొచ్చారు.

క్వార్ట్జ దోచేసిన కాకాణి, అనిల్‌కుమార్

(మొదటి పేజీ తరువాయి)

వాంగ్మూలమిచ్చారు. ఈ అక్రమ దందాలో అనిల్‌కుమార్‌ కీలక పాత్ర ఉన్నట్లు తేలడంతో ఆయనను త్వరలో నిందితుడిగా చేర్చే అవకాశం ఉందని ప్రచారం జరుగుతోంది.

అనుమతుల్లేకుండా తవ్వితే అందినంత దోచుకోవచ్చని..: క్వార్ట్జ్‌కు విదేశాల్లో మంచి డిమాండ్ ఉండటం, టన్నుకు రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ధర పలుకుతుండటంతో పొదలకూరు, సైదాపురం, గూడూరు ప్రాంతాల్లో తవ్వకాలు జరపాలని కాకాణి, అనిల్‌కుమార్ యాదవ్ బృందం ప్రణాళిక రచించింది. అనుమతులు తీసుకుని తవ్వితే లాభాలు తక్కువగా వస్తాయన్న ఉద్దేశంతో ఆ ప్రాంతాల్లో అప్పటికే గడువు ముగిసిన క్వారీలపై వారి కన్నేశారు. వాటిలో ఎలాంటి అనుమతులు లేకుండా తవ్వేసి.. లాభాలు మూటగట్టుకోవాలని కుట్ర పన్నారు. శ్రీకాంత్‌రెడ్డిని తెరపైకి తెచ్చారు. పొదలకూరు మండలం తాటిపర్తి వద్ద లీజు గడువు ముగిసిన రుస్తుం మైన్స్‌లో తవ్వకాలు జరపాలని ముగ్గురూ నిర్ణయించారు. 2023 అక్టోబరు నుంచి తవ్వకాలు ప్రారంభించారు. క్వార్ట్జ్ తవ్వే బాధ్యతను వారి అనుచరులు వాకాటి శివారెడ్డి, వాకాటి శ్రీనివాసులరెడ్డికి అప్పగించారు.

ఎగుమతిదారులను బెదిరించి.. అనిల్‌కుమార్ అక్రమ వసూళ్లు: అనిల్‌కుమార్ యాదవ్, శ్రీకాంత్‌రెడ్డి కలిసి 2022 నుంచే గూడూరు, వెంకటగిరి, చిల్లకూరు, సైదాపురం మండలాల్లో సిలికా శాండ్, క్వార్ట్జ్ అక్రమ మైనింగ్ చేసేవారు. నెల్లూరు ఇస్కాన్ సిటీ ప్రాంతానికి చెందిన దువ్వూరు శ్రీకాంత్ రెడ్డి (జిమ్ శ్రీకాంత్‌రెడ్డి) ద్వారా క్వార్ట్జ్‌ను విదేశాలకు ఎగుమతి చేయించారు. శ్రీకాంత్‌రెడ్డి అనుచరులు కె.దిలీప్‌రెడ్డి, పందిటి సాకేష్‌రెడ్డి ద్వారా క్వార్ట్జ్ ఎగుమతిదారుల నుంచి మామూళ్లు వసూలు చేశారు. ఎగుమతిదారులు ఏ గనుల నుంచి ఎన్ని లారీల క్వార్ట్జ్ తరలిస్తున్నారో తెలుసుకునేందుకు మస్తాన్, శ్యామ్ అనే ఇద్దర్ని నియమించుకున్నారు. వారిచ్చిన సమాచారం ఆధారంగా దిలీప్ రెడ్డి, సాకేష్‌రెడ్డి.. ఎగుమతిదారులను బెదిరించేవారు. గ్రేడ్‌ను బట్టి టన్నుకు రూ.7 వేల నుంచి రూ.10 వేల వరకు డబ్బులు ఇవ్వాలని, లేకపోతే ఆ వాహనాలను పోలీసులకు, గనులశాఖ అధికారులకు పట్టించి, కేసులు పెట్టిస్తామని బెదిరించేవారు. ఎగుమతిదారులు, లీజుల యజమానులకు అనుమతులు, మినరల్ డీలర్ లైసెన్సులు ఉన్నా, లేకపోయినా, గనులశాఖకు రాయల్టీ కట్టినా, కట్టకపోయినా.. ఈ ముఠాకు టన్నుకు రూ.7 వేల నుంచి రూ.10 వేల చొప్పున ఇవ్వాల్సిందే. ఈ ముఠాకు కప్పం కట్టాక, శ్రీకాంత్‌రెడ్డి ఓకే అంటేనే లారీలు హైవే మీదుగా చెన్నై పోర్టుకు వెళ్లేవి.

మార్టూరు నుంచి పేలుడు పదార్థాలు

రుస్తుం మైన్స్‌లో తవ్వి తీసిన క్వార్ట్జ్ ఖనిజాన్ని ఎక్కడ డంప్ చేయాలన్నదానిపై తోడేరు గ్రామంలోని కాకాణి ఇంట్లో సమాలోచనలు జరిగాయి. శ్రీకాంత్‌రెడ్డితో పాటు వాకాటి శ్రీనివాసుల రెడ్డి, శివారెడ్డి దానిలో పాల్గొన్నారు. అదే గ్రామానికి చెందిన తన బంధువు ఏనుగు శశిధర్‌రెడ్డిని కాకాణి పిలిపించారు. నీ భూమిలో క్వార్ట్జ్ నిల్వ ఉంచి, అక్కడే గ్రేడ్ చేసి, ఎగుమతి చేస్తామని, దానికి ప్రతిఫలంగా నీకు ఎకరాకు రూ.25 వేల చొప్పున ఇస్తామని కాకాణి అతణ్ని ఒప్పించారు. మైన్‌లో బ్లాస్టింగ్ కోసం కుందేటి హనుమంతరావు అనే వ్యక్తి ద్వారా బాపట్ల జిల్లా మార్టూరు ప్రాంతం నుంచి పేలుడు పదార్థాలు తెప్పించారు. తవ్వితీసిన క్వార్ట్జ్‌ను చైనాకు ఎగుమతి చేశారు. ఈ వ్యవహారాలన్నీ పర్యవేక్షించినందుకు శ్రీకాంత్‌రెడ్డికి టన్నుకు రూ.వెయ్యి చొప్పున ఇచ్చారు.

నా భూమిలోనే డంప్ చేశారు: శశిధర్‌రెడ్డి

రుస్తుం మైన్స్‌లో తవ్విన క్వార్ట్జ్‌ను తన భూమిలోనే డంప్ చేసేవారని తోడేరు మాజీ సర్పంచ్ ఏనుగు శశిధర్‌రెడ్డి ఈ నెల 18న పోలీసులకు వాంగ్మూలం ఇచ్చారు. '2023 జనవరిలో తోడేరులో 3.90 ఎకరాలు కొనుగోలు చేసి, నా కుమారుడి పేరిట రిజిస్టర్ చేయించాను. 2023 అక్టోబరులో అప్పటి మంత్రి కాకాణి నన్ను పిలిపించారు. రుస్తుం మైన్‌లో క్వార్ట్జ్ తవ్వుతారని, ఆ ఖనిజాన్ని నిల్వ చేసి, గ్రేడింగ్ చేసేందుకు నీ భూమిని వాడుకుంటారని.. అందుకు ఎకరాకు రూ.25 వేల చొప్పున ఇస్తామని చెప్పారు. నాకు మినరల్ డీలర్ లైసెన్స్ లేనందున పోలీసులు, మైనింగ్ అధికారులు పట్టుకుంటారేమోనని సందేహం వ్యక్తం చేశాను. ఏమీ కాదని ఆయన భరోసా ఇచ్చారు. కాకాణి సమక్షంలో వాకాటి శ్రీనివాసులరెడ్డి నాకు అడ్వాన్స్‌గా రూ.50 వేలు ఇచ్చారు. శ్రీనివాసుల రెడ్డితోపాటు, వాకాటి శివారెడ్డి, వేమిరెడ్డి అరవింద్‌కుమార్‌రెడ్డి, కాటంరెడ్డి కరుణాకర్‌రెడ్డి, కొండా శివారెడ్డి, వారి మనుషులు టిప్పర్లతో క్వార్ట్జ్‌ను నా భూమిలో డంప్ చేసి, గ్రేడింగ్ చేయించి ఎక్స్‌పోర్ట్‌కు తీసుకెళ్లేవారు' అని పేర్కొన్నారు.

శ్రీకాంత్‌రెడ్డికి 14 రోజుల రిమాండ్

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: క్వార్ట్జ్ అక్రమ తవ్వకాలు, రవాణా కేసులో శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాకు చెందిన బిరదవోలు శ్రీకాంత్‌రెడ్డికి గూడూరు అడిషనల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టు జడ్జి సులోచన రాణి మంగళవారం 14 రోజుల రిమాండ్ విధించారు.

ధన్‌ఖడ్ త్వరగా కోలుకోవాలి

● మాజీ సీఎం జగన్

ఈనాడు, అమరావతి: 'ఉప రాష్ట్రపతిగా, రాజ్యసభ ఛైర్మన్‌గా జగదీప్ ధన్‌ఖడ్ అంకితభావంతో పని చేశారు. అనారోగ్య కారణాల వల్ల పదవి విరమణ చేస్తున్నందున, ఆయన త్వరగా కోలుకోవాలి, ఆరోగ్యంగా ఉండాలని హృదయపూర్వకంగా కోరుకుంటున్నా' అని ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ రాజీనామాపై మాజీ సీఎం జగన్ మంగళవారం ఎక్స్ వేదికగా స్పందించారు.

స్థిరాస్తి రంగానికి ఊతం

(మొదటి పేజీ తరువాయి)

స్టాంపు డ్యూటీ కింద వసూలు చేస్తున్నారు. సేల్ కం జీపీఏ విధానంలో భూ యజమాని నుంచి పొందిన ఆస్తి విలువను బట్టి 5% వరకూ స్టాంపు డ్యూటీని చెల్లించాల్సి వస్తోంది. వైకాపా పాలనలో 2021లో ఇచ్చిన ఉత్తర్వుల్ని అనుసరించి వసూళ్లు సాగుతున్నాయి. దీనివల్ల ఆర్థిక భారం పెరిగిపోతుందని నరెడ్కో, క్రెడాయ్ నుంచి అందిన విజ్ఞప్తుల మేరకు కూటమి ప్రభుత్వం సానుకూలంగా స్పందించింది. ఈ స్టాంపు డ్యూటీని 1 శాతానికి పరిమితం చేస్తూ రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయలక్ష్మి తాజాగా ఉత్తర్వులిచ్చారు. స్టాంపు డ్యూటీని తగ్గించడం వల్ల నిర్మాణ రంగం, ప్లాట్లు, ఫ్లాట్ల కొనుగోలుదారులకు ఆర్థికంగా ఉపశమనం కలుగుతుంది. డాక్యుమెంట్ రిజిస్ట్రేషన్లు పెరుగుతాయని భావిస్తున్నారు. రెవెన్యూ శాఖ ద్వారా జరిగే భూ వినియోగ మార్పిడి(నాలా) అనుమతుల జారీ బాధ్యతను స్థానిక సంస్థలకు అప్పగించాలని కూటమి ప్రభుత్వం ఇప్పటికే నిర్ణయించింది. దీంతో ఈ ప్రక్రియ మరింత సరళతరం కానుంది. ఇళ్లు, భవనాల(నాన్ హైరైజ్) నిర్మాణదారులకు ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన స్వీయ ధ్రువీకరణ పథకం కింద వెంటనే అనుమతులు లభిస్తున్నాయి. పుర, నగరపాలక సంస్థల్లో ఏటా 40 వేల ఇళ్లు, భవన నిర్మాణాలకు అనుమతులు తీసుకుంటున్నారు. వీటిలో 100 నుంచి 200 చదరపు గజాల్లోపు స్థలాల్లో పేదలు, మధ్యతరగతి వారు నిర్మించుకునేవే 80% వరకూ ఉన్నాయి.

అభిశంసనే చిచ్చురేపిందా?

(మొదటి పేజీ తరువాయి)


ఇచ్చిన నోటీసు గురించి సభలో ప్రస్తావించి దానిపై సంతకాలను ధ్రువీకరించుకున్న తర్వాత ముందుకెళ్తానని ప్రకటించడం.

3. రూల్ 267 నోటీసు కింద ఆపరేషన్ సిందూర్, పహల్గాం ఉదంతాలపై రాజ్యసభలో ప్రతిపక్ష నేత ఖర్గే మాట్లాడేందుకు ఎక్కువ అవకాశం ఇవ్వడం.

4. సభలో తాను చెప్పిందే రికార్డుల్లోకి వెళ్తుంది తప్పితే మీరు మాట్లాడింది కాదని రాజ్యసభాపక్ష నేత జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలు సభాపతి గౌరవాన్ని తగ్గించేలా ఉన్నందున దానిపై చర్చించడానికి సాయంత్రం సమావేశం ఏర్పాటుచేస్తే దానికి నడ్డాగానీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజుగానీ రాకపోవడం.

5. న్యాయ వ్యవస్థ పనితీరు, దాని అధికార పరిధి, జవాబుదారీతనంపట్ల ఇటీవలి కాలంలో తరచూ ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించడం.

6. ఈ నెల 20వ తేదీన ఆయన ఆప్ కన్వీనర్, దిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు అపాయింట్‌మెంట్ ఇచ్చి మాట్లాడటం... కేజ్రీవాల్‌తో ఆయన పంచుకున్న భావాలు అధికార పక్షానికి నచ్చకపోవడం.



అటు ఖర్గే.... ఇటు నడ్డా

సోమవారం సాయంత్రం 4.30 గంటలకు రాజ్యసభ బీఏసీ సమావేశం జరిగింది. దీనికి రాజ్యసభాపక్ష నేత జేపీ నడ్డా, పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి కిరణ్ రిజిజు హాజరు కాలేదు. ఇది ధన్‌ఖడ్‌కు మనస్తాపం కలిగించిందని సమాచారం. దీంతోపాటు సభలో కాంగ్రెస్‌పక్ష నేత మల్లికార్జున ఖర్గే సుదీర్ఘంగా మాట్లాడుతున్నా అధ్యక్ష స్థానంలో ఉన్న ధన్‌ఖడ్ ఆయన్ను వారించకపోవడం అధికార పక్షం కినుకకు కారణమైందని చెబుతున్నారు. దీనికి సభా నాయకుడి హోదాలో జేపీ నడ్డా సమాధానం ఇస్తున్న సమయంలో కాంగ్రెస్ సభ్యులు అడ్డుపడటంతో ఆయన ఆవేశంగా.. 'ఏదీ రికార్డుల్లోకి వెళ్లదు. నేను ఏది చెబితే అది వెళ్తుంది. అది మీరు తెలుసుకోవాలి' అని చేసిన వ్యాఖ్యలు సభలో పెద్దగా కలకలం రేపకపోయినా ఆ తర్వాత అవి సభాధ్యక్షుడి అధికారాలను ప్రశ్నించేలా ఉన్నాయన్న భావన ప్రతిపక్షాల నుంచి వ్యక్తమైంది. దానిపై చర్చించడానికి సాయంత్రం 4.30 గంటలకు ధన్‌ఖడ్ సమావేశం ఏర్పాటుచేస్తే దానికి నడ్డా, రిజిజు రాలేదు. దాంతో ధన్‌ఖడ్ మనస్తాపం చెంది. . అవమానానికి గురైనట్లు భావించి రాజీనామా చేసినట్లు ప్రచారం జరుగుతోంది. తాను సభలో అధ్యక్ష స్థానాన్ని నియంత్రించినట్లు వచ్చిన ఆరోపణలను నడ్డా ఖండించారు. అలాగే ముందస్తుగా నిర్ణయించుకున్న కార్యక్రమాలు ఉండటంవల్ల తాను, రిజిజు బీఏసీకి వెళ్లలేకపోయినట్లు చెప్పారు.

మరికొన్ని వాదనలు..

2027 ఆగస్టులో పదవీ విరమణ చేస్తానని ఇటీవలే జేఎన్‌యూలో జరిగిన కార్యక్రమంలో ధన్‌ఖడ్ పేర్కొన్నారు. కానీ అనూహ్యంగా కొద్ది రోజుల్లోనే వైదొలిగారు. ఆయన రాజీనామా చేశాక ఒక్క భాజపా నేతా స్పందించలేదు. 15 గంటల తర్వాత ప్రధాని మోదీ ఆయన ఆరోగ్యాన్ని కాంక్షిస్తూ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. దేశానికి సేవ చేయడానికి ఆయనకు ఎన్నో అవకాశాలు లభించాయని వ్యాఖ్యానించారు.

■ బిహార్ ఎన్నికల కోణంలో ధన్‌ఖడ్‌ను తప్పించి ఉండవచ్చన్న వాదనలు వినిపిస్తున్నాయి. తదుపరి ఉప రాష్ట్రపతిగా నీతీశ్‌ను నియమించి బిహార్‌లో తమ పార్టీ ముఖ్యమంత్రి అభ్యర్థితో ఎన్నికలకు వెళ్లాలని భాజపా అధిష్ఠానం భావిస్తోందని సమాచారం. నీతీశ్‌ను ఉప రాష్ట్రపతిని చేయడం బిహార్‌కు మంచిదని భాజపా ఎమ్మెల్యే ఒకరు వ్యాఖ్యానించడం గమనార్హం.

కేంద్రం ప్రణాళికకు ఆటంకం కలిగిందా..

ఇంట్లో నోట్ల కట్టలు దొరికాయన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మపై అధికార పార్టీ భాజపా.. లోక్‌సభలో ప్రతిపక్షాలను కలుపుకొని అభిశంసన తీర్మానాన్ని స్పీకర్‌కు అందించింది. అక్కడ ఏకాభిప్రాయం కూడగట్టింది. రాజ్యసభలోనూ అదే తీరులో అధికార, ప్రతిపక్షాలు కలిసి ముందడుగు వేయాలని అధికార పక్షం భావించింది. అయితే దానికంటే ముందే ప్రభుత్వంతో చర్చించకుండానే రాజ్యసభ ఛైర్మన్ హోదాలో ధన్‌ఖడ్.. యశ్వంత్ వర్మ అభిశంసనకు ప్రతిపక్షం ఇచ్చిన నోటీసును ఆమోదిస్తున్నట్లు ప్రకటించారు. లోక్‌సభలో అప్పటికే అధికార పక్షం దానిపై నోటీసు ఇచ్చిందని తెలిసీ ఇదే తరహా తీర్మానాన్ని లోక్‌సభలో ప్రతిపాదించారో.. లేదో.. తెలుసుకోవాలని సెక్రటరీ జనరల్‌ను ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. న్యాయమూర్తుల విచారణ చట్టం 1968 ప్రకారం... ఇలాంటి తీర్మానాన్ని ఒక సభలో ప్రవేశపెట్టినప్పుడు.. లేదంటే ఒకే రోజు రెండు సభల్లో ప్రవేశ పెట్టినప్పుడు భిన్నమైన విధానాలు అనుసరించాల్సి ఉంటుంది. తీర్మానాన్ని రెండు సభల్లో వేర్వేరు రోజుల్లో ప్రవేశపెట్టి ఉంటే మొదట ప్రవేశపెట్టిన సభలోనే దాన్ని పరిగణనలోకి తీసుకుంటారు. రెండో తీర్మానం నాన్ జ్యూరిస్డిక్షనల్ అవుతుంది. ఒకవేళ రెండూ ఒకే రోజు ప్రవేశపెట్టి ఉంటే వాటిని ఆమోదించే/తిరస్కరించే హక్కు స్పీకర్, ఛైర్మన్‌లకు ఉండదు. ఆ తీర్మానాలు సభల ఆస్తులవుతాయి. స్పీకర్, ఛైర్మన్‌లు వాటిని పెండింగ్‌లో పెట్టి సదరు జడ్జిని తొలగించడానికి పేర్కొన్న అంశాలపై విచారించడానికి ముగ్గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ఇప్పుడు ఉభయ సభల్లో ఒకే రోజు నోటీసును పరిగణనలోకి తీసుకుంటున్నట్లు ప్రకటించడంవల్ల దానిపై కమిటీ ఏర్పాటుచేసి విచారణ జరిపించిన తర్వాతే అభిశంసన తీర్మానాన్ని ముందుకు తీసుకెళ్లాల్సిన పరిస్థితి ఉంటుందన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఇది ప్రభుత్వానికి ఇబ్బంది కలిగించిందని చెబుతున్నారు. ఈ తీర్మానం గురించి చదివిన తర్వాత ధన్‌ఖడ్ రాజ్యసభలో వెంటనే అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి శేఖర్ యాదవ్ అభిశంసన కోసం ప్రతిపక్షాలు ఇచ్చిన తీర్మానాన్ని సభముందు ప్రస్తావించడం ప్రభుత్వ పెద్దలకు ఇబ్బందికరంగా మారినట్లు చెబుతున్నారు.

కోసేస్తాం.. నరికేస్తాం.. అంటే చేతులు కట్టుకుని కూర్చోం!



వైకాపా నేతలపై ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మండిపాటు

ఈనాడు, అమరావతి: 'వైకాపా నాయకులు కోసేస్తాం, నరికేస్తాం అంటే ఇక్కడెవరూ చేతులు కట్టుకుని కూర్చోరు కదా! అలా మాట్లాడడం, బెదిరించడం వాళ్ల నైజం.. అవన్నీ ఎదుర్కొని నిలబడ్డాం కాబట్టే కూటమి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయగలిగాం. వాళ్లవన్నీ తాటాకు చప్పుళ్లు' అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. వైకాపా నాయకులు మద్య నిషేధం చేస్తామని అధికారంలోకి వచ్చి.. మద్యం కుంభకోణంలో రూ.వేల కోట్లు దోచుకున్నారని, కల్తీ మద్యంతో అనేకమంది బతుకుల్ని ఛిద్రం చేశారని ధ్వజమెత్తారు. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఆరోగ్యశ్రీ కేసులు హఠాత్తుగా పెరగడానికి కల్తీ మద్యమే కారణమని వివరించారు. తాను నటించిన 'హరిహర వీరమల్లు' సినిమా విడుదల సందర్భంగా మంగళవారం పార్టీ కార్యాలయంలో ఆయన విలేఖరులతో మాట్లాడారు. వైకాపా నాయకులకు అబద్ధాలు చెప్పడం, దబాయించడం అలవాటుగా మారిపోయిందని మండిపడ్డారు. 'దబాయిస్తే భయపడిపోతారనుకుంటున్నారు. వ్యవస్థలు, వాటిని రక్షించే వ్యక్తులు బతికే ఉన్నారని గుర్తుపెట్టుకోవాలి' అని పేర్కొన్నారు.

వైకాపా నాయకుల్లా నాకు దొంగ కంపెనీల్లేవు

పవన్ కల్యాణ్‌కు సినిమాల మీదున్న శ్రద్ధ, పరిపాలనపై లేదన్న వైకాపా నాయకుల విమర్శలపై ఆయన తీవ్రంగా మండిపడ్డారు. 'వాళ్ల మాత్రం పత్రికలు, టీవీలు, బోలెడు బినామీ కంపెనీలు నడుపుతారు. వ్యాపారాలు చేస్తారు. అనేక ఆదాయమార్గాలు పెట్టుకుంటారు. నేను సినిమాలు మానేయాలా? వాళ్లను సిమెంట్ ఫ్యాక్టరీలు, వ్యాపారాలు మూసేయమనండి. నేను సినిమా షూటింగ్‌లు చేయడమే కనిపిస్తుంది తప్ప, వాళ్లు చేసేది కనిపించదు' అని ధ్వజమెత్తారు. 'వాళ్లలా నాకు ఆస్తులు, స్థిరాస్తి వ్యాపారాల్లో పెట్టుబడులు లేవు. తప్పనిసరి పరిస్థితుల్లో సినిమాలు చేస్తున్నాను. ఈ మూడు సినిమాలు కూడా ఎన్నికల ముందే పూర్తయ్యేవి. కానీ రాజకీయ పరిణామాలు మారిపోవడం వల్ల సమయం కుదరలేదు' అని తెలిపారు.

రాజకీయాలు, సినిమాలు బ్యాలెన్స్ చేయలేకపోయా

'రాజకీయాలు, సినిమాలు.. ఎన్నికల ముందు బ్యాలెన్స్ చేయలేకపోయాను. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఆరు నెలల వరకు నాకు ఊపిరి సలపలేదు. అప్పగించిన ప్రభుత్వశాఖలపై అవగాహన పెంచుకోవడం, అధికారులను సమన్వయం చేసుకోవడానికే సరిపోయింది. అప్పటికే చాలావరకు చేసిన 'హరి హర వీరమల్లు' 20 రోజుల షూటింగ్‌తో పూర్తవుతుందని మా వాళ్లు చెప్పారు. పరిపాలనకు ఇబ్బంది లేకుండా రోజులో రెండు గంటలే షూటింగ్‌లో పాల్గొన్నా. ఆదివారం పూర్తిగా హాజరయ్యేవాణ్ని. కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక ఆంధ్రప్రదేశ్‌లో చేసిన మొదటి సినిమా ఇది' అని తెలిపారు.

టికెట్ ధర పెంపు దస్త్రాన్ని సీఎంకు నేనే పంపాను

'వైకాపా ప్రభుత్వం నాపై కక్షతో భీమ్లా నాయక్ సినిమా టికెట్ ధర పెంచేందుకు అనుమతినివ్వలేదు. అయినా నేను అడగలేదు. ఇప్పుడు హరిహర వీరమల్లు టికెట్ ధర పెంచేందుకు అనుమతిచ్చిన తెలంగాణ, ఏపీ ముఖ్యమంత్రులు రేవంత్‌రెడ్డి, చంద్రబాబులకు కృతజ్ఞతలు. ఇక్కడ సినిమాటోగ్రఫీ శాఖ మా పార్టీ మంత్రి దగ్గరే ఉన్నందున.. టికెట్ ధర పెంపు దస్త్రాన్ని ఆయనకు కాకుండా నేరుగా ముఖ్యమంత్రి వద్దకు నేనే పంపాను. ఆయన నుంచే అనుమతి వచ్చింది. ఇతర సినిమాలకు ఇచ్చినట్లే నాకూ అనుమతిచ్చారు' అని పవన్ కల్యాణ్ వెల్లడించారు.

ప్రభుత్వం అద్భుతంగా పనిచేస్తోంది

'రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం చాలా సమర్థంగా, అద్భుతంగా పనిచేస్తోంది. మొదటి తారీఖున జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితుల్లో ఉన్నప్పుడు.. అధికారంలోకి వచ్చిన మా ప్రభుత్వం ఇప్పుడు ఉద్యోగులకు సకాలంలో జీతాలు, పింఛన్లు ఇస్తోంది. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు తల్లికి వందనం వంటి పథకాలు అమలు చేశాం. 20-30 ఇళ్లున్న గ్రామాలకూ రోడ్లు వేయించగలుగుతున్నాం. భారీగా పెట్టుబడులు తెస్తున్నాం. క్వాంటం వ్యాలీ ఏర్పాటు వంటి చర్యల వల్ల ఫలితాలు ఇప్పటికిప్పుడు తెలియకపోవచ్చు. కానీ వచ్చే 10-15 సంవత్సరాల్లో వాటి ఫలితాలు తెలుస్తాయి' అని ఆయన పేర్కొన్నారు.

జనసేన బలోపేతానికి కార్యాచరణ

కూటమిలోని మూడు పార్టీలు సమన్వయంతో పనిచేస్తున్నాయని, తమ పార్టీ తరఫున ఎక్కడైనా సమస్యలుంటే వ్యక్తిగతంగా చొరవ తీసుకుని పరిష్కరిస్తున్నానని పవన్ కల్యాణ్ తెలిపారు. రాష్ట్రంలో జనసేన బలోపేతానికి చర్యలు చేపట్టబోతున్నారా? అనే ప్రశ్నకు.. 'ఆగస్టు 15 తర్వాత కార్యాచరణ ప్రారంభిస్తాం' అని బదులిచ్చారు.

సాయం చేయాలనే చెప్పులు పంపా

'నాకు పేరొస్తుందనో, మరో కారణంతోనో గిరిజనులకు చెప్పులు పంపలేదు. గిరిజన ప్రాంతాల పర్యటనకు వెళ్లినప్పుడు నడుస్తుంటే నా చెప్పులు జారిపోయాయి. నేను చెప్పులు వేసుకునే నడవడానికి అంత కష్టపడుతుంటే.. పెద్ద వయసు వాళ్లు చెప్పులు లేకుండా నడుస్తుండడం చూసి ఇబ్బంది అనిపించింది. సాటి మనిషికి సాయం చేయాలన్న ఉద్దేశంతో చెప్పులు పంపాను' అని తెలిపారు. రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి చేయాలన్నది తన ఉద్దేశమన్నారు.

కాలువలకు నీటిని విడుదల చేయండి

(మొదటి పేజీ తరువాయి)

హెచ్‌డీ బర్లీ పొగాకు కొనుగోలు పూర్తిచేయాలి. ఆగస్టు 15లోగా మామిడి రైతులకు చెల్లింపులు చేయాలి. రైతుల నుంచి మామిడి కొనుగోలు చేయని కంపెనీలపై కఠినచర్యలు తీసుకోవాలి' అని పేర్కొన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాలపై మంగళవారం సాయంత్రం సచివాలయంలో సుమారు 4 గంటలకు పైగా సీఎం సమీక్షించారు. ఈ సందర్భంగా కవర్లు కట్టి పండించిన మామిడి పండ్లను చంద్రబాబు పరిశీలించారు. 'అన్నదాతా సుఖీభవ పథకంలో 47.42 లక్షల మంది రైతుల ఈ-కేవైసీ పూర్తయింది. ప్రతి రైతుకూ ఈ పథకం ద్వారా సాయం అందేలా చూడాలి' అని చంద్రబాబు ఆదేశించారు.

సాగు సంగతి తెలుసుకునేందుకు ఉపగ్రహ సర్వే

ఏ సర్వే నంబర్లో ఏ పంట సాగు చేస్తున్నారో తెలుసుకునేందుకు ఉపగ్రహ సర్వే విధానం అనుసరించాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు మండలం బలభద్రపురంలో ఉపగ్రహ సర్వే ద్వారా సమగ్ర సమాచారం అందిందని చెప్పారు. ఒక ప్రాంతంలో ఒకే తరహా పంటలు వేసేలా రైతు సేవాకేంద్రాల నిర్వాహకుల ద్వారా రైతుల్లో అవగాహన కల్పించాలని చంద్రబాబు చెప్పారు. చంద్రబాబు సమీక్షలోని ముఖ్యాంశాలు..

■ ఆక్వా రంగంలో దాణాగా చికెన్ వ్యర్థాలను ఉపయోగించే వారిపై కఠినచర్యలు తీసుకోవాలి. అలాంటివారికి రాయితీ విద్యుత్తు నిలిపివేసే అంశాన్ని పరిశీలించాలి.

■ పంటల సాగులో నాణ్యతకు పెద్దపీట వేయాలి. అంతర్జాతీయ ఎగుమతులకు వీలుగా మన ఉత్పత్తులు ఉండాలి.

■ ఆర్గానిక్ ఉత్పత్తుల సర్టిఫికేషన్‌కు త్వరలో టాటాతో ఒప్పందం చేసుకోవాలి. ఇండిగ్యాప్ సర్టిఫికేషన్ ద్వారా జపాన్, తైవాన్ తదితర దేశాలకు ఉత్పత్తుల్ని ఎగుమతి చేయాలి.

■ మొబైల్ రైతుబజార్లను అపార్ట్‌మెంట్లు, గృహ సముదాయాల వద్దకు పంపేలా 30 రోజుల్లో కార్యాచరణ సిద్ధం చేయండి.

■ వర్షాలను బట్టి ముందే పంటలు వేసేలా రైతుల్లో అవగాహన కల్పించాలి. దీంతో తుపానులు, భారీవర్షాల కారణంగా పంటనష్టాన్ని నివారించవచ్చు.

■ మత్స్య సంపద ఎక్కువగా ఎక్కడ దొరుకుతుందో మత్స్యకారులకు యాప్ ద్వారా తెలియజేయాలి.

కోకో ముంజ్ వికాస్‌కు సీఎం అభినందనలు

● ఈనాడు కథనం చూసి ప్రత్యేకంగా ఆహ్వానించిన చంద్రబాబు

కొబ్బరితో 60కి పైగా పదార్థాలు తయారు చేస్తూ.. కొబ్బరి రైతుకు మేలుచేస్తున్న కోకో ముంజ్ వికాస్‌ను సీఎం చంద్రబాబు అభినందించారు. జులై 1న వికాస్ విజయ ప్రస్థానంపై 'కొబ్బరి శ్రీమంతుడు' శీర్షికన ఈనాడులో ప్రత్యేక కథనం ప్రచురితమైంది. దీన్ని చదివిన సీఎం.. ఆసక్తితో వికాస్‌ను మంగళవారం ప్రత్యేకంగా తన దగ్గరకు పిలిపించుకున్నారు. తయారుచేస్తున్న పదార్థాల గురించి తెలుసుకున్నారు. వికాస్ కొబ్బరితో తయారుచేసిన ఉత్పత్తులు, పంటలు ఆయనకు అందజేశారు. వాటిని రుచి చూసి మెచ్చుకున్నారు.



కోకోముంజ్ ప్రతినిధి వికాస్‌తో సీఎం చంద్రబాబు

ఏపీలో కొబ్బరి నీరా తయారీకి అవకాశం కల్పించాలని కోరారు. దీనివల్ల కొబ్బరి రైతు ప్రస్తుత ఆదాయానికి రెట్టింపు ఆదాయం పొందేలా చేయవచ్చని వివరించారు. సాధ్యాసాధ్యాలపై అధ్యయనం చేసి నివేదిక తయారుచేయాలని ఉద్యాన అధికారులను సీఎం ఆదేశించారు.


ఈనాడు

ఆది నుంచీ వివాదాస్పదమే!

పశ్చిమ్ బెంగాల్ గవర్నర్‌గా 2019 జులైలో నియమితులయ్యేంత వరకు జగదీప్ ధన్‌ఖడ్ గురించి ఎవరికీ పెద్దగా తెలియదు. అంతకు మునుపు జనతాదళ్, కాంగ్రెస్ పార్టీలతో అనుబంధం ఉన్నప్పటికీ; ఎమ్మెల్యేగా, ఎంపీగా, కేంద్ర సహాయమంత్రిగా పనిచేసినప్పటికీ 1998 తరవాత ఆయన న్యాయవాద వృత్తికే పరిమితమయ్యారు. రాజకీయ వానప్రస్థంలోంచి హఠాత్తుగా బయటకొచ్చి కోల్‌కతా రాజ్‌భవన్‌లో అడుగుపెట్టిన ధన్‌ఖడ్- ఆపై మూడేళ్లకు 'రైతుబిడ్డ', 'రాజ్యాంగ శాసన వ్యవహారాల నిపుణులు' అన్న స్వపక్ష పొగడ్తల నడుమ ఉపరాష్ట్రపతి అయ్యారు. పదవీ కాలం పూర్తయ్యేందుకు ఇంకెంతో సమయం ఉండగానే మొన్న రాత్రి అనూహ్యంగా అస్త్రసన్యాసం చేసిన ఆయన- ఒక్కసారిగా తీవ్ర కలకలం సృష్టించారు. రాష్ట్రపతిగా ఎన్నిక కావడం లేదా సంబంధిత ఎలక్షన్లలో పోటీపడటంతో సంబంధం లేకుండా ఇలా అర్ధాంతరంగా బాధ్యతల నుంచి తప్పుకొన్న మొదటి ఉపరాష్ట్రపతి ధన్‌ఖడే! పార్లమెంట్ వర్షాకాల సమావేశాల మొదటి రోజు ఎగువసభ ఛైర్మన్‌గా చురుగ్గా పనిచేసిన గంటల వ్యవధిలోనే ఆయన ఎందుకు రాజీనామా చేశారన్న దానిపై రాజకీయవర్గాల్లో రకరకాల వాదనలు వినిపిస్తున్నాయి. వాటి సంగతి అలా ఉంచితే- రాజ్యాంగ పదవుల నిర్వహణలో ధన్‌ఖడ్ ఆది నుంచి వివాదాలకు కేంద్రబిందువుగా నిలిచారు!

'గవర్నర్ పదవి అలంకారప్రాయమైనది. దాన్ని నిర్వహించే వ్యక్తి అధికారాలూ నామమాత్రమైనవే. రాజ్యాంగం ప్రకారం ఆయన అన్ని విషయాల్లో మంత్రివర్గం సలహాలకు అనుగుణంగానే నడుచుకోవాలి' అని సంవిధాన సభలోనే డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ స్పష్టీకరించారు. కానీ, పశ్చిమ్ బెంగాల్ ప్రథమ పౌరుడిగా జగదీప్ ధన్‌ఖడ్- ప్రజల ద్వారా ఎన్నికైన ఆ రాష్ట్ర ప్రభుత్వంతో దాదాపుగా ప్రత్యక్ష యుద్ధమే చేశారు. రోజువారీ పాలనా వ్యవహారాల్లో వేలుపెట్టాల్సిన పనేమీ లేకపోయినా, శాంతిభద్రతల స్థితిగతుల నుంచి ఉపకులపతుల నియామకాల వరకు అన్నింటిపైనా విమర్శనాస్త్రాలు సంధిస్తూ వివాదాలను రాజేశారు. బిల్లులను తొక్కిపెట్టారనే ఆరోపణలనూ మూటగట్టుకున్నారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికయ్యాకా ఆయన పోకడల్లో మార్పేమీ రాలేదు. రాజ్యసభ ఛైర్మన్‌గా తొలి ప్రసంగంలోనే న్యాయవ్యవస్థపై మాటలదాడికి దిగిన ధన్‌ఖడ్- ఆపైనా చాలాసార్లు కోర్టులపై కారాలూమిరియాలూ నూరారు. జాతీయ న్యాయనియామకాల చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టేయడాన్ని తప్పుబట్టడమే కాదు- చరిత్రాత్మక కేశవానందభారతి కేసు తీర్పుపైనా ప్రతికూల వ్యాఖ్యలెన్నో చేశారు. అలా ఆయన వ్యవస్థల నడుమ ఘర్షణాత్మక వాతావరణాన్ని ఎగదోశారు!

న్యాయవ్యవస్థ స్వతంత్రంగా పనిచేయాలని, అప్పుడే పౌరహక్కులకు సరైన రక్షణ లభిస్తుందని రాజ్యాంగ సభ సభ్యులు భావించారు. చట్టాల రాజ్యాంగబద్ధతను నిగ్గుదేల్చే న్యాయసమీక్షాధికారాన్ని అందుకే న్యాయపాలికకు అప్పగించారు. దానిపై పలుమార్లు నోరుపారేసుకున్న ధన్‌ఖడ్- శాసన వ్యవస్థే సర్వోన్నతమైనదంటూ సెలవిచ్చారు. నిజానికి శాసన, న్యాయ, కార్యనిర్వాహక వ్యవస్థల్లో ఏదీ ఎక్కువా కాదు, తక్కువా కాదు. ఆ మేరకు ఆ మూడింటి అధికారాలను రాజ్యాంగం స్పష్టంగా నిర్దేశించింది. సంవిధాన ప్రమాణాలకు సొంత భాష్యాలు చెప్పిన ధన్‌ఖడ్- రాజ్యాంగ ప్రవేశికలోని లౌకికవాదం, సామ్యవాదం పదాలపైనా తన అక్కసును వెళ్లగక్కారు. ప్రతిపక్షాలపైనా నిత్యం ఒంటికాలిపై లేస్తూ- ఉపరాష్ట్రపతిగా, రాజ్యసభ ఛైర్మన్‌గా అభిశంసన తీర్మానాన్ని ఎదుర్కొన్న మొదటి వ్యక్తిగా అప్రతిష్ఠ పాలయ్యారు. అత్యున్నత రాజ్యాంగ పదవుల్లో ఉన్నవారు గౌరవప్రదంగా నడుచుకుంటూ ప్రజాస్వామ్య సంప్రదాయాలను సంరక్షించాలి. తద్భిన్నమైన ధన్‌ఖడ్ విపరీత ధోరణులు ఉపరాష్ట్రపతి పదవికి వన్నెతేలేదన్నది వాస్తవం!



వనరులూ సామర్థ్యమూ లేకపోవడం
సమస్య కాదు... సాధించాలన్న కోరిక లేకపోవడమే
అసలు సమస్య. అందుకే వాస్తవ ప్రపంచంలోకి రాగానే
చాలామంది యువత కలలు అదృశ్యమవుతాయి.

- బాల గంగాధర్ తిలక్

చీకటిలో చిరుదివ్వె

ఈత రానివాడు నీటిలో పడితే మునిగిపోక తప్పదు. కానీ చిన్న కర్రపుల్ల పట్టు దొరికినా దాన్ని ఈదుకుంటూ ఒడ్డుకు చేరే ప్రయత్నం మాత్రం మానడు. పుట్టిన ప్రతి జీవీ మనుగడ కోసం పోరాడుతూనే ఉంటుంది... ఉండాలి కూడా. సవాళ్లు ఎదురైనప్పుడు అంధకారంలోకి అగాధాల్లోకి కూరుకుపోయినట్లు అనిపించడం సహజం. ఆ సమయంలో చిన్న ఆధారం దొరికినా ఊరటనిచ్చి మనోధైర్యాన్ని పెంచుతుంది. సన్నని వెలుగు రేఖలాంటి ఆ మనోధైర్యమే మనుగడకు తిరిగి ప్రాణం పోస్తుంది.

రావణుడు తనను అపహరించి తీసుకునిపోతున్నప్పుడు సీతాదేవి దుఃఖంతో కుంగిపోయింది. 'నా స్వామికి నా జాడ తెలియచేసే మార్గమేదీ కనిపించడం లేదు!' అని దీనంగా విలపించింది. చుట్టూ అంధకారం అలముకున్నట్టయి మనోధైర్యాన్ని కోల్పోయింది. కానీ రావణుడితో పోరాడి శ్రీరామకార్యంతో తన సర్వస్వాన్ని పరిత్యాగం చేయడానికి సిద్ధపడిన జటాయువు, సీతమ్మ మనసును చుట్టుముట్టిన దుఃఖమనే చీకటిని చీల్చే చిరుదివ్వెగా కృతార్థుడయ్యాడు.



అంతర్యామి

ఒక మూగ వ్యక్తి రోజూ నదిని దాటి వెళ్లి అటువైపు ఉన్న అడవిలో కట్టెలు కొట్టి తెచ్చుకునేవాడు. ఒక రోజు ఓ చెట్టును నరకబోయేంతలో పొదల చాటున మాటువేసిన ఎలుగు వచ్చి దాడి చేసింది. ఆపద నుంచి తప్పించి ఆదుకోమని అరుద్దామంటే అతడికి మాట రాదు. అక్కడికి దగ్గర్లోనే ఓ వేటగాడు వేటాడుతున్న శబ్దాలు వినబడుతున్నాయి. కానీ ప్రాణాపాయం గురించి అరచి చెప్పేందుకు అవకాశం లేక ఆ వ్యక్తి కుంగిపోయాడు. ఇంతలో అతడు ఏ చెట్టునయితే నరకబోయాడో, ఆ చెట్టుతొర్రలో తన గుడ్లను పొదిగి, ఆహారాన్వేషణకు వెళ్లిన ఓ పక్షి తిరిగి వచ్చింది. పరిస్థితి అర్థమై గుండ్రంగా పైన తిరుగుతూ గట్టిగా అరచి గోల చేయసాగింది. ఆ పక్షి కూతలకు వేటగాడు గబగబా అటువైపు వచ్చాడు. ఎలుగు పైకి బాణాలు వేశాడు. అది పారిపోయింది. ఇక్కడ మనం గమనించాల్సింది ఏంటంటే- వేటగాడి వల్ల తనకు ప్రమాదం ఉందని తెలిసినా ఆ పక్షి, ఎలుగు బారినుంచి ఆ వ్యక్తిని రక్షించే ప్రయత్నం చేసింది. అదే సమయంలో తనకూ తన పిల్లలకూ ఆశ్రయం ఇచ్చిన చెట్టును కాపాడుకోగలిగింది.

ఆపత్కాలంలో ఆర్తత్రాణ పరాయణుడైన పరమాత్మపై భారం వేసి కాపాడమని అర్థిస్తే, సన్నటి వెలుగు రేఖనైనా ప్రసరింపజేస్తాడు. ఆ వెలుతురులో మనం కష్టం నుంచి బయటపడే మార్గాన్ని వెతుక్కోవాలి. మనోధైర్యాన్ని కోల్పోకుండా తనను తాను కాపాడుకునే ప్రయత్నం చేసినవాడే ఏ ఆపద నుంచైనా గట్టెక్కగలుగుతాడు. పిరికితనాన్ని జయించి, నిబ్బరంతో నిలబడిన వారికే మనుగడ సుగమం అవుతుంది. చుట్టూ అంధకారం అలముకున్నా సరే, మనసులో చీకట్లు కమ్ముకోకుండా అదుపు చేసుకోగల శక్తిని ఆ భగవంతుడే ఇస్తాడు. కావాల్సిందల్లా మన మీద మనకి, ఆయనమీద మనకి... నమ్మకమే!.

- వేలూరి ప్రమీలా శర్మ

సేద్యానికి క్వాంటం చేవ!

వ్యవసాయ రంగంలో దేశంలో అత్యంత పురోగమన రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటి. అయితే వాతావరణ అనిశ్చితి, నేల క్షీణత, నీటి కొరత, మార్కెట్ ఒడుదొడుకులు, పంట నష్టాలు రాష్ట్ర సాగు రంగాన్ని తీవ్ర ఒత్తిడికి గురిచేస్తున్నాయి. ఈ క్రమంలో రేపటి సాంకేతికతగా ఆవిర్భవిస్తున్న క్వాంటం కంప్యూటింగ్‌ను వినియోగించడం ద్వారా వ్యవసాయంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావచ్చు.

ప్రపంచవ్యాప్తంగా రవాణా, వాతావరణ నమూనాలు, ఔషధ రంగాల్లో క్వాంటం సాంకేతికతను విస్తృతంగా ఉపయోగిస్తున్నారు. సాగు రంగంలో కూడా ఇది కీలకమైన ఆవిష్కరణలకు దారితీస్తోంది. క్వాంటం పరిజ్ఞానం అనేది ఒక సమస్యకు ఒకే ఒక పరిష్కారాన్ని పరిశీలించకుండా, సాధ్యమైనన్ని పరిష్కారాలను ఒకేసారి విశ్లేషిస్తుంది. వ్యవసాయంలో నేల పరిస్థితి, వాతావరణ నమూనాలు, తెగుళ్ల ప్రవర్తన, మార్కెట్ శక్తుల వంటి అంశాలన్నీ ఒకదానితో ఒకటి సంక్లిష్టంగా అనుసంధానమై ఉంటాయి. క్వాంటం కంప్యూటర్లు వీటన్నింటినీ ఒకేసారి విశ్లేషించగలవు. ఒక పంట సీజన్‌ను సమగ్రంగా విశ్లేషించి విభిన్న రకాల పనులను అత్యంత నిక్కచ్చిగా పూర్తి చేయగలవు. ఏపీలో సాగు భూమికి సంబంధించి తీరప్రాంత జిల్లాలు తుపాన్లకు గురవుతుంటాయి. రాయలసీమ ప్రాంతం తరచూ కరవులను ఎదుర్కొంటోంది. పాడేరు, అరకు వంటి గిరిజన ప్రాంతాలు సేంద్రియ వ్యవసాయాన్ని అనుసరిస్తున్నాయి. కృష్ణ, గుంటూరు జిల్లాలు అధిక విలువైన పంటలకు కేంద్రాలుగా విలసిల్లుతున్నాయి. ఈ వైవిధ్యం ఏపీని క్వాంటం ఆధారిత పరిష్కారాలకు అనువైన పరీక్షా క్షేత్రంగా మార్చుతోంది. రాష్ట్రంలో ఇప్పటికే ఉన్న రియల్-టైమ్ సేకరణ వ్యవస్థలు, ఈ-క్రాప్ రిజిస్ట్రేషన్, రైతు సేవా కేంద్రాల వంటి డిజిటల్ వ్యవస్థలూ ఇందుకు బలమైన పునాదిని అందిస్తున్నాయి. వ్యవసాయ వర్సిటీ, ఐఐటీ, ట్రిపుల్‌ఐటీ, శ్రీసిటీ, నైపుణ్యాభివృద్ధి కార్పొరేషన్ వంటి సంస్థల తోడ్పాటూ దక్కుతుంది.



విభిన్న ఉపయోగాలు

అనంతపురం, శ్రీకాకుళం వంటి జిల్లాల్లో వర్షాభావం రైతులకు పెద్ద సవాలు. క్వాంటం ఆధారిత నమూనాలు స్థానిక వాతావరణం, నేలలో తేమ, పంటతీరును కొన్ని నెలల ముందుగానే విశ్లేషించగలవు. తద్వారా రైతులు సరైన పంటలను ఎంచుకునేలా, సరైన సమయంలో నాటడంతో పాటు కోతకు సిద్ధమయ్యేలా సాయపడతాయి. నేల రసాయన గుణాలను విశ్లేషించి, నీరూ పోషకాల సరైన మోతాదులను సూచిస్తాయి. దీనివల్ల సాగు వ్యయాలు తగ్గుతాయి. పర్యావరణ పరిరక్షణ సాధ్యమవుతుంది. దీర్ఘకాలంపాటు నేల ఆరోగ్యం సురక్షితంగా ఉంటుంది. ఐఓటీ డేటా, ఉపగ్రహ చిత్రాలు, క్వాంటం ఆధారిత మెషీన్ లెర్నింగ్ వంటి సాంకేతికతలన్నీ కలిసి తెగుళ్లు, చీడపీడలకు సంబంధించిన సంకేతాలను ముందుగానే గుర్తిస్తాయి. దీనివల్ల మిరప, అరటి, ద్రాక్ష వంటి అధిక విలువైన పంటల విషయంలో సకాలంలో జోక్యం చేసుకుని దిగుబడిని కాపాడుకోవచ్చు. రవాణాలో ఆలస్యం, నిల్వ కష్టాలు, మార్కెట్‌తో అనుసంధానంలో లోపాల వల్ల పండ్లు, కూరగాయల సాగులో గణనీయమైన నష్టం సంభవిస్తోంది. క్వాంటం అల్గారిథమ్‌లు వేలకొద్దీ సరఫరా గొలుసు దృశ్యాలను రియల్-టైమ్‌లో విశ్లేషించి, అత్యంత సమర్థమైన మార్గాలను సూచించగలవు. మార్కెట్ అవకాశాలను అందిపుచ్చుకునే సామర్థ్యాన్నీ మెరుగు పరుస్తాయి. ఫలితంగా నష్టాలు తగ్గుతాయి.

మెరుగైన సామర్థ్యాలు...

ఏపీ వ్యవసాయ రంగంలో క్వాంటం కంప్యూటింగ్‌ను పూర్తిస్థాయిలో ఉపయోగించుకోవడానికి అగ్రిటెక్, ఫిన్‌టెక్ మిషన్‌లతో అనుసంధానించాలి. క్వాంటం ఆలోచనలు పరిశోధన పత్రాలకే పరిమితం కాకుండా యాప్‌లు, ఆర్థిక సాధనాలు, బీమా ఉత్పత్తులు, స్టార్టప్‌ల ఆవిష్కరణలలో భాగంగా మారాలి. ప్రస్తుతం ఏపీలో వినియోగంలో ఉన్న డ్రోన్‌లు, నేల పరీక్ష కిట్‌లు, ఏఐ ఆధారిత సలహాలు వంటి అగ్రిటెక్ సాధనాలకు క్వాంటం కంప్యూటింగ్ మెరుగైన సామర్థ్యాలను జోడిస్తుంది. రియల్-టైమ్‌లో వాతావరణం, నేల, మార్కెట్ డేటా ఆధారంగా ఒక నేలకు నిర్దిష్ట విత్తన రకాన్ని సిఫార్సు చేస్తుంది. తెగుళ్ల రాకను అంచనా వేస్తుంది. డిమాండ్ అంచనాలు, ధరల సిమ్యులేషన్‌ల ఆధారంగా పంట కోత సమయాన్ని నిర్ణయించడంలో సహాయపడుతుంది. పంట బీమా ప్రీమియంలనూ నిర్దిష్టంగా లెక్కించవచ్చు. గత దిగుబడులు, భవిష్యత్తు సమస్యలను పరిగణనలోకి తీసుకుని కిసాన్ క్రెడిట్ స్కోర్‌లను రూపొందించవచ్చు. మార్కెట్ ధరల అంచనా సాధనాల వల్ల పంటలను బలవంతంగా అమ్ముకునే అగత్యం రైతులకు తప్పుతుంది. ఇంజినీరింగ్ విద్యార్థులు, గ్రామీణ వ్యవసాయ ఔత్సాహికులు, క్వాంటం సాంకేతికత, వ్యవసాయ, ఆర్థిక రంగాల మేలుకలయికలో మేలైన ఆవిష్కరణలను సృష్టించే అవకాశం ఏర్పడుతుంది. ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాలు వ్యవసాయంలో క్వాంటం సాంకేతికతలను వినియోగిస్తున్నాయి. నెదర్లాండ్స్‌లోని వాగెనింగెన్ విశ్వవిద్యాలయం క్వాంటం ఆధారిత నేల, పశుసంవర్ధన సిమ్యులేషన్‌లపై కృషిచేస్తోంది. ఇజ్రాయెల్ నీటి కొరత, వ్యవసాయ ప్రణాళిక కోసం క్వాంటం అంచనా నమూనాలను ఉపయోగిస్తోంది. ఇలాంటివాటి నుంచి ఎంతో నేర్చుకోవచ్చు. స్టార్టప్‌ల సహకారంతో వాటిలో భాగస్వామ్యమూ పొందవచ్చు.

స్పష్టమైన లక్ష్యంతో...

క్వాంటం కంప్యూటింగ్‌ను సాగు రంగంలో ఆచరణాత్మక సాధనంగా తీర్చిదిద్దడానికి వ్యవసాయం, ఐటీ, ప్రణాళిక శాఖలు సంయుక్తంగా స్పష్టమైన లక్ష్యంతో ప్రత్యేక మిషన్‌ను నెలకొల్పాలి. విత్తన గ్రాంట్లు, మౌలిక సదుపాయాలు, క్వాంటం ఆధారిత వ్యవసాయ సలహా వేదికలు, పంట రుణాలు, బీమా, పొలం నుంచి మార్కెట్‌కు క్వాంటం ఆధారిత రవాణా సాధనాలపై పనిచేసే స్టార్టప్‌లను ప్రోత్సహించాలి. స్థానిక వాతావరణం, తెగుళ్ల తీరు, విత్తన చక్రాలపై రైతులకు తరతరాలుగా అపార అనుభవం, విజ్ఞానం ఉంటుంది. దీన్ని మరింత బలోపేతం చేయడానికి క్వాంటం కంప్యూటింగ్ తోడ్పడుతుంది. ఏఐ ఆధారిత తెగుళ్ల హెచ్చరికలను రైతుల సంప్రదాయ పంటల పరిజ్ఞానంతో అనుసంధానించడం ద్వారా వ్యవసాయ పునరుజ్జీవనం సాధ్యమవుతుంది. క్వాంటం కంప్యూటింగ్ ఇంకా ప్రాథమిక దశలోనే ఉన్నా, వ్యవసాయ సాంకేతిక పరిణామంలో ఏపీకి మెరుగైన భవిష్యత్తును సృష్టించే అవకాశాన్ని అందించగలదు.



డాక్టర్ షేక్ ఎన్.మీరా
డైరెక్టర్, ఐకార్-అగ్రికల్చరల్ టెక్నాలజీ అప్లికేషన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, హైదరాబాద్



చూసే కోణం...

తన టీమ్‌లోని ఉద్యోగులు పనిపట్ల నిరాసక్తంగా ఉండటం గమనించాడు ఓ కార్పొరేట్ సంస్థ మేనేజర్. అందరూ యువకులూ, మంచి జీతం అందుకుంటున్నవాళ్లే. ఏ అసంతృప్తి వారినలా ఉంచుతోందో ఆయనకు అర్థం కాలేదు. అందుకని ఒకరోజు వారితో పిచ్చాపాటీ మాట్లాడుతూ ఆఫీసులో బాధ్యతలు మీకు ఆసక్తి కలిగిస్తున్నాయా అని అడిగాడు. రోజూ ఒకే విధమైన పని చేయడంవల్ల కాస్త విసుగ్గా ఉంటోందని సమాధానమిచ్చారు వాళ్లు. అవునా.. అని ఊరుకున్నాడు మేనేజరు. తరవాత కొన్నాళ్లకు వాళ్లందరినీ నగరానికి దూరంగా తీసుకెళ్లాడాయన. అక్కడో నిర్మాణం జరుగుతోంది. మూడు పక్కలా గోడలు కడుతున్న ముగ్గురు కూలీల దగ్గరికి వెళ్లి, వాళ్లు చేస్తున్న పనేంటో, దానిపట్ల వారి అభిప్రాయం ఏంటో కనుక్కుందామన్నాడు మేనేజరు. అలాగే వెళ్లి ఏం చేస్తున్నావని అడిగారు. మొదటి కూలీ వాళ్లు అడిగిన ప్రశ్నలకు తల కూడా తిప్పకుండా 'కనిపించడం లేదూ.. గోడ కడుతున్నాను' అన్నాడు అనాసక్తంగా.

రెండో కూలీ 'ఏముందయ్యా. ఇల్లు గడవాలంటే ఏదో ఒక పని చేయాలి. ఈ పని దొరికింది' అని చెప్పి మళ్లీ పనిలో పడ్డాడు. చివరగా మూడో కూలీ దగ్గరికి వెళ్లారు. అతడు చాలా చురుగ్గా ఉత్సాహంగా కనిపించాడు. యాంత్రికంగా కాకుండా ఎంతో ప్రేమతో చేస్తున్నట్లు తెలుస్తోంది అతడి పని తీరు. వీళ్లడిగిన ప్రశ్నకు తడుముకోకుండా 'అయ్యా.. నేను కడుతున్న ఈ గోడ బడిది. భవనం పూర్తయ్యాక ఇక్కడ పిల్లలు చదువుకుంటారు' అన్నాడు. కష్టమైన పనిచేస్తూ ఇంత సంతోషంగా ఎలా ఉన్నావూ అనడిగితే- 'నేనెట్లాగూ చదువుకోలేకపోయాను. పిల్లల జీవితాలను బాగుచేసే బడిని కట్టే అవకాశం దొరికింది. రేపు ఇందులోనే నా బిడ్డలూ చదువుకుంటారేమో. పిల్లల భవిష్యత్తును తలచుకుంటూ సంతోషంగా పనిచేస్తున్నా' అని నవ్వుతూ బదులిచ్చాడు.

అంతా విన్నాక మేనేజర్ తన బృందం వైపు తిరిగి 'మనం కూడా ఇదే చేస్తున్నాం- ఒకే పని. కాకపోతే మొదటి వాళ్లిద్దరిలా నిరాసక్తంగా మనది కాని పని, కేవలం జీతం కోసం చేస్తున్నట్లుగా భావిస్తున్నాం. పనిని బట్టి కాదు, చూసే దృష్టిని బట్టి అందులో మనకు ఆనందం ఉంటుంది. నిజానికి అవే ప్రాజెక్టులు, అదే కోడింగు... అని మనం విసుక్కుంటున్నాం కానీ ఒక్కసారి ఆలోచించండి- మన పని వల్ల ఎంతమంది జీవితాలు సులభతరం అవుతున్నాయో! స్కూలు, బ్యాంకు, ఫ్యాక్టరీ... ఏ సంస్థ అయినా దానికి సంబంధించిన ప్రాజెక్టును మనం సిద్ధం చేసి ఇచ్చామంటే దానివల్ల వినియోగదారులకు మరిన్ని మెరుగైన సేవలు అందుతాయి కదా. పని విలువ మనకొచ్చే జీతంతో కాదు, దాని ఫలితం ప్రజల జీవితం మీద చూపే ప్రభావాన్ని బట్టి ఉంటుంది. అది గుర్తుంచుకుంటే- పనిని ప్రేమించగలుగుతాం. ఆడుతూ పాడుతూ ఆనందంగా ఉద్యోగం చేయగలుగుతాం' అన్నాడు.

- వై.ప్రసాద్



భారీగా వాహనాల ఎగుమతి

సమాజంలో వస్తున్న మార్పులకు అనుగుణంగా వినియోగం పెరుగుతోంది. దాంతో భారత్ పెద్ద మొత్తంలో వాహనాలు రూపొందించడంతో పాటు భారీగా విదేశాలకు ఎగుమతి చేస్తోంది. 2022-23లో ప్రయాణికుల బండ్లు, త్రిచక్ర, ద్విచక్ర వాహనాలు వంటి వన్నీ కలిపి ఇండియా మొత్తం 47.61 లక్షల వెహికిల్స్‌ను విదేశాలకు పంపింది. తరవాతి ఏడాదిలో వాటి సంఖ్య 45 లక్షలకు తగ్గినా, నిరుడు మళ్లీ 19శాతం వృద్ధితో అవి 53.63 లక్షలకు చేరాయి. 2024-25లో ఆయా విభాగాల్లో భారత్ వాహన ఎగుమతులు... (లక్షల్లో)

ప్రయాణికుల వాహనాలు	7.70
వాణిజ్య వాహనాలు	0.81
త్రిచక్ర వాహనాలు	3.06
ద్విచక్ర వాహనాలు	41.98
చిన్న వాహనాలు	0.06

(ఆధారం: సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ వెబ్‌సైట్)

మత్తులో ముంచి... బ్రేవ్‌మని తేన్చి...

'బాస్! కొంప మునిగింది, మిత్రరత్నాన్ని అరెస్టు చేశారు'

'మనకు తెలియని ఎదవ పని ఏం చేశాడయ్యా!'

'జనాన్ని మత్తులో ముంచి, మద్యం దందాలో మనం సంచులు నింపేసుకున్నామని అనుకుంటున్నారంతా!'

'చూడు గజాలా, జనం కష్టజీవులు. వాళ్ల కష్టం మరిచిపోయేలా మందు పట్టించాం. మత్తు బాగా ఎక్కించే సరకును మనవాళ్లతోనే తయారు చేయించాం. మన కష్టానికి ఒక రూపాయి ఇటు పడిఉండొచ్చు. దానికే కుంభకోణాలంటూ లంబకోణాలు వెతుకుతారా? తిరిగొచ్చాక లెక్కలన్నీ సరిచేద్దాంలే!'

'ఇంకెక్కడికి వచ్చేది బాస్! జనం చిత్తు కాగితంలా చింపి, పదకొండు ముక్కలు చేసి పారేస్తేనే చెత్త చరిత్రతో వ్యర్థాల అడుక్కి చేరాం!'

'ఇప్పుడు పైన ఉన్నవాళ్లంతా కిందికి వస్తారు. మనం పైకి వస్తాంలే!'

'జెయింట్ వీల్ ఎక్కి పదకొండు నిమిషాల్లో పదకొండుసార్లు పైకి కిందికీ తిరిగి ముచ్చట తీర్చుకోవాల్సిందే తప్ప, పైకొచ్చేదీ లేదు, సచ్చేదీ లేదు బాస్!'

'గట్టిగా మూడేళ్లు కళ్లు మూసుకోవయ్యా. అంతా ఎగిరిపోతారు.'

'నెక్స్ట్ రౌండ్‌లో ఊచల వెనక్కి ఎగిరిపడేది బిగ్‌బాసే నంటూ బయట చెవులు కొరుక్కుంటున్నారు'

'అలవాటేగా వెళ్లి వచ్చెయ్యొచ్చు లేవయ్యా గజాలా!'

'వెళ్తారు సరే, వచ్చేదెప్పుడోనని భయంగా ఉంది బాస్'

'ఇది నీ మనసులో కోరికా? నిజంగానే అనుమానమా?'

'భయంతో నిండిన బలమైన అనుమానం అనుకోండి!'

'అయితే, మనకోసం ఏడ్చే జనాల్ని ఓదార్చి వద్దాం'

'మనల్నే కదండీ పరామర్శించి, ఓదార్చాలి'

'ఉన్న పదకొండుతో ఎన్నిసార్లు మనలో మనమే ఓదార్చుకుంటాం! ముందయితే జనాల్ని పరామర్శించేద్దాం.'

'ఏర్పాట్లు చెయ్యమంటారా బాస్'

'దీనికి స్పెషల్ స్ట్రాటజిస్టులు కమ్ డైరెక్టర్లను దింపుతా!'

★ ★ ★ ★ ★

'ఏంటయ్యా డైరెక్టరూ, స్ట్రాటజీల కోసం పిలిపిస్తే, ఏవో లెక్కలేసుకుంటావేం?'


'ఊచలు ఏడు ఉంటాయా, పదకొండు పెట్టాలా అని బుర్ర గిలక్కొడుతున్నా బాస్'

'ఇప్పుడా గిలక్కొట్టుడు ఎందుకో?'

'పరామర్శ పోస్టర్లలో ఊచల గ్రాఫిక్స్ చేయిస్తే, సానుభూతి వరదలా పారుతుందంతే!'

'వరదెక్కువై, కొట్టుకుపోకుండా చూడు'

'పర్ఫెక్టుగా ప్లాన్ చేశాం బాస్! జనం రోజూ కిందామీదా



పడి తోసుకుంటూ మిమ్మల్ని కలుసుకుంటారన్న మాట'

'అంతమంది ఎలా వస్తారయ్యా?'

'జనానికేమీ పనిలేదా, వాళ్లెందుకు వస్తారు బాస్! మన వాళ్లకే డబ్బులిచ్చి తెస్తాం!'

'ఎందుకొస్తున్నారంటే ఏం చెప్పేదీ?'

'మళ్లీ వచ్చేది మనమేననే ఆశతో సమస్యలు చెప్పడానికి వస్తున్నారన్నట్లుగా కలరింగివ్వాలి'

'మరి, రైతుల్ని ఎందుకు తెచ్చారు?'

'వీళ్లంతా మన కార్యకర్తలే! ఒకరోజు రైతుల్లా, ఇంకోరోజు పేదల్లా, మరోరోజు స్టూడెంట్స్, యూత్‌లా వేషాలేస్తాం.'

'మామిడికాయలు, టమాటాల ట్రాక్టర్లు వచ్చాయా?'

'అవన్నీ స్పాట్‌కు వచ్చేస్తాయి, డ్రైవర్లకూ రిహార్సల్స్ చేయించాం.'

'అంతా స్క్రిప్టు ప్రకారమే సాగుతుంది కదా!'

'మీరు చెప్పినట్లే అంతా పక్కాగా సాగుతుంది. రోడ్లపై తొక్కించేయడమే'

'ఫ్లెక్సీలన్నీ ప్రింటయ్యాయా?'

'రప్పారప్పా నరుకుతాం... పర్రాపర్రా కోస్తాం... కస్సాపొడుస్తాం... కసాబిసా కొరుకుతా... ఇలాంటి నినాదాలతో ఫ్లెక్సీలు వేయించాం. కాకపోతే, వయొలెన్స్ ఎక్కువైందంటారేమో బాస్'

'కుర్రాళ్లేదో ముచ్చటపడి, సినిమా డైలాగ్‌లు రాసుకుంటే ఎవరికొచ్చిన నష్టమేంటి? అని రివర్స్ డైలాగులతో చెలరేగిపోదాం లేవయ్యా! నేను ఫలానా ఊరు దగ్గరికి వెళ్లేసరికి నన్ను పట్టుకుని ఏడ్చేందుకు కొందరుండాలి'

'పెయిడ్ ఆర్టిస్టులను తెప్పించాం. మీరు ఊళ్లోకి ఎంటరవ్వగానే, ఒకచోట వాళ్లంతా దీనంగా కూర్చుని ఉంటారు. మీరు మొహం వేలాడేసి, అది నవ్వో, ఏడుపో అర్థంకాని అర్ధవదనంతో, ఎమోషన్‌లెస్ ఫీలింగ్స్‌తో వాళ్ల నెత్తిన చెయ్యి పెడతారు. అంతలోనే పక్క సందులో నుంచి ఇంకొందరు పరుగున వచ్చి మిమ్మల్ని పట్టేసుకుని బోరుమంటారు. నేను ఉన్నానుగా అన్నట్లుగా నుదుటి మీద ఓదారుస్తారు.'

'దాంతో సమస్యేమీ ఉండదు కదా?'

'పదకొండు లీటర్ల ఫినాయిల్, పదకొండు లీటర్ల షాంపూ, పదకొండు లీటర్ల శానిటైజర్లతో మీ నోటిని శుభ్రం చేసుకోవచ్చు. అవసరమైతే పదకొండు లీటర్ల సెంటుకూడా కొట్టేద్దాం'

'ఈ పదకొండు గోలేమిటయ్యా, అది తప్ప ఇంకో నంబరే లేదా?'

'అది మా లక్కీ నంబర్ బాస్, అన్నీ పదకొండుతోనే ట్రై చేస్తుంటాం'

'ఆ నంబర్ నా ముందు పలక్కండి, ఇంకెలాగైనా చెప్పండి'

'పదకొండును పదకొండు అనకుండా, ఒకటి పక్కన ఒకటి అనాలా ఏంటీ?'

'ఏదోఒకటి తగులబెట్టండయ్యా!'

'యాత్రలో మనం చేసే పని అదే బాస్! ఓ పక్కన మీరు పరామర్శించేస్తుంటే, మరోపక్క మన కుర్రాళ్లు కనిపించిన వాటినల్లా తగులబెట్టేస్తుంటారు.'

'మొత్తానికి నా మనసులో మాట సరిగ్గా అర్థం చేసుకున్నావయ్యా! వయొలెన్స్ లేని క్లైమాక్స్.. విలన్ లేని సినిమాలా ఫ్లాప్ టాక్‌లో పడుతుంది. మనం ఓదారిస్తే.. జనం అదిరిపడి బెదిరిపోవాలంతే!'

- శ్రీశైల

అలా వెక్కిరించొద్దు!

హాయ్ బుజ్జీ!!

హాయ్ నేస్తాలూ..! మనల్ని ఎవరైనా బెదిరించినా, వెక్కిరించినా ఏం చేస్తాం? ఏముంది ఏడ్చుకుంటూ అమ్మ దగ్గరికి వెళ్లిపోతాం. లేదంటే మనమూ తిరిగి ఏదో ఒకటి అనేస్తాం. కానీ ఈ నేస్తం మాత్రం.. దానికి వ్యతిరేకంగా ఒక ప్రచార సంస్థ ఏర్పాటు చేశాడు. ఇంతకీ ఆ వివరాలేంటంటే..

అమెరికాకు చెందిన కావనాగ్ బెల్‌కు పన్నెండు సంవత్సరాలు. తనని చిన్నప్పుడు అమ్మానాన్నలు ఒక చైనీస్ ప్రీస్కూల్లో జాయిన్ చేశారు. కానీ తనకు ఆ భాష రాకపోవడంతో మాట్లాడకుండా మౌనంగా ఉండేవాడు. దాంతో అందరూ వెక్కిరించేవారట. ఒకరోజు అదే విషయం వాళ్ల అమ్మతో చెబుతూ ఏడ్చేశాడట. ఒకసారి తన స్నేహితుడిని కూడా ఎవరో



వెక్కిరించడంతో చాలా బాధపడిపోయాడట. అందుకే వెక్కిరింతల వల్ల ఎదుటి వాళ్లు ఎంత ఇబ్బంది పడతారో అందరికీ తెలియజేయాలి అనుకున్నాడు కావనాగ్. అలా వాళ్లమ్మ సాయంతో ఆరేళ్ల వయసులోనే.. 'యాంటీ బుల్లీయింగ్ నాన్ ప్రాఫిట్(కూల్ అండ్ డోప్)' అనే ఒక సంస్థను ప్రారంభించాడు. అప్పటి నుంచి తను ఉండే ప్రాంతంలో ఎక్కడ మీటింగ్స్ జరిగితే అక్కడికి వెళ్లి.. 'వెక్కిరింతలు మంచివి కాదు. అది ఎదుటి వ్యక్తిలో కాన్ఫిడెన్స్‌ను తగ్గిస్తుంది. కుంగుబాటుకు లోనయ్యేలా చేస్తుంది' అంటూ ఉపన్యాసాలు ఇస్తున్నాడు. తక్కువ సమయంలోనే చాలా మంచి పేరునీ సంపాదించుకున్నాడు. అలా 'వరల్డ్స్ యంగెస్ట్ యాంటీ బుల్లీయింగ్ యాక్టివిస్ట్'గా 'గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్'లో స్థానం సంపాదించాడు. తనకు బేస్‌బాల్ ఆడటమంటే చాలా ఇష్టమట. కాస్త చిన్నగా, బొద్దుగా ఉండటంతో ఆ విషయంలో కూడా వెక్కిరింతలు ఎదుర్కొన్నాడట కావనాగ్. అంతే కాదు నేస్తాలూ.. తన సంస్థ పేరిట కరోనా సమయంలో ఫండ్స్ కలెక్ట్ చేసి వృద్ధాశ్రమాలకు సాయం అందించాడు. 2030 సంవత్సరం కల్లా.. తన సంస్థ ద్వారా వీలైనంత ఎక్కువ మందిలో నెగెటివిటీని తొలగించడమే లక్ష్యమట. ★

పదాలేవి?

ఇక్కడ కొన్ని పదాలు అసంపూర్తిగా ఉన్నాయి. మొదటి పదం చివరి అక్షరాలతోనే రెండోది ప్రారంభమవుతుంది. ఓసారి ప్రయత్నించండి.

1. DAM☐☐☐NT
2. ZO☐☐AR
3. COUR☐☐AT
4. SHA☐☐ACE
5. ELE☐☐☐☐ION
6. AMO☐☐☐IL

జవాబు: 1.DAMAGE, AGENT 2. ZONE, NEAR 3.COURSE, SEAT 4.SHAPE, PEACE 5.ELEMENT, MENTION 6.AMOUNT, UNTIL

తాగునీటి నాణ్యతపై అలసత్వం వద్దు


నీటిని పరిశీలిస్తున్న కలెక్టర్ లక్ష్మీశ

విద్యాధరపురం, న్యూస్‌టుడే: తాగునీటి నాణ్యతపై అలసత్వం వద్దని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. విద్యాధరపురంలోని కేఎల్ రావు హెడ్ వాటర్ వర్క్స్ వద్ద నదిలో శుద్ధి చేసిన నీటిని ఆయన మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వర్షాకాలం నేపథ్యంలో తాగునీరు నాణ్యత, సరఫరా వ్యవస్థలో లోపాలకు తావు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులు క్షేత్రస్థాయిలో సిబ్బందితో సమన్వయం చేసుకొని ప్రజల ఆరోగ్య భద్రతకు కీలకమైన రక్షిత నీటిని అందించేందుకు కృషి చేయాలన్నారు. 5 ఎంఎల్‌డీ ఐవీబీక్ వెల్, ఫిల్టరేషన్ ప్లాంట్, క్లోరినేషన్ ప్లాంట్, పంప్ హౌస్, నీటి శుద్ధికి తీసుకుంటున్న చర్యలను ఆయన పరిశీలించారు. నగరపాలక సంస్థ చీఫ్ ఇంజినీర్ శ్రీనాథ్‌రెడ్డి, ఎస్ఈ సత్యకుమారి, ఈఈ వెంకటేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

సెప్టెంబరు 22 నుంచి దసరా ఉత్సవాలు

విద్యాధరపురం, న్యూస్‌టుడే: రాష్ట్ర పర్వదినంగా సెప్టెంబరు 22 నుంచి అక్టోబర్ 2 వరకు ఇంద్రకీలాద్రిపై దసరా ఉత్సవాలను నిర్వహించాలని కలెక్టర్ లక్ష్మీశ మంగళవారం ఉత్తర్వులు ఇచ్చారు. ఈనెల 29న కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించనున్న సమన్వయ సమావేశానికి వారు కోఆర్డినేషన్ ఏర్పాట్లపై అన్ని ప్రభుత్వ విభాగాలు, దుర్గగుడి అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొన్నారు.

నేటి నుంచి ఐటీఐ రెండో విడత కౌన్సెలింగ్

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: జిల్లాలోని ప్రభుత్వ ప్రైవేటు ఐటీఐ కోర్సుల్లో మొదటి విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సీట్ల భర్తీకి నేటి నుంచి రెండు రోజుల పాటు రెండో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్ కనకారావు తెలిపారు. 23న ఉదయం 1 నుంచి 164 ర్యాంక్ వరకు, మధ్యాహ్నం ఒంటి గంట నుంచి 165 - 337 ర్యాంక్ వరకు, 24న ఉదయం 8 గంటలకు 338 - 509 ర్యాంకులు, మధ్యాహ్నం 510 - 650 ర్యాంకు అభ్యర్థులు హాజరుకావాలని తెలిపారు. ఈనెల 20 నుంచి 22వ తేదీ వరకు ప్రవేశాలకు దరఖాస్తు చేసుకున్నవారు కౌన్సెలింగ్‌కు హాజరుకావాలని సూచించారు. సందేహాల నివృత్తికి విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, 0866-2475575, 94906-39639, 77804-29468 నంబర్లలోనూ సంప్రదించాలని తెలిపారు.

సాఫీగా సాగుతున్నాయ్..

ఈనాడు, అమరావతి

వైకాపా పాలనలో కాలువల నిర్వహణకు పైసా విదల్చలేదు. తట్టెడు మట్టి తీసిన దాఖలాలు లేవు. గత ప్రభుత్వ పాలనలో పూడికతీత లేక.. తూడు తీసే దిక్కులేక.. శివారు పొలాల గొంతు తడారింది. నీటి పారుదల లేక కాలువలకు గండ్లు పడి ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. కూటమి సర్కారు అధికారం చేపట్టిన వెంటనే నిర్వహణ పనులకు నిధులిచ్చింది. అన్నీ ఉన్నా అల్లుడి నోట్లో శని అన్నట్లు రూ.కోట్ల నిధులున్నా అధికారుల నిర్లిప్తతతో పనులు ముందుకు సాగలేదు. కాలువలకు నీళ్లొదిలే నాటికి 20 శాతం కూడా పూర్తి చేయలేదు. కొందరు నాయకులు కమీషన్ల కోసం వైకాపా నాయకులకు కాంట్రాక్టులు అప్పగించడం, ముందే కమీషన్లు ఇస్తేనే పనులు ఇస్తామని బేరాలు మాట్లాడటంతో మరింత అలసత్వమయ్యాయి. దీనిపై ఈనాడులో 'తూడు తీయరు.. గోడు తీర్చరు', 'కీలక నేత కనుసన్నల్లో' 'సిరిసాగా..ఉసిస్సా' 'ముందే బేరం.. ముడితేనే పనులు' శీర్షికలతో వరుస కథనాలు ప్రచురించడంతో అధికారులు స్పందించారు. కాలువ పనులను వేగంగా గుత్తేదారులను ఎంపిక చేసి వడివడిగా పనులు చేస్తున్నారు.

వడివడిగా కాలువల నిర్వహణ పనులు


తూడుతో నిండిన బందరు కెనాల్ (పాత చిత్రం)


తొలగించిన తర్వాత..

ప్రధాన కాలువల్లో వేగంగా: ప్రస్తుతం జిల్లాలో ప్రధానంగా బందరు, రైవస్, ఏలూరు, కేఈబీ కాలువల్లో నిర్వహణ పనులు చేస్తున్నారు. వర్షంతో వంతెనల దగ్గర పేరుకుపోయిన తూడు తొలగిస్తున్నారు. బందరు కాలువ మొత్తం 70 కిమీలలో 60 శాతం పైగా పనులు పూర్తి చేశారు. రైవస్ కాలువకు సంబంధించి గుడివాడ బైపాస్ వరకు అంటే దాదాపు 40 కిమీ వరకు పూర్తి చేశారు. ఏలూరు కాలువలో 80 శాతం, కేఈబీలో 90శాతం పైగా పనులు చేశారు. గత నాలుగు రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు పొలాలు పూర్తిగా నీట మునగడంతో కాలువలు సాఫీగా సాగుతుంటే ముంపు ప్రమాదం తప్పింది. చాలా వరకు పనులు పూర్తి చేయడంతో శివారు వరకు సాఫీగా వెళ్లేందుకు అవకాశం ఏర్పడింది.

పర్యవేక్షణ పెరగాలి: ప్రస్తుతం వర్షం నేపథ్యంలో యంత్రాలతో తొలిసే కొట్టుకుపోతాయనే ధోరణిలో కొందరు గుత్తేదారులు మమ అనిపిస్తున్నారు. గట్ల వెంట పట్టిన తూడు, గుర్రపుడెక్కను తొలగించడం లేదు. దీనిపై అధికారుల పర్యవేక్షణ సైతం సక్రమంగా లేదు. కొందరు మండల స్థాయి అధికారులు గుత్తేదారుల నుంచి ముడుపులు తీసుకుని పనుల పర్యవేక్షణ గాలికి వదిలేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. వర్షాల నేపథ్యంలో ఎగువ నుంచి కొట్టుకొచ్చే గుర్రపుడెక్కను ఎప్పటికప్పుడు తొలగించే చర్యలు తీసుకోవాలి. అప్పుడే శివారులో సిరులు పండుతాయి.

స్పందనకు వందనం

వసతింట.. వేదనంట..!



ఇవి పెనుగంచిప్రోలులోని బీసీ సంక్షేమ వసతి గృహం మరుగుదొడ్లు. మొత్తం 60 మంది విద్యార్థులు ఈ నాలుగు మరుగుదొడ్లనే వాడాలి. దీంతో బహిర్భూమికి సైతం బయటకు వెళ్లాల్సిన దుస్థితి. వానొచ్చినా ఆరుబయటే స్నానం చేయాలి. వసతి గృహం శిథిలావస్థకు చేరిన అద్దె భవనంలో నిర్వహిస్తున్న వేళ పిల్లల అవస్థలు అన్నీఇన్నీ కావు.



ఇవీ.. నందిగామ బీసీ కళాశాల వసతి గృహంలో శిథిలావస్థకు చేరిన మరుగుదొడ్లు. 80 మంది విద్యార్థులు ఉండగా ఎప్పుడు కూలతాయో తెలియని దైన్యం.



ఇదీ.. గుడ్లవల్లేరు మండలం కౌతవరంలోని సాంఘిక సంక్షేమ వసతి గృహం. పూర్తిగా శిథిలావస్థకు చేరి.. శ్లాబు పూర్తిగా పాడైంది. వర్షం పడితే ఇలా కురుస్తోంది. 20 మందికిపైగా పిల్లలు ఉన్నారు. గత పదేళ్లుగా ఇదే దుస్థితి.

- ఈనాడు, అమరావతి న్యూస్‌టుడే- నందిగామ గ్రామీణం, పెనుగంచిప్రోలు

అంశం (సంక్షేమం)	సాంఘిక	బీసీ
వసతి గృహాలు (ఉమ్మడి జిల్లా)	71	70
మొత్తం విద్యార్థులు	5,187	3,157
నిధుల మంజూరు (రూ.కోట్లలో)	11.74	4
మరమ్మతులు చేయాల్సింది	30%	50%

★ **నందిగామ** ఎస్సీ కళాశాల వసతి గృహంలో తాగునీటి సౌకర్యం లేదు. ట్యాంకర్లతో సరఫరా చేస్తున్నా అవి వాసన వస్తున్నాయని వాపోతున్నారు. ★ **పెడనలో** బీసీ సంక్షేమ వసతి గృహం నిర్వహిస్తున్న అద్దె భవనం సైతం శిథిలావస్థకు చేరడంతో 20 మంది విద్యార్థులను నాగాయలంకలోని మరో వసతి గృహానికి తరలించారు.

'ఉమ్మడి కృష్ణాలో సాంఘిక సంక్షేమ వసతి గృహాలను వైకాపా సర్కారు నిర్వీర్యం చేసింది. మౌలిక సదుపాయాలను గాలికొదిలేసింది. కూటమి సర్కారు అధికారం చేపట్టాక దిద్దుబాటు చర్యల దిశగా అడుగులు వస్తోంది. అయినా ఇంకా సమస్యలు కనిపిస్తూనే ఉన్నాయి. వర్షాకాలం నేపథ్యంలో అన్ని వసతి గృహాల్లో మౌలిక వసతులు కల్పించాల్సిన తరుణమిది.'

వైకాపా పాపానికి పర్యవసానం...

వైకాపా అయిదేళ్ల పాలనలో వసతి గృహాలను గాలికొదిలేసింది. మరుగుదొడ్లు, తాగునీరు, భవనాలు, విద్యుత్తు ఇలా ఏ సౌకర్యానికి పైసా విదల్చలేదు. శిథిల భవనాలకు కనీస మరమ్మతులు చేయలేదు. అధికారులు ఏటా ప్రతిపాదనలు పంపడం తప్ప ఫలితం లేదు. దీంతో వీటిని గాడిన పెట్టేందుకు చాలా సమయం అవసరం. కూటమి అధికారంలోకి రాగానే ఉమ్మడి జిల్లాలో వసతి గృహాలకు రూ.15.74 కోట్ల నిధులు మంజూరు చేసింది. చాలా వసతి గృహాల్లో దిద్దుబాటు చర్యలు చేపట్టినా సమస్యలు కనిపిస్తున్నాయి.

ఇంత నిర్లక్ష్యమా...

కూటమి సర్కారు అధికారం చేపట్టాక ఉమ్మడి జిల్లాలో వసతి గృహాలకు రూ.15 కోట్లకు పైగా నిధులు మంజూరు చేసినా అధికారులు మాత్రం వైకాపా పాలన నాటి నిర్లిప్తతను వీడలేదు. కొందరికి.. తమ పరిధిలో ఎన్ని పనులు చేశారు? ఇంకా ఏం పనులు చేయాలనే కనీస సమాచారం లేదు. ఓ అధికారికి తన పరిధిలో వసతి గృహాల్లో ఎందరు విద్యార్థులు ఉన్నారు? ఎన్ని హాస్టళ్లు ఉన్నాయో కూడా తెలియని దుస్థితి. క్షేత్రంలో సమస్యలు వేధిస్తున్నా.. నిర్లక్ష్యం వీడని అధికారులతో ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తోంది.



మురుగు.. ఆరోగ్యం కనుమరుగు!

నగరంలో జ్వరాలు విజృంభిస్తున్నాయి. ఇటీవల వర్షాలకు చాలా ప్రదేశాల్లో నీరు రోజుల తరబడి నిలిచిపోయి దోమలకు ఆవాసంగా మారింది. జక్కంపూడి కాలనీలో ఇప్పటికే చాలా మంది వైరల్ జ్వరాలతో ఆస్పత్రుల పాలయ్యారు. ఎక్కడచూసినా రోడ్లు, నివాసాల పక్కనే మురుగునీరు పేరుకుపోయి చెత్త కుప్పలుగా కనిపిస్తోంది. పరిసరాలన్నీ అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. -ఈనాడు, అమరావతి

1,756 రిటర్నబుల్ ప్లాట్ల కేటాయింపు


రైతులకు ధ్రువపత్రాలు అందిస్తున్న డేవిడ్‌రాజు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ప్రజారాజధాని అమరావతి నిర్మాణానికి భూములిచ్చిన పెనుమాక జరీబు రైతులకు మంగళవారం విజయవాడలోని ఏపీ సీఆర్‌డీఏ కార్యాలయంలో ఈ-లాటరీ నిర్వహించి 1,756 ప్లాట్లు కేటాయించారు. వీటిలో 1,033 నివాస, 723 వాణిజ్య ప్లాట్లు ఉన్నాయి. సీఆర్‌డీఏ ల్యాండ్స్ విభాగం స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వి.డేవిడ్ రాజు మాట్లాడుతూ.. భౌగోళికంగా ప్లాట్లు ఎక్కడ ఉన్నాయో రైతులకు చూపించేందుకు ప్రత్యేకంగా జీఐఎస్ సిబ్బంది, గ్రామ సర్వేయర్లను నియమించామని తెలిపారు. ప్లాట్లు పొందిన వారు రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని, దీనికి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. ఈ-లాటరీ కార్యక్రమానికి రాలేకపోయిన రైతులు.. తమ ప్లాట్లకు సంబంధించిన ప్రొవిజనల్ సర్టిఫికెట్లను పెనుమాక కాంపిటెంట్ అథారిటీ కార్యాలయంలో పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌డీఏ ఆఫీస్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ వి.శ్రీనివాసరావు, ప్లానింగ్ విభాగం డైరెక్టర్ వి.సురేష్‌కుమార్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎ.జి.చిన్నికృష్ణ, ఐటీ విభాగ అదనపు డైరెక్టర్ పెద్ది అజయ్‌బాబు, ప్రాజెక్టు మేనేజర్లు లక్ష్మీప్రసన్న, సి.హెచ్.శివశంకరరావు తదితరులు పాల్గొన్నారు.

అమరావతిలో పచ్చదనం కోసం ఆసక్తి వ్యక్తీకరణకు ఆహ్వానం

ఈనాడు - అమరావతి: అమరావతిని హరిత నగరంగా తీర్చిదిద్దేందుకు ఏడీసీఎల్ (అమరావతి అభివృద్ధి సంస్థ) చర్యలు ప్రారంభించింది. ప్రధాన రహదారుల వెంట, కూడళ్లు, డివైడర్ల మధ్య పచ్చదనం, సుందరీకరణ చేపట్టనున్నారు. రిజర్వాయర్లు, పాలవాగు, కొండవీటి వాగు, గ్రావిటీ కాలువ, తదితర కాలువల పక్కన పచ్చదనాన్ని పెంచనున్నారు. శాఖమూరు, అనంతవరం, మల్కాపురంలోని పార్కులను హరితమయం చేయనున్నారు. మంగళగిరి మండలం నీరుకొండలో రానున్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద కూడా పచ్చదనం అభివృద్ధి చేస్తారు. ఎంప్యానెల్ చేసేందుకు తగిన సామర్థ్యం, ప్రముఖ నర్సరీల నుంచి ఏడీసీఎల్ ఆసక్తి వ్యక్తీకరణను పిలిచింది. ఆసక్తి ఉన్న నర్సరీలు బిడ్లు దాఖలు చేసుకునేందుకు వచ్చే నెల 12న సాయంత్రం 4 గంటల వరకు గడువు నిర్దేశించారు. ఎంపికైన నర్సరీల నుంచి అవసరమైన మేరకు నాణ్యమైన మొక్కలను ఏడీసీఎల్ తీసుకుంటుంది. ఇప్పటికే ఏడీసీఎల్ భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకుని రాజధాని నగరానికి హరిత బృహత్ ప్రణాళికను రూపొందించింది.

విరిగిన మెట్టు.. ప్రాణానికి ముడిపెట్టు



ఆపదలో ఉన్న వారి ప్రాణాలు కాపాడే సంజీవని 108. ఎక్కడ ప్రమాదం చోటు చేసుకున్నా ఒక్క ఫోన్ కాల్‌తో ఘటనా స్థలానికి వచ్చి క్షతగాత్రులను ఆస్పత్రికి తరలిస్తుంది. విజయవాడ కొత్త ప్రభుత్వ ఆస్పత్రిలో అలాంటి వాహనాలు ఇప్పుడు దయనీయస్థితిలో ఉన్నాయి. తలుపులు తుప్పపట్టి విరిగిపోతున్నాయి. పుట్‌బోర్డులు ఊడి వేలాడుతుండడంతో తాళ్లతో కట్టారు. మాటిమాటికి ఆగిపోతూ, రిపేర్లు వస్తున్నాయని డ్రైవర్లు చెబుతున్నారు. ప్రభుత్వం స్పందించి 108 వాహనాలకు మరమ్మతులు చేయించాలి. -ఈనాడు, అమరావతి


బుడమేరు వరద ఉద్ధృతికి కూలిన ఇంటి గోడలు

ప్లాట్లలో భారీగా పెరిగిన గడ్డి, చిల్లచెట్లు

తుప్పుపట్టిన ఇనుము

చెదిరిన బడుగుల గూడు.. నీడకు దారి చూడు

కొండపల్లి శివారు శాంతినగర్-ఈలప్రోలు జగనన్న లేఔట్‌లో లబ్ధిదారులకు 1605 ప్లాట్లు కేటాయించారు. శివారు ప్లాట్లకు శాంతినగర్ పొలాల వైపు నుంచి వెళ్లేందుకు అనువుగా రహదారి వేయాల్సి ఉండగా అధికారులు పట్టించుకోలేదు. ఆ ప్లాట్లలోకి వెళ్లేందుకు దారి లేక లబ్ధిదారులు ఇళ్లు కట్టుకునేందుకు ఆసక్తి చూపలేదు. గతేడాది బుడమేరు వరదల కారణంగా నీరు ప్లాట్లలోకి చేరి గోడల వరకు నిర్మించిన ఇళ్లు నేలకూలాయి. ట్రాన్స్‌ఫార్మర్లు పడిపోయాయి. కరెంటు తీగలు చోరీ అవుతున్నాయి. ఇనుప సామగ్రి తుప్పుబడుతున్నాయి. ప్లాట్లలో చిల్లచెట్లు, గడ్డి పెరిగిపోయింది. కూటమి ప్రభుత్వం స్పందించి రహదారి ఏర్పాటు చేస్తే ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం ఉంటుందని లబ్ధిదారులు కోరుతున్నారు. -ఈనాడు, అమరావతి


పడిపోయిన ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మె

దుర్గాఘాట్ సబ్‌వే వినియోగించేలా చర్యలు


ఏసీపీ దుర్గారావు, సీఐలతో చర్చిస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దుర్గాఘాట్ నుంచి భక్తులు రహదారికి అడ్డుగా నడవకుండా సబ్‌వేను పూర్తి స్థాయిలో వినియోగించేందుకు చర్యలు తీసుకున్నట్లు ఈవో శీనానాయక్ తెలిపారు. పశ్చిమ ఏసీపీ దుర్గారావు, వన్‌టౌన్ సీఐ గురుప్రకాష్, ట్రాఫిక్ సీఐ ఉమామహేశ్వరరావుతో కలిసి ఈవో దుర్గాఘాట్, సబ్‌వే వినియోగంపై మంగళవారం క్షేత్ర స్థాయి పరిశీలించారు. దుర్గాఘాట్‌లో లగేజీ కౌంటర్లు, పాదరక్షలు భద్రపరిచేందుకు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తీసుకున్న చర్యలను ఈవో వివరించారు. ఈ నెల 25, 26 తేదీల్లో ట్రయల్ రన్ నిర్వహించేందుకు పోలీసులు సహకరించాలని కోరారు. దుర్గాఘాట్‌లో డ్రెయిన్ నిర్మాణ పనుల కోసం తవ్విన మట్టిని కూడా పూర్తిగా తొలగిస్తామని పేర్కొన్నారు.

పీ-4తో పేదల జీవితాలు బంగారుమయం

నందిగామ గ్రామీణం, న్యూస్‌టుడే: పీ4 కార్యక్రమంతో పేదల జీవితాలు బంగారుమయం అవుతాయని కలెక్టర్ జి.లక్ష్మీశ తెలిపారు. మంగళవారం కేతవీరునిపాడులో పీ4 సర్వేలో గుర్తించిన బంగారు కుటుంబాల సభ్యులతో ఆయన మాట్లాడారు. జిల్లాలో ఇప్పటి వరకు 86,398 బంగారు కుటుంబాలను గుర్తించారని, 3669 మంది మార్గదర్శకులు ముందుకొచ్చారని, 28,992 కుటుంబాలను దత్తత తీసుకున్నారని కలెక్టర్ తెలిపారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని మరింతమంది మార్గదర్శకులు ముందుకురావాలని కోరారు. పీ4 విధానంతో పేదరికం లేని రాష్ట్రంగా ఏపీని తీర్చిదిద్దాలన్నది సీఎం చంద్రబాబు లక్ష్యమని తెలిపారు. ఆర్డీవో బాలకృష్ణ, డిప్యూటీ ఎంపీడీవో నామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

తప్పని చెప్పండి.. తగదని మార్చండి!

తల్లిదండ్రులూ... జరభద్రం సుమా... ★ పిల్లల సామాజిక ఖాతాలపై కన్నేయండి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

తెలిసీ తెలియని వయసులో సామాజిక మాధ్యమాల పట్ల ఆకర్షితులైన బాలబాలికలు పెను ప్రమాదాలను కొని తెచ్చుకుంటున్నారు. ఆన్‌లైన్ గేమ్స్ ఆడి రూ.లక్షలు పోగొట్టుకుంటున్నారు. ఇదొక ఎత్తయితే... ప్రేమ పేరుతో వల వేసి బ్లాక్‌మెయిలింగ్ చేసే వారి బారిన పడుతున్నారు. తప్పొప్పులు తెలియని వయసున్న అమాయకులైన బాలికలను మభ్యపెట్టి.. ఆ తర్వాత బెదిరించి డబ్బులు గుంజేస్తున్నారు. ఇలాంటి సంఘటనల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని పోలీసులు హెచ్చరిస్తున్నారు.

★ అజిత్‌సింగ్‌నగర్‌కు చెందిన ఇద్దరు బాలికలు మంచి స్నేహితులు. నిండా పదిహేనేళ్లు లేని ఒక బాలిక స్నేహితురాలి అన్నను ప్రేమించింది. ఈవిషయం తెలిసి అతడు బాలికను మందలించాడు. దీంతో కోపగించుకున్న బాలిక తన స్నేహితురాలి ఇంటి **ఇంటర్నెట్ కనెక్షన్ నుంచే అశ్లీల చిత్రం** అప్‌లోడ్ చేసి కింద స్నేహితురాలి ఫోన్ నంబరు ఇచ్చింది. వరుస కాల్స్ వస్తుండటంతో పోలీసులను ఆశ్రయించారు. బాధిత బాలిక ఇంటర్నెట్ ఐపీ నుంచే ఫొటో అప్‌లోడ్ అయిందని గుర్తించారు. తర్వాత స్నేహితురాలే కారణమని తేల్చారు.

★ ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఒక **యువకుడితో బాలిక తరచూ చాటింగ్** చేసింది. ఒక రోజు సదరు చాటింగ్‌లను తల్లిదండ్రులకు చూపిస్తానని బ్లాక్‌మెయిల్ చేశాడు. తనకు ఆన్‌లైన్‌లో నగ్నంగా కనిపించాలని కోరటంతో సదరు బాలిక అలాగే చేసింది. దాన్ని రికార్డ్ చేసి డబ్బులు డిమాండ్ చేయటంతో తల్లి యూపీఐ ఖాతా నుంచి రూ.20 వేల వరకు పంపింది. ఇంకా కావాలని కోరుతుండటంతో విషయం తల్లిదండ్రులకు చెప్పగా వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.



★ దేవీనగర్‌కు చెందిన ఒక బాలుడు **తరచూ చరవాణిలో వీడియో గేమ్‌లు** ఆడుతున్నాడు. ఒక రోజు అతని తండ్రి బ్యాంకు ఖాతా నుంచి రూ.80 వేలు విత్‌డ్రా అయ్యాయి. కంగారుపడిన ఆయన బ్యాంకును సంప్రదిస్తే ఆన్‌లైన్ గేమింగ్ వెబ్‌సైట్లకు డబ్బులు బదిలీ అయినట్లు గుర్తించారు. కుమారుడు ఆన్‌లైన్ గేమ్‌లు ఆడుతూ తండ్రి చరవాణి నెంబరు ఇవ్వటంతో ఇలా జరిగిందని గుర్తించారు.

నమ్మకం కంటే భద్రత ముఖ్యం..

చరవాణి, అంతర్జాల వినియోగం పదేళ్ల వయస్సు నుంచే అలవాటవుతోంది. తప్పుడు వయసు పెట్టి ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్‌ల్లో ఖాతాలు సృష్టిస్తున్న బాలబాలికలు కోకొల్లలు. తెలిసీ తెలియక అపరిచిత వ్యక్తులతో చాటింగ్ చేస్తూ మోసపోతున్నారు. తల్లిదండ్రులు ఇలాంటి ఘటనలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసులు కోరుతున్నారు. వారు ఎవరితో చనువుగా ఉంటున్నారు? ఎవరితో ఎక్కువగా మాట్లాడుతున్నారు? తదితర విషయాలను నిశితంగా గమనించాలని చెబుతున్నారు. ప్రధానంగా పిల్లల సామాజిక మాధ్యమ ఖాతాలను అప్పుడప్పుడు తనిఖీ చేయమంటున్నారు. పిల్లల నమ్మకానికి భంగం కలగకుండా వారికి సమాజంలో వెలుగుచూస్తున్న సమస్యలను వివరించి వారి భద్రతే తమకు ముఖ్యమని అందుకే జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలియజేయాలని చెబుతున్నారు.

సైబర్ నేరాలపై అవగాహన కలిగించండి



కౌమార వయసు నుంచి బాలబాలికలకు మంచి చెడుల గురించి చెప్పండి. సామాజిక మాధ్యమాలతో వచ్చే ప్రమాదాల గురించి వివరించండి. ఇపుడు సమాజాన్ని పట్టి పీడిస్తున్న సైబర్ నేరాలపై వారికి విస్తృతంగా అవగాహన కలిగించటం ముఖ్యం. తల్లిదండ్రులు దాని గురించి తెలియజేయాలి. అపరిచిత వ్యక్తుల నుంచి వచ్చే కాల్స్, లింక్‌లు క్లిక్ చేయవద్దని చెప్పండి. ఏ సమస్య వచ్చినా వెంటనే తల్లిదండ్రుల దృష్టికి వచ్చేలా చేస్తే సమస్యల బారి నుంచి పిల్లలను కాపాడవచ్చు.

– ఎస్.వి.రాజశేఖరబాబు, నగర పోలీస్ కమిషనర్

సమగ్ర విద్య అందించండి


హెచ్‌ఎంలతో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: విద్యార్థులకు, సహ ఉపాధ్యాయులకు నాయకత్వం వహిస్తూ... సమగ్ర విద్య అందించడానికి ప్రధానోపాధ్యాయులు కృషి చేయాలని సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు అన్నారు. నగరంలోని ఆంధ్రా లయోల కళాశాల ఆవరణలోని ఎస్-జె ఎక్సలెన్స్ కేంద్రంలో పీఎంశ్రీ ఏడో దశ కింద ఎంపికైన రాష్ట్రంలోని 80 పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు రెండు రోజులపాటు నిర్వహించిన ప్రబంధ్ పోర్టల్.. పాఠశాల సమగ్ర అభివృద్ధికి బడ్జెట్ రూపకల్పన అనే అంశంపై నిర్వహించిన ఓరియంటేషన్ తరగతుల ముగింపు కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. పాఠశాలల్లోని గ్రంథాలయాలు, సైన్స్ ప్రయోగశాలలు, క్రీడా మైదానాలు, కిచెన్ గార్డెన్లను విద్యార్థులు సద్వినియోగం చేసుకునేలా చూడాలని, విద్యతో పాటు వృత్తి, జీవన నైపుణ్యాలు పెంపొందించేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. పాఠశాల అవసరాలకు బడ్జెట్ తయారీ, స్కూల్ ఇన్నోవేషన్ కౌన్సిల్, స్కూల్ క్వాలిటీ అసెస్‌మెంట్ ఫ్రేమ్‌వర్క్, నైపుణ్య విద్య, విద్యాంజలి, నిధుల వినియోగం వివరించి పీఎంశ్రీ పాఠశాలల నిర్వహణపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆశయాలను ఆయన తెలియజేశారు.

కృష్ణా వరద తగ్గుముఖం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : కృష్ణా నదిలో వరద ప్రవాహం కొనసాగుతోంది. నగరంలోని ప్రకాశం బ్యారేజీ వద్ద మంగళవారం ఉదయం పెరిగిన ప్రవాహం.. సాయంత్రానికి తగ్గుముఖం పట్టింది. ఉదయం 6 గంటలకు 25 గేట్లను ఒక అడుగు మేర ఎత్తారు. సముద్రంలోకి 18,125 క్యూసెక్కులు విడుదల చేశారు. 9 గంటలకు కాస్త తగ్గడంతో 20 గేట్లు మాత్రమే తెరిచారు. దిగువకు 14,500 క్యూసెక్కులు విడుదల చేశారు. సాయంత్రం 6 గంటలకు 15 గేట్లను ఒక అడుగు మేర ఎత్తి, సముద్రంలోకి 10,875 క్యూసెక్కులు వదిలారు. బ్యారేజీ నుంచి కృష్ణా తూర్పు ప్రధాన కాల్వకు 3,623 క్యూసెక్కులు విడుదల చేశారు. కృష్ణా తూర్పు ప్రధాన కాల్వ నుంచి రైవస్ కాలువకు 1,411, కేఈబీ 1,008, ఏలూరు కాలువకు 1,204 క్యూసెక్కుల చొప్పున ఇస్తున్నారు.

కృష్ణా పశ్చిమ ప్రధాన కాల్వ కట్టివేత: భారీ వర్షాల నేపథ్యంలో ప్రధాన కాలువకు సాగునీటిని నిలిపివేయాల్సి వచ్చింది. గుంటూరు, బాపట్ల జిల్లాలకు ప్రకాశం బ్యారేజీ నుంచి నీటిని అందించే కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువను మంగళవారం కట్టివేశారు. ఖరీఫ్ పంటలకు సాగునీటిని అందించేందుకు ఈ నెల 2వ తేదీన పశ్చిమ కాలువకు సాగునీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. పట్టిసీమ ద్వారా వచ్చిన గోదావరి జలాలనూ మళ్లించారు. తీరా భారీ వర్షాలు కురవడంతో సాగునీటి అవసరాలు తగ్గాయి. సాగునీరు విడుదల చేసిన 20 రోజుల వ్యవధిలోనే కాలువను కట్టి వేయాల్సి వచ్చింది.

బందరు కాలువకూ నిల్: కృష్ణా తూర్పు పశ్చిమ కాలువ నుంచి ప్రవహించే బందరు కాలువకు నీటి విడుదలను నిలిపివేశారు. తూర్పు కృష్ణాలో వర్షాల ప్రభావంతో ఈ నిర్ణయం తీసుకున్నారు.

రైళ్ల రద్దు.. దారి మళ్లింపు



విజయవాడ(రైల్వేస్టేషన్), న్యూస్‌టుడే: మూడో నూతన రైల్వే లైను నిర్మాణ పనుల్లో భాగంగా విజయవాడ, గూడూరు సెక్షన్‌లో నాన్ ఇంటర్ లాకింగ్ పనుల దృష్ట్యా పలు రైళ్లను రద్దు చేయడంతో పాటు దారి మళ్లిస్తున్నట్లు విజయవాడ రైల్వే అధికారులు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

పూర్తిగా రద్దయినవి.. ★ 67273/67274 విజయవాడ-ఒంగోలు(ఈ నెల 23వ తేదీ నుంచి 29 వరకు, ఆగస్టు 6 నుంచి 19 వరకు). ★ 67213/67214 విజయవాడ-తెనాలి (23వ తేదీ నుంచి 29 వరకు, ఆగస్టు 6 నుంచి 24 వరకు) ★ 67259/67260 విజయవాడ-చీరాల (23వ తేదీ నుంచి 29 వరకు, ఆగస్టు 6 నుంచి 19వరకు).

28, 29 తేదీల్లో.. వచ్చే నెల 6 నుంచి 24 వరకు.. ★ 67229 విజయవాడ-గుంటూరు ★ 67223/67224 గుంటూరు-రేపల్లె ★ 67222 తెనాలి-విజయవాడ ★ 67225/67226 విజయవాడ-గూడూరు.

వచ్చే నెల 8 నుంచి 24 వరకు.. ★ 67211 విజయవాడ-తెనాలి. ★ 67231/67232 తెనాలి-రేపల్లె. ★ 12709/12710 గూడూరు-సికింద్రాబాద్(ఆగస్టు 14, 17, 18 తేదీల్లో). ★ 12733/12744 తిరుపతి-లింగంపల్లి (ఆగస్టు 17, 18, 19 తేదీల్లో). ★ 12743/12744 విజయవాడ-గూడూరు (ఆగస్టు 11వ తేదీ నుంచి 20 వరకు). ★ 17247/17248 నర్సాపూర్-ధర్మవరం(ఆగస్టు11వ తేదీ నుంచి 19వరకు). ★ 17249/17250 రేణిగుంట-కాకినాడ టౌన్(ఆగస్టు 12వ తేదీ నుంచి 19 వరకు). ★ 17405/17406 తిరుపతి-ఆదిలాబాద్(ఆగస్టు 13వ తేదీ నుంచి 20 వరకు). ★ 22707/22708 తిరుపతి-విశాఖపట్నం(ఆగస్టు 13వ తేదీ నుంచి 18వరకు). ★ 07131/07132 తిరుపతి-నర్సాపూర్(ఆగస్టు 17, 18 తేదీల్లో).

దారి మళ్లించిన రైళ్లు (వయా కృష్ణాకెనాల్, న్యూగుంటూరు, తెనాలి మీదుగా).. ★ 00761 రేణిగుంట-నిజాముద్దీన్(ఈ నెల 25, 26, 28 తేదీల్లో). 23న.. ★ 22614 అయోధ్యకంట్-రామేశ్వరం. 24న.. ★ 22603 ఖరగ్‌పూర్-విల్లుపురం ★ 22851 సంత్రాగచి-మంగళూరు. 25న.. ★ 22306 జసిడి-బెంగళూరు ★ 22605 పురూలియా-తిరునల్వేలి ★ 12644 హజ్రత్ నిజాముద్దీన్-త్రివేండ్రం ★ 22612 న్యూజల్పాయిగురి-చెన్నై. 26న.. ★ 20889 హౌరా-తిరుపతి ★ 22859 పూరీ-తిరుపతి. 26, 29 తేదీల్లో.. ★ 12504 అగర్తల-బెంగళూరు. 27న.. ★ 12389 గయా-చెన్నై ★ 22855 సంత్రాగచి-తిరుపతి ★ 12511 గోరఖ్‌పూర్-కొచివెల్లి ★ 20493 మధురై-చండీగఢ్. 28న ★ 22872 తిరుపతి-భువనేశ్వర్. 27, 28 తేదీల్లో.. ★ 13351 ధన్‌బాద్-అల్లపూజ. ★ 22503 కన్యాకుమారి-దిబ్రూగఢ్. 28, 29 తేదీల్లో.. ★ 12656 చెన్నై-అహ్మదాబాద్.

చాకచక్యంగా చోరీ.. కెమెరాలకు దొరికిపోయి..

అయిదుగురు దొంగలను పట్టుకున్న సీసీఎస్ పోలీసులు

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

ఎన్టీఆర్ జిల్లాలో వరుస నేరాలకు పాల్పడుతున్న అయిదుగురు దొంగలను సీసీఎస్ పోలీసులు వలపన్ని పట్టుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది. నేరస్థల పరిసరాల్లో సేకరించిన సీసీ ఫుటేజీల ద్వారా గుర్తించారు. వీరిలో నలుగురు ద్విచక్రవాహనాల దొంగలు కాగా.. మరొకరు భవానీపురంలో నేరాలకు పాల్పడిన యువకుడిగా గుర్తించారు. వివరాలు ఇలా ఉన్నాయి..

చోరీల కోసం ముఠా తయారీ

కంచికచర్ల పోలీస్ స్టేషన్ పరిధిలో వరుసగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురవుతున్నాయి. ఈ నేపథ్యంలో ఈ ముఠా కోసం సీసీఎస్ పోలీసులు రంగంలోకి దిగారు. పార్కింగ్ ప్రదేశాలు, ఇళ్ల ముందు నిలిపిన వాహనాలు చోరీకి గురవుతుండటంతో.. ఆయా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలు సేకరించారు. వీటిల్లో మేచర్ల రాహుల్ కార్తికేయ (23) అనే యువకుడు అనుమానాస్పదంగా కనిపించాడు. ఇతనిపై గతంలో దోపిడీ కేసు ఉండటంతో.. ఆ దిశగా దర్యాప్తు చేపట్టారు. ఇతనే కంచికచర్ల పీఎస్ పరిధిలో ద్విచక్రవాహనాల నేరాలకు ప్రధాన సూత్రధారిగా గుర్తించారు. ఇతను కంచికచర్లకు చెందిన పాడమూర్తి పవన్‌కుమార్ (22), కొప్పుల నాగవెంకట తిరుపతిరావు (18), మరో బాలుడితో సహా ఒక ముఠాను ఏర్పాటు చేశాడు. వీరు తాళం వేసిన వాహనాల లివర్ బ్రేక్ చేసి, వైర్లు కలిపి నేరాలకు పాల్పడుతూ సీసీ కెమెరాలకు దొరికిపోయారు. రెండు బుల్లెట్ వాహనాలు, పల్సర్, ఫ్యాషన్ వాహనాన్ని చోరీ చేసినట్లు గుర్తించారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

హైదరాబాద్ నుంచి వచ్చి నేరం చేసి...

భవానీపురం పోలీస్‌స్టేషన్ పరిధిలోని ట్రిబుల్ ఎక్స్ కాలనీలోని ఒక ఇంట్లో దొంగతనం జరిగింది. దాదాపు 85 గ్రాముల బంగారం చోరీకి గురైంది. ఈ ఇంటి ముందు ఉన్న సీసీ కెమెరాలో ఒక వ్యక్తి తారసపడ్డాడు. అతడి ఫొటోను న్యాట్‌గ్రిడ్‌లో వెతికితే.. హైదరాబాద్ ఎల్‌బీ నగర్‌కు చెందిన మిక్కిలి వంశీకృష్ణ (43)గా తేలింది. ఇతడు.. తెనాలి, గుంటూరు, హైదరాబాద్ తదితర ప్రాంతాల్లో దాదాపు 30 దొంగతనం కేసులో నిందితుడిగా ఉన్నాడు. రాత్రి వేళ తలుపులు పగలకొట్టి నేరాలు చేస్తుంటాడు. ఇతడి ఫొటోను గుర్తించిన న్యాట్‌గ్రిడ్ చెప్పిన వివరాలతో పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. ఇబ్రహీంపట్నం పరిసరాల్లో వంశీకృష్ణను గుర్తించి.. అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయంగా తెలిసింది.

అమ్మా... చదవలేను... కూలికి వెళతా!

మందలించిన తల్లి.. బాలుడి బలవన్మరణం

మధురానగర్, న్యూస్‌టుడే

'అమ్మా... చదవలేకపోతున్నా... కళాశాలకు వెళ్లను. కూలి పనులకు వెళతా' అంటున్న కుమారుడిని తల్లి మందలించింది. బాగా చదువుకుని ఉన్నత స్థితికి రావాలని కోరింది. అయితే తల్లి ఆశయాన్ని సాధించలేక.. చదవలేక తీవ్రమైన మనో వేదనకు గురైన బాలుడు (16) బలవన్మరణానికి పాల్పడ్డాడు. రామకృష్ణాపురంలో చోటు చేసుకున్న ఈ విషాదకర ఘటనపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. ఆలస్యంగా వెలుగు చూసిన ఈ ఘటన పూర్వాపరాలు ఇలా ఉన్నాయి.. రామకృష్ణాపురానికి చెందిన ఓ మహిళ భర్త చనిపోయారు. ఆమెకు నలుగురు పిల్లలు. పెద్ద కుమారుడు క్షౌరశాలలో పని చేస్తుండగా.. ఇద్దరు కుమార్తెలు ప్రింటింగ్ ప్రెస్‌లో పని చేస్తున్నారు. చిన్న కుమారుడు ఓ కళాశాలలో ఇంటర్ రెండో సంవత్సరం చదువుతున్నాడు. తాను చదవలేకపోతున్నానని ఇటీవల తల్లి వద్ద కన్నీటి పర్యంతమయ్యాడు. ఇక చదవనని, కూలి పనులకు వెళతానని చెప్పాడు. కానీ తల్లి మందలించింది.. బాగా చదువుకోమని ప్రోత్సహించింది.

ఇంట్లో ఎవరూ లేకుండా చూసి..

మహిళ తన ఇద్దరు కుమార్తెలను తీసుకుని ఆదివారం ఉదయం 7 గంటల సమయంలో దుర్గ గుడికి వెళ్లారు. పెద్ద కుమారుడు తాను పనిచేస్తున్న క్షౌరశాలకు వెళ్లాడు. చిన్న కుమారుడు ఒక్కడే ఇంట్లో ఉన్నాడు. రాత్రి 9 గంటల సమయంలో కుటుంబ సభ్యులు ఇంటికి రాగా.. తలుపు లోపలి వైపు గడియ పెట్టి ఉంది. బలవంతంగా తెరిచి చూడగా.. చిన్న కుమారుడు ఫ్యాన్‌కు ఉరేసుకుని కనిపించాడు. వెంటనే కిందకు దింపి హుటాహుటిన ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అప్పటికే వైద్యులు పరిశీలించి.. మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ ఘటన స్థానికులను కలచివేసింది. చదవలేక తీవ్రమైన ఒత్తిడితో ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని పోలీసులు భావిస్తున్నారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. పోస్టుమార్టం అనంతరం సోమవారం సాయంత్రం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు.

దస్త్రాల నిర్వహణ సరిగా లేదని ఆగ్రహం



బియ్యం బస్తాలను పరిశీలిస్తున్న మంత్రి మనోహర్

గొల్లపూడి, న్యూస్‌టుడే: చౌక, మధ్యాహ్న భోజన పథకం బియ్యం పక్కదారి పట్టకుండా పటిష్ఠమైన చర్యలు చేపడుతున్నట్లు పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. గొల్లపూడిలోని పౌర సరఫరాల శాఖ గోదామును ఆయన మంగళవారం తనిఖీ చేశారు. బియ్యం నాణ్యత, బస్తాల బరువు, గోదాములో ఎన్ని బస్తాలు ఉన్నాయనే విషయాన్ని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో వారి వద్ద రికార్డులు సరిగా లేకపోవడం, మంత్రి అడిగిన విషయాలకు సమాధానం చెప్పలేక పోవడంతో వారిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రికార్డులను సక్రమంగా నిర్వహించాలని, అలా చేయకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. గోదామును పరిశుభ్రంగా ఉంచక పోవడంపై అసహనం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజనం పథకం బస్తాలపై ఉన్న క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే బియ్యం ఎక్కడ నుంచి వచ్చిందనే వివరాలు తెలుస్తాయన్నారు. త్వరలో చౌక బియ్యం బస్తాలపై కూడా క్యూఆర్ కోడ్ విధానాన్ని తీసుకు వస్తామన్నారు.

పీఆర్సీ కమిషనర్‌ను నియమించాలి

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే: రాష్ట్ర ప్రభుత్వం పీఆర్సీ కమిటీకి కమిషనర్‌ను నియమించాలని.. 30శాతం మధ్యంతర భృతి ఇవ్వాలని ఫ్యాప్టో ఎన్టీఆర్ జిల్లా ఛైర్మన్ ఎ. సుందరయ్య పేర్కొన్నారు. మంగళవారం గవర్నర్‌పేటలోని యూటీఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో జిల్లా ఫ్యాప్టో కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉద్యోగులకు పెండింగ్‌లో ఉన్న కరవు భత్యాలు, 2021 నుంచి సరండర్ లీవ్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల విలువైన సమయాన్ని బోధనకు ఉపయోగించేందుకు ప్రభుత్వం సహకరించాలని కోరారు. ఫ్యాప్టో సెక్రటరీ జనరల్ ఇంటి రాజు మాట్లాడుతూ.. మండల విద్యాశాఖాధికారులు వారంలో ఒక రోజు మండలంలో అందుబాటులో ఉండి.. ఉపాధ్యాయుల సర్వీస్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యకలాపాల నివేదికను ప్రవేశపెట్టారు. కార్యక్రమంలో డిప్యూటీ సెక్రటరీ జనరల్ వి.భిక్షమయ్య, సదారతుల్లా బేగ్, కార్యవర్గ సభ్యులు వి.రాధిక, వెంకట నారాయణ, ఎం.డి. అష్హర్‌షిడే, పూర్ణచంద్రరావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సుందరయ్య, వేదికపై వెంకట నారాయణ, రాధిక, పూర్ణచంద్రరావు తదితరులు

భారీ వర్షాలతో అంతా అప్రమత్తం

అధికారులు అందుబాటులో ఉండాలని కలెక్టర్ ఆదేశాలు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మంగళవారం కలెక్టర్ జి.లక్ష్మీశ ఓ ప్రకటనలో సూచించారు. అధికారులు క్షేత్ర స్థాయిలో అందుబాటులో ఉండాలని, అప్రమత్తతతో వ్యవహరించాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని చెప్పారు. ఇళ్లలోకి నీళ్లు వచ్చే పరిస్థితి లేకుండా చూడాలన్నారు. అత్యవసర సేవలతో పాటు నిత్యావసర సరుకుల పంపిణీని నిరంతరం పర్యవేక్షించాలని, ఎక్కడా ఎవరికీ ఇబ్బంది లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పునరావాస శిబిరాల ఏర్పాటుకు సన్నద్ధంగా ఉండాలన్నారు. వయోవృద్ధులు, గర్భిణుల అవసరాలు తెలుసుకోవాలని, ఆరోగ్యంతో బాధపడుతున్న వారిని సమీప ఆసుపత్రులకు తరలించాలన్నారు. నగరంలోని కలెక్టరేట్‌లో 91549 70454 ఫోన్ నంబరుతో 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. రాష్ట్ర విపత్తు స్పందన దళం (ఎస్డీఆర్ఎఫ్) నగరంలో అందుబాటులో ఉందన్నారు. ఎలాంటి ప్రాణ, పశు నష్టం జరగకుండా చూడాలని పేర్కొన్నారు. రోడ్లపై చెట్లు విరిగితే తక్షణం తొలగించాలని, నీళ్లు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. భారీ హోర్డింగులు, చెట్లు కింద, శిథిలావస్థలో ఉన్న భవనాల దగ్గర ఉండకూడదని ప్రజలకు కలెక్టర్ సూచించారు.

ఎ.కొండూరు 55.4 మి.మీ. వాన

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: జిల్లా అంతటా జోరుగా వర్షాలు కురిశాయి. సోమవారం సాయంత్రం నుంచి మంగళవారం ఉదయం వరకు నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. ఎ.కొండూరు 55.4 మి.మీ., జగ్గయ్యపేట 45.8, పెనుగంచిప్రోలు 42.6, మైలవరం 41.2, రెడ్డిగూడెం 39.6, తిరువూరు 38.6, చందర్లపాడు 34.8, వత్సవాయి, జి.కొండూరు 34.2, విస్సన్నపేట 33.8, కంచికచర్ల 29.2, నందిగామ 28.6, గంపలగూడెం 27, వీరులపాడు 26.2, ఇబ్రహీంపట్నం 23.4, విజయవాడ గ్రామీణ 19.6, పటమట 16.4, గాంధీనగర్, భవానీపురం 16.2, అజిత్‌సింగ్‌నగర్‌లో 16 మిల్లీ మీటర్ల మేర వర్షం పడింది. జిల్లా సగటు వర్షపాతం 30.95 మి.మీ.గా నమోదైంది.

మహిళకు పాము కాటు... పరిస్థితి విషమం

కంచికచర్ల, వీరులపాడు, న్యూస్‌టుడే : మహిళ పాము కాటుకు గురైం.. ఆమె ఆరోగ్య పరిస్థితి విషమంగా మారిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. వీరులపాడు మండలం జయంతి గ్రామానికి చెందిన తాటి శ్రీనివాసరావు భార్య హలీమా ఈ నెల 20న పొలంలో దోస తీగని కాలితో కదపగా.. పాము కాటేసింది. వెంటనే బంధువులు ఆమెను కంచికచర్లలోని ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి గొల్లపూడి ఆంధ్రా ఆసుపత్రికి తీసుకెళ్లారు. చికిత్స కొనసాగుతుండగా.. హలీమా బంధువులు చికిత్స సరిగా లేదంటూ ఆసుపత్రి సిబ్బందితో వాగ్వాదానికి దిగారు. స్పందించిన వైద్యులు... తమపై నమ్మకం లేకపోతే తీసుకెళ్లవచ్చని, వెంటిలేటర్‌పై ఉన్నందున.. దానిని తొలగిస్తే ప్రాణాపాయం కలుగుతుందని చెప్పారు. చివరికి హలీమా బంధువులు ఆమెను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ప్రస్తుతం ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్లు వైద్యులు చెప్పినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. * హలీమా ఆంధ్రా ఆసుపత్రిలో మరణించగా.. పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్తే ఆమె బతికే ఉన్నట్లు అక్కడి వైద్యులు చెప్పినట్లు మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వార్తలు హల్‌చల్ చేశాయి. స్పందించిన డీఎంఅండ్‌హెచ్‌వో సుహాసిని ఆంధ్రా ఆసుపత్రి వివరణ అడిగారు. ఆసుపత్రి మెడికల్ డైరెక్టర్ డా.రవీంద్రనాథ్ మాట్లాడుతూ.. సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్త అవాస్తవమని, బంధువుల ఇష్ట ప్రకారమే ప్రభుత్వ ఆసుపత్రికి పంపించినట్లు తెలిపారు. హలీమా భర్త శ్రీనివాసరావు మాట్లాడుతూ.. తామే హలీమాను ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లామని తెలిపారు.

నాణ్యమైన మద్యం సరఫరాకు చర్యలు

గవర్నర్‌పేట, న్యూస్‌టుడే : ప్రజల ఆరోగ్య రక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం వినియోగదారులకు నాణ్యమైన మద్యం సరఫరాకు ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని ఎన్టీఆర్ జిల్లా అబ్కారీ, మద్య నిషేధ అధికారి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజల నుంచి మద్యం నాణ్యతపై ఫిర్యాదులు స్వీకరించేందుకు టోల్ ఫ్రీ నంబరు 14405ను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. మద్యం దుకాణం, బార్ల వద్ద క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసి.. వినియోగదారుడి నుంచి నాణ్యతపై సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఐవీఆర్ఎస్ ద్వారా సమాచారం సేకరించి.. దిద్దుబాటు చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. గత రెండు రోజులుగా జిల్లాలోని 126 మద్యం దుకాణాలు, 120 బార్లలో తనిఖీలు నిర్వహించి.. కాలం చెల్లిన 236 బీరు సీసాలను పారబోసినట్లు వివరించారు. ఎక్సైజ్ నేరాలపై సమాచారాన్ని 94409 02452, 94409 02455 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని అధికారి కోరారు.

స్త్రీనిధి రుణాల చెల్లింపులో అక్రమాలు..?



వీవో సుమపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న స్వయం సహాయక సంఘ సభ్యులు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే : చిలుకూరుకు చెందిన డ్వాక్రా సభ్యుల స్త్రీనిధి రుణాల చెల్లింపుల్లో గందరగోళం నెలకొంది. దీంతో డ్వాక్రా సభ్యులు, గ్రామానికి చెందిన వెలుగు వీవో కంద్రు సుమ తమ వాదనలు వినిపిస్తూ పరస్పరం మంగళవారం ఇబ్రహీంపట్నం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు. గ్రామానికి చెందిన 13 స్వయం సహాయక సంఘాలకు చెందిన సభ్యులు స్త్రీనిధి ద్వారా రూ. 11.10 లక్షలు రుణాలు పొందారు. దీంతో వారు వీటిని ప్రతి నెలా వీవో సుమకు చెల్లిస్తుండగా ఆమె వాటిని బ్యాంకులో వేయకుండా సొంతానికి వాడుకున్నట్లు సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ విషయంపై గ్రామంలో అధికార పార్టీ నాయకుడు కె. సుబ్బారావు వద్ద పంచాయితీ జరిగింది. ఆ తర్వాత వెలుగు అధికారుల విచారణలో కూడా తాను వాటిని తిరిగి చెల్లించేందుకు ఆమె అంగీకరించిదన్నారు. తాము వీవోపై ఎటువంటి దుర్భాషలు చేయలేదని పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో వారు పేర్కొన్నారు.

ఆత్మహత్యాయత్నం.. ఈ నేపథ్యంలో గత శనివారం వీవో సుమ నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నం చేశారు. కుటుంబ సభ్యులు గమనించి కంచికచర్లలోని ఓ ప్రైవేటు వైద్యుడి వద్ద చికిత్స అందించారు. కోలుకున్న ఆమె గ్రామానికి చెందిన సుబ్బారావు తనను మానసికంగా, లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్నాడని అతని వల్ల తన కుటుంబ సభ్యులకు, తన ఉద్యోగానికి భద్రత కరవైదని, రక్షణ కల్పించాలని చట్టప్రకారం అతనిపై చర్యలు తీసుకోవాలని ఆమె పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో తెలిపారు. ఇరువురి ఫిర్యాదులపై విచారణ చేస్తున్నట్లు సీఐ చంద్రశేఖర్ చెప్పారు. దీనిపై వెలుగు ఏపీవో శోభన్ బాబు స్పందించారు. చిలుకూరు స్త్రీ నిధి రుణాల చెల్లింపులో అక్రమాలు జరిగినట్లు మా దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయాన్ని స్త్రీ నిధి విభాగం అధికారులకు తెలిపామన్నారు. దీనిపై వారు దర్యాప్తునకు కమిటీని ఏర్పాటు చేసి నివేదిక ఇస్తారని, దాని ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు.

పోలీసు జాగిలాలకు శిక్షణ



మాక్ డ్రిల్‌లో భాగంగా పోలీసులు తీసుకువచ్చిన జాగిలాలు

విజయవాడ బస్‌స్టేషన్, న్యూస్‌టుడే: పోలీసు జాగిలాలకు ప్రత్యేక శిక్షణలో భాగంగా విజయవాడ పండిట్ నెహ్రూ బస్ స్టేషన్‌లో మంగళవారం మాక్ డ్రిల్ నిర్వహించారు. ఏడాది వయస్సు ఉన్న 35 జాగిలాలను, ప్రత్యేక దుస్తులు ధరించిన పోలీసు సిబ్బంది బస్ స్టేషన్‌కు తీసుకు వచ్చి బస్టాండ్ ఆవరణలో, బస్సుల్లో పేలుడు పదార్థాలు, మత్తు పదార్థాలు, అనుమానాస్పద వ్యక్తులు, వస్తువులను పసిగట్టేలా శిక్షణ ఇచ్చారు. మాక్ డ్రిల్ దృష్ట్యా బస్టాండ్‌లో ప్రయాణికులకు ఇబ్బందులు కలుగకుండా ఆర్టీసీ అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు.

అగ్రిగోల్డ్ భూముల పరిశీలన



చర్చిస్తున్న ఆర్డీవో చైతన్య, అధికారులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : అగ్రి గోల్డ్‌కు సంబంధించి ప్రభుత్వం అటాచ్ చేసిన భూములను క్షేత్రస్థాయి పరిశీలన చేసి, వివరాల నివేదికను రూపొందించినట్లు విజయవాడ ఆర్డీవో కావూరి చైతన్య తెలిపారు. రాష్ట్ర భూపరిపాలన శాఖ, కలెక్టర్ ఆదేశాలతో మంగళవారం జిల్లాలో అగ్రి గోల్డ్ భూములను ప్రత్యక్ష పరిశీలన చేశారు. ఇందులో భాగంగా రెవెన్యూ, నగరపాలక సంస్థ, స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ తదితర విభాగాలకు చెందిన జిల్లా స్థాయి కమిటీ, సీఐడీ డీఎస్పీ పి.శ్రీనివాస్‌తో కలిసి ఆర్డీవో.. గాంధీనగర్ జయరామ్ థియేటర్ సమీపంలోని అగ్రి గోల్డ్ భూములను పరిశీలించారు. సంబంధిత భూమిని రీసర్వే చేశారు. వాటి విలువతో పాటు మార్కెట్ విలువను లెక్కించి జిల్లా రిజిస్ట్రార్ సహకారంతో వివరాలు పొందుపరిచినట్లు చైతన్య వెల్లడించారు. ఆయా భూముల ప్రభుత్వం విలువ, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి మార్కెట్ విలువను అధికారిక ఏజెన్సీ నుంచి పొంది.. మ్యూటేషన్ పనులు పూర్తిచేస్తామని ఆయన పేర్కొన్నారు.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

వెన్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -114 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224. అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 122, 131, 142 చికెన్ విత్ స్కిన్ - 232 చికెన్ స్కిన్‌లెస్ - 242.

నెక్ సూచించిన కోడిగ్రుడ్డు ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 505 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.92/-.

సమర్థంగా యూబీఐ సేవలు



బ్యాంకు అధికారులు, సిబ్బంది ప్రదర్శన

గాంధీనగర్, న్యూస్‌టుడే : యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(యూబీఐ) రీజనల్ ఆఫీస్, జోనల్ ఆఫీస్ సంయుక్తంగా హెచ్‌ఆర్ వీక్ 2025 సందర్భంగా మంగళవారం బీఆర్‌టీఎస్ రోడ్డులో వాకథాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. తమ బ్యాంకు జిల్లాలో 73 బ్రాంచీలు, 699 మంది సిబ్బందితో లీడ్ బ్యాంకుగా సమర్థంగా సేవలు అందిస్తోందని జోనల్ హెడ్ సి.వి.ఎన్. భాస్కరరావు తెలిపారు. వివిధ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ప్లకార్డులు పట్టుకుని ప్రదర్శన చేశారు. ఈ కార్యక్రమంలో రీజనల్ హెడ్ ఎం.వి.తిలక్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

జాతీయ పతాక దినోత్సవం


జెండాలతో ప్రదర్శన చేస్తున్న విద్యార్థులు, ఉపాధ్యాయులు

పెనుగొలను(గంపలగూడెం), న్యూస్‌టుడే : మండలంలోని పెనుగొలనులో మంగళవారం జాతీయ పతాక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల విద్యార్థులు జాతీయ పతాకాలతో ప్రదర్శన చేపట్టారు. జాతీయ పతాక రూపకర్త పింగళి వెంకయ్య చిత్రపటానికి నివాళులర్పించారు. శిర్డీ సాయి బాబా సేవా కమిటీ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705



స్పందనకు వందనం

★ తిరువూరు 15వ వార్డు ఇందిర కాలనీలోని డ్రెయిన్లలో పూడిక పేరుకుందని స్థానికులు 'ఈనాడు' మేమున్నాం..మీకు తోడుగా ద్వారా సమస్యను పురపాలిక కమిషనర్ మనోజ దృష్టికి తీసుకెళ్లారు. ఆమె స్పందించి పురపాలిక సిబ్బందిని పంపి పూడిక తీయించారు. ★తిరువూరు 2వ వార్డులోని డ్రెయిన్లలో పూడిక ఉందని స్థానికులు 'మేమున్నాం..మీకు తోడుగా' ద్వారా ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్‌కు సమస్యను తెలిపారు. ఆయన స్పందించి పురపాలిక కార్మికులతో పూడిక తీయించారు. ★ తిరువూరు 13వ వార్డు రామాలయం వీధిలోని డ్రెయిన్లలో తీసిన వ్యర్థాలు రహదారిపై ఉన్నాయని స్థానికులు ఇన్‌ఛార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ బుర్రి జగదీష్‌కు తెలిపారు. ఆయన స్పందించి కార్మికులతో ఆ ప్రాంతంలో శుభ్రం చేయించారు. - న్యూస్‌టుడే, తిరువూరు

సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

గొల్లపూడి, న్యూస్‌టుడే : విద్యార్థులు సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, అప్పుడే ఉన్నత స్థానానికి చేరవచ్చని నలంద డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ షేక్. ఖాసీంషా పేర్కొన్నారు. గొల్లపూడిలోని నలంద డిగ్రీ కళాశాలలో మంగళవారం విద్యార్థులకు ప్రాజెక్టు మేనేజ్‌మెంట్, సాఫ్ట్‌వేర్ డెవలపింగ్‌పై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా విద్యార్థులు అభివృద్ధి చెందాలని సూచించారు. డిలైట్ సంస్థ ప్రతినిధి సెల్వరాజ్, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

అధిక వేగం.. ఆపై ప్రమాదం..!

కొండపల్లి, ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే

☛ హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి గొల్లపూడి వద్ద ఈ నెల 21న వర్షం వస్తున్నప్పుడు వేగంగా వచ్చిన కారు బోల్తా కొట్టి డివైడర్‌లోకి దూసుకెళ్లింది. అందులో ఉన్న ఇద్దరు కొద్దిపాటి గాయాలతో బయటపడ్డారు.

☛ పశ్చిమ ఇబ్రహీంపట్నం జాతీయ రహదారి సెవంత్ డే అడ్వెంటిస్ట్ పాఠశాల వద్ద ఈ నెల 14న కంకర లోడుతో విజయవాడ వైపు వెళ్తున్న లారీ వేగంగా వచ్చి రోడ్డు అంచు దిగి గుంతలో పడింది. ఈ సంఘటనలో డ్రైవర్, టిప్పర్‌కు గాయాలయ్యాయి.

కొన్ని రోజులుగా కురుస్తోన్న వర్షాలకు రహదారులు జారుతున్నాయి. ఇదే సమయంలో జాతీయ రహదారులపై వెళ్తున్న వాహనదారులు వేగాన్ని పెంచడంతో అదుపు తప్పి ప్రమాదాలకు గురవుతున్నారు. కొన్ని సందర్భాల్లో కొందరు మృత్యువాత పడుతుంటే మరికొందరు గాయాలపాలై దివ్యాంగులుగా మారుతున్నారు. హైదరాబాద్- విజయవాడ జాతీయ రహదారి భవానీపురం నుంచి ఇబ్రహీంపట్నం ఇరు వైపులా నిత్యం రద్దీగా ఉంటుంది. అక్కడి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించలేక ట్రాఫిక్ పోలీసులు సైతం ఇబ్బందులు పడిన సందర్భాలు అనేకం. ఇంతటి రద్దీ ఉండే రోడ్డుపై సాధారణ సమయం కన్నా వర్షాలు పడుతున్నప్పుడే ప్రమాదాల సంఖ్య పెరుగుతుంది.

మూడు నెలల్లో..

గత సంవత్సరం వర్షాకాలం మూడు నెలల్లో విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారి భవానీపురం నుంచి ఇబ్రహీంపట్నం వరకూ 28 ప్రమాదాలు జరిగాయి. ఇందులో వర్షం సమయంలో వాహనం అదుపులోకి రాక ప్రమాదానికి గురైనవే 19 ఉండటం గమనార్హం. గడిచిన మే, జూన్ వర్షాలతో పాటు జులై నెలలో 30పైగా ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. వీటిల్లో 22 వర్షాలు పడినప్పుడే జరిగాయి.


పాఠశాల రక్షణ గోడ మీదకు వెళ్లి పడిపోయిన టిప్పర్

త్వరలో స్టాప్ అండ్ గో కార్యక్రమం

వర్షాలు పడుతున్నప్పుడు ద్విచక్ర వాహనాలు రహదారులపై కనిపించవు. ఈ సమయంలో రోడ్లు ఖాళీగా ఉన్నట్లు కార్లు, లారీల చోదకులు భావించి వేగంగా ప్రయాణిస్తున్నారు. ప్రస్తుతం జరుగుతున్న ప్రమాదాల్లో అత్యధికం వేగంగా వెళ్లిన వాహనాలే. ఆ సమయంలో వాహనాన్ని అదుపు చేయాలని వాహనదారుడు ప్రయత్నించినా ఏదో ప్రమాదం జరిగిపోతుంది. అందుకే రద్దీ సమయాల్లో, వర్షాలు పడుతున్నప్పుడు స్టాప్ అండ్ గో కార్యక్రమాన్ని త్వరలో చేపట్టనున్నాం.

- సీఐ చంద్రశేఖర్, ట్రాఫిక్ ఎస్సై లక్ష్మణరావు

పాఠశాల తనిఖీ

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రుద్రవరం గ్రామంలోని మోడల్ ప్రైమరీ పాఠశాలను ఎంఈవో పి.రమేష్ బాబు మంగళవారం తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. పాఠశాలలోని రికార్డులను చూసి ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు.


విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎంఈవో రమేష్

అభివృద్ధి పనులకు శంకుస్థాపన నేడు

మైలవరం, న్యూస్‌టుడే : మండల పరిధిలోని మొర్సుమిల్లి నుంచి తండాకు వెళ్లే రహదారి అభివృద్ధి పనులకు ఈ నెల 23న ఉదయం 9 గంటలకు, ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ శంకుస్థాపన చేయనున్నట్లు ఆ గ్రామ సీనియర్ నాయకుడు ఎంవీ సుబ్బారావు తెలిపారు. దీర్ఘకాలంగా రోడ్డు గోతులమయంగా మారగా, అభివృద్ధి నిమిత్తం రూ.1.65 కోట్ల నిధులు మంజూరయ్యాయని చెప్పారు. వాటితో పాటు రూ.35 లక్షల వ్యయంతో గ్రామంలో నిర్మించిన సీసీ రహదారులు, ఇతర పనులను ప్రారంభిస్తారని ఆయన పేర్కొన్నారు.

రేపు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ఇబ్రహీంపట్నం: స్థానిక జాకీర్ హుస్సేన్ కళాశాలలో గురువారం ఉచిత నేత్ర వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ మస్తాన్ వలీ మంగళవారం తెలిపారు. మ్యాక్స్ విజన్ ఐ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వారి సౌజన్యంతో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్లు ఈ శిబిరాన్ని నిర్వహిస్తారని చెప్పారు. ఇందులో కంటి పరీక్షలు చేయడంతో పాటు మందులు కూడా పంపిణీ చేస్తామన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4 వరకూ ఈ శిబిరం ఉంటుందని చెప్పారు.

తిరువూరు టెక్స్‌టైల్స్ పేరుతో నూతన ఒరవడి సృష్టిద్దాం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు

తిరువూరు, న్యూస్‌టుడే : పట్టణంలోని మహిళా దర్జీలకు పది రోజుల్లో వెయ్యి డ్రస్ మెటీరియల్స్ ఉచితంగా అందజేస్తానని స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు తెలిపారు. నెల రోజుల్లో వాటిని చూడిదార్లుగా కుట్టి తనకివ్వాలని చెప్పారు. ఆ వస్త్రాలకు ప్రత్యేకంగా లోగో తయారు చేసి పట్టణంలో 'తిరువూరు టెక్స్‌టైల్స్' పేరుతో విక్రయించి నూతన ఒరవడి సృష్టిద్దామని సూచించారు. పట్టణంలో మంగళవారం డీఆర్‌డీఏ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సీఎం చంద్రబాబును సోమవారం కలిశానని, తన ప్రగతి పనితీరు 66.4 శాతం ఉన్నట్లు ఆయన చెప్పినట్లు తెలిపారు. తన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో విస్సన్నపేట మండలం పుట్రేలకు చెందిన అంతర్జాతీయ ఫొటోగ్రఫీ విజేత కందేటి వెంకటేశ్వరరావును సత్కరించారు.

కూటమి ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యం


తునికిపాడులో కరపత్రాలు పంపిణీ చేస్తున్న తెదేపా నాయకులు

తిరువూరు, ఎ.కొండూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో మంగళవారం తెదేపా నాయకుల ఆధ్వర్యంలో 'సుపరిపాలనలో తొలి అడుగు' కరపత్రాలను పంపిణీ చేశారు. ఏడాదిగా ఎన్డీయే కూటమి ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన విజయాలను ప్రజలకు తెలిపారు. ఎ.కొండూరు, తిరువూరు, గంపలగూడెం, విస్సన్నపేట మండలాల్లోని పలు గ్రామాల్లో కూడా ఈ కార్యక్రమం నిర్వహించారు.

పరస్పర వాదనలతో ముగిసిన సమావేశం

తిరువూరు, గంపలగూడెం, న్యూస్‌టుడే : తిరువూరు నగర పంచాయతీ సమావేశం అధికార, ప్రతిపక్ష వార్డు కౌన్సిలర్ల వాగ్వివాదాలతో ముగిసింది. మంగళవారం ఛైర్‌పర్సన్ కొలికపోగు నిర్మల అధ్యక్షతన పురపాలిక అత్యవసర సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం పట్టణాభివృద్ధికి విడుదల చేసిన నిధులను తెదేపా కౌన్సిలర్లు ప్రాతినిధ్యం వహిస్తున్న వార్డులకే కేటాయించి వివక్ష చూపుతున్నారని వైకాపా కౌన్సిలర్లు ఆరోపించడంతో వివాదం చోటు చేసుకుంది. ఈ క్రమంలో వైకాపా కౌన్సిలర్లు తొలుత వాకౌట్ చేసి బయటకు వచ్చేశారు. వెంటనే లోపలకు వెళ్లి సమావేశం ముగించాలని పోడియం దిగి కిందకు వస్తున్న ఛైర్‌పర్సన్ నిర్మలను అడ్డుకుని వాదనకు దిగారు. తెదేపా కౌన్సిలర్లు అబ్దుల్ హుస్సేన్, సురేంద్ర ఛైర్‌పర్సన్‌కు మద్దతుగా నిల్చొని వారికి ధీటుగా సమాధానం ఇచ్చారు. అజెండాలో ఒకటో అంశంగా టీయూఎఫ్ఐడీసీ నిధులతో 10 వార్డుల్లో చేపట్టనున్న 30కి పైగా పనులకు, మరో 28 అంశాలకు కౌన్సిలర్లు ఆమోదిస్తూ తీర్మానాలు చేశారు. పురపాలిక కమిషనర్ కె.మనోజ పాల్గొన్నారు.


తెదేపా, వైకాపా వార్డు కౌన్సిలర్ల వాగ్వాదం

ఛైర్‌పర్సన్‌ను అడ్డుకోవడం తగదు

ఛైర్‌పర్సన్ నిర్మలను వైకాపా వార్డు కౌన్సిలర్లు అడ్డుకోవడాన్ని తెదేపా కౌన్సిలర్లు ఖండించారు. పట్టణాభివృద్ధికి ప్రభుత్వం విడుదల చేసిన నిధుల మంజూరు, సమస్యల కేటాయింపులో అజెండాలో పొందుపరిచిన అంశాలను కౌన్సిల్ సమావేశంలో చదువుతుండగా వైకాపా కౌన్సిలర్లు వివాదం సృష్టించి వాదం చేశారు. ఛైర్‌పర్సన్‌ను అడ్డుకున్నారని చెప్పారు. సమావేశం అనంతరం ఛైర్‌పర్సన్ నిర్మల, తెదేపా కౌన్సిలర్లు ఎస్‌కే.అబ్దుల్ హుస్సేన్, ఎస్.సురేంద్ర, జి.సత్యవతి, ఎం.దుర్గారావు, పి.సత్యనారాయణ, పి.శేఖర్‌బాబు తదితరులు విలేకరులతో మాట్లాడారు. తొలుత మంజూరైన రూ.2.5 కోట్లను 10 వార్డులకు కేటాయించగా, మిగిలిన 10 వార్డుల అభివృద్ధికి వేరే పథకంలో నిధులు కేటాయించామని చెప్పారు. వైకాపా సభ్యులు అవేమి పట్టించుకోకుండా సభను రసాభాస చేయాలనే ఉద్దేశంతో సమావేశ మందిరంలోనే అజెండా పత్రాలను చింపేసి వాదనకు దిగారని మండిపడ్డారు.

సమస్యల పరిష్కారానికి కృషి

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో కృషి చేయాలని ఎంపీపీ రామినేని దేవి ప్రవణ్య అన్నారు. ఆమె అధ్యక్షతన మంగళవారం మండల పరిషత్తు సమావేశం నిర్వహించారు. ఇందులో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు ప్రజలకు అందే విధంగా చూడాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని చెప్పారు. వైద్యులు కీర్తి, ఏవో డి.శ్రీనివాసరావు, నరుక్కుళ్లపాడు సర్పంచి మాట్లాడారు. తహసీల్దార్ జె.సుశీల దేవి, ఎంపీడీవో టి.కె.వి.రమణ, సీడీపీవో పుష్పలత తదితరులు పాల్గొన్నారు.


ప్రసంగిస్తున్న ఎంపీపీ దేవి ప్రవణ్య

స్పందించారు.. పరిష్కారం చూపారు

స్పందనకు వందనం

జి.కొండూరు, న్యూస్‌టుడే : చెవుటూరులో రామాలయం వీధిన ఉన్న ఇళ్ల మధ్యలో సీసీ రోడ్డుపై మురుగు చేరి స్థానికులు అవస్థలు పడుతున్నారు. ఈ సమస్యపై ఈ నెల 16న 'ఈనాడు'లో 'మురుగు నీటితో తిప్పలు' శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. పారిశుద్ధ్య కార్మికులతో మురుగును తొలగించి, శాశ్వత పరిష్కారంగా సీసీ రోడ్డును తవ్వించి మరలా మురుగు నిల్వ ఉండకుండా తూమును ఏర్పాటు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.


సీసీ రోడ్డు తవ్వుతున్న కార్మికులు

అన్నదాతకు.. బీమాతో భరోసా

పంట వేయకున్నా బీమా చేసుకునే అవకాశం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే

పంట వేయకపోయినా ధ్రువపత్రంతో బీమా చేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం రైతులకు కల్పించింది. బీమా చేశాక పంట సాగు చేసి ఆ వివరాలను ఈ- పంటలో తప్పనిసరిగా నమోదు చేస్తే సరిపోతుంది. ఇంతకు ముందు పంట వేసిన తర్వాతనే నమోదు చేయించుకునే వారు. దీంతో బీమా గడువు లోపల నాట్లు పూర్తి చేయలేని అన్నదాతలు బీమాకు దూరమవుతున్నారు. ఈ విషయాన్ని గుర్తించిన ప్రభుత్వం రైతులకు ప్రయోజనం చేకూరేలా పంట వేయకపోయినా వ్యవసాయ సహాయకుడి ధ్రువపత్రంతో బీమా చేయించుకొని ఆ తర్వాత పంట వేసుకునే అవకాశం ఇచ్చింది.

నారుమళ్లు సిద్ధం

ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన కింద మైలవరం నియోజకవర్గంలో అన్ని పంటల కంటే వరిసాగే అధికం. తక్కువ ప్రీమియంతో ఎక్కువ పరిహారం పొందే ఆస్కారం ఉంది. ఎకరానికి రూ.84 చెల్లిస్తే బీమాగా రూ.42 వేలు అందుతుంది. నియోజకవర్గంలో ఈ ఏడాది తొమ్మిది వేల ఎకరాల్లో వరి పంట సాగవుతుందని అధికారులు అంచనా. ప్రస్తుతం రైతులు నారు మళ్లు సిద్ధం చేసుకుంటున్నారు. ఆగస్టు 15 తర్వాత నాట్లు వేసే అవకాశముంది. ఇబ్రహీంపట్నం మండలంతో పాటు గొల్లపూడి, రాయనపాడు, పైడూరుపాడు గ్రామాల్లో మెట్ట ప్రాంతంలో బోర్ల కింద సెప్టెంబరు మొదటి వారం వరకు నాట్లు వేస్తూనే ఉంటారు. ప్రభుత్వం వరి పంటను బీమా చేసేందుకు ఆగస్టు 15 తుది గడువుగా నిర్ణయించింది. అప్పటికి నాట్లు వేయక పోయినా బీమా చేసుకోవచ్చని వ్యవసాయాధికారులు చెబుతున్నారు. సాగు అనంతరం ఈ- పంటలో విధిగా నమోదు చేసుకోవాలని వారు తెలుపుతున్నారు. రైతు సేవా కేంద్రంలోని వ్యవసాయ సహాయకుడి వద్ద నుంచి పంట సాగు చేస్తారన్న ధ్రువపత్రం తీసుకుని బీమా చేయవచ్చు.


సాగులో ఉన్న వరి

దరఖాస్తు విధానం ఇలా..

బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతులకు ప్రీమియం వసూలు చేసి బ్యాంకు సిబ్బంది నేరుగా బీమా చేస్తారు. రుణం తీసుకోని అన్నదాతలు కామన్ సర్వీసు సెంటర్, గ్రామ సచివాలయాల ద్వారా ప్రీమియం చెల్లించి రసీదు పొందవచ్చు. రైతులు, కౌలుదారులు ఆధార్, కౌలు గుర్తింపు కార్డులు, బ్యాంకు ఖాతా, గ్రామ వ్యవసాయ సహాయకుడు ఇచ్చిన ధ్రువపత్రాలను నమోదు సమయంలో సమర్పించాల్సి ఉంటోంది.

సద్వినియోగం చేసుకోండి

పంట వేయక పోయినా బీమా ఎలా చేయాలనే అనుమానం అవసరం లేదు. గ్రామ వ్యవసాయ సహాయకుడి వద్ద నుంచి పంట సాగు చేస్తారనే ధ్రువపత్రం సమర్పిస్తే సరిపోతుంది. నాట్లు వేసిన తర్వాత ఈ- పంట నమోదు మాత్రం తప్పనిసరిగా చేయాలి. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోండి.

- వై.రజని, ఏవో, ఇబ్రహీంపట్నం

కుండపోత వర్షం.. రాకపోకలు అస్తవ్యస్తం

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం సాయంత్రం కుండపోత వర్షం కురిసింది. గంపలగూడెం, ఊటుకూరు, కొణిజెర్ల, పెనుగొలను తదితర గ్రామాల్లోని రోడ్లపై వరద నీరు ప్రవహించింది. ఎగువన ఖమ్మం జిల్లాలో కురిసిన వర్షానికి కట్లేరులోకి వరద నీరు చేరింది.


రామచంద్రాపురం జాతీయ రహదారిపై వాహనదారుల ఇక్కట్లు

ఎ.కొండూరు, న్యూస్‌టుడే : మండలంలోని రామచంద్రాపురం వద్ద జాతీయ రహదారిపై వరద నీరు ప్రవహించడంతో ప్రయాణికులు, పాఠశాల విద్యార్థులు అసౌకర్యానికి గురయ్యారు. ఆ నీటిలో వెళ్లలేక అవస్థలు పడ్డారు.

'రైతాంగ సమస్యలు పట్టని ప్రభుత్వాలు'

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే : రైతాంగ సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి.వి.ఆంజనేయులు అన్నారు. మంగళవారం రంగాపురం పంచాయతీ శివారు తాడిగూడెంలో రైతు సంఘం మండల మహాసభ నిర్వహించారు. ముందుగా తాడి సాంబశివరావు రైతు సంఘం జెండాను ఆవిష్కరించారు. అనంతరం నూతన కమిటీని ఎన్నుకున్నారు. మండల అధ్యక్షుడిగా జంగా వెంకటరెడ్డి, కార్యదర్శిగా గోగులమూడి అప్పిరెడ్డి, సభ్యులుగా ఎం.మాధవరెడ్డి, చిట్టిబాబు, ఏసుబాబులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.


రైతు సంఘం జెండా ఆవిష్కరణలో నేతలు

స్కిల్డ్ వేతనాలు అమలు చేయాలి


పదో రోజు సమ్మెలో పాల్గొన్న మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులు

కొండపల్లి, న్యూస్‌టుడే : మున్సిపల్ ఇంజినీరింగ్ కార్మికులకు స్కిల్డ్ వేతనాలు ఇవ్వడంతో పాటు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి మహేష్ అన్నారు. కొండపల్లి మచ్చర్ పాయింటు వద్ద పదో రోజు సమ్మెను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల సమ్మె నేపథ్యంలో ప్రభుత్వం నామమాత్రంగానే స్పందించిందన్నారు. వారికి సంక్షేమ పథకాల వర్తింపు ఊసే లేదన్నారు. ఉద్యోగ విరమణ వయసు 62కు పెంచే ప్రస్తావన లేకపోవడం దుర్మార్గమన్నారు. ప్రమాద బీమా గురించి చెప్పకపోవడం విచారకరమన్నారు. కార్మికులు వాసు, శ్రీను, తిరుపతిరావు, నోజు, రామకృష్ణ, పోతురాజు, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థికి అభినందనలు

జి.కొండూరు: స్థానిక వివేకానంద పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థి ఎం.మణిదీప్ ఐఐటీలో 1326 ర్యాంకు పొంది హైదరాబాద్ ఐఐటీ కళాశాలలో సీటు సాధించాడు. ఈ మేరకు మంగళవారం ఆ పాఠశాల డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, కరస్పాండెంట్ ఈశ్వరరావు మణిదీప్‌ను సన్మానించి జ్ఞాపిక అందించారు. భవిష్యత్తులో మరింత మందిని ప్రతిభావంతులుగా తయారు చేస్తామని డైరెక్టర్ శ్రీనివాసరావు తెలిపారు.

పారిశుద్ధ్య పనులు పరిశీలన

రెడ్డిగూడెం: రంగాపురం పంచాయతీలో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను ఎంపీడీవో టి.కె.వి.రమణ, డిప్యూటీ ఎంపీడీవో పి.ప్రభాకరరావు మంగళవారం పరిశీలించారు. తాడిగూడెంలో చెత్త సేకరణ పనులను తనిఖీ చేశారు. తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి పంచాయతీ సిబ్బందికి అందజేయాలని ప్రజలకు సూచించారు.

లారీ ఢీకొని యువకుడి దుర్మరణం

పాల్వంచ గ్రామీణం: లారీ ఢీకొని ఓ వ్యక్తి మంగళవారం తెల్లవారుజామున దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. పాల్వంచ పట్టణ పరిధిలోని రాంనగర్‌కు చెందిన ధనుకోటి నరసింహా నాయుడు(40) వృత్తి రీత్యా ఉల్లిపాయలు వ్యాపారం చేస్తున్నారు. పాల్వంచ, కొత్తగూడెం చుట్టుపక్కల ప్రాంతాలకు ట్రాలీ ఆటోలో వెళ్లి వ్యాపారం చేస్తుంటారు. మంగళవారం తెల్లవారుజామున ఉల్లిపాయల లోడ్‌తో కొత్తగూడేనికి వెళ్లే క్రమంలో నవభారత్ వద్ద ఎదురుగా వచ్చి లారీ ఢీకొంది. దీంతో నరసింహా నాయుడు ట్రాలీ క్యాబిన్‌లో ఇరుక్కోవడంతో తలకు బలమైన గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు క్షతగాత్రుడిని పాల్వంచ సీహెచ్‌సీకి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు ఎస్సై సుమన్ లారీ డ్రైవర్ బి.శ్రీనివాసరావు (ఎన్టీఆర్ జిల్లా, మైలవరం)పై కేసు నమోదు చేశారు. మృతుడికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

కొండపల్లి: బుడమేరు ఈలప్రోలు పాత వంతెన వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గ్రామస్థులు మంగళవారం గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న ఇబ్రహీంపట్నం పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పైకి తీయించారు. మృతునికి 40 ఏళ్లు ఉంటాయని, ఎగువ ప్రాంతంలో ప్రమాదవశాత్తూ పడి మరణించి ఉంటాడని భావిస్తున్నారు. వైద్య పరీక్షల నిమిత్తం మృతదేహాన్ని విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఎన్‌పీటీఈఎల్ పరీక్షలో ప్రతిభ

మైలవరం, న్యూస్‌టుడే : దేశంలోని ఐఐటీలు, ఐఐఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహించే ఎన్‌పీటీఈఎల్ పరీక్షలో తమ కళాశాలకు యాక్టివ్ లోకల్ చాప్టర్ అవార్డుతో పాటు 650 మంది విద్యార్థులు, అధ్యాపకులు ఉత్తీర్ణులైనట్లు కళాశాల ప్రిన్సిపల్ కె.అప్పారావు తెలిపారు. అందులో 9 మంది టాపర్లుగా, ఏడుగురికి(ఎలైటు, గోల్డ్), 126 మందికి(ఎలైటు, సిల్వర్), 225 మంది ధ్రువపత్రాలు సాధించినట్లు ఆయన చెప్పారు. ప్రతిభ చాటిన వారిని కళాశాల అధ్యక్షుడు జి.శ్రీనివాసరెడ్డి, ప్రిన్సిపల్, ఉప ప్రిన్సిపల్ రమేష్‌రెడ్డి, చాప్టర్ స్పోక్ పవన్‌చంద్, పలువురు అధ్యాపకులు అభినందించారు.


ధ్రువపత్రాలతో ప్రిన్సిపల్, అధ్యాపకులు

విద్యుత్తు సరఫరా నిలిపివేత

గంపలగూడెం, న్యూస్‌టుడే : మండలంలోని తోటమూల విద్యుత్తు ఉపకేంద్రం నుంచి మధిర రోడ్డు వరకు బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు మరమ్మతుల నిమిత్తం విద్యుత్తు సరఫరాను నిలిపేస్తున్నట్లు డిస్కం ఏఈ కె.వాసు మంగళవారం తెలిపారు.

వ్యాధులపై నియంత్రణ అవసరం

చౌటపల్లి (తిరువూరు) : మండలంలోని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా లెప్రసీ, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ భాను నాయక్ మంగళవారం ఆకస్మికంగా సందర్శించారు. పీహెచ్‌సీ పరిధిలో నమోదైన కుష్ఠు, క్షయ వ్యాధి రోగుల వివరాలను తెలుసుకున్నారు. ఆ వ్యాధుల నియంత్రణపై చౌటపల్లి, గంపలగూడెం పీహెచ్‌సీల వైద్యాధికారులు ఎ.కనక దుర్గాభవాని, వి.శృతికి పలు సూచనలు చేశారు. జిల్లా, క్లస్టర్ ప్రోగ్రాం సమన్వయకర్తలు దినేష్, శ్యామ్, వైద్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. కాకర్ల హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్రాన్ని భానునాయక్ సందర్శించారు.


వైద్యాధికారులతో మాట్లాడుతున్న భానునాయక్

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

చంద్రాల(మైలవరం)న్యూస్‌టుడే: పంటల సాగులో రసాయన ఎరువుల వాడకాన్ని 15 శాతం తగ్గించాలని వ్యవసాయ సహాయ సంచాలకుడు ఎం.శ్రీనివాసరావు సూచించారు. చంద్రాల, ఎదురుబీడెంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పత్తి మొక్కలను పరిశీలించారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో అన్నదాతలతో సమావేశం నిర్వహించి, పలు సూచనలు చేశారు. జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మోనీషా, తహసీల్దార్ అబ్దుల్ దరియా, ఏవో సంధ్యారాణి, పశు వైద్యాధికారిణి వి.దివ్య, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

జి.కొండూరు: రైతులు రసాయనిక ఎరువులను తగ్గించి సేంద్రియ ఎరువులను వాడితే అధిక దిగుబడి సాధించవచ్చని తహసీల్దార్ చాట్ల వెంకటేశ్వర్లు అన్నారు. మండలంలోని కోడూరు, కుంటముక్కలలో మంగళవారం నిర్వహించిన 'పొలం పిలుస్తోంది'లో ఆయన పాల్గొని రైతులకు అవగాహన కల్పించారు. ఎంపీడీవో రామకృష్ణ నాయక్, ఏవో సూరిబాబు పాల్గొన్నారు.

ఎ.కొండూరు, తిరువూరు, గంపలగూడెం: ఎ.కొండూరు మండలం రామచంద్రాపురం, గంపలగూడెం మండలం గుళ్లపూడి, ఆర్లపాడు, తిరువూరు మండలం వాముకుంట్లలో నిర్వహించిన కార్యక్రమంలో ఏవోలు సాయిశ్రీ, హరీష్ కుమార్, పద్మ పాల్గొని రైతులకు మెట్ట, మాగాణి పంటల సాగులో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు, యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు.

అచ్యుతానందన్‌కు ఘన నివాళి

మైలవరం, న్యూస్‌టుడే : కేరళ మాజీ సీఎం వీఎస్ అచ్యుతానందన్ మృతి పట్ల సీపీఎం నాయకులు సంతాపం ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం స్థానిక సీపీఎం కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన నిబద్ధతను కొనియాడారు. నాయకులు పీవీ ఆంజనేయులు, సీహెచ్ సుధాకర్, వెంకటరెడ్డి, సుబ్బారావు, సురేష్, ప్రసాద్, శ్రీనివాసరావు, పలు సంఘాల కార్మికులు పాల్గొన్నారు.


నినాదాలు చేస్తున్న సీపీఎం నాయకులు

ఏడున్నర కిలోల గంజాయితో బాలుడి పట్టివేత

సత్తుపల్లి, న్యూస్‌టుడే : సత్తుపల్లిలో రూ.3.78లక్షల విలువైన ఏడున్నర కిలోల గంజాయిని పోలీసులు మంగళవారం పట్టుకున్నారు. కల్లూరు ఏసీపీ ఎ.రఘు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలం దేవుడుచెరువుకు చెందిన ఓ బాలుడు ద్విచక్రవాహనంపై ఈ గంజాయిని తరలిస్తుండగా నీలాద్రి అర్బన్ పార్కు వద్ద సీఐ టి.శ్రీహరి, ఎస్సై పి.ప్రదీప్ వాహన తనిఖీల్లో పట్టుకున్నారు. బాలుడు పారిపోయే యత్నం చేయగా పట్టుకుని విచారించి వివరాలు రాబట్టారు. సూర్యాపేట, మధిరకు చెందిన తన స్నేహితులతో కలిసి ఈనెల 21న ఏపీలోని విజయవాడ, ఏలూరులో రెండు ద్విచక్రవాహనాలను దొంగతనం చేసి ఒడిశాకు వెళ్లి గంజాయిని కొనుగోలు చేశారు. ఒక ద్విచక్ర వాహనాన్ని అక్కడి వ్యక్తికి అప్పగించారు. పోలీసులకు అనుమానం బాలుడు ద్విచక్ర వాహనంపై సత్తుపల్లికి వచ్చేలా, పక్కన వెళ్లిన వారు బస్సులో సత్తుపల్లికి చేరుకునేలా ప్రణాళిక వేసుకున్నారు. బాలుడిని సత్తుపల్లిలో పోలీసులు పట్టుకుని గంజాయి, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడ్ని జువైనల్ జస్టిస్ బోర్డు ముందు హాజరుపరిచారు. బాలుడు గంజాయికి, జల్సాలకు అలవాటు పడి సులువుగా డబ్బులు సంపాదించాలని చిన్న ప్యాకెట్లను రూ.500ల చొప్పున ఈ ప్రాంతంలో అమ్ముతున్నట్లు విచారణలో పోలీసులు గుర్తించారు. సమావేశంలో సీఐ టి.శ్రీహరి, ఎస్సై పి.ప్రదీప్ పాల్గొన్నారు.



స్తబ్ధంగా ఉన్న మార్కెట్‌లో అద్భుతాలు జరుగవు. పరిశ్రమ చైతన్యశీలంగా ఉంటేనే పదిమందికి నీడనిచ్చేది. ఆ కోవలో ఏనాడూ డిమాండ్ తగ్గకుండా పైపైకి ఎదుగుతున్న భారత ఆభరణాల పరిశ్రమ ధగధగలాడే హోదాలున్న కొలువులను అందిస్తోంది. నిత్యకల్యాణం పచ్చతోరణంలా వెలుగొందుతోంది కాబట్టే ఏటా కొత్త కంపెనీల ప్రవేశమో ప్రస్తుత కంపెనీల విస్తరణ ప్రణాళికలో చూస్తున్నాం.

కొత్త హోదాల పుత్తడి పరిశ్రమ!

తొమ్మిది లక్షల కోట్లకు చేరువవుతున్న భారత ఆభరణాల మార్కెట్లోకి బిర్లా వంటి కంపెనీలు ఇటీవల ప్రవేశించాయి. బిర్లా గ్రూప్ 'ఇంద్రియా' పేరుతో భారీ ఎంట్రీ ఇచ్చింది. ఇప్పటికే ఈ రంగంలో కళ్యాణ్ జ్యువెలర్స్, మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్, పి.సి.జ్యువెలర్స్, సెన్కో గోల్డ్ అండ్ డైమండ్స్, జి.ఆర్.టి.జ్యువెలర్స్, త్రిభువన్ దాస్ జ్యువెలర్స్ (టి.బి.జెడ్.), జోయ్ అలూకాస్, తనిష్క్ తదితర బ్రాండ్లు అమ్మకాల్లో దూసుకువెళుతున్నాయి.

పెరుగుతున్న మార్కెట్టుకు పదునైన నైపుణ్యాలున్న ఉద్యోగులు కావాలి. అందరూ వెళ్లే దారి కంటే కొత్త మార్గంలో మంచి కెరియర్ అందుకోవాలనుకునే యువతను జ్యువెలరీ బిజినెస్ ఆహ్వానిస్తోంది. సరికొత్త అవకాశాలను అందిస్తోంది.

విస్తరిస్తున్న వ్యవస్థీకృత రంగం, స్థిరంగా నిలబడ్డ అవ్యవస్థీకృత రంగం కలిపి స్వర్ణాభరణాల పరిశ్రమలో కోటి మందికి ఉపాధి కల్పిస్తుండగా పొజిషన్లు కొత్తవి పుట్టుకొస్తున్నాయి. పోటీ రోజు రోజుకీ పెరుగుతుండడంతో కస్టమర్లను ఆకర్షించి, నిర్దేశించుకున్న వ్యాపార పరిమాణాన్ని అందుకునేందుకూ జ్యువెలరీ కంపెనీలు వివిధ హోదాల్లో యువత సేవలు వినియోగించుకుంటున్నాయి.

పొజిషన్లలో సాంప్రదాయికంగా వస్తున్నవి కొన్నయితే.. కొత్తగా పుట్టుకొస్తున్నవి మరికొన్ని. జ్యువెలరీ డిజైనర్, సేల్స్ ఎగ్జిక్యూటివ్, స్టోర్ మేనేజర్, కౌంటర్ సేల్స్ ఎగ్జిక్యూటివ్... లాంటి పొజిషన్లు ఎప్పటినుంచో వస్తుండగా కంపెనీలు గుర్తించిన అవసరాల మేర నూతన హోదాలు వచ్చి చేరి యువతకు అవకాశాలు పెంచాయి.

ఉపాధి పథం — నైపుణ్య సాధనం

ఎన్‌గ్రేవర్: ఈ మధ్య డెకరేటివ్ జ్యువెలరీ.. వినియోగదారులను ఆకట్టుకుంటోంది. దీనిని గుర్తించి కంపెనీలు తయారైన ఆభరణాలపై ఆకర్షణీయమైన డిజైన్లు పొదిగే ఎన్‌గ్రేవర్ అనే కొత్త పొజిషన్ సృష్టించి కళాత్మక అభిరుచి గలవారిని నియమిస్తున్నారు. తయారైన వివిధ మోడల్స్‌పై ఎన్‌గ్రేవర్స్ అదనపు డిజైన్లు అద్ది మరింత అందాన్ని తీసుకువస్తారు.

ఎనామిలర్: ఈ పొజిషన్ కూడా ఆభరణాలకు అదనపు సొగసులు తీసుకొచ్చేందుకే. వివిధ డిజైన్ల నగలపై కంటికింపైన, రంగులను (పౌడర్డ్ గ్లాస్) ఎనామిలర్ చేర్చి కొత్త అందాలు తీసుకొస్తారు.

మోడల్ మేకర్: విభిన్న అభిరుచులున్న కస్టమర్లను ఆకర్షించేందుకు రకరకాల మోడల్స్ రూపొందించడం ఈ పొజిషన్లో చేరేవారి బాధ్యత. ప్రొఫెషనల్ డిగ్రీతో పాటు సృజనాత్మకత ఉన్నవారికి పెద్ద పీట వేస్తారు.

కేస్టర్: దేశవ్యాప్తంగా విస్తరించిన షోరూములకు వేలాది కస్టమర్లు వస్తుంటారు. వీళ్ల కళ్లు చెదిరేలా మోడల్స్‌ను ప్రదర్శించేందుకు అవసరమైన కేస్టింగ్స్ (అచ్చులు) తయారు చేసేందుకు ప్రత్యేకంగా నియమిస్తున్నారు. లోహాలతో కేస్టర్స్ తయారుచేసే అచ్చులతోనే రకరకాల డిజైన్ల ఆభరణాలు సిద్ధమవుతాయి.

జ్యువెలరీ కన్సల్టెంట్: వెడ్డింగ్ జ్యువెలరీ వంటి ప్రత్యేక విభాగం గల పెద్ద షోరూమ్స్ కస్టమర్స్‌కు వారి బడ్జెట్ తగ్గి వీటిలో కొనుగోలు చేయాల్సిన ఆభరణాలపై ప్లానింగ్ ఇచ్చేందుకు వీరిని మేనేజ్మెంట్ నియమిస్తోంది. వేలాది మోడల్స్, వివిధ విభాగాలు గల భారీ షోరూమ్స్ కన్సల్టెంట్స్ కస్టమర్లను గమనిస్తూ అవసరమనుకుంటే చొరవతో పరిచయం చేసుకొని సలహాలు అందిస్తారు.

మర్చండైజర్: రిటెయిల్ షోరూమ్స్ జ్యువెలరీ అమరికకు మర్చండైజర్ సేవలు వినియోగపడతాయి. కస్టమర్లను ఆకట్టుకునేలా షోరూములో వివిధ నగల విభాగాలు, ఒక్కో విభాగంలో వినియోగదారుడి చూపును ఆకర్షించేలా నగల ప్రదర్శన విధానాన్ని మర్చండైజర్ నిర్ణయిస్తాడు. ఆకట్టుకునే ప్రదర్శన (ప్రజెంటేషన్) ద్వారా అమ్మకాలు పెరిగేలా చూడటం వీరి విధి.

బీ టూ బీ సేల్స్ ఎగ్జిక్యూటివ్: రిటెయిల్ అమ్మకాలపై సేల్స్ ఎగ్జిక్యూటివ్ పనిచేస్తుంటే ఆభరణాల బల్క్ బిజినెస్‌పై బీ టూ బీ ఎగ్జిక్యూటివ్స్ దృష్టి పెడతారు. రిటెయిల్ షాపులకు పెద్ద పరిమాణంలో ఆభరణాల అమ్మకం, కార్పొరేట్ కంపెనీలకు అధిక సంఖ్యలో గిఫ్ట్ ఐటమ్స్ విక్రయం లాంటి బల్క్ సేల్స్‌పై ఈ ఎగ్జిక్యూటివ్ దృష్టి పెడతారు.

క్వాలిటీ కంట్రోల్ మేనేజర్: 'తనిష్క్' బ్రాండ్ పేరుతో ఆభరణాల వ్యాపారంలో ఉన్న టాటా, 'ఇంద్రియా' పేరుతో గోల్డ్ ఆర్నమెంట్ మార్కెట్లో ఈ మధ్యనే ప్రవేశించిన బిర్లా, ఇప్పటికే ఈ విపణిలో ఉన్న రిలయన్స్ వంటి కంపెనీలు నాణ్యతకు ఎనలేని ప్రాముఖ్యం ఇస్తాయి. కంపెనీ నిర్దేశించుకున్న నాణ్యత ప్రమాణాల రీత్యా బంగారం, డిజైన్లు ఉంటున్నాయా? లేదా అన్న విషయాన్ని క్వాలిటీ కంట్రోల్ మేనేజర్ పర్యవేక్షిస్తారు.

జ్యువెలరీ బిజినెస్‌లో అవకాశాలకు కొదవేం లేదు. అయితే మేటి హోదాలు అందుకునేందుకు తగిన విద్యార్హతలు సొంతం చేసుకోవాలి. తగిన నైపుణ్యాలు సంతరించుకోవాలి. ఈ రెండింటినీ ఒడిసి పట్టుకుంటే ఆభరణాల పరిశ్రమలో ఒక వెలుగు వెలగవచ్చు.



– యస్.వి. సురేష్
సంపాదకుడు, ఉద్యోగ సోపానం

ఫెర్రో స్క్రాప్ నిగమ్‌లో నాన్-ఎగ్జిక్యూటివ్‌లు



బిలాయ్‌లోని ఫెర్రో స్క్రాప్ నిగమ్ లిమిటెడ్ (ఎఫ్ఎస్ఎన్ఎల్).. 50 నాన్–ఎగ్జిక్యూటివ్ పోస్టులను భర్తీచేయనుంది.

ఆపరేషన్, మెయింటెనెన్స్, ఎఫ్ అండ్ ఏ, పీ అండ్ ఏ విభాగాల్లో.. సూపర్‌వైజర్లు-12, అసిస్టెంట్ ఫోర్‌మెన్ (మెకానికల్)-3, అసిస్టెంట్ ఫోర్‌మెన్ (ఎలక్ట్రికల్)-2, అసిస్టెంట్-3, ఎంఆర్‌పీ సీనియర్ ఆపరేటర్-4, క్రేన్ ఆపరేటర్-4, ఎక్స్‌కవేటర్ ఆపరేటర్-6, టిప్పర్ ఆపరేటర్-6, లోడర్ ఆపరేటర్-2, మెకానిక్-4 , ఎలక్ట్రీషియన్-2, వెల్డర్-2 ఖాళీలు ఉన్నాయి.

అర్హతలు: ● **సూపర్‌వైజర్లు:** ఏదైనా డిప్లొమా, ఐదేళ్ల అనుభవం.
- ● **ఎక్స్‌కవేటర్ ఆపరేటర్:** ఐటీఐ, హెచ్ఈఎంఈ/ హెచ్ఎంవీ లైసెన్స్, ఏడాది అనుభవం ఉండాలి. టిప్పర్ ఆపరేటర్‌కు కూడా ఇవే అర్హతలు అవసరం అవుతాయి.
- ● **సూపర్‌వైజర్, అసిస్టెంట్ ఫోర్‌మెన్, అసిస్టెంట్:** ఈ పోస్టులకు ఐదేళ్లు, మిగతావాటికి ఏడాది అనుభవం ఉండాలి.

వయసు: అన్ని పోస్టులకూ 35 సంవత్సరాలు మించకూడదు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.

వేతన శ్రేణి: ఆపరేటర్‌కు నెలకు రూ. 25,070-32,010. అసిస్టెంట్‌కు రూ. 27,080-39,160. మిగతా పోస్టులకు రూ. 27,710-48,920.

ఎంపిక: ● రాత పరీక్ష/ట్రేడ్ టెస్ట్/ఇంటర్వ్యూతో ఎంపిక చేస్తారు. వీటికి హాజరయ్యేవారికి స్లీపర్ క్లాస్ రైలు ఛార్జీలను చెల్లిస్తారు.
- ● రాతపరీక్ష/ స్కిల్ టెస్ట్ సమయంలో ధ్రువపత్రాలను పరిశీలిస్తారు.
- ● రాత పరీక్షలో సాధించి మార్కులు, వైద్య పరీక్షల అనంతరం తుది ఎంపిక చేస్తారు.
- ● ఎంపిక విధానంలో మార్పులు చేసే అవకాశం ఉంటుంది.
- ● ఎంపికైనవారిని కంపెనీకి దేశవ్యాప్తంగా ఉన్న ఆఫీసులు/ యూనిట్లు/ ప్రాజెక్టుల్లో ఎక్కడైనా నియమించవచ్చు.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 24. 07. 2025
వెబ్‌సైట్: https://www.fsnl.co.in/career

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్
హెచ్ఆర్ జనరలిస్ట్
సంస్థ: నెక్ట్స్‌జాబ్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ రాయడం, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, లింక్డ్ఇన్ మార్కెటింగ్, టైమ్ మేనేజ్‌మెంట్
స్టైపెండ్: రూ. 2,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 14
☛ https://shorturl.at/vJbwx

యూఐ/యూఎక్స్ డిజైన్
సంస్థ: క్రియేటివైజ్ నైపుణ్యాలు: అడోబ్ ఆఫ్టర్ ఎఫెక్ట్స్, క్రియేటివ్ సూట్, ఎక్స్‌డి, ఫిగ్మా, యూఐ అండ్ యూఎక్స్ డిజైన్
స్టైపెండ్: రూ. 12,000-40,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 8
☛ https://shorturl.at/Yk6Oj

ట్యాలెంట్ అక్విజిషన్
సంస్థ: దటెక్‌గ్యాలర్
నైపుణ్యం: ఇంగ్లిష్ మాట్లాడటం
స్టైపెండ్: రూ. 6,250-6,750
☛ https://shorturl.at/2IthP

ఆపరేషన్స్
సంస్థ: యుబ్రిక్స్ నైపుణ్యాలు: అడ్మినిస్ట్రేటివ్ సపోర్ట్, క్లయింట్ ఇంటరాక్షన్, ఇంగ్లిష్ రాయడం, ఎంఎస్-ఎక్సెల్, ఆన్‌బోర్డింగ్, ఆపరేషన్స్
స్టైపెండ్: రూ. 9,000-11,000
☛ https://shorturl.at/Am7Vh

లీడ్ జనరేషన్
సంస్థ: ఐటీ సొల్యూషన్స్ ఎక్స్‌పర్ట్స్
నైపుణ్యాలు: డిజిటల్, ఈమెయిల్, సోషల్ మీడియా మార్కెటింగ్, లీడ్ జనరేషన్, సేల్స్
స్టైపెండ్: రూ. 2,000-26,000
☛ https://shorturl.at/Re6X8

క్యాడ్ డిజైన్
సంస్థ: సంఘప్రీ వర్మ
నైపుణ్యాలు: ఆటోక్యాడ్, ఆటోక్యాడ్ ఫ్యుషన్ 360, క్యాడ్, రినో, సాలిడ్‌వర్క్స్
స్టైపెండ్: రూ. 10,000-17,500
☛ https://shorturl.at/1zjQD

టెలికాలింగ్
సంస్థ: వైట్‌ఫీల్డ్ నెట్‌వర్క్
నైపుణ్యాలు: ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ. 3,500
☛ https://shorturl.at/1JPeM

వీటన్నిటికీ దరఖాస్తు గడువు: ఆగస్టు 15

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

సీనియర్ కన్సల్టెంట్లు
ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా తరపున ఎడ్‌సిల్ లిమిటెడ్.. ఒప్పంద ప్రాతిపదికన 10 సీనియర్ కన్సల్టెంట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ✦ సీనియర్ కన్సల్టెంట్ (ప్లానింగ్): 06
- ✦ సీనియర్ కన్సల్టెంట్ (ఆపరేషన్స్): 04

అర్హత: ఏదైనా ఇంజినీరింగ్ డిగ్రీ, ఎంబీఏతో పాటు ఉద్యోగానుభవం.
స్టైపెండ్: నెలకు రూ. 1,50,000.
వయసు: 45 ఏళ్లు మించకూడదు.
ఎంపిక: విద్యార్హతలు, ఇంటర్వ్యూ, ధ్రువపత్రాల పరిశీలనతో
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 01. 08. 2025.
వెబ్‌సైట్: https://www.aai.aero/

సివిల్ అసిస్టెంట్ సర్జన్లు
తిరుమల తిరుపతి దేవస్థానం, తిరుపతి.. ఒప్పంద ప్రాతిపదికన 8 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు ప్రకటన వెలువరించింది.
- ✦ సివిల్ అసిస్టెంట్ సర్జన్: 08 పోస్టులు

అర్హత: ఎంబీబీఎస్, పీజీ (ఎండీ/ఎంఎస్)కు ప్రాధాన్యం.
వయసు: 42 ఏళ్లు మించకూడదు.
మూల వేతనం: నెలకు రూ. 53,495.
ఎంపిక: విద్యార్హతలు, అనుభవం, ఇంటర్వ్యూతో.
పోస్టు ద్వారా దరఖాస్తుకు చివరి తేదీ: 07. 08. 2025.
చిరునామా: ది అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, సెంట్రలైజ్డ్ ఔట్ సోర్సింగ్ సెల్, టీటీడీ అడ్మినిస్ట్రేటివ్ బిల్డింగ్స్, కేటీ రోడ్, తిరుపతి.
వెబ్‌సైట్: https://www.tirumala.org/

ఎన్ఐడీఎంలో అసోసియేట్ ప్రొఫెసర్లు
నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్, న్యూదిల్లీ.. అసోసియేట్ ప్రొఫెసర్ పోస్టులకు దరఖాస్తులు కోరుతోంది.
- ✦ అసోసియేట్ ప్రొఫెసర్: 04 ఖాళీలు

అర్హత: సోషల్ సైన్సెస్/ ఎన్విరాన్మెంటల్/ ఎర్త్ సైన్స్/ ఇంజినీరింగ్/ డిజాస్టర్ మెనేజ్‌మెంట్ లేదా తత్సమాన విభాగాల్లో పీజీ, పీహెచ్‌డీతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
వయసు: 01. 07. 2025 నాటికి 50 ఏళ్లు మించకూడదు.
దరఖాస్తు ఫీజు: యూఆర్, ఈడబ్ల్యూఎస్, ఓబీసీలకు రూ. 1000; ఎస్సీ, ఎస్టీలకు రూ. 500.
దరఖాస్తు: ఈమెయిల్ recruitment.nidm@nic.in కు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: 04. 08. 2025.
వెబ్‌సైట్: https://nidm.gov.in/recruitment.asp

ఉర్వరక్ రసాయన్ లిమిటెడ్‌లో...
హిందుస్థాన్ ఉర్వరక్ రసాయన్ లిమిటెడ్.. వివిధ విభాగాల్లో 108 పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ✦ మేనేజర్: 03 ✦ ఇంజినీర్/సీనియర్ ఇంజినీర్: 35
- ✦ అసిస్టెంట్ మేనేజర్/డిప్యూటీ మేనేజర్: 21
- ✦ అడిషనల్ చీఫ్ మేనేజర్: 01 ✦ సీనియర్ మేనేజర్: 01
- ✦ జూనియర్ ఇంజినీర్ అసిస్టెంట్-2-గ్రేడ్-2: 47

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, డిప్లొమా, ఎంబీఏ, పీజీడీఎం, పీజీ డిప్లొమాతో పాటు పని అనుభవం. **ఎంపిక:** రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో
వయసు: జూనియర్ ఇంజినీర్ అసిస్టెంట్-2-గ్రేడ్-2కు 30 ఏళ్లు, సీనియర్ మేనేజర్‌కు 42 ఏళ్లు, అడిషనల్ చీఫ్ మేనేజర్‌కు 44 ఏళ్లు, అసిస్టెంట్ మేనేజర్‌కు 35 ఏళ్లు, డిప్యూటీ మేనేజర్‌కు 37 ఏళ్లు, సీనియర్ ఇంజినీర్‌కు 32 ఏళ్లు, మేనేజర్‌కు 40 ఏళ్లు.
వేతన శ్రేణి: నెలకు మేనేజర్‌కు రూ. 70,000 - రూ. 2,00,000, డిప్యూటీ మేనేజర్‌కు రూ. 60,000 - రూ. 1,80,000, అసిస్టెంట్ మేనేజర్‌కు రూ. 50,000 - రూ. 1,60,000, సీనియర్ ఇంజినీర్‌కు రూ. 45,000 - రూ. 1,50,000, ఇంజినీర్/ఆఫీసర్‌కు రూ. 40,000 - రూ. 1,40,000, జూనియర్ ఇంజినీర్ అసిస్టెంట్-2-గ్రేడ్-2కు రూ. 25,000 - రూ. 86,4000, సీనియర్ మేనేజర్‌కు రూ. 80,000 - రూ. 2,20,000, అడిషనల్ చీఫ్ మేనేజర్‌కు రూ. 90,000 - రూ. 2,40,000.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 12. 08. 2025
వెబ్‌సైట్: https://jobse3.hurl.net.in/index.php

మార్కెటింగ్ అసోసియేట్లు
రెప్కో బ్యాంక్ లిమిటెడ్, చెన్నై.. ఒప్పంద ప్రాతిపదికన మార్కెటింగ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
- ✦ మార్కెటింగ్ అసోసియేట్: 10 పోస్టులు

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీతో పాటు పని అనుభవం ఉండాలి. **ఎంపిక:** ఇంటర్వ్యూతో.
వయసు: 30. 06. 2025 నాటికి 25 నుంచి 35 ఏళ్లు ఉండాలి.
జీతం: నెలకు రూ. 15,000.
పోస్టు ద్వారా దరఖాస్తుకు చివరి తేదీ: 05. 08. 2025.
చిరునామా: ది జనరల్ మేనేజర్(అడ్మిన్), రెప్కో బ్యాంక్ లిమిటెడ్, పీబీ నెం.1449, రెప్కో టవర్, నెం.33, నార్త్ ఉస్మాన్ రోడ్, టీ.నగర్, చెన్నై - 600017.
వెబ్‌సైట్: https://www.repcobank.com/careers

ఎగ్జిక్యూటివ్ ట్రైనీ
ఉడుపి కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్, కర్ణాటక ఎగ్జిక్యూటివ్ ట్రైనీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. ✦ ఎగ్జిక్యూటివ్ ట్రైనీ: 08
విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ.
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్(మెకానికల్, ఎలక్ట్రికల్, సివిల్, ఐటీ)తో పాటు పని అనుభవం ఉండాలి. **ఎంపిక:** ఆన్‌లైన్ టెస్ట్, రైటింగ్ స్కిల్స్, పర్సనల్ ఇంటర్వ్యూతో. **వయసు:** 20. 08. 2025 నాటికి 27 ఏళ్లు ఉండాలి.
జీతం: నెలకు రూ. 77,200.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 20. 08. 2025.
దరఖాస్తు ఫీజు: రూ.1000. ఎస్సీ, ఎస్టీ పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.
వెబ్‌సైట్: https://udupicsl.com/index.php/careers/

వాక్–ఇన్స్

119 టీచింగ్ పోస్టులు
గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, నల్గొండలో కాంట్రాక్ట్, ఆనరేరియం ప్రాతిపదికన ఫ్యాకల్టీ, రెసిడెంట్ వైద్యులను నియమించడానికి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రకటన వెలువరించింది.
- ✦ ప్రొఫెసర్: 4 ✦ అసోసియేట్ ప్రొఫెసర్: 14
- ✦ అసిస్టెంట్ ప్రొఫెసర్: 21 ✦ ట్యూటర్: 9
- ✦ సీనియర్ రెసిడెంట్స్: 37 ✦ జూనియర్ రెసిడెంట్స్: 28
- ✦ సివిల్ అసిస్టెంట్ సర్జన్: 06

అర్హత: పోస్టును అనుసరించి.. ఎంబీబీఎస్, ఎండీ/ఎంఎస్/డీఎన్‌బీ, ఎమ్మెస్సీ/ పీహెచ్‌డీతో పాటు బోధన, రిసెర్చ్ అనుభవం, తెలంగాణ రాష్ట్ర మెడికల్ కౌన్సిల్‌లో చెల్లుబాటయ్యే రిజిస్ట్రేషన్ అవసరం.
వయసు: నోటిఫికేషన్ తేదీ నాటికి సీనియర్ రెసిడెంట్‌కు 45 సంవత్సరాలు, ఇతర పోస్టులు 69 ఏళ్లు మించకూడదు.
జీతం: నెలకు ప్రొఫెసర్‌కు రూ. 1,90,000; అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ. 1,50,000; అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ. 1,25,000; సీనియర్ రెసిడెంట్‌కు రూ. 1,06,461; ట్యూటర్‌కు రూ. 55,000; జూనియర్ రెసిడెంట్‌కు రూ. 46,000; సివిల్ అసిస్టెంట్ సర్జన్‌కు రూ. 52,000.
ఎంపిక: విద్యార్హతలు, బోధన/రిసెర్చ్ అనుభవం, ఇంటర్వ్యూతో. తెలంగాణ స్థానికులకు ప్రాధాన్యం, రూల్ ఆఫ్ రిజర్వేషన్ వర్తిస్తుంది.
ఇంటర్వ్యూ తేదీ: 23. 07. 2025
వేదిక: ప్రిన్సిపల్ చాంబర్, గవర్నమెంట్ మెడికల్ కాలేజ్, నల్గొండ.
వెబ్‌సైట్: https://nalgonda.telangana.gov.in/notice/notification-for-contract-honorrarium-recruitment-gmc-nalgonda/

నైరా అగ్రికల్చర్ కాలేజీలో..
అగ్రికల్చర్ కాలేజీ, నైరా(శ్రీకాకుళం) ఒప్పంద ప్రాతిపదికన టీచింగ్ అసోసియేట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
- ✦ టీచింగ్ అసోసియేట్: 01 పోస్టు

అర్హత: సంబంధిత విభాగంలో డిగ్రీ, పీహెచ్‌డీతో పాటు పని అనుభవం ఉండాలి. **జీతం:** నెలకు రూ. 61,000 - రూ. 67,000.
ఎంపిక: ఇంటర్వ్యూతో **ఇంటర్వ్యూ తేదీ:** 29. 07. 2025
వేదిక: అగ్రికల్చర్ కాలేజ్, నైరా, శ్రీకాకుళం జిల్లా.
వెబ్‌సైట్: https://angrau.ac.in/ANGRU/Recruitment_Notification_2021.aspx

పఠనానికో చోటు! ఎందుకని?

ఎవరికైనా సరే పాఠాలు చదువుకోవడానికి సొంతంగా ఒక గది ఉంటే ఎంతో బాగుంటుంది. కానీ, అలా అందరికీ వీలు కాదు. అన్నిచోట్లా అన్నివేళలా అందుబాటులో ఉండకపోవచ్చు. అయితే పఠనానికి ప్రత్యేకమైన చోటు ఎందుకు, ఎలా ఉండాలో చూద్దాం.



ఒకే చోట చదువుతూ ఉంటే అక్కడికి రాగానే చదువుకోవాలన్న ప్రేరణ కలుగుతుంది. సహజంగా ఏకాగ్రత కుదురుతుంది. అధ్యయనం అలవాటుగా మారుతుంది. అక్కడికి రాగానే కలిగే సహజ మానసిక సన్నద్ధత వల్ల చదువుకోవడం పట్ల ఒక నిబద్ధత ఏర్పడుతుంది.

ఒక చోటును ప్రత్యేకించడం అంటేనే మానసికంగా చదువుకోవడానికి సిద్ధపడ్డాం అనే కదా. దాంతో చుట్టూ ఉన్న సవాలక్ష అంతరాయాలు (డిస్ట్రాక్షన్‌లు) మన దృష్టి నుంచి మాయమైపోతాయి. పాఠాల మీద మనసు నిమగ్నమవుతుంది.

అది ఎలా ఉండాలి?

1 **చదువుకొనే ప్రదేశం (రీడింగ్ లొకేషన్):** లైబ్రరీ, రీడింగ్ రూం, పార్క్, హాస్టల్ వంటి బహిరంగ ప్రదేశాలలో, ఇంటిలోని స్టడీ రూంలోనో, డాబా మీదనో, గరాజ్.. బేస్‌మెంట్ లోనో, చదువుకొనే మూల (రీడింగ్ నూక్) లోనో ఒక చోటును ప్రత్యేకించవచ్చు.

2 **ఏకాంత సృష్టి:** సెల్ ఫోన్, రీల్స్, టీవీ, సోషల్ మీడియా, క్రికెట్ తదితర ఆటల కామెంటరీలతో బాటు కుటుంబసభ్యుల మాటలు, తోటి విద్యార్థుల చర్చలు, రాజకీయాలు, కాలక్షేపపు కబుర్ల వరకు అన్నిటినీ గట్టునబెట్టి, మీ చదువుకోసమే ఏకాంతాన్ని సృష్టించుకోండి. ప్రయత్నించి చూడండి.

3 **చక్కటి వెంటిలేషన్:** గాలీ వెలుతురు ధారాళంగా ఉండే చోటును ఎంపిక చేసుకోండి. కిటికీ పక్కనో, వరండా లేదా డాబామీదో సహజ వాతావరణం ఉండే స్థలం మంచిది. తలుపులు, కిటికీలు బిగించి గదిలో బంధించుకోకండి. తాజా గాలీ వెలుతురు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కలిగిస్తాయి.

4 **సౌకర్యవంతంగా:** ఆ చోటులో మీకు సౌకర్యంగా ఉండేట్టుగా, వీలయిన రీతిలో చాప, బొంత, పరుపు, టేబుల్, కుర్చీ, డెస్క్ .. వీటిలో ఏదైనా అమర్చుకోండి. చిన్న చిన్న దిండ్లు, కుషన్లు, దుప్పట్లు తదితరాలను అమర్చుకోండి.

5 **స్వీయాలంకరణ:** నచ్చిన వస్తువులతో, పుస్తకాలతో, చిత్రాలతో ఆ చోటును మీ అభిరుచికి తగ్గట్టుగా కళాత్మకంగా అలంకరించుకోండి. నచ్చిన కొటేషన్లను, స్ఫూర్తినిచ్చే వాక్యాలను కనిపించేట్టుగా పెట్టుకోండి.

6 **ఆహ్లాద వాతావరణం:** మీ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేట్టు చూసుకోండి. చెవులు బద్దలుకొట్టే శబ్దాలను, మీ ఏకాగ్రతను సవాలు చేసే గోలను తగ్గించండి. చదువుకొంటూ సంగీతం వినేట్టయితే రణగొణ ధ్వనులు లేకుండా చూసుకోండి.

7 **సమయ పాలన:** అనుకున్నవేళలో నిర్ధారిత సమయంలో చదువుకొనే చోటుకు వెళ్ళడాన్ని పాటించండి. మీ టైం షెడ్యూల్‌ను బట్టి ఆయా పాఠాలను చదువుకోండి.

8 **స్టడీ డెస్క్:** ఉపయోగించే డెస్క్‌ను శుభ్రంగా ఉంచుకోండి. పెన్నులు, పెన్సిళ్ళు, కంపాస్ బాక్స్ నుంచి, కాలిక్యులేటర్, కంప్యూటర్, పెన్ డ్రైవ్‌లు, ప్రింట్ ఔట్ కాగితాలను ఒక క్రమంలో అమర్చుకోండి. పాఠ్య పుస్తకాలు, నోట్ పుస్తకాలను, ఫైల్స్‌ను అరలలో వరసగా సర్దుకోండి. మీ స్టడీ డెస్క్ గజిబిజి గందరగోళంగా మారకుండా చూసుకోండి.

9 **అందుబాటైన చోటు:** మీరు సులువుగా వెళ్ళగలిగిన చోటు, అనుకూలమైన రీతిలో మలుచుకోగలిగిన చోటు, మీ సమయానికి, బడ్జెట్‌కు ఇమిడే చోటును ఎంపిక చేసుకోవడం ముఖ్యం.

10 **ప్రత్యామ్నాయ స్థలం:** అనుకోని అవాంతరం వచ్చి, అలవాటయిన చోట చదువుకోవడం వీలుకాక పోతే, పఠనం వాయిదా పడకూడదు. అందుకే బదులుగా మరో చోటును చదువుకోవడానికి ఒక ఆల్టర్నేటివ్ స్టడీ స్పాట్‌గా తయారుగా ఉంచుకోవడం మరిచిపోవద్దు.

అయినా, 'మనసు చోటు దానికదే ఒక సొంత ప్రదేశం (ది మైండ్ ఈజ్ ఇట్స్ ఓన్ ప్లేస్)' అన్న మిల్టన్ మాటలను మననం చేసుకోండి. మీ మనసుకు నచ్చిన చోటునే మీ అధ్యయన కేంద్రంగా మలుచుకోండి. లేదంటారా... ఏ చోటునైనా మీ మనసుకు నచ్చిన చదువుకొనే ప్రదేశంగా మార్చుకోండి. అది ఎలాంటి చోటైనా సరే, ఏకాగ్రతతో పఠనం సాగించడం ముఖ్యం, అవసరం!



– చంద్రలత

దూరవిద్యలో బీఈడీ?

బీఈడీని దూరవిద్యలో చదవడానికి మన దేశంలో ప్రత్యేకంగా విశ్వవిద్యాలయాలు ఉన్నాయా? అందుకోసం ఏ అర్హతలు ఉండాలి? ఆ సర్టిఫికెట్‌కు విలువ ఉంటుందా? - వి.రమేష్



■ బీఈడీని దూరవిద్య ద్వారా చదవడానికి మనదేశంలో ప్రత్యేక విశ్వవిద్యాలయాలు లేవు. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ నిబంధనల ప్రకారం, డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ విద్యార్హత ఉన్నవారు మాత్రమే డిస్టెన్స్/ ఓపెన్ యూనివర్సిటీ ద్వారా బీఈడీ చేసే వెసులుబాటు ఉంది. డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ విద్యార్హతతో ఉపాధ్యాయులుగా పనిచేస్తూ, దూరవిద్య ద్వారా బీఈడీ చేస్తే, ఆ సర్టిఫికెట్ స్కూల్ అసిస్టెంట్‌గా ప్రమోషన్ పొందడానికి ఉపయోగపడుతుంది. ఆ బీఈడీ సర్టిఫికెట్, రెగ్యులర్ సర్టిఫికెట్‌తో సమానంగా విలువ ఉంటుంది. ప్రయివేటు పాఠశాలల్లో కానీ, రాత పరీక్షతో పాటు, ఇంటర్వ్యూ ఉన్న ఉద్యోగాల్లో మాత్రం కొంత ఇబ్బంది ఉండే అవకాశం ఉంది. బీఈడీ అనేది ఒక ప్రొఫెషనల్ ప్రోగ్రాం. ఈ ప్రోగ్రాంలో విషయ పరిజ్ఞానంతో పాటు, బోధనా నైపుణ్యాల గురించి కూడా శిక్షణ ఇస్తారు. మెడిసిన్, ఇంజనీరింగ్, లా.. లాంటి ప్రొఫెషనల్ ప్రోగ్రాంలను డిస్టెన్స్ విధానంలో చదివితే వృత్తి నైపుణ్యాలు పొందడంలో ఇబ్బందులు ఉన్నట్లే, బీఈడీ లాంటి ప్రొఫెషనల్ ట్రైనింగ్ కోర్సును దూరవిద్యా విధానంలో చదివితే కూడా సమస్యలు ఉంటాయి. కాబట్టి, బీఈడీని రెగ్యులర్ విధానంలో చదివితేనే, మీరు మంచి ఉపాధ్యాయులుగా తయారవడానికి ఎక్కువ అవకాశాలు ఉంటాయి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

వసుంధర

vasundhara@eenadu.in

నేనెందుకు అలా లేను?



జెన్ జీ అన్న పదం వినగానే చాలా మందిలో ఒక అద్భుత తరమన్న భావన. వేగంగా దూసుకెళ్తున్న వాళ్లని చూసి ఆశ్చర్యపడే వాళ్లూ ఎక్కువే. అయితే... ఇది ఒక కోణమే. ఒకప్పుడు మధ్య వయసుకు వచ్చాక జీవితంలో ఏం సాధించాం? ఎంతమంది కంటే ముందున్నాం అని చూసుకునేవారు. కానీ ఇప్పుడు? 20ల్లోనే ఈ తీరు పెరిగిపోతోంది. సరైన కెరియర్ ఎంచుకున్నామా? నేను మిగతావాళ్లలా ఆనందంగా లేనేంటి? ఇలాంటి ప్రశ్నలతో సతమతమవుతున్నారట జెన్ జీ అమ్మాయిలు. నిజానికి వీళ్లు కెరియర్‌కి ఎక్కువ ప్రాధాన్యమిచ్చి 30 ఏళ్లొచ్చే వరకూ పెళ్లినీ వాయిదా వేసుకుంటున్నారు. అయినా ఎందుకిలా ఆలోచిస్తున్నారంటే... పోలికలే కారణమంటున్నారు నిపుణులు. 23ఏళ్ల ప్రియ... గ్రాఫిక్ డిజైనర్‌గా ఉద్యోగంలో చేరింది. మంచి సంస్థలో రావడం చూసి అంతా పొగిడినవారే! అయినా అసంతృప్తి. ఎందుకంటే... తన స్నేహితురాళ్లు ఇన్‌ఫ్లుయెన్సర్, వ్యాపారవేత్తలుగా రాణిస్తున్నారు. తన కంటే ఎక్కువ మొత్తంలో సంపాదిస్తున్నారు. దీంతో తను ఈ కెరియర్‌లోకి వచ్చి తప్పు చేశానా అన్న భయం. దీనికితోడు మరికొంత ప్రమోషన్ వచ్చింది, స్నేహితులతో వెకేషన్‌కి వెళ్లొచ్చాం అని పెడుతుంటారు కదా! అదీ వీళ్లకి సమస్యే. 'వాళ్లు అందరూ ఎంజాయ్ చేస్తున్నారు. నేను చేయడం లేదు. నేను సరైన ఉద్యోగం కాదన్నట్లే'... ఇలాగే సాగుతున్నాయి జెన్ జీ అమ్మాయిల ఆలోచనలు. దీంతో వెనకబడిపోతున్నాం, జీవితంలో ఏదో కోల్పోతున్నామన్న కంగారులో కెరియర్ క్రైసిస్‌కి బల్వుపుటకే గురవుతున్నారట.

దీని బారిన పడొద్దంటే... ప్రమోషన్, జీతం ఇవే గెలుపును సూచించవు. చిన్న చిన్న ఆనందాలకీ చోటిస్తున్నామా అన్నదీ చూసుకోవాలంటారు కెరియర్ నిపుణులు. ఇప్పటికే కొందరు దీన్ని గుర్తించి చిన్న చిన్న విరామాలు ప్లాన్ చేసుకుంటున్నారు. అయితే అది కొద్ది శాతమే. అమ్మానాన్నలు చెప్పారని కోర్సులు ఎంచుకోవడం, మంచి ఉద్యోగమని నచ్చకపోయినా బలవంతంగా కొనసాగడం... ఇలాంటప్పుడూ అనాసక్తి పెరుగుతుంది. అప్పుడు నచ్చిన వేరే కోర్సులు, అంశాలు ప్రయత్నించడం వంటివి సాయపడతాయి. లేదా మెంటార్లు, నిపుణుల సలహాలను తీసుకొని పాటించొచ్చు. ముఖ్యంగా కెరియర్ జీవితంలో ఒక భాగమే. దాన్నో పరుగు పందెంలా భావించొద్దు. పని, వ్యక్తిగత జీవితం రెండింటినీ సమన్వయం చేస్కోవాలి. కుదరకపోతే అవసరమైతే కెరియర్‌ని మార్చుకోవచ్చు. ఒకరు నిలోనే సాగుతూ బాధపడిపోవాల్సిన పని లేదంటున్నారు నిపుణులు. జెన్ జీ అమ్మాయిలూ... మరి గమనించుకుంటారా?

ఉద్యోగం వద్దంటే... ప్రధానితో మాట్లాడా!



చాలామంది మహిళల్లానే అన్నెం లక్ష్మీభవాని కూడా పెళ్లి తరవాత కెరియర్‌కి బ్రేక్ ఇవ్వాల్సి వచ్చింది. అయితే, ఏళ్లు గడిచినా ఆమె లక్ష్యం చెదరకపోవడంతో తిరిగి స్వయం ఉపాధిపై దృష్టి పెట్టారు. ఇప్పుడు తాను నిలదొక్కుకోవడమే కాదు... మరో 15 మందికి ఆర్థిక భరోసా అందిస్తున్నారు. ఈ కృషితోనే ప్రధానితో మాట్లాడే అవకాశాన్నీ దక్కించుకున్నారు.

సరైన అవకాశాలు లభిస్తే.. ఏ రంగంలోనైనా రాణించగలమనడానికి నేనే ఓ ఉదాహరణ. మాది వైఎస్సార్ కడప జిల్లా చింతకొమ్మదిన్నె మండలం సీఎంఆర్ పల్లె. అమ్మానాన్నలు నన్ను డిగ్రీ వరకు చదివించారు. చిన్నప్పటి నుంచి నా కాళ్లపై నేను నిలబడాలనుకునే దాన్ని. పెళ్లయ్యాక అత్తింటి వారు ప్రభుత్వ ఉద్యోగమైతే చేయొచ్చు... ప్రైవేటు కొలువు వద్దనడంతో ఆగిపోయా. తర్వాత ఇద్దరాడపిల్లలు పుట్టడం, వారి ఆలనా పాలనా చూసుకుంటూ పదకొండేళ్లు గృహిణిగానే కాలం గడిచిపోయింది. కానీ, నా మనసుకి ఏదో ఒకటి చేయాలనిపించేది. ఆఖరికి ఓ రోజు ధైర్యం చేసి 'నేనూ ఏదో ఒక పనిచేస్తా. కుటుంబ ఖర్చులకైనా ఉపయోగపడతాయి కదా' అని మావారిని అడగడంతో ఆయన నీ ఇష్టం అన్నారు.

మాస్కులతో మొదలుపెట్టి...

అప్పటికే మెప్మా (పట్టణ పేదరిక నిర్మూలన సంస్థ)లో సాయి హెచ్ఎస్ స్వయం సహాయక సంఘంలో సభ్యురాలిగా ఉన్నా. ఆ సమయంలోనే కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో జ్యూట్ బ్యాగుల తయారీలో 13 రోజులపాటు శిక్షణ, రూ.2 లక్షల ముద్రా రుణం ఇచ్చింది. ఆ మొత్తంతో ఊళ్లో జ్యూట్ బ్యాగుల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశా. అయితే, కొన్నాళ్లకే కరోనా మహమ్మారి విజృంభించడంతో చేస్తున్న పని ఆగిపోయింది. వెంటనే ఆ పరిస్థితిని అర్థం చేసుకుని మాస్కులు కుట్టడం ఆరంభించాం. సుమారు రెండు లక్షలకు పైగా మాస్కులను కుట్టి అమ్మాం. వచ్చిన ఆదాయంతో రుణాన్ని తీర్చేశా. ఈసారి బ్యాంకు రూ.9.5 లక్షల లోన్ ఇచ్చింది. అప్పుడే... కడపలో ప్లాస్టిక్ నిషేధించడంతో ప్రజలు జ్యూట్ బ్యాగుల వైపు ఆకర్షితులయ్యారు. దాంతో దీన్నే వ్యాపారంగా మార్చుకున్నా. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచి 15 మంది మహిళలకు ఉపాధి కల్పించా. అంతేకాదు, ఎప్పటికప్పుడు మారే ఫ్యాషన్లు, మార్కెట్ అవసరాలకు అనుగుణంగా పర్యావరణహిత బ్యాగుల్ని రూపొందిస్తున్నాం. దీంతో తక్కువ సమయంలోనే ఆదరణ లభించింది. దేశవిదేశాల నుంచీ ఆర్డర్లు వస్తున్నాయి. గతేడాది విద్యార్థులకు యూనిఫాంలు కుట్టే పెద్ద అవకాశం అందుకున్నా. ఇందుకోసం కడప కేంద్ర కారాగారం సహకారంతో అక్కడి మహిళా ఖైదీలకూ పని కల్పించా. ఈ ఏడాది అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మెప్మాలో ప్రేరణ సఖి కింద రూ.50 వేల నగదు అవార్డును రాష్ట్ర ప్రభుత్వం అందించింది. ప్రధానమంత్రి ముద్రా యోజన పదో వార్షికోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్రమోదీతో మాట్లాడే అవకాశం దక్కింది.

– శ్రీనివాసులు బోగెం, కడప



చిటపట చినుకుల్లో తడవడం... బురద నీటిలో గంతులేయడం. పారే నీటిలో పడవలు చేసి వదలడం! ఎంత వద్దన్నా చిన్నారులు చేసే పనులే ఇవి. నిజానికి నీటితో తనివితీరా ఆడుకోవచ్చనే ఈ కాలం అంటే తెగ ఇష్టపడతారు కూడా. వర్షా కాలమంటే వానలేనా... వాటితో మోసుకొచ్చే అనారోగ్యాలూ బోలెడు. వాటి బారిన మన పిల్లలు పడొద్దంటే...

వానొచ్చె... పిల్లలు జాగ్రత్త!

● నీళ్లు గుర్తుచేయండి



వాతావరణం చల్లగా ఉంటే మనకే నీళ్ల సంగతి గుర్తుండదు. ఇక పిల్లల మాట వేరే చెప్పాలా? అలాగని అశ్రద్ధ చేయొద్దు. తప్పక తాగించండి. అప్పుడే శరీరంలోని మలినాలు బయటకు పోతాయి. ఈ కాలం నీళ్లే డయేరియా, కలరా వంటి అనారోగ్యాలకు ప్రధాన కారణం. కాబట్టి, శుభ్రమైన వాటికే ప్రాధాన్యమివ్వండి. అవసరమైతే కాచి, వడకట్టి ఇవ్వండి. చలిగా ఉంటే గోరువెచ్చని నీటిని తాగిస్తే ఇంకా మంచిది. గొంతు ఇన్‌ఫెక్షన్లు, జలుబు, దగ్గు వగైరా దరిచేరకుండానూ ఉంటాయి.

● ఏవి వేస్తున్నారు?



చల్లదనానికి పిల్లలు స్నానం చేయనని మారాం చేస్తారు. కానీ రోజూ వేడినీటితో స్నానం తప్పనిసరి. వానలో తడిచినప్పుడూ చేయిస్తే మంచిది. అలాగే శానిటైజర్ దగ్గరుంచైనా చేతులను ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకునేలా చూడాలి. పొడి, శరీరానికి వెచ్చదనాన్ని ఇచ్చే దుస్తులనే వేయండి. ఒకవేళ తడిచినా వెంటనే మార్పించాలి. లేదంటే ఇన్‌ఫెక్షన్లకు దారి తీస్తాయి. చెప్పులు, షూ విషయంలోనూ ఈ జాగ్రత్త తప్పనిసరి. బయటికి వెళ్లేటప్పుడు రెయిన్‌కోట్, గొడుగు వంటివి తప్పనిసరి. మోకాలి వరకూ ఉండే గమ్ బూట్లను వేస్తే మరీ మంచిది.

● సిద్ధమేనా?



జలుబు, దగ్గు, జ్వరం సహా పిల్లల అనారోగ్యాలకు సంబంధించిన అత్యవసర మందులున్నాయా? అప్పటికప్పుడు వెళ్లి తెచ్చుకుంటామన్న ధోరణి ఈ కాలంలో పనికిరాదు. కాబట్టి, కిట్‌ను సిద్ధం చేసుకోండి. ముందుగానే వైద్యులను కలిసి, అత్యవసర వ్యాక్సిన్ల వివరాలు తెలుసుకుని, వేయిస్తే మేలు. ఈ కాలం దోమలు, ఈగల బెడదా ఎక్కువే. ఇవీ అనారోగ్య కారకాలే. కాబట్టి, ఇంటిని ఇన్‌సెక్ట్ ప్రూఫ్ చేసుకోండి. నీళ్లు నిల్వ లేకుండా చూసుకోవడంతోపాటు నేలను తరచూ శుభ్రం చేయడం, కిటికీలకు నెట్ వేయించడం, దోమ తెర సమకూర్చుకోవడం వంటివన్నీ సాయపడేవే. మస్కిటో కాయిల్స్, రెపల్లెంట్స్ వంటివాటికి వీలైనంత దూరంగా ఉంటే మేలు. బదులుగా పొడవు దుస్తులు, వాటికి అతికించే రెపల్లెంట్‌లు వంటివి వాడితే మంచిది.

● ఆహారం జాగ్రత్త!



ఈ కాలం జంక్‌ఫుడ్, బయటి ఆహారాలకు చిన్నారులను దూరంగా ఉంచండి. పొరపాటున పాడైన, నిల్వ ఉన్న ఆహారం తిన్నారంటే అనారోగ్యాల బారిన పడతారు. కాబట్టి, ఇంటి భోజనానికే ప్రాధాన్యమివ్వండి. వేడి వేడి సూపులు, పాలు, పెరుగు, స్మూతీలు వంటివీ ఇవ్వాలి. కాలానికి అనుగుణంగా దొరికే పండ్లు, కాయగూరలను ఎక్కువగా తినిపించండి. ముఖ్యంగా సి విటమిన్ ఎక్కువగా దొరికే నిమ్మ, నారింజ, జామ, క్యారెట్ వంటివాటికి ఎక్కువ ప్రాధాన్యమివ్వండి. ఇవి శరీరానికి కావాల్సిన పోషకాలను అందివ్వడమే కాదు, రోగనిరోధకతను పెంచడంలోనూ సాయపడతాయి.

● ఆడించండి కానీ...



చల్లదనానికి స్తబ్దుగా అనిపిస్తుంది. అలాగని ఊరుకుంటే ఆకలి మందగించడమే కాదు, బద్ధకంగానూ తయారవుతారు. కాబట్టి, వ్యాయామం తప్పనిసరి. ఇంట్లోనే డ్యాన్స్, చిన్న చిన్న వ్యాయామాలు ప్లాన్ చేయండి. ఆటలూ ఆడనివ్వండి. అయితే బయటికే వెళ్లనీయొద్దు. బదులుగా ఇంట్లోనే బోర్డు గేమ్స్, పజిల్స్, క్రాఫ్ట్ వంటివి ఇస్తే మేలు. కథలు, యాక్టివిటీ పుస్తకాలు తెచ్చిస్తే బోర్ కొడుతుందంటూ నస పెట్టరు.

ఎంతైనా పిల్లలు కదా... ఇంట్లో ఉన్నంతసేపు అయిష్టంగానైనా చెప్పినవి చేస్తారు. బయట అడుగు పెడితే మాత్రం షరా మామూలే. నీళ్లు కనిపిస్తే ఆడాలనే చూస్తారు. కానీ ఈకాలం పారేనీరు, తెరిచి ఉంచిన డ్రైనేజీలు... అన్నీ ముప్పు తెచ్చేవే. కాబట్టి, ఆ ప్రమాదాలు, నీటిలో ఆడటం వల్ల కలిగే అనారోగ్యాల గురించి వివరంగా చెప్పండి. ఏదైనా అనుకోనిది జరిగితే ఇంట్లోవాళ్లకి సమాచారం ఇచ్చేలానూ సిద్ధం చేయండి. అప్పుడే వారిని సురక్షితంగా ఉంచగలం. అయితే ఇవి కేవలం పిల్లలకే కాదు, పెద్దవాళ్లూ పాటించగలగాలి. లేదంటే మన నుంచి వాళ్లకి అనారోగ్యాలు సోకొచ్చు. ముఖ్యంగా వాళ్లు మనల్నే అనుసరిస్తారు... అందుకైనా జాగ్రత్తగా ఉండాల్సిందే!

> ఒక మహిళ ల్యాబ్‌లోకి అడుగుపెట్టినా, కంప్యూటర్‌లోకి లాగిన్ అయినా, డేటా సెంటర్‌లోకి ప్రవేశించినా... ఆమె కేవలం ఇంజినీరింగ్ వృత్తిని చేపడుతున్నట్టు కాదు, భవిష్యత్తు రూపురేఖల్ని మార్చుతున్నట్టు. ఒకప్పుడు తమ ఆఫీసులో, విభాగంలో ఒక్కరిగానే ఉన్న మహిళా ఇంజినీర్లు త్వరలో చాలామందిలో ఒకరిగా ఉంటారు. ఇప్పటికే మా సంస్థతోపాటు, టెక్ పరిశ్రమలో 40 శాతం మహిళలు ఉన్నారు. ఇది ఇంకా పెరుగుతుంది. ఇవి గణాంకాలు కాదు, మనం నిర్మించుకుంటున్న భవిష్యత్తు.
>
> – ప్రీతీ సావంత్, వ్యవస్థాపకురాలు, జౌల్స్‌టువాట్స్ బిజినెస్ సొల్యూషన్స్



మీకు తెలుసా?



ఆడ శిశువులతో పోలిస్తే, మగ శిశువులు ఒత్తిడిని ఎక్కువగా తట్టుకోలేరట. ముఖ్యంగా ప్రినేటల్, ప్రసవానంతర కాలాల్లో ఒత్తిడి నియంత్రణకు సంబంధించి మెదడు అభివృద్ధి నెమ్మదిగా ఉండటమే దీనికి కారణమని పరిశోధనలు చెబుతున్నాయి.

అప్పుడే నా శక్తి తెలిసింది..!

ఆసియాలోనే అత్యంత కష్టమైనది 'డీప్ జపాన్ అల్ట్రా 100 మారథాన్' ట్రైల్ రేస్. దీనిలో పాల్గొనేవారు గంటలపాటు విశ్రాంతి, నిద్ర లేకుండా 173 కి.మీ. పరుగెత్తాలి. ఈ క్రమంలో ఏర్పడే భిన్న వాతావరణ పరిస్థితుల్ని తట్టుకోవాలి. 63మంది పాల్గొన్న ఈ పోటీలో 10మంది మహిళలు మాత్రమే దీన్ని పూర్తి చేయగలిగారు. అందులో భారత్‌కు చెందిన అశ్వినీ గణపతి ఒకరు. తన ప్రయాణం ఎలా సాగిందంటే...



బెంగళూరులో పుట్టిపెరిగారు అశ్విని. స్థానికంగానే పాఠశాల విద్యను పూర్తిచేశారీమె. అశ్వినికి చిన్నప్పట్నుంచీ ఆటలంటే ఇష్టం. దాంతో ఫీల్డ్ హాకీతోపాటు ఇతర క్రీడల్లోనూ చురుగ్గా పాల్గొనేవారు. చదువులో భాగంగా కొద్దిరోజులు ఆటలకు బ్రేక్ ఇచ్చారు. తర్వాత టెక్ రంగంలో తొమ్మిదేళ్లు పనిచేశారు. 'ఓసారి మా కంపెనీ రన్నింగ్‌రేస్‌ను పెట్టింది. దాన్లో పాల్గొని అంత దూరం పరుగెత్తినా నాకు అలసటే రాలేదు. అప్పుడే నా శక్తి గురించి నాకు తెలిసింది. ఉద్యోగానికి స్వస్తి చెప్పి ఫొటోగ్రాఫర్‌గా పని చేస్తూ అథ్లెట్‌కి తగినవిధంగా నా జీవనశైలి మార్చుకున్నా. పరుగు ప్రాక్టీస్ చేసేదాన్ని. 2019 కర్ణాటకలో 110కి.మీ. మల్నాడ్ అల్ట్రా మారథాన్‌లో పాల్గొన్నా. ఇదే నా మొదటి మారథాన్. అప్పటి నుంచి అందుకు తగినట్లుగా నా శరీరాన్ని తయారుచేసుకున్నా. ఇందుకోసం ఎక్సర్‌సైజ్‌లు చేసేదాన్ని' అంటారీమె.

డీప్ జపాన్ అల్ట్రా వరకూ...

ఆ తరవాత 160 కి.మీ. మారథాన్‌లో పాల్గొనాలనుకున్నారు అశ్విని. 2022లో '60కి.మీ. ఎవరెస్ట్ మారథాన్‌లో' పాల్గొని 9వ స్థానంలో నిలిచారు. వీటితో పాటు బాలీ అల్ట్రా, సిలబర్ అల్ట్రా మారథాన్‌ల్లోనూ ఆమె పాల్గొన్నారు. ఈ క్రమంలోనే డీప్ జపాన్ అల్ట్రాలో పాల్గొనే అవకాశం వచ్చింది. ఇటీవల జరిగిన ఈ మారథాన్ లక్ష్యం... 46గంటల్లో 173కి.మీ., 9వేల మీటర్ల ఎత్తులో ఉండే మార్గంగుండా పరుగెత్తాలి. ఈ రేస్‌ను అశ్విని 45గం. 42నిమిషాల్లోనే పూర్తి చేసి రన్నరప్‌గా నిలిచారు. 'ఇప్పటి వరకూ నేను చేసిన మారథాన్‌లన్నింటిలోనూ ఇదే అత్యంత కష్టమైనది. దీనికోసం చాలా కష్టపడ్డా. నేను శాకాహారిని కావడంతో వాళ్లు ఇచ్చే ఆహారం నాకు నచ్చేదికాదు. నీళ్లు, ఆహారంతో కలిపి నా బ్యాక్ ప్యాక్ 8కేజీల బరువుండేది. ఈ ప్రయాణంలో రెండురాత్రుళ్లు నిద్ర లేకుండానే పరుగెత్తాను. మధ్యలో కునుకు తీద్దామన్నా సమయం ఉండేది కాదు. దాంతో టైమ్ అంతా రన్నింగ్‌తోనే సరిపోయింది. కానీ గెలిచిన ఆనందం ముందు అవేవీ కష్టంగా అనిపించలేదు' అంటారు అశ్విని.

పదే పదే కాల్స్ వస్తున్నాయ్...

ఎమ్ఎన్‌సీ కంపెనీలో అసిస్టెంట్ మేనేజర్ని. చాలా త్వరగా ఈ స్థానానికి వచ్చా. నా ఇబ్బందంతా ఇంటికి వచ్చాకే. ఆఫీస్‌కు సంబంధించిన కాల్ వస్తుందంటేనే భయం వేస్తోంది. వేరే ఎవరూ ఉద్యోగాలు చేయట్లేదా? నీకే ఎందుకు పదే పదే కాల్స్ వస్తున్నాయి అంటున్నారు ఇంట్లోవాళ్లు. ఆఫీస్‌లో చెబుదామంటే ఏమనుకుంటారో అన్న భయం. ఏం చేయాలి? – ఓ సోదరి

మీరు కెరియర్లో ఉన్నత స్థాయికి వేగంగా చేరుకోవటానికి ఒక కారణం... పని గంటల తర్వాత కూడా అందుబాటులో ఉండటం కావచ్చు. అలా అని ఆఫీస్ వేళల తర్వాత కూడా పైవాళ్లు మీరు పని చేయాలని ఆశించడం న్యాయం కాదు. అయితే, ఈ రెండింటినీ బ్యాలెన్స్ చేసుకోవటం, హద్దులు ఏర్పాటుచేసుకోవటం వంటివి మీరు తెలుసుకోవాలి. ఓసారి మీ కార్యాలయ సంస్కృతిని పరిశీలించండి. అందరూ ఇలానే అందుబాటులో ఉంటున్నారా? అలా ఉండని వారి ఎదుగుదల ఎలా ఉంది? వంటివి గమనించండి. అందుబాటులో లేకున్నా మీ బాస్‌లు అంగీకరిస్తున్నట్లయితే దాని గురించి మరింత ధైర్యంగా ఉండొచ్చు. అయితే, అందుబాటులో ఉండటం, ఉండకపోవటం అనేది మీరు చేస్తోన్న ప్రాజెక్ట్ మీదా ఆధారపడి ఉంటుంది. కొన్నిసార్లు కచ్చితంగా కాల్స్‌కి అందుబాటులో ఉండాల్సి వస్తుంది. మీ కుటుంబ సభ్యులతో మీ పరిస్థితి గురించి స్పష్టంగా వివరించండి. మీరేమీ సమయాన్ని వృథా చేసుకోవట్లేదు. మీ ఉద్యోగ అవసరాలకు తగినట్లుగా పనిచేస్తున్నారు అంతే. అలానే, చాలా కంపెనీలు ఉద్యోగుల జీవిత సమతుల్యతను గౌరవిస్తాయి. పని వేళల తర్వాత ఉద్యోగులకు అంతరాయం కలిగించవు. కాబట్టి, అవసరాన్ని బట్టి, అందుబాటులో ఉండాలా.. వద్దా అనేది మీరే ఎప్పటికప్పుడు నిర్ణయించుకోండి.

డియర్ వసుంధర



కవితా గూడపాటి
ఆర్గనైజేషనల్ సైకాలజిస్ట్

బంగారం - వెండి



22న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,03,600	93,250	1,18,470
విజయవాడ	99,490	92,850	1,17,500
ప్రొద్దుటూరు	99,200	91,260	1,16,500
రాజమహేంద్రవరం	1,01,290	92,850	1,28,000
విశాఖపట్నం	1,00,930	92,850	1,20,000
తమిళనాడు	-----	92,850	1,28,000

శోధిత

తీపితో చిక్కులే!

తీపంటే ఇష్టపడని పిల్లలు ఉండరేమో కదా! అయితే, అదే ఆడపిల్లల పాలిట శాపంగానూ మారుతోందట. స్వీటెనర్లు వాడిన ఆహార పదార్థాలు, బెవరేజస్... వంటివి తీసుకోవటం, అమ్మాయిల్లో ముందస్తు రజస్వలకు కారణమవుతోందట. 'ది ఎండోక్రైన్ సొసైటీ' తాజా అధ్యయనాలు ఈ విషయాలు వెల్లడిస్తున్నాయి. ఈ పరిశోధన కోసం శాస్త్రవేత్తలు వెయ్యిమందికి పైగా టీనేజ్ పిల్లలను భిన్న అంశాల్లో పరిశీలించారు. వారి ఆహార అలవాట్లు తెలుసుకున్నారు. జెనెటిక్ రిస్కనూ, హార్మోన్ల స్థాయులనూ పరీక్షించారు. అయితే, స్వీటెనర్లు ఉన్న ఆహారం తిన్నవారిలో... హార్మోనుల్లో మార్పులతోపాటు, గట్ బ్యాక్టీరియాలో అసమతౌల్యత ఏర్పడినట్లు గమనించారు. దీర్ఘకాలంలో వాళ్లు ఎమోషనల్ స్ట్రెస్, మెటబాలిక్ డిజార్డర్లు, ఎత్తు పెరగకపోవటం, సంతానోత్పత్తి సమస్యల వంటివీ ఎదుర్కొంటున్నట్లు గుర్తించారు. కాబట్టి, పిల్లల్లో జెనెటిక్ రిస్కుల వంటివి ఏమైనా ఉన్నాయేమో ముందుగానే పరీక్షించాలనీ, స్వీటెనర్లు వాడిన ఆహారాన్ని తగ్గించాలనీ సూచిస్తున్నారు పరిశోధకులు. పిల్లల ఆహారపు అలవాట్లపై దృష్టి పెట్టడం ద్వారా వారిలో ఈ ముందస్తు రజస్వల సమస్య రాకుండా చూడొచ్చనీ, తద్వారా అనేక అనారోగ్య సమస్యలకు చెక్ పెట్టొచ్చనీ చెబుతున్నారు.

కూరగాయలకీ ఓ ట్రాలీ!

స్మార్ట్ కిచెన్

ప్రస్తుత జీవనశైలిని బట్టి... శ్రమ, సమయాన్ని తగ్గించే ఏ వస్తువైనా మనకు ఉపయోగపడేదే. అలాంటి వాటిల్లో ఇవీ కొన్ని... ఓ లుక్కేయండి.





వేగంగా కత్తిరించాలంటే...


కూరగాయల్లాంటి వాటిని కత్తిరించేందుకు చాకు ఉపయోగపడినా.... కొత్తిమీర, పుదీనా, ఉల్లి కాడల్లాంటివి కట్ చేయటానికి అంత అనువుగా ఉండదు. ప్రత్యేకించి వాటికోసమే తయారైంది ఈ 'స్టీల్ సిజర్స్'. దీన్లో ఉండే 5బ్లేడుల సాయంతో వేగంగా పని పూర్తవుతుంది. క్లీనింగ్ కోంబ్ సాయంతో దీన్ని శుభ్రపరచుకోవటమూ తేలికే.






బరువు మోయకుండా...

మార్కెట్‌కి వెళ్లి కావాల్సిన సరకులు తీసుకుంటాం. కానీ, వాటిని మోసుకురావాలంటేనే శ్రమ. చేతిసంచులు, కవర్లు... వేళ్లు గుంజుతుంటాయి. ఇక దానికి తోడు పక్కన పిల్లలుంటే చెప్పక్కర్లేదు. ఆ ఇబ్బందిలేకుండా చేస్తుంది ఈ పోర్టబుల్ షాపింగ్ ట్రాలీ. దీన్ని హ్యాండ్‌బ్యాగ్‌లా చేతికి తగిలించుకోవచ్చు. సరకులు తీసుకున్న తర్వాత దానికున్న హ్యాండిల్ పైకి లాగి ట్రాలీలానూ ఉపయోగించుకోవచ్చు. రద్దీ ప్రాంతాల్లో తేలిగ్గా లాక్కెళ్లొచ్చు. వాటర్‌ప్రూఫ్ కాబట్టి, తడుస్తుందన్న భయమూ లేదు. బావుంది కదా!




వృథా అరికట్టేలా...

ఒక్కోసారి పండ్లు, కూరగాయల్లాంటివి ఎక్కువగా మిగిలిపోతుంటాయి. ఒకేసారి తినలేం, అలా అని ఫ్రిజ్‌లో ఉంచినా తినే సమయానికి పాడైపోతుంటాయి. ఆ వృథాని అరికట్టేందుకు ఉపయోగపడుతుంది ఈ డీహైడ్రేషన్ మెషీన్. దీన్లో ఐదు రిమూవబుల్ ట్రేలు ఉంటాయి. ఒక్కోదాన్లో ఒక్కో ఆహార పదార్థాన్ని ఉంచి డ్రై చేసుకోవచ్చు. ఉష్ణోగ్రతను కావాల్సినట్లు సెట్ చేసుకునే వెసులుబాటూ ఉంటుంది. కావాల్సినప్పుడు ఆ ఆహారాన్ని తీసుకుని ఉపయోగించుకోవచ్చు.



ఫూల్ మఖానాలో పోషకాలెన్నో!



కాలక్షేపానికి పాప్‌కార్న్ తినడం తెలిసిందే... కానీ, ఇప్పుడు తామర గింజలతో చేసిన చిరుతిండిదే హవా. ఫూల్ మఖానా, ఫాక్స్ నట్స్‌గా పిలిచే ఇది... పిల్లల చిరుతిళ్లలోనూ భాగమయ్యాక ఉప్పు, కారం, పుదీనా, టొమాటో, ఉల్లి, మసాలా వంటి ఎన్నెన్నో రుచుల్లో ఆకట్టుకుంటోంది. ఫూల్ మఖానాని పోషకశక్తికి కేంద్రంగా చెబుతున్నాయి మన ఆయుర్వేద గ్రంథాలు. దశాబ్దాల సాగు చరిత్ర కలిగిన ఇవి పోషకాహారలేమిని దూరం చేయడంతో పాటు బరువుని నియంత్రిస్తాయి. ముఖ్యంగా ఈ ఫాక్స్ నట్స్ ప్రొటీన్, ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్లకు గొప్ప వనరు. ఇందులో సహజంగానే క్యాలరీలు, కొవ్వు తక్కువగా ఉండటంతో... ఊబకాయం తగ్గించడంలో, జీర్ణక్రియలు మెరుగ్గా పని చేయడంలో సాయపడతాయి. కొలెస్ట్రాల్‌ని అదుపు చేసి గుండె ఆరోగ్యాన్నీ కాపాడతాయి. కాల్షియం ఎముకలూ, దంతాల్నీ దృఢంగా మారుస్తుంది. కీళ్లనొప్పుల్నీ తగ్గిస్తుంది. ఇందులోని బీ విటమిన్ మెదడుని చురుగ్గా ఉంచుతుంది. ఫూల్ మఖానాని నెయ్యిలో వేయించుకుని తిన్నా, స్నాక్స్‌గా వాడినా సరే... రుచిలో మాత్రం మేటిగా ఉంటాయివి.

పెళ్లి పేరుతో గిల్లేస్తారు!

హైదరాబాద్‌కు చెందిన ఓ యువకుడు మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లు, యాప్‌లలో ఫేక్ ప్రొఫైళ్లు ఉంచేవాడు. సంప్రదించిన వారిని మాయమాటలతో బుట్టలో వేసి అందిన కాడికి గుంజేవాడు. ఓ కుటుంబం అతడి మాయలో పడి రూ.20 లక్షలు పోగొట్టుకుంది. పోలీసుల విచారణలో అతడికి అప్పటికే వివాహమై ఇద్దరు పిల్లలున్నట్టు తేలింది.

భార్య చనిపోవడంతో రెండో వివాహం చేసుకోవాలని విశాఖకు చెందిన ఓ ప్రభుత్వ ఉద్యోగి సిద్ధమయ్యారు. పెళ్లిళ్ల పేరయ్య ద్వారా ఓ మహిళను సంప్రదించారు. ఇద్దరి మధ్యా చనువు పెరిగింది. ఒక రోజు మా నాన్నకు అనారోగ్యమని ఆమె నుంచి ఫోన్ కాల్. ముందూవెనకా ఆలోచించకుండా రూ.15 లక్షలు ఆమె చెప్పిన ఎకౌంట్లకు పంపారు. మరుక్షణం నుంచి ఆమె, పెళ్లిళ్ల పేరయ్య ఫోన్లు స్విచ్ఛాఫ్.

వంద అబద్ధాలాడైనా ఓ పెళ్లి చేయమంటారు పెద్దలు. కానీ కొందరు మోసగాళ్లు 'నూరేళ్ల పంట'ను జీవితకాల చేదు అనుభవంగా మారుస్తున్నారు. ఫేక్ ప్రొఫైళ్లతో బురిడీ కొట్టిస్తున్నారు. మోసపోయిన వారిలో చాలామంది బయట తెలిస్తే పరువు పోతుందనే భయంతో పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. ఇంకొందరైతే వ్యవస్థీకృత ముఠాలుగా ఏర్పడి ఈ తరహా మోసాలకు పాల్పడుతున్నారు.



తస్మాత్ జాగ్రత్త...

- విశ్వసనీయత ఉన్న మ్యాట్రిమోనీ వెబ్‌సైట్లు, యాప్‌లనే ఎంచుకోవాలి.
- మధ్యవర్తులు చెప్పే మాటలు, చూపించే ఫొటోలను విచారించకుండా నమ్మొద్దు
- ప్రొఫైల్ సరైనదా? కాదా? అని తనిఖీ చేసుకోవాలి. ఆ వ్యక్తి పని చేసే చోట, నివసించేచోట సమాచారం సేకరించాలి
- పెళ్లి నిశ్చయమైంది కదా విహారయాత్రలకు వెళదాం, ఏకాంతంగా కలుద్దామంటే వద్దని చెప్పండి.
- ఫొటోలు, ఫోన్ నంబర్లు, వ్యక్తిగత సమాచారాన్ని వీలైనంత వరకు షేర్ చేసుకోవద్దు
- వేధింపులు, బెదిరింపులకు పాల్పడితే తక్షణం పోలీసుల్ని సంప్రదించండి
- పెళ్లికి సంబంధించిన నిర్ణయాలను ఒంటరిగా కాకుండా కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, ఆత్మీయులను సంప్రదించి తీసుకోవాలి
- వ్యక్తిగత, వృత్తిగత విషయాలు, అభిరుచుల గురించి వీలైనన్ని ప్రశ్నలు వేయడం ద్వారా మరింత సమాచారం తెలుసుకోవచ్చు
- ఆర్థిక లావాదేవీలు ఎట్టి పరిస్థితుల్లోనూ వద్దు. అవతలి వ్యక్తి డబ్బులు అడిగితే అనుమానించాల్సిందే.



రకరకాలు...

1 పెళ్లి సంబంధాల కోసం వెతికి వేసారిన వారు, జీవిత భాగస్వామిని కోల్పోయిన వారు, తోడు కోరుకుంటున్న ఒంటరి వృద్ధులు మోసగాళ్లకు లక్ష్యమవుతున్నారు. వారికి తగ్గట్టు ఫేక్ ప్రొఫైళ్లు రూపొందించి కొన్ని మ్యాట్రిమోనీ సైట్లు, యాప్‌లలో ఉంచుతారు. ముందుగా వీళ్లే వారిని సంప్రదిస్తారు. మాయమాటలతో ఉచ్చులోకి లాగుతారు. పరిచయ కార్యక్రమాలకు నకిలీ బంధుమిత్రులను తీసుకొస్తారు. పెళ్లి నిశ్చయమయ్యాక షాపింగ్‌లు, వివాహ ఖర్చులు, పెట్టుపోతలంటూ అందినకాడికి దండుకుంటారు.

2 "పేదింటి అమ్మాయి..అమ్మానాన్న చిన్నప్పుడే చనిపోయారు. కట్నకానుకలు ఇచ్చుకోలేరు. లాంఛనాలు, ఖర్చులు అన్నీ మీరే భరించాలి" అంటూ సానుభూతి వచనాలతో బుట్టలో పడేస్తారు. ఎదురుకట్నం డిమాండ్ చేస్తారు. వధువు అన్నావదిన, అక్కాబావ, పిన్నీబాబాయ్ అంటూ పరిచయం చేసుకొనే వాళ్లంతా నటులే. పెళ్లయిన వారం, పది రోజుల్లోనే వధువు సహా అందరూ పత్తా లేకుండా జారుకుంటారు.

3 వివాహమై పిల్లలున్న మహిళల్ని పెళ్లి కాని అమ్మాయిలుగా నమ్మిస్తారు. వధువు కుటుంబ ఆర్థిక పరిస్థితి బాగలేదని, పెళ్లిఖర్చులు.. అదీఇదీ అంటూ వరుడి నుంచి ముందుగానే రూ.లక్షల్లో గుంజుతారు. సదరు వధువుకు ఇన్ని రోజులకని ప్యాకేజీ నిర్ణయిస్తున్నారు. అన్ని రోజులు మాత్రమే ఆమె వరుడితో ఉండి తర్వాత జారుకుంటుంది. కర్ణాటకలో స్థిరపడ్డ తెలుగు కుటుంబాన్ని విజయవాడకు చెందిన ఓ ముఠా ఇలాగే మోసం చేసింది.

- ఈనాడు, అమరావతి



కార్ల టవర్ తిప్పుకోలేం నజర్

బెంగళూరు శివారు యలహంకలో 120 అడుగుల ఎత్తుతో వింటేజ్ కార్ టవర్ ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తోంది. బెంగళూరు నగర పాలక సంస్థ అక్కడి పార్కులో ఈ టవర్‌ను తీర్చిదిద్దింది. తొమ్మిది వింటేజ్ కార్లను ఒకదానిపై ఒకటి అమర్చి టవర్‌గా మార్చారు. 1940 నుంచి 1980 వరకు ఉన్న మెర్సిడెస్ బెంజ్ సహా వివిధ కంపెనీల కార్లను ఇందులో అమర్చారు.

– ఈనాడు, హైదరాబాద్


పక్షిలా ఎగురుతున్నా.. అవంటే భయమే

- లోహ విహంగాలకు పక్షి గండం
- ప్రధాన విమానాశ్రయాల్లో పెరుగుతున్న సంచారం

ఈనాడు, హైదరాబాద్: విమాన రాకపోకలకు సాంకేతిక ఇబ్బందులే కాదు పక్షులు కూడా ఆటంకంగా మారుతున్నాయి. ప్రధానంగా మెట్రో నగరాల్లోని ఎయిర్‌పోర్టుల్లో అవి విమానాలను ఢీకొడుతున్నాయి. గత నెల 12న అహ్మదాబాద్‌లో జరిగిన ఘోర విమాన ప్రమాదం అనంతరం పౌరవిమానయాన శాఖ ఉన్నతాధికారులు భద్రతపై సమీక్ష నిర్వహించగా.. దేశంలోని 20 విమానాశ్రయాల్లో ఈ ఏడాది జనవరి నుంచి మే నెలాఖరు వరకు పక్షులు, జంతువులు ఢీకొట్టిన కారణంగా 641 విమానాల రాకపోకలకు అంతరాయం కలిగిందని తేలింది. దిల్లీలో పక్షులు ఢీకొనడంతో అత్యధికంగా 95 సార్లు వేర్వేరు గమ్యస్థానాలకు వెళ్లాల్సిన విమానాలు ఇబ్బందులు ఎదుర్కొన్నాయి. ఈనేపథ్యంలో అత్యాధునిక సమాచార, సాంకేతిక పరిజ్ఞానంతో ఈ సమస్యను అధిగమించాలని పౌరవిమానయాన డైరెక్టర్ జనరల్ కార్యాలయం మెట్రో, ఇతర నగరాల అధికారులకు ఆదేశాలు జారీ చేసింది.

ఆహారం కోసం రన్‌వే పైకి..

విమానాశ్రయాల్లో వాయు, ఇతర కాలుష్య నియంత్రణ చర్యలు చేపట్టాలని కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ ఆదేశాలు జారీ చేసింది. దీంతో విమానాశ్రయ అధికారులు జలవనరులు, మొక్కలు పెంచడం ప్రారంభించారు. ఎయిర్‌పోర్టుల్లో పక్షులు రాకుండా ఉండేందుకు నిర్వాహకులు ప్రత్యేకమైన మొక్కలు, పూలను పెంచుతున్నారు. మొక్కలు పెద్దవయ్యాకె దిల్లీ, ముంబయి, బెంగళూరు, హైదరాబాద్ విమానాశ్రయాల్లో పక్షుల రాకపోకలు పెరుగుతున్నాయి. ఇవన్నీ ఆహారం కోసం విమానాశ్రయం రన్‌వేలపైకి వస్తున్నాయి. విమానాలను ఢీకొడుతున్న పావురాలు, పిచ్చుకలు, గబ్బిలాలను చెదరగొట్టేందుకు దిల్లీ, హైదరాబాద్ విమానాశ్రయాల్లో విమానాలు టేకాఫ్ అయ్యే ముందు భారీ శబ్దాలను చేస్తున్నారు. వాటిని గుర్తించేందుకు అత్యాధునిక బైనాక్యులర్లను ఏర్పాటు చేశారు. ఇంకా బ్యాక్ లైట్ ట్రాప్ పరిజ్ఞానాన్ని వాడుతున్నారు. గబ్బిలాలను గుర్తించే పరికరాలనూ అందుబాటులోకి తీసుకువచ్చారు. వీటన్నింటినీ ప్రయోగిస్తున్నా పక్షుల దాడులు ఆగడం లేదు. హైదరాబాద్ విమానాశ్రయంలో ఆదివారం బ్యాంకాక్ నుంచి హైదరాబాద్‌కు వస్తున్న విమానం ల్యాండింగ్ అయ్యే సమయంలో ఓ పక్షి ఢీకొంది. పైలట్ అప్రమత్తమై సురక్షితంగా రన్‌వేపై దించారు.



మెట్రో నగరాల్లో పక్షులతో అంతరాయాలు

విమానాశ్రయం	2023	2024	2025 (మే వరకు)
దిల్లీ	398	419	95
ముంబయి	190	200	71
బెంగళూరు	149	182	74
కోల్‌కతా	135	120	50
హైదరాబాద్	136	143	49
చెన్నై	111	104	38

నల్లమల రాజసం..



నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌రేంజ్ పరిధిలో 36 వేల హెక్టార్లలో నల్లమల అటవీ ప్రాంతం విస్తరించి ఉంది. ఇందులో అధికభాగం అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ పరిధిలోకి వస్తుంది. ఈ ప్రాంతంలో 5 నుంచి 7 పులులు ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. వాటి సంచారాన్ని గుర్తించేందుకు అటవీశాఖ పలుచోట్ల ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేయగా.. అంకిల్‌పెంట సెక్షన్‌లో ఇటీవల ఓ పెద్దపులి సంచారం, నీరు తాగుతున్న దృశ్యాలు ఇలా రికార్డయ్యాయి. – న్యూస్‌టుడే, కొల్లాపూర్

హ్యాకర్ల దెబ్బకు 158 ఏళ్ల కంపెనీ మూత



ఒక్క చిన్న చిల్లు భారీ ఓడను ముంచేస్తుంది. అలాగే ఒక్క తప్పు బ్రిటన్‌లోని 158 ఏళ్ల కంపెనీని నిట్టనిలువునా ముంచి.. 700 మంది ఉద్యోగులు వీధిన పడేలా చేసింది. రవాణారంగంలో సుదీర్ఘకాలంగా వ్యాపారం చేస్తున్న కేఎన్‌పీ లాజిస్టిక్స్ కంపెనీ దాదాపు 500 ట్రక్కులను 'ది నైట్స్ ఆఫ్ ఓల్డ్' బ్రాండు కింద నడుపుతోంది. పరిశ్రమకు సంబంధించిన ప్రమాణాలను కచ్చితంగా పాటించే ఈ సంస్థ సైబర్ ఎటాక్ బీమా కూడా తీసుకొంది. అయినా.. అకిర గ్యాంగ్ హ్యాకర్ల రాన్సమ్‌వేర్ బారినపడి విలవిల్లాడింది. ఈ ముఠా కేఎన్‌పీ సిస్టమ్స్‌లోకి దొంగచాటుగా చొరబడి, అక్కడున్న డేటాను ఎన్‌క్రిప్ట్ ఫార్మాట్‌లోకి మార్చేసి.. ఉద్యోగులకు దాని యాక్సెస్ లేకుండా చేసింది. తిరిగి డేటాను పొందాలంటే కొంత మొత్తం (సుమారు రూ.58 కోట్లు) చెల్లించాలని డిమాండ్ చేసింది. కేఎన్‌పీ అంత మొత్తం చెల్లించలేని పరిస్థితిలో ఉండటంతో డేటా మొత్తం కోల్పోయి కంపెనీ మూతపడింది. గతంలో బ్రిటన్‌కు చెందిన ఎం అండ్ ఎస్, కో-ఆప్, హారోడ్స్ కూడా ఇటువంటి సైబర్ దాడులకు గురయ్యాయి. – ఇంటర్నెట్ డెస్క్

వేల ఏళ్ల క్రితమే రాయచూరులో జనావాసాలు!

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: కర్ణాటకలోని రాయచూరు జిల్లాలో చారిత్రక మస్కి సమీపంలో పురావస్తు పరిశోధకులు చేస్తున్న తవ్వకాల్లో నాలుగు వేల ఏళ్ల పూర్వపు జనావాసాలను గుర్తించారు. భారతీయ అధ్యయనకారులతో పాటు అమెరికా, కెనడా దేశాల నుంచి వచ్చిన 20 మందికి పైగా పరిశోధకులు తవ్వకాల్లో పాల్గొన్నారు. కొన్ని దశాబ్దాల కిందటే మస్కిలో మౌర్య సామ్రాజ్యానికి చెందిన అశోక చక్రవర్తి శాసనం గుర్తించడం తెలిసిందే. తాజా తవ్వకాల్లో వేల ఏళ్ల క్రితం నాటి ప్రజలు వినియోగించిన వివిధ కళాకృతులు, మట్టి పెంకులు, రాతి ఆయుధాలు, వంట సామగ్రి లభించాయని ఈ తవ్వకాలకు నేతృత్వం వహించిన దిల్లీకి చెందిన నిపుణుడు శివ్ నాడార్ వివరించారు. అమెరికాలోని స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు డాక్టర్ ఆండ్రూ ఎం. బాయర్, కెనడాలోని మెక్‌గిల్ విశ్వవిద్యాలయ ఆచార్యుడు డాక్టర్ పీటర్ జోహాన్సెన్ మూడు నెలలుగా మస్కిలో ఉంటూ ఈ తవ్వకాలు చేపట్టారు. మస్కిలో సుమారు 271 కేంద్రాలను గుర్తించారు. మల్లికార్జున బెట్ట, దేవాలయం చుట్టుపక్కల ప్రదేశాల్లో క్రీస్తుపూర్వం 14 నుంచి 11వ శతాబ్దాల మధ్య మానవులు నివసించారనేందుకు ఆధారాలు లభించాయని వారు తెలిపారు.



మస్కిలో తవ్వకాలు జరుపుతున్న పరిశోధకులు

భరణం కింద బీఎండబ్ల్యూ కారు!

మహిళ డిమాండుపై సీజేఐ విస్మయం

ఇంటర్నెట్ డెస్క్: విడాకులు పొందేందుకు ఓ మహిళ భరణం కింద రూ.12 కోట్లు, ముంబయిలో ఇల్లు, బీఎండబ్ల్యూ కారు కోరడంతో సుప్రీంకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. ఉన్నత చదువులు చదివి, సొంతంగా సంపాదించుకునే సామర్థ్యం ఉన్నప్పటికీ ఇంత పెద్ద మొత్తంలో భరణం అడగటం సరికాదని కేసును విచారించిన సీజేఐ జస్టిస్ గవాయ్ ఆ మహిళకు సూచించారు. 'నా భర్త ధనవంతుడు. నేను మానసిక సమస్యలతో బాధపడుతున్నా. అతడే నాకు విడాకులు ఇవ్వడానికి నిర్ణయించుకున్నాడు. వైద్యం కోసం ఎక్కువ ఖర్చు అవుతుందనే అంత భరణం అడుగుతున్నా" అని ఆమె వివరించింది. బిడ్డను కూడా తనకు ఇవ్వట్లేదని ఆవేదన వ్యక్తం చేసింది. భర్త సూచనతో పెళ్లి సమయానికి ఉద్యోగం మానేశానని పేర్కొంది. వాదనలు విన్న సీజేఐ.. భరణంగా భర్త నుంచి ముంబయిలో ఇల్లు, రూ.4 కోట్ల నగదు ఇప్పిస్తామని.. ఉద్యోగం చేసుకోవాలని మహిళకు సూచించారు. ఆర్డర్‌ను రిజర్వు చేశారు.

ప్రియుడితోనే కలిసి జీవించు

భార్యకు రాతపూర్వక అనుమతి ఇచ్చిన భర్త

సిద్ధార్థ్‌నగర్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని కేరి జిల్లా పర్సాముర్తా గ్రామానికి చెందిన రామ్‌చరణ్(47)కు జానకీదేవి(40)తో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. రామ్‌చరణ్ ముంబయిలో టైల్స్ కార్మికుడిగా పని చేస్తున్నాడు. జానకి ఇంటి వద్దే ఉంటూ పిల్లల్ని చూసుకునేది. నాలుగేళ్ల క్రితం జానకికి సమీప గ్రామంలో ఉండే దినసరి కూలీ సోను ప్రజాపతి(24)తో వివాహేతర సంబంధం ఏర్పడింది. ఏడు నెలలు వారిద్దరూ ఒకే ఇంట్లోనే ఉన్నారు. విషయం తెలుసుకున్న రామ్‌చరణ్ భార్యని నిలదీయగా క్షమాపణ చెప్పి, కొంతకాలం భర్తతో కలిసి ఉంది. కొన్ని నెలల తర్వాత జానకి మళ్లీ తన ప్రియుడి దగ్గరికే వెళ్లింది. దీంతో ఆమె జానకి కనిపించడం లేదని భవానీగంజ్ ఠాణాలో ఆమె భర్త ఫిర్యాదుచేశాడు. ఈ నెల 20న ఆ ఫిర్యాదు వెనక్కి తీసుకున్నాడు. తన భార్య ప్రియుడు సోనుతో ఉండటం ఇష్టమేనని, ఇకపై ఆమెతో తనకు ఎలాంటి సంబంధం లేదని రాతపూర్వక ఒప్పంద పత్రాన్ని ఠాణాలో సమర్పించాడు. "గతంలో ఇలాగే చేసి తిరిగి వస్తే క్షమించాను. ఇప్పుడు నన్ను ఏమైనా చేస్తుందని భయంగా ఉంది. తనతో నేను కలిసి ఉండలేను" అని రామ్‌చరణ్ స్పష్టంచేశారు.

చేప గుట్టు.. తేల్చాలని పట్టు!




చెన్నై, న్యూస్‌టుడే: చేపల ఉత్పత్తి సామర్థ్యం, వాటి పెంపక విధానాలను మెరుగుపరచడానికి చెన్నైలోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ బ్రాకిష్‌వాటర్ ఆక్వా కల్చర్ (సీఐబీఏ) పరిశోధకులు గోల్డ్‌లైన్డ్ సీబ్రీమ్ అనే చేప జన్యువులను విశ్లేషించారు. ఉప్పు, మంచి నీటి వనరుల్లో పెరగగలిగే ఈ చేపను తమిళంలో 'మత్తివాయన్' అని అంటారు. చేపల్లో సంతానోత్పత్తి, పర్యావరణ మార్పులకు వాటి స్పందనలు తెలుసుకునేందుకు ఈ జన్యు విశ్లేషణ దోహదపడుతుందని శాస్త్రవేత్తలు తెలిపారు. ముఖ్య శాస్త్రవేత్త ఎం.ఎస్.శేఖర్ నాయకత్వంలో వినయ్‌కుమార్, అశోక్‌కుమార్ జంగం, రేమండ్, కుల్దీప్ కె.లాల్ పరిశోధనలో పాలుపంచుకున్నారు.

1000 ఏళ్ల చోళ రాజధాని

భారతీయ బాబిలోనియన్‌గా పేర్కొన్న చరిత్రకారులు

నేటి నుంచి 5 రోజుల పాటు వేడుకలు

చోళ సామ్రాజ్యం.. ప్రాచీన భారతదేశంలోని గొప్ప సామ్రాజ్యాల్లో ఒకటి.. దీని రాజధాని గంగైకొండ చోళపురం. తమిళనాడులోని అరియలూరు జిల్లాలో కొల్లిడం నదీ తీరాన ఉంది. ఈ నగరాన్ని భారతీయ బాబిలోనియన్‌గా చరిత్రకారులు ప్రస్తావిస్తారు. క్రీ.శ. 1025లో రాజేంద్ర చోళరాజు-1 నిర్మించిన ఈ నగరానికి ఇప్పుడు వెయ్యేళ్లు. ఈ సందర్భంగా అక్కడ ఈ నెల 23 నుంచి 27 వరకు ప్రత్యేక వేడుకల్ని నిర్వహించనున్నారు. వాటిలో పాల్గొనేందుకు ప్రధాని నరేంద్రమోదీ ఈ నెల 27న ఈ పురాతన రాజధానికి రానున్నట్లు గంగైకొండ చోళపురం అభివృద్ధి మండలి ట్రస్ట్ సభ్యులు తెలిపారు. వాస్తవానికి చోళుల రాజధాని తంజావూరు. రాజరాజ చోళుడు-1 (పరిపాలనా కాలం క్రీశ 985-1014) తర్వాత ఆయన కుమారుడు రాజేంద్ర చోళరాజు-1 (క్రీశ 1014-1044) సామ్రాజ్యాన్ని విస్తరించాలని భావించారు. భారీఎత్తున సైన్యాన్ని నియమించుకొని తంజావూరుకు 50 కిలోమీటర్ల దూరంలోని గంగైకొండ చోళపురంలో శిక్షణ ఇచ్చారు. తర్వాత ఉత్తరాది ప్రాంతాలపై దండయాత్రకు సిద్ధమయ్యారు. మార్గంలోని కళింగ, పాల సామ్రాజ్యాలను ఓడించారు. ఓడిన రాజులతో గంగాజలాలను మోయించి తెచ్చి గంగైకొండ చోళపురంలోని 'చోళ గంగం' చెరువులో కలిపారని చెబుతారు. ఈ విజయానికి గుర్తుగా రాజేంద్ర చోళరాజు-1 అదే ప్రాంతాన్ని రాజధానిగా ఎంచుకున్నారు. తంజావూరులో తన తండ్రి హయాంలో నిర్మించిన బృహదీశ్వర ఆలయాన్ని పోలిన మరో శివాలయాన్ని, కోటను ఇక్కడ నిర్మించారు. వాటి నిర్మాణాల్లో గంగాజలాల్ని వాడినట్లు చరిత్రకారులు చెబుతారు. ఈ ప్రాంతాన్ని రాజధానిగా చేసుకుని చోళరాజులు 256 ఏళ్ల పాటు తుంగభద్ర నుంచి ఆంధ్రా సహా దక్షిణ భారతదేశంలోని చాలా ప్రాంతాలను పాలించారు. 11-12 శతాబ్దాల్లో గంగైకొండ చోళపురం గొప్ప రాజధానిగా ఎదిగింది. రాజకీయంగా, వాణిజ్యపరంగా, సాంస్కృతికపరంగా పేరుగాంచింది. – ఈనాడు,చెన్నై



గంగైకొండ చోళపురంలో బృహదీశ్వర ఆలయాన్ని తలపించే శివాలయం

- 13వ శతాబ్దంలో పాండ్యరాజుల ప్రాబల్యంతో చోళసామ్రాజ్యానికి ముగింపు పడింది.
- గంగైకొండ చోళపురం చరిత్ర, విశిష్టతలను గుర్తించిన యునెస్కో ఈ ప్రాంతాన్ని వారసత్వ సంపదగా ప్రకటించి పరిరక్షిస్తోంది.
- ఆనాటి ఆనవాళ్లలో ఆలయం ఒకటే మిగిలింది. ఈ ప్రాంగణంలోనే వెయ్యేళ్ల వేడుక నిర్వహించనున్నారు.

బాహుబలి బొప్పాయి



సాధారణంగా బొప్పాయి చెట్టు 20 అడుగుల వరకు పెరుగుతుంది. కానీ అనంతపురం జిల్లా కళ్యాణదుర్గం మండలం మాదిరెడ్డిపల్లిలోని రమేష్ అనే రైతు ఇంటి ఆవరణలో ఉన్న ఈ చెట్టు 50 అడుగుల వరకు పెరిగి ఆకర్షిస్తోంది. కొబ్బరి చెట్టు అంత ఎత్తు ఎదిగిన ఈ బాహుబలి బొప్పాయి చెట్టును వైర్లతో కట్టి ఈదురుగాలులకు విరిగిపోకుండా రక్షిస్తున్నామని రమేష్ తెలిపారు. "తెగుళ్లు రాకుండా, చెట్టు విరగకుండా సంరక్షించుకోవడంతో చెట్టు ఈ స్థాయిలో పెరిగింది. చాలా అరుదుగా ఇలా జరుగుతుంది" అని కళ్యాణదుర్గంలోని కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త యుగంధర్ వివరించారు.

–న్యూస్‌టుడే, కళ్యాణదుర్గం గ్రామీణం

గంట మోగితేనే దుకాణాలు తెరిచేది



సమయం ఉదయం 8 గంటలు. ప్రకాశం జిల్లా పొదిలిలోని పాతూరులో 60 ఏళ్ల వ్యక్తి గంట కొట్టుకుంటూ వెళ్తారు. ఆ తర్వాతే అక్కడి వస్త్ర వ్యాపారులు దుకాణాలు తెరుస్తారు. 4 దశాబ్దాలుగా ఈ ఆనవాయితీ కొనసాగుతోంది. ఇలా గంట కొట్టే పనికి బ్రహ్మయ్య అనే వ్యక్తిని అప్పట్లో నియమించుకున్నారు. ఆయనే ఇప్పటికీ కొనసాగుతున్నారు.

– న్యూస్‌టుడే, పొదిలి

ప్రాణం నిలిపే అర్జెంట్ నిబంధన

నిరీక్షణ లేకుండానే కాలేయం పొందే అవకాశం



ఈనాడు, హైదరాబాద్: తీవ్ర అస్వస్థతతో కాలేయానికి ముప్పు ఏర్పడి... ప్రాణం నిలిపేందుకు అత్యవసరంగా లివర్ మార్పిడి చేయాల్సిన రోగులకు 'సూపర్ అర్జెంట్ కేటగిరీ' అండగా నిలుస్తోంది. అవయవదానంలో ఈ నిబంధన ఎప్పటి నుంచో ఉన్నప్పటికీ అవగాహన లేక చాలామంది వినియోగించుకోవడం లేదు. ఇటీవల ఉస్మానియా ఆసుపత్రిలో ఓ ఇంజినీరింగ్ విద్యార్థినికి వైద్యులు ఇదే కేటగిరీ కింద కాలేయాన్ని అమర్చి ఆమె ప్రాణాలను కాపాడారు. దాంతో ఈ నిబంధన వెలుగులోకి వచ్చింది.

అవయవ మార్పిడి అవసరమైన వారికి దాతల నుంచి రెండు రకాలుగా సేకరించి అందిస్తుంటారు. జీవన్‌దాన్ ట్రస్టు ఈ కార్యక్రమాన్ని సమన్వయం చేస్తుంది. బ్రెయిన్‌డెడ్ అయిన దాతల నుంచి సేకరించడానికి తొలి ప్రాధాన్యం ఇస్తుంటారు. రోగి కుటుంబ సభ్యులు ముందుకొస్తే సగం కాలేయం, ఒక కిడ్నీ సేకరించి మార్పిడి చేసేందుకు ద్వితీయ ప్రాధాన్యమిస్తారు. మొదటి కేటగిరీలో అవయవం పొందేందుకు కొన్నిసార్లు ఏడాది, రెండేళ్లు వేచి చూడాల్సి ఉంటుంది. కిడ్నీలు పాడైతే డయాలసిస్‌తో కొన్నేళ్ల పాటు నెట్టుకురావచ్చు. కాలేయం పాడైతే కొన్నిసార్లు 24 గంటల్లోనే అవయవం మార్పిడి చేయాల్సి ఉంటుంది. దీన్ని దృష్టిలో పెట్టుకొని కాలేయ మార్పిడి కోసం సూపర్ అర్జెంట్ కేటగిరీ కింద ప్రత్యేక వెసులుబాటు కల్పించారు. ● వైరల్ హెపటైటిస్ లాంటి పరిస్థితిలో 15% మందిలో కాలేయం పూర్తిగా పనిచేయడం ఆగిపోతుంది. ● కొన్ని ఇన్‌ఫెక్షన్లు, క్యాన్సర్లు వేగంగా వ్యాపించి కాలేయాన్ని దెబ్బతీస్తాయి. ● రోగిలో కాలేయ వ్యాధి తీవ్రతను అంచనా వేసే ఎంఈఎల్‌డీ స్కోరు 35 దాటితే లివర్ పనిచేయదు. ఈ మూడు సందర్భాల్లోనూ సూపర్ అర్జెంట్ కేటగిరీని వర్తింపజేయవచ్చు.

కూల్ కూల్‌గా ట్రాఫిక్ డ్యూటీ



విశాఖ నగరంలో ట్రాఫిక్ పోలీసులకు ఓ కంపెనీ ఏసీ శిరస్త్రాణాలు అందించింది. వాటిని ధరించి విధులు నిర్వర్తిస్తున్న పోలీసులు విశాఖపట్నం బీచ్ రోడ్డులో కనిపించారు. నిత్యం నడి కూడళ్లలో విధుల్లో ఉండే వారికి ఏసీ శిరస్త్రాణాలు ఎంతో ఉపశమనం ఇస్తున్నాయి. బెల్టుకు పెట్టుకున్న బ్యాటరీ నుంచి హెల్మెట్‌కు విద్యుత్తు కనెక్షన్ ఇస్తే.. అది తలకు కావాల్సిన చల్లదనాన్ని ఇస్తోందని ధరించిన వారు తెలిపారు. –ఈనాడు, విశాఖపట్నం

నేడు ఇన్వెస్టోపియా గ్లోబల్-ఏపీ సదస్సు

- యూఏఈ పెట్టుబడుల ఆకర్షణ లక్ష్యం
- ముఖ్య అతిథిగా హాజరుకానున్న సీఎం చంద్రబాబు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో పెట్టుబడులను ప్రోత్సహించడమే లక్ష్యంగా యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)కు చెందిన పారిశ్రామికవేత్తలతో చర్చించేందుకు 'ఇన్వెస్టోపియా గ్లోబల్-ఏపీ' పేరిట ఇన్వెస్ట్ ఇండియా, కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీస్ (సీఐఐ) సదస్సు నిర్వహిస్తున్నాయి. విజయవాడలో బుధవారం జరిగే ఈ సదస్సులో యూఏఈకి చెందిన వివిధ సంస్థల ప్రతినిధులు 200 మంది హాజరుకానున్నారు. సీఎం చంద్రబాబు ముఖ్యఅతిథిగా పాల్గొంటారు. రాష్ట్రంలో పెట్టుబడి అవకాశాలు, రాష్ట్ర ఆర్థికాభివృద్ధికి సంబంధించిన అంశాలపై చర్చలు జరగనున్నాయి. వివిధ సంస్థల సీఎండీలు, సీఈఓలు, యూఏఈ మంత్రులు, ఇతర ప్రముఖులు ఇప్పటికే విజయవాడ చేరుకున్నారు.


4 అంశాలపై కీలక చర్చ

భారత్-యూఏఈ ఆర్థిక సంబంధాలు బలోపేతం: 'పెట్టుబడులకు ముఖ ద్వారంగా రాష్ట్రం' అనే అంశంపై మొదటి సెషన్‌లో చర్చించనున్నారు. భారత్-యూఏఈ మధ్య వాణిజ్యం, పెట్టుబడుల ప్రతిపాదనలను ముందుకు తీసుకెళ్లడంలో సహకారంపై చర్చిస్తారు. పాలసీలు, మౌలిక సదుపాయాలు ప్రజెంటేషన్ ద్వారా ప్రభుత్వం వివరించనుంది.

యూఏఈ-ఏపీ భాగస్వామ్యం: యూఏఈ పెట్టుబడులు, భాగస్వామ్యాల ద్వారా పరస్పర వృద్ధి సాధించేందుకు సహకారంపై ప్యానల్ డిస్కషన్ నిర్వహిస్తారు. విస్తరణ ప్రణాళికలను యూఏఈ పెట్టుబడిదారులు వివరిస్తారు. పెట్టుబడులకు సంబంధించిన కీలక రంగాలు, అత్యుత్తమ విధానాలు, అంతర్జాతీయ సహకారాల కోసం వ్యూహాలపై చర్చిస్తారు.

ఇండో-యూఏఈ ఫుడ్ కారిడార్: వ్యవసాయ సాంకేతికత, ఆహార భద్రత అంశాలపై నిర్వహించే ప్యానల్ డిస్కషన్‌లో.. ఫుడ్ పార్కులు, ఫామ్-టు-పోర్టు నమూనా, అగ్రిటెక్, సప్లయ్ చైన్ బలోపేతం, ఎగుమతులు పెంచడం, ఆహార భద్రత, ఆర్థిక వృద్ధి వంటి అంశాలను ప్రోత్సహించడానికి ఉన్న మార్గాలపై చర్చిస్తారు.

సాంకేతికత సాయం: ఏఐ, డేటా సెంటర్లు, స్మార్ట్ గవర్నెన్స్‌లు ఆర్థిక వృద్ధిలో ఎలా దోహదపడతాయనే అంశాలపై చర్చిస్తారు.



పెట్టుబడుల అవకాశాలపై చర్చించాం: చంద్రబాబు

రాష్ట్రంలో పెట్టుబడులకు, అభివృద్ధికి ఉన్న అవకాశాలపై పారిశ్రామికవేత్తలతో చర్చించినట్లు సీఎం చంద్రబాబు తెలిపారు. 'యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ ఆర్థిక మంత్రి హెచ్.ఈ. అబ్దుల్లా బిన్ టౌక్ అల్‌మరి, లులు ఇంటర్నేషనల్ సీఎండీ ఎం.ఏ.యూసుఫ్ అలీ, లులు ఫైనాన్షియల్ హోల్డింగ్స్ ఎండీ అదీబ్ అహ్మద్‌తో వివిధ అంశాలపై చర్చించాం' అని ఎక్స్ వేదికగా తెలిపారు.

సీఎం చంద్రబాబుతో యూఏఈ ఆర్థిక మంత్రి హెచ్.ఈ.అబ్దుల్లా బిన్ టౌక్ అల్‌మరి

పాల్గొనే ప్రముఖులు

- ఇన్వెస్టోపియా సీఈఓ డాక్టర్ జీన్ ఫేర్స్
- సీఐఐ వైస్ ప్రెసిడెంట్, భారత్ బయోటెక్ ఇంటర్నేషనల్ లిమిటెడ్ సహ వ్యవస్థాపకురాలు, ఎండీ డాక్టర్ సుచిత్ర కె.ఎల్ల
- లులు ఇంటర్నేషనల్ సీఎండీ యూసుఫ్ అలీ
- టాటా కెమికల్స్ లిమిటెడ్ ఎండీ, సీఈఓ ముకుందన్
- యూఏఈ ఆర్థిక, పర్యాటక మంత్రి హెచ్.ఈ. అబ్దుల్లా బిన్ టౌక్ అల్‌మరి

పెట్టుబడులకు క్రోమా అథోర్ ఆసక్తి

రాష్ట్రంలో హరిత ఇంధన రంగంలో పెట్టుబడులకు యూఏఈకి చెందిన క్రోమా అథోర్ ఇంటర్నేషనల్ సంస్థ ఆసక్తి వ్యక్తం చేసింది. పశుగ్రాసం లభ్యత, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన జిల్లాలకు కంప్రెస్డ్ బయో గ్యాస్, సోలార్ సెల్ తయారీ యూనిట్ల ద్వారా పెట్టుబడులకు ప్రాధాన్యమివ్వాలన్న ప్రభుత్వ లక్ష్యానికి అనుగుణంగా వ్యవహరిస్తామని సీఎం చంద్రబాబుకు లేఖ రాసింది. 'ఇన్వెస్టోపియా గ్లోబల్' కార్యక్రమంలో ఆలోచనలను వివరించనుంది.

సూర్యలంకలో 26న పవన్‌కల్యాణ్ పర్యటన

బాపట్ల, న్యూస్‌టుడే: ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఈ నెల 26న బాపట్ల జిల్లా పర్యటనకు రానున్నట్లు సమాచారం. సూర్యలంక సమీపంలోని ముత్తాయపాలెం అటవీ ప్రాంతంలో ఆయన చేతుల మీదుగా మొక్కలు నాటించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అక్కడ జేసీబీతో ముళ్ల చెట్లను తొలగిస్తున్నారు. ఐటీసీ అందించనున్న 50 వేల మడ అడవుల మొక్కలను తీర ప్రాంతంలో నాటేందుకు అధికారులు ప్రణాళికలు రూపొందించారు.


ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ప్రస్తుత విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని మెడికల్, దంత వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్/బీడీఎస్ కన్వీనర్ కోటా సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ రాధికారెడ్డి తెలిపారు. ఈ మేరకు మంగళవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. నీట్ యూజీ ప్రవేశ పరీక్ష రాసి స్థానిక ర్యాంకులు సాధించిన అభ్యర్థులు ఈ నెల 23వ తేదీ ఉదయం 9 నుంచి 29న రాత్రి 9 గంటల వరకు దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని పూరించి పంపాలి. అపరాధ రుసుం (రూ.20 వేలు)తో ఈ నెల 30న ఉదయం 7 నుంచి 31న రాత్రి 9 గంటల్లోగా తమ పేర్లను నమోదు చేసుకోవచ్చు.

★ విజయవాడ సిద్ధార్థ ప్రభుత్వ వైద్య కళాశాలలోని 175 ఎంబీబీఎస్ సీట్లకు 15 శాతం ఆల్ ఇండియా కోటా, 15 శాతం అన్‌రిజర్వుడు క్యాటగిరీకి పోగా మిగిలిన సీట్లను ఆంధ్రా పరిధికి 65.62 శాతం, ఎస్వీయూ పరిధికి 34.38 శాతం కేటాయిస్తారు.

★ లోకల్ క్యాటగిరీ కిందకు వచ్చే అభ్యర్థులు వరుసగా నాలుగేళ్లు (9వ తరగతి నుంచి ఇంటర్) ఆయా ప్రాంతంలోని విద్యాసంస్థల్లో చదివి ఉండాలి. ఏ ఒక్క ఏడాది ఇతర రాష్ట్రాల్లో చదివినా లోకల్ ప్రాధాన్యం కోల్పోతారు.

★ కొన్ని ప్రైవేటు వైద్య కళాశాలలకు జాతీయ వైద్య కమిషన్ అనుమతులు ఇవ్వకపోవడంతో సీట్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఈ ఏడాది విశాఖపట్నంలోని గాయత్రి విద్యా పరిషత్‌కు ఇంకా అనుమతులు రాలేదు. ఫీజుల మార్గదర్శకాలు ఇంకా విడుదల కావాల్సి ఉంది. విశ్వవిద్యాలయం మార్గదర్శకాలపై అభ్యంతరాలుంటే 89787-80501, 79977-10168 నంబర్లకు, సాంకేతిక సమస్యలు తలెత్తితే 90007-80707కు ఫోన్ చేయవచ్చు.



అనుమానాల కంటే మీరే శక్తిమంతులు

తపరవి ముందడుగు వేయడానికి కావాల్సినంత శక్తి మీలో ఉందని బలంగా నమ్మండి. ఆ విశ్వాసమే మిమ్మల్ని నడిపిస్తుంది. ఎంత చిన్న అడుగైనా సరే.. ముందుకే వేయండి. మీ అనుమానాల కంటే మీరు చాలా శక్తిమంతులని ఎల్లప్పుడూ గుర్తుంచుకోండి.

– స్టీవ్ హార్వే, ప్రముఖ టీవీ వ్యాఖ్యాత

కూటమి నేతలపై అసభ్య వ్యాఖ్యలు చేసిన రోజా

జగనన్న ప్రభుత్వం వస్తే వడ్డీతో చెల్లిస్తామని వ్యాఖ్య

నగరి, న్యూస్‌టుడే: 'గాలో గెలిచిన గాలి .. కొడుకు ఎమ్మెల్యేనైపోయాడు (ఎమ్మెల్యేలు) రాష్ట్రంలో. తెదేపా, జనసేన నాయకులు తెలుసుకోవాలి.. ఇప్పుడు హైదరాబాద్‌కు పారిపోతున్నారు. రేపు జగనన్న ప్రభుత్వం వస్తే హైదరాబాద్ కాదు అమెరికాకు పారిపోతారు. ఆరోజు మిమ్మల్ని కాపాడటానికి ఎవరూ ఉండరు. వీళ్లను నమ్ముకుని వైకాపా నాయకులను టార్గెట్ పెట్టినా, కేసులు పెట్టినా, కొట్టినా.. దానికి వందరెట్లు వడ్డీతో తిరిగి చెల్లిస్తాం' అని వైకాపా నాయకురాలు రోజా వ్యాఖ్యానించారు. ఈ నెల 6న చిత్తూరు జిల్లా నగరి వైకాపా కార్యాలయంలో నిర్వహించిన 'రీకాల్ చంద్రబాబు' కార్యక్రమంలో ఆమె ఈ మాటలన్నారు. ఆ వీడియో మంగళవారం సామాజిక మాధ్యమాల్లో వైరల్ అయింది. పవన్‌కల్యాణ్‌ను ఉద్దేశించి మాట్లాడుతూ... 'ఆయనకు పిచ్చి బాగా ముదిరింది. ఎక్కడకు వెళ్తే అక్కడే పుట్టానంటూ ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నాడు. చివరికి తమిళనాడు వెళ్లినా అక్కడే పుట్టానని చెబుతున్నాడు' అని రోజా వ్యాఖ్యానించారు.

భవిష్యత్తులో సమయాన్ని బట్టి నటిస్తా

- వీరమల్లు చారిత్రక సినిమా కాదు.. రాజకీయాలు లేవు
- పారితోషికం తీసుకోలేదు: పవన్‌కల్యాణ్



మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతున్న పవన్‌కల్యాణ్

ఈనాడు, అమరావతి: 'హిందువుగా బతకాలంటే పన్ను కట్టాలనేవారిపై యుద్ధమే హరిహర వీరమల్లు. అలనాటి అమానుష పాలనను స్పృశిస్తూ, రక్తసంబంధీకులను చంపిన ఔరంగజేబ్ స్వరూపాన్ని తెలిపే కథ ఇది. ఇది చారిత్రక సినిమా కాదు. ఆ నేపథ్యం ఆధారంగా అల్లుకున్న ఫిక్షన్. రాజకీయాలకు అతీతంగా చేశాను. కోహినూర్ వజ్రాన్ని తీసుకురావడం ఆధారంగా రాసుకున్న కథ ఇది. సినిమా పూర్తయ్యేసరికి అందరికీ మంచి ఫీల్ కలుగుతుంది. ప్రజల కోసం, ధర్మం కోసం పోరాడిన ఓ యోధుడి కథ ఇది' అని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆ సినిమా కథానాయకుడు పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడారు.

◆ 'ఔరంగజేబ్ విధించిన జిజియా పన్ను గురించి మా సినిమాలో పెట్టాం. ఔరంగజేబ్ దర్శాన్ని తొక్కేస్తున్నట్లు వ్యవహరించారు. వసరులు దోచుకున్నారు. తన దర్మాన్ని పాటించాలి, మీ దర్మాన్ని పాటించవద్దన్నారు. ఔరంగజేబ్ సమయంలో హిందువులే బాధలు పడ్డారు. తొలుత బాబర్ హిందూధర్మాన్ని ఇబ్బంది పెడితే, తర్వాత అక్బర్ దాని తీవ్రత తగ్గించినా... ఔరంగజేబు మాత్రం తాత బాబర్ లక్షణాలు వచ్చాయి. విగ్రహారధన చేయరాదంటూ హిందువులను చావబాదారు. ఆ చరిత్ర ఈ తరానికి చెప్పాలనే ఈ సినిమా చేశాను. ఇవన్నీ సినిమాకు అవసరమైనంతే ఉంచాం. ఇప్పుడున్న పరిస్థితులతో అసలు పోల్చలేదు.

బందరు నుంచి దిల్లీకి..

మచిలీపట్నంలో మొదలయ్యే కథ దిల్లీ వెళ్లి ఆగుతుంది. అది మొదటిభాగం. దిల్లీ నుంచి కోహినూర్ వజ్రాన్ని ఎలా తెచ్చారనేది రెండో భాగం.

◆ అప్పట్లో మరో నెల తీసుకుంటే ఈ సినిమా పూర్తయ్యేది. చంద్రబాబు అరెస్టు, విశాఖలో నన్ను ఇబ్బంది పెట్టడంతో ఆగిపోయింది. ఆ తర్వాత ఒక మనిషి సృష్టించిన విపత్తు. రెండుసార్లు కోవిడ్ విపత్తు మరో కారణం. ఎన్నికలకు ఏడాది ముందునుంచి సినిమాలకు దూరమయ్యాను. ఉపముఖ్యమంత్రి అయ్యాక పాలనపై అవగాహనకు కొన్నాళ్లు జాప్యం జరిగింది. రోజూ ఉదయం 7-9 గంటల మధ్య, ఆదివారాలు సినిమా పూర్తిచేశా. మంగళగిరిలోనే స్టూడియో ఏర్పాటుచేసి పూర్తిచేశా.

◆ క్లైమాక్స్ సన్నివేశాన్ని నేనే తిరగరాశా. రాసి, కొరియోగ్రఫీ చేసి నటించడం కష్టమైంది. రాజకీయాల్లో ఉన్నానని తూతూమంత్రంగా చేయకూడదన్నాను. మొదటి సినిమాకు ఎంత మనసు పెట్టి, కష్టపడి చేశానో ఈ సినిమాకూ అలాగే కష్టపడ్డా.

◆ ఈ సినిమాకు పారితోషికం తీసుకోలేదు. అన్నీ బాగుంటే తీసుకుంటా.

◆ ఎన్నో ఇబ్బందుల వల్ల నిర్మాతలు నష్టపోవడంతో సినిమాను ప్రమోట్ చేస్తున్నా. నేను రాజకీయాల్లో ఉండడంతో గత ప్రభుత్వం చేసిన పనికి నిర్మాతలు బలయ్యారు. అందుకే ప్రమోట్ చేయడం బాధ్యతగా భావించా. ప్రత్యర్థులపై కోపంతో చీనీ చెట్లు నరికేయడం లాంటి సంస్కృతి వాళ్లది. యుద్ధంలో ఉన్నందున అది భరించా. భీమ్లానాయక్ సమయంలోనూ టికెట్ ధరలు తగ్గించి ఇబ్బందిపెట్టారు. ఆర్థిక మూలాలపై దెబ్బకొట్టాలని వ్యూహాలు అమలుచేశారు. ప్రస్తుతం నడుపుతూ, ఇవన్నీ భరిస్తూ ఇక్కడివరకు రావడం పెద్ద విషయం.

వైఫల్యాలతో ఎన్నో నేర్చుకున్నా

జానీ సినిమా వైఫల్యం ఎన్నో నేర్పింది. అన్ని బంధాలు ఆర్థికబంధాలే అన్న కార్ల్ మార్క్స్ మాటలు గుర్తొచ్చాయి. ఒంటరితనం అనుభవించాను. నా పారితోషికం తిరిగిచ్చేశా. ఆ అనుభవం బలమైన వ్యక్తిగా నిలబెట్టింది. జానీ ఫ్లాప్ రాజకీయాల్లోనూ తట్టుకునేలా చేసింది.

◆ సెప్టెంబరులో ఓజీ విడుదల చేస్తాం. డిసెంబరు లేదా జనవరిలో ఉస్తాద్ భగత్‌సింగ్ వస్తుంది. ఇక వారం రోజులే దాని పని మిగిలింది. ఇవి అయిపోతే విముక్తుడిని అవుతా. సినిమాలు, రాజకీయాల మధ్య ఏదైనా ఒకటే ఎంచుకోవాల్సి వస్తే సినిమాలు వదులుకుంటా. పార్టీ బలోపేతమే నా ప్రాధాన్యం. నా ఆర్థిక స్థిరత్వానికి సినిమా అవసరం. భవిష్యత్తులో సినిమాలు నిర్మించాలి. ఇప్పటికిలా రెండు మూడు గంటలు సినిమాకు కేటాయించి అవసరమైతే అతిథి పాత్రలలో చేస్తా. ఇప్పటికైతే కథలేమీ లేవు.

◆ ఆంధ్రప్రదేశ్‌కు సినిమా పరిశ్రమను తీసుకురావడం కన్నా ముందు ఇక్కడ మౌలిక సౌకర్యాలు అభివృద్ధి చేయాలి. హైదరాబాద్‌లో ఉన్నలాంటి సౌకర్యాలు రావాలి. ముందు ఫిల్మ్‌మేకింగ్ స్కూళ్ల ఏర్పాటు ముఖ్యం.

ఆ 36% మెడికల్ సీట్లు ఇకపై రాష్ట్ర విద్యార్థులకే

ఉత్తర్వులను జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాష్ట్ర విభజన చట్టం ప్రకారం తెలంగాణ ప్రాంతానికి కేటాయించిన 36 శాతం మెడికల్ సీట్లు ఇకపై ఆంధ్రప్రదేశ్ విద్యార్థులకే కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించింది. విభజన చట్టంలో పేర్కొన్న గడువు ముగియడంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంగళవారం విడుదల చేసిన ఉత్తర్వుల్లో పేర్కొంది. 2025-26 విద్యా సంవత్సరంలో జరిగే వైద్య విద్య ప్రవేశాలకు ఈ నిర్ణయం వర్తిస్తుందని వెల్లడించింది. గతంలో తెలంగాణలోని ఉస్మానియా, కాకతీయ విశ్వవిద్యాలయాల పరిధిలోని విద్యార్థులతో 36 శాతం సీట్లు భర్తీ చేసేవారు. రాష్ట్ర విభజన చట్టంలో నిర్దేశించిన పదేళ్ల గడువు ముగిసినందున గతేడాది (2024-25) వరకు ప్రవేశాలు పొందిన తెలంగాణ విద్యార్థులకు 2025-26 ప్రవేశాల్లో అవకాశం ఇవ్వలేదు. దీంతో రాష్ట్రస్థాయి హోదా కలిగిన విజయవాడలోని ప్రభుత్వ సిద్ధార్థ వైద్య కళాశాలలోని సీట్లలో 85 శాతం సీట్లను రాష్ట్రంలోని ఏయూ, ఎస్వీయూ పరిధిలోని విద్యార్థులతోనే భర్తీ చేస్తారు. మిగిలిన 15 శాతం సీట్లు అన్ రిజర్వుడు కేటగిరిలో రాష్ట్రంలో ఉండే పొరుగు రాష్ట్రాల విద్యార్థులు షరతులతో పొందే అవకాశం కల్పిస్తారు.

ఒకే బస్సులో 100 మందికి పైగా విద్యార్థులు

ఊపిరాడక ముగ్గురికి అస్వస్థత



అస్వస్థతకు గురైన విద్యార్థులకు సపర్యలు

దేవనకొండ, న్యూస్‌టుడే: ఒకే బస్సులో 100 మందికి పైగా విద్యార్థులు ఎక్కడంతో ఊపిరాడక ముగ్గురు పిల్లలు అస్వస్థతకు గురైన ఘటన కర్నూలు జిల్లాలో చోటుచేసుకుంది. మంగళవారం సాయంత్రం గద్దరాళ్ల, పల్లెదొడ్డి, ఓబుళాపురం, మాదాపురం, కప్పట్రాళ్ల, జిల్లడబుడకల గ్రామాలకు చెందిన సుమారు 230 మందికి పైగా విద్యార్థులు దేవనకొండ స్టాప్‌లో ఎదురుచూశారు. ఇంతలో బస్సు రాగానే.. ఒక్కసారిగా తోసుకుంటూ వంద మందికిపైగా ఎక్కేశారు. లోపల ఊపిరాడక పోవడంతో ముగ్గురు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. వారిని కిందికి దించి కండక్టర్ లక్ష్మన్న సపర్యలు చేశారు. కొద్దిసేపటికి కోలుకున్న విద్యార్థులు ఇంటికి క్షేమంగా చేరారు. మరో సర్వీస్ లేకపోవడంతో విద్యార్థులంతా ఈ బస్సులోనే ఎక్కాల్సి వచ్చిందని స్థానికులు తెలిపారు.

నల్లమలలో యువకుడిపై పెద్దపులి దాడి



అంకన్న




చేతికి గాయాలు

ఆత్మకూరు, న్యూస్‌టుడే: నల్లమల అటవీ సమీప పంట పొలాల్లో మందులు పిచికారి చేసేందుకు వెళ్లిన యువకుడిపై పెద్దపులి దాడి చేసింది. నంద్యాల జిల్లా కొత్తపల్లి మండలం సదరం పెంట గూడానికి చెందిన చెంచు యువకుడు పులిచెర్ల అంకన్న ఆత్మకూరు అటవీ డివిజన్ కొత్తపల్లి రేంజ్ పరిధిలోని తన పంట పొలంలో మందులు పిచికారి చేసేందుకు వెళ్లారు. పొదల్లో మాటేసి ఉన్న పెద్దపులి ఒక్కసారిగా ఆయనపై దాడి చేసి గాయపరిచింది. సమీపంలోనే ఉన్న అతని మేనమామ అరుస్తూ రావడంతో పులి అంకన్నను వదిలి వెళ్లిపోయింది. సమాచారం తెలుసుకున్న అటవీ అధికారులు అంకన్నను ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స చేయించారు.

ప్రభుత్వ సాయంతో విదేశీవిద్య.. నేడు పేదలకు సాయం

- సీఎం చంద్రబాబును కలిసిన యువ వ్యాపారవేత్త సాత్విక్ మురారి



ముఖ్యమంత్రి చంద్రబాబుతో సాత్విక్ మురారి

ఈనాడు, అమరావతి: తెదేపా ప్రభుత్వం 2014-19 మధ్య ప్రవేశపెట్టిన విదేశీ విద్య పథకం ద్వారా విదేశాల్లో చదువుకుని యువ వ్యాపారవేత్తగా ఎదిగిన సాత్విక్ మురారి.. ముఖ్యమంత్రి చంద్రబాబును మంగళవారం సచివాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపారు. నాడు ప్రభుత్వం నుంచి సాయం పొందిన తాను... ఇప్పుడు విదేశాల్లో చదవాలని ఆసక్తి చూపించే పేద విద్యార్థులకు సాయం చేయాలనే ఉద్దేశంతో ఉన్నట్లు వివరించారు. 2016లో విదేశీవిద్య పథకం సాయంతో ఐర్లండ్‌లో బిజినెస్ మేనేజ్‌మెంట్‌లో ఎంఎస్ పూర్తిచేశానని సాత్విక్ ముఖ్యమంత్రికి తెలిపారు. ప్రస్తుతం ఐర్లండ్‌లోనే వ్యాపారం ప్రారంభించినట్లు వెల్లడించారు. నలుగురు పేద విద్యార్థులకు విదేశాల్లో చదువుకునేందుకు ఉపకార వేతనం (స్కాలర్‌షిప్) అందించేందుకు సిద్ధంగా ఉన్నట్లు సీఎంకు వివరించారు. ఈ సందర్భంగా సాత్విక్‌ని అభినందించిన ముఖ్యమంత్రి... సమాజానికి కొంత తిరిగివ్వాలనే ఆలోచన రావడం ప్రశంసనీయమని అన్నారు. సీఎంను కలిసిన వారిలో క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు స్వామిదాస్ ఉన్నారు.

ఓబీసీ నాన్ క్రీమీలేయర్ అర్హత నిర్ణయించేందుకు కమిటీ

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాల వేతన శ్రేణుల ఆధారంగా వర్గీకరణను అధ్యయనం చేసి తదనుగుణంగా ఓబీసీ నాన్ క్రీమీలేయర్ అర్హతను నిర్ణయించడానికి ప్రభుత్వం ముగ్గురు అధికారులతో కూడిన కమిటీని నియమిస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ కమిటీకి సాధారణ పరిపాలన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఛైర్మన్‌గా వ్యవహరిస్తారు. రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సభ్యుడిగా, బీసీ సంక్షేమ శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు.

నేడు ఉపరితల ఆవర్తనం

ఈనాడు, విశాఖపట్నం: బంగాళాఖాతంలో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోంది. దక్షిణ చైనా సముద్రంలో బలపడి, వియత్నాంలో తీరం దాటిన విఫా తుపాను ప్రభావం బుధవారం నాటికి ఉత్తర బంగాళాఖాతంపై పడనుంది. ఈ కారణంగా ఉపరితల ఆవర్తనం ఏర్పడి.. గురువారం నాటికి అల్పపీడనంగా బలపడే అవకాశముందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) తెలిపింది. రాబోయే నాలుగు రోజుల్లో కోస్తాంధ్రలోని పలు జిల్లాల్లో భారీ వర్షాలకు అవకాశముందని అమరావతి వాతావరణ కేంద్రం పేర్కొంది. గంటకు 40 కి.మీ. నుంచి 50 కి.మీ. వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని తెలిపింది. సముద్రం అలజడిగా మారిన నేపథ్యంలో మత్స్యకారులు శనివారం వరకు వేటకు వెళ్లరాదని హెచ్చరించింది.

కోస్తా జిల్లాలకు భారీ వర్ష సూచన

అల్లూరి సీతారామరాజు, తూర్పుగోదావరి, డా.బీఆర్ అంబేడ్కర్ కోనసీమ, ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్టీఆర్, కృష్ణా, పల్నాడు, గుంటూరు, బాపట్ల, ప్రకాశం, శ్రీపొట్టిశ్రీరాములు నెల్లూరు జిల్లాల్లో బుధవారం భారీ వర్షాలకు అవకాశముందని తెలిపింది. మంగళవారం అనకాపల్లి, ఎన్టీఆర్, అల్లూరి సీతారామరాజు, వైఎస్సార్ కడప, పల్నాడు, శ్రీకాకుళం, గుంటూరు తదితర జిల్లాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిశాయి. అత్యధికంగా సాయంత్రం 6 గంటల వరకు అనకాపల్లి జిల్లా రావికమతంలో 63.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

క్యాన్సర్‌ను జయించి.. తనయుడికి కిడ్నీ దానం



తండ్రీకొడుకులతో వైద్య బృందం

విశాఖపట్నం(వన్‌టౌన్), న్యూస్‌టుడే: ఆయనో 60 ఏళ్ల వృద్ధుడు. ఇటీవలే ఉదర క్యాన్సర్‌ను జయించారు. తాజాగా ఇప్పుడు 37 ఏళ్ల తన తనయుడికి కిడ్నీ పాడైందని తెలుసుకుని, తన కిడ్నీని దానం చేశారు. విశాఖపట్నంలోని ఏఐఎన్‌యూ ఆసుపత్రిలో నిర్వహించిన ఈ సర్జరీ వివరాలను నెఫ్రాలజిస్ట్ డాక్టర్ ఉదయ్ దీపక్‌రావు మంగళవారం వెల్లడించారు. లక్ష్మణరావు అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలో చేరగా, ఆయనకు కిడ్నీ మార్పిడి చేయాలని వైద్యులు సూచించారు. ఈ విషయం తెలుసుకున్న తండ్రి పైడియ్య కిడ్నీ దానానికి ముందుకు రావడంతో వైద్యులు అవసరమైన వైద్య పరీక్షలు చేసి కిడ్నీ దానానికి అర్హులని తేల్చారు. దీంతో వైద్య బృందం కిడ్నీ మార్పిడి చికిత్సను విజయవంతంగా నిర్వహించింది. ప్రస్తుతం దాత, స్వీకర్తలైన తండ్రీకొడుకులిద్దరూ కోలుకుని, ఆరోగ్యంగా ఉన్నారని డాక్టర్ ఉదయ్‌దీపక్‌రావు తెలిపారు.

శ్రీశైలం నుంచి నీటి విడుదల

సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: ఎగువ నుంచి వరద ప్రవాహం కొనసాగుతుండడంతో శ్రీశైలం జలాశయం ఒక రేడియల్ క్రస్టు గేటు ద్వారా మంగళవారం నీటిని దిగువకు విడుదల చేశారు. శ్రీశైలం జలాశయం ఎస్ఈ శ్రీరామచంద్రమూర్తి నీటిని దిగువకు వదిలారు. రేడియల్ క్రస్టు గేటును 10 అడుగుల మేర పైకెత్తి 27,478 క్యూసెక్కులు, శ్రీశైలం కుడి, ఎడమగట్టు జలవిద్యుత్తు కేంద్రాల్లో విద్యుదుత్పత్తి చేస్తూ 67,185 క్యూసెక్కులను నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. జూరాల, సుంకేసుల జలాశయాల నుంచి 88,623 క్యూసెక్కుల వరద నీరు వస్తోంది. శ్రీశైలం జలాశయం నీటిమట్టం సాయంత్రానికి 883.70 అడుగులు, నీటినిల్వ 208.2841 టీఎంసీలుగా నమోదైంది.

జిల్లాలు, మండలాల పేర్లు, సరిహద్దుల మార్పు!

- మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని పలు జిల్లాలు, మండలాలు, గ్రామాల పేర్లు, సరిహద్దుల్ని మార్చాలంటూ ప్రజలు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నుంచి వచ్చిన విజ్ఞప్తుల్ని పరిశీలించి తగు సిఫారసులు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏడుగురు మంత్రులతో ఉపసంఘాన్ని నియమించింది. అనగాని సత్యప్రసాద్, పి.నారాయణ, వంగలపూడి అనిత, బీసీ జనార్దన్‌రెడ్డి, నిమ్మల రామానాయుడు, నాదెండ్ల మనోహర్, సత్యకుమార్ యాదవ్‌లను సభ్యులుగా నియమించింది. రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు.

ఉపసంఘం పరిశీలించే అంశాలు

◆ పేర్లు, సరిహద్దులు మార్చాలన్న విజ్ఞప్తుల్లోని సాధ్యాసాధ్యాలు, మరింత మెరుగైన పరిపాలన అందించేందుకు అవి ఎంతవరకు దోహదం చేస్తాయన్న విషయాల్ని ఈ కమిటీ పరిశీలిస్తుంది.

◆ జిల్లాలు, డివిజన్లు, మండలాల సరిహద్దులపై నెలకొన్న వివాదాలకు పరిష్కారం సూచిస్తుంది. జిల్లా, డివిజన్, మండల కేంద్రాల నుంచి దూరంగా ఉన్న ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల పరిష్కారానికి చర్యల్ని ప్రతిపాదిస్తుంది.

◆ జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దుల మార్పు, కొత్తవి ఏర్పాటు చేయాలన్న డిమాండ్‌లు పరిశీలించే క్రమంలో వాటి చారిత్రక, సాంస్కృతిక నేపథ్యాన్ని దృష్టిలో ఉంచుకుంటుంది.

◆ మొత్తం అన్ని ప్రాంతాలు సామాజికంగా, ఆర్థికంగా సమానంగా అభివృద్ధి చెందేలా పునర్వ్యవస్థీకరణకు మార్పులు సూచిస్తుంది.

◆ భౌగోళికంగా, జనాభాపరంగా సమతుల్యత దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకుంటుంది.

◆ సంప్రదాయాలు, పరిపాలనాపరమైన ఏర్పాట్లు, వనరుల లభ్యత వంటి అంశాల్ని పరిగణనలోకి తీసుకుని.. సరిహద్దులు, పేర్ల మార్పునకు సంబంధించి సూచనలు చేస్తుంది.

ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ బోధనకు సహకరిస్తున్నాం

సినీనటి మంచులక్ష్మి



కోటమిట్టలో డిజిటల్ తరగతి గదిని ప్రారంభిస్తున్న మంచు లక్ష్మి

నెల్లూరు (మార్కెట్ సెంటర్), న్యూస్‌టుడే: ప్రభుత్వ పాఠశాలల్లో బోధన మెరుగుపరిచేందుకు డిజిటల్ తరగతి గదులు ఏర్పాటు చేసినట్లు సినీ నటి మంచు లక్ష్మి తెలిపారు. తమ టీచ్ ఫర్ ఛేంజ్ సంస్థ ఆధ్వర్యంలో నాలుగు రాష్ట్రాల్లో ఇలాంటి కార్యక్రమాలు చేస్తున్నామన్నారు. ఇందులో భాగంగా శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో 12 పాఠశాలల్లో డిజిటల్ తరగతులను ఏర్పాటుచేశామన్నారు. నెల్లూరులో నాలుగు చోట్ల తరగతి గదులను తీర్చిదిద్దామన్నారు. మంగళవారం నగరంలోని కోటమిట్ట మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో డిజిటల్ తరగతి గదిని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో డీఈవో బాలాజీరావు, డిప్యూటీ మేయర్ తహసీన్ ఇంతియాజ్, సర్వేపల్లి నియోజకవర్గం తెదేపా సమన్వయకర్త సోమిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, శృతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తిరువూరు ఎస్సై పనితీరుపై కొలికపూడి మండిపాటు



ఎమ్మెల్యేకు ఫిర్యాదు చేస్తున్న యువకుడి తండ్రి, పక్కన సీఐ గిరిబాబు

తిరువూరు, న్యూస్‌టుడే : తిరువూరు ఎస్సై కేవీజీవీ.సత్యనారాయణ నేరస్థులకు కొమ్ము కాస్తున్నారని తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు మండిపడ్డారు. గతంలో గంజాయి కేసుల్లో పట్టుబడిన నిందితులను కూడా ఎస్సై ప్రోత్సహించి మళ్లీ గంజాయి విక్రయాలు చేయించి, అక్రమార్జన చేస్తున్నారని ఆరోపించారు. ఇటీవల తిరువూరులో పట్టుబడిన గంజాయి నిందితుడు ఎస్.శ్రీకాంత్ ఇందుకు ఉదాహరణ అన్నారు. అతని తండ్రి ఎస్సైపై తనకు చేసిన ఫిర్యాదును తెలిపారు. పట్టణంలో ఇద్దరు తెదేపా కార్యకర్తల మధ్య జరిగిన ఘర్షణలో ఎస్సై ఏకపక్షంగా వ్యవహరించారని, దీనిపై ఎస్సైను ప్రశ్నించేందుకు మంగళవారం రాత్రి తిరువూరు పోలీస్ స్టేషన్‌కు కొలికపూడి వచ్చారు. రాత్రి 9 నుంచి 10.30 వరకు ఠాణాలోనే ఉన్నారు. ఆ సమయంలో ఎస్సై లేకపోవడంతో సమాచారం తెలిసి సీఐ గిరిబాబు అక్కడకు వచ్చారు. గంజాయి నిందితుల నుంచి రూ.2 లక్షలు పోలీసులు వసూలు చేశారని ఎమ్మెల్యే సమక్షంలో శ్రీకాంత్ తండ్రి సీఐకి ఫిర్యాదు చేశాడు.

ఎందుకు చర్యలు తీసుకోలేదు: అంతర్గత వ్యవహారమై పట్టణానికి చెందిన తెదేపా కార్యకర్తలు చిల్లపల్లి రామకృష్ణ, కందిమళ్ల సాయిసుమిత్ మధ్య సోమవారం ఘర్షణ జరిగింది. రామకృష్ణ ఇంటికి వెళ్లిన సాయిసుమిత్ ఆత్మరక్షణకు దాడి చేశారు. సంఘటనలో సాయిసుమిత్‌కు తలకు గాయమై ఆసుపత్రిలో కుట్లు కూడా వేశారు. ఇతని ఫిర్యాదు మేరకు రామకృష్ణపై ఎస్సై సత్యనారాయణ హత్యాయత్నం కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేసేందుకు ప్రయత్నించగా అతను అందుబాటులో లేడు. దీంతో నిందితుని తల్లి, చెల్లిని మంగళవారం పోలీస్ స్టేషన్‌కు తీసుకొచ్చారు. రామకృష్ణ ఆచూకీ చెప్పాలని వారికి రాత్రి వరకు నిర్బంధించారు. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే అక్కడకు చేరుకుని మహిళలను ఠాణాలో నిర్బంధించిన పోలీసులపై మండిపడ్డారు. వాస్తవంగా ఇంటికి వచ్చి రామకృష్ణపై దాడి చేసి వారిని స్టేషన్‌కు తీసుకురావాలన్నారు. నెల రోజుల కిందట గంజాయి బ్యాచ్ రామకృష్ణపై దాడి చేస్తే ఇంత వరకు నిందితులపై చర్యలు తీసుకోలేదన్నారు. దీనిపై విచారించి తగు చర్యలు తీసుకుంటామని సీఐ చెప్పడంతో రాత్రి 10.30 తర్వాత ఎమ్మెల్యే ఠాణా నుంచి బయటకు వచ్చారు. ఇద్దరు మహిళలను పోలీసులు ఇంటికి పంపించారు. తదుపరి తమకు జరిగిన అన్యాయంపై రామకృష్ణ తల్లి వీరరాఘవమ్మ కూడా ఎమ్మెల్యే సమక్షంలో ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

ఛాంపియన్స్

మధ్యాహ్నం 3.30 నుంచి

ఓవైపు సిరీస్‌లో వెనుకంజ.. ఇంకోవైపు గాయాల బాధ.. మరోవైపు తుది జట్టులో ఎవరుంటారో తెలియని అనిశ్చితి.. ఇలా నాలుగో టెస్టు ముంగిట టీమ్‌ఇండియాకు ఎన్ని ప్రతిబంధకాలో! కానీ ఇలాంటి ఇబ్బందికర స్థితిలోనే రెండో టెస్టులో బలంగా పుంజుకుని ఇంగ్లిష్ జట్టును చిత్తుగా ఓడించింది శుభ్‌మన్ సేన. రెండు ఓటములు చవిచూసి ఉండొచ్చు కానీ.. ఇప్పటిదాకా సిరీస్‌లో ఎక్కువ సెషన్లలో ఆధిపత్యం చలాయించిన జట్టు భారతే. అయితే కీలక దశలో తడబడే బలహీనతను వీడితేనే సిరీస్‌పై ఆశలు నిలుస్తాయి. సిరీస్ చేజారకూడదంటే గెలవాల్సిన లేదా కనీసం డ్రా చేసుకోవాల్సిన స్థితిలో మాంచెస్టర్‌లో భారత జట్టు ఎలాంటి ప్రదర్శన చేస్తుందో?

పరీక్షకు నిలుస్తారా?

భారత్‌కు కఠిన సవాల్


పంత్, శుభ్‌మన్

ఇంగ్లాండ్‌తో నాలుగో టెస్టు నేటి నుంచే

మాంచెస్టర్

ఇంగ్లాండ్ పర్యటనలో మెరుగైన ప్రదర్శన చేస్తున్నప్పటికీ సిరీస్‌లో 1-2తో వెనుకబడి ఉన్న టీమ్‌ఇండియా.. అత్యంత కీలక పోరుకు సిద్ధమైంది. మాంచెస్టర్ నాలుగో టెస్టు బుధవారం ఆరంభం కానుంది. తొలి టెస్టులో మాదిరే మూడో టెస్టులోనూ గెలిచేందుకు మంచి అవకాశం వచ్చినా ఉపయోగించుకోలేకపోయింది శుభ్‌మన్ సేన. ఎడ్జ్‌బాస్టన్ తరహాలోనే ఆ జట్టు పుంజుకోవాలని అభిమానులు ఆశిస్తున్నారు. ఈ మ్యాచ్ ముంగిట గాయాలే భారత్‌కు అతి పెద్ద సమస్యగా మారాయి. జిమ్‌లో గాయపడ్డ నితీశ్ కుమార్ రెడ్డి మొత్తం పర్యటనకే దూరం కాగా.. గజ్జల్లో గాయంతో ఆకాశ్ దీప్.. చేతి గాయం కారణంగా అర్ష్‌దీప్ నాలుగో టెస్టుకు అందుబాటులో లేకుండా పోయారు. ముందు ఈ మ్యాచ్‌కు బుమ్రా విశ్రాంతి తీసుకుంటాడని అనుకున్నారు కానీ.. జట్టును గాయాలు బాధ వెంటాడుతున్న నేపథ్యంలో అందుకు అవకాశం లేనట్లే. ఈ మ్యాచ్‌కు భారత తుది జట్టు ఎలా ఉంటుందన్నది ఆసక్తికరం.

సుదర్శన్ పునరాగమనం.. అన్షుల్ అరంగేట్రం?: ఈ మ్యాచ్‌కు భారత తుది జట్టులో మూణ్నాలుగు మార్పులు జరిగే అవకాశముంది. తొలి టెస్టులో అరంగేట్రం చేసి, తర్వాత చోటు కోల్పోయిన సాయి సుదర్శన్.. మళ్లీ ఛాన్స్ అందుకోవచ్చు. నితీశ్ స్థానంలో అతణ్ని ఎంచుకునే అవకాశముంది. ఎనిమిదేళ్ల తర్వాత టెస్టు జట్టులోకి వచ్చి.. వరుసగా మూడు మ్యాచ్‌ల్లో ఆడినప్పటికీ ఒక్క అర్ధశతకం కూడా సాధించలేకపోయిన కరుణ్ నాయర్‌కు మరో అవకాశం ఇస్తామని కెప్టెన్ శుభ్‌మన్ సంకేతాలు ఇచ్చాడు. గత మ్యాచ్‌లో వేలి గాయంతో ఇబ్బంది పడ్డ రిషబ్ పంత్ ఈ మ్యాచ్‌లో ఆడబోతుండడం భారత్‌కు ఉపశమనాన్నిచ్చేదే. భారత బౌలింగ్ విభాగం ఎలా ఉండబోతోందన్నది అత్యంత ఆసక్తి రేకెత్తిస్తున్న విషయం. ఆకాశ్‌దీప్ ఈ మ్యాచ్‌కు దూరమయ్యాడు. నితీశ్ కూడా అందుబాటులో లేదు కాబట్టి ప్రదర్శన బాగాలేక చోటు కోల్పోయిన ప్రసిద్ధ్, శార్దూల్ వైపు చూడాల్సి వస్తోంది. కొత్తగా జట్టులోకి వచ్చిన అన్షుల్ కాంబోజ్‌ను ఆడించే అవకాశాలూ కొట్టిపారేయలేం. ఓల్డ్ ట్రాఫోర్డ్ పిచ్ పేసర్లకు అనుకూలమన్న అంచనాల నేపథ్యంలో రెండో స్పిన్నర్ సుందర్‌ను పక్కనపెట్టి ఓ పేసర్‌ను ఆడించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. జట్టు యాజమాన్యం ఆ దిశగా ఆలోచిస్తే శార్దూల్‌కు ఛాన్స్ దక్కొచ్చు.

ఈసారి ఆ తప్పులు చేయొద్దు: తొలి టెస్టుల్లో, మూడో టెస్టులో భారత్ బాగా ఆడలేదని అనలేం. ఎక్కువ శాతం మ్యాచ్‌లో మన జట్టే ఆధిపత్యం చలాయించింది. కానీ కీలక దశల్లో ఉదాసీనతతో, తప్పిదాలతో పట్టు బిగించే అవకాశాన్ని కోల్పోయింది. తొలి టెస్టులో ఫీల్డింగ్ వైఫల్యాలు, లోయరార్డర్ తడబాటు దెబ్బ తీస్తే.. మూడో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో పంత్ రనౌట్, రెండో ఇన్నింగ్స్‌లో టాప్ ఆర్డర్ వైఫల్యం కొంప ముంచాయి. ఇలా చేజేతులా ఓటములు కొనితెచ్చుకున్న భారత జట్టు.. నాలుగో టెస్టులో మాత్రం చిన్న పొరపాటుకూ తావిచ్చే పరిస్థితి లేదు. ఈ మ్యాచ్ ఓడితే సిరీస్ చేజారుతుంది కాబట్టి ఇటు బ్యాటింగ్‌లో, అటు బౌలింగ్‌లో ఉత్తమ ప్రదర్శనతో ప్రత్యర్థికి చెక్ పెట్టాల్సిన అవసరముంది. రాహుల్, జైస్వాల్, శుభ్‌మన్, పంత్, జడేజా మంచి లయలో ఉన్నారు. రాహుల్, జైస్వాల్ శుభారంభాలివ్వడం.. శుభ్‌మన్ మళ్లీ ఓ పెద్ద ఇన్నింగ్స్ ఆడడం కీలకం. పంత్ ఆడకపోతే ఆ లోటును భర్తీ చేయడం తేలిక కాదు. సుదర్శన్ రెండో అవకాశాన్ని ఎంతమేర ఉపయోగించుకుంటాడో చూడాలి. బౌలింగ్‌లో బుమ్రా, సిరాజ్ జట్టును ముందుండి నడిపించాల్సి ఉంది. ఆడిన రెండు టెస్టుల్లో బుమ్రా ఓ ఇన్నింగ్స్‌లో సత్తా చాటి మరో ఇన్నింగ్స్‌లో నిరాశపరిచాడు. సిరాజ్ కూడా నిలకడగా రాణించాల్సిన అవసరముంది.

జోరుమీద ఇంగ్లాండ్: లార్డ్స్‌లో ప్రతికూల పరిస్థితులను అధిగమించి విజయం సాధించిన ఇంగ్లాండ్.. నాలుగో టెస్టుకు ఉత్సాహంగా సిద్ధమైంది. ఆర్చర్ రాకతో ఆ జట్టు బౌలింగ్ బలం పెరిగింది. అతను గత మ్యాచ్‌లో రాణించాడు. వోక్స్, కార్స్‌ల ప్రదర్శన కూడా మెరుగుపడింది. స్టోక్స్ గత మ్యాచ్‌లో ఆల్‌రౌండ్ మెరుపులతో అదరగొట్టాడు. లార్డ్స్‌లో అతను గొప్ప పోరాటతత్వాన్ని ప్రదర్శించాడు. సిరీస్‌లో రూట్, బ్రూక్, జేమీ స్మిత్, డకెట్ కీలక ఇన్నింగ్స్ ఆడారు. గాయపడ్డ బషీర్ స్థానంలో డాసన్‌ను తీసుకున్న ఇంగ్లాండ్.. ఇంకేం మార్పులు లేకుండా బరిలోకి దిగుతోంది. విజయోత్సాహంలో ఉన్న ఇంగ్లాండ్‌ను ఆపడం భారత్‌కు తేలిక కాదు.


స్టోక్స్

"ఆకాశ్, అర్ష్‌దీప్ ఈ మ్యాచ్‌కు అందుబాటులో లేరు. అయినా మేం 20 వికెట్లు తీయగలమనే అనుకుంటున్నాం. అన్షుల్ అరంగేట్రానికి దగ్గరగా ఉన్నాడు. జట్టులో స్థానానికి అతడికి, ప్రసిద్ధ్‌కు మధ్య పోటీ ఉంది. కరుణ్ బ్యాటింగ్‌లో సమస్యేమీ లేదు. అతను బాగా ఆడుతున్నాడు. అతనో 50 పరుగులు చేస్తే అంతా సర్దుకుంటుంది. పంత్ ఈ మ్యాచ్‌లో ఆడతాడు. వికెట్ కీపింగ్ అతనే చేస్తాడు. లార్డ్స్ టెస్టులో మూడో రోజు సాయంత్రం జరిగిన దాని గురించి అందరూ మాట్లాడుతున్నారు. 7 నిమిషాల సమయం ఉంటే. . ఇంగ్లాండ్ ఓపెనర్లు ఒకటిన్నర నిమిషం ఆలస్యంగా వచ్చారు. కావాలని ఆలస్యం చేయడం క్రీడా స్ఫూర్తి కిందికి రాదు"

– శుభ్‌మన్ గిల్, భారత కెప్టెన్

"ఈ సిరీస్‌లో ఇరు జట్లూ పోటాపోటీగా తలపడుతున్నాయి. నాణ్యమైన క్రికెట్ ఆడుతున్నాం. మూడు టెస్టులు ఎంతో ఆసక్తికరంగా సాగాయి. ఇది పెద్ద సిరీస్. బాగా ఆడాలన్న ఒత్తిడి ఈ జట్ల మీదా ఉంటుంది. మేం కావాలని అదే పనిగా స్లెడ్జింగ్ చేయాలనుకోం. కానీ ప్రత్యర్థి జట్టు ఘర్షణకు దిగితే మేం ఎంతమాత్రం వెనక్కి తగ్గం"

– బెన్ స్టోక్స్, ఇంగ్లాండ్ కెప్టెన్

పేస్ పిచ్

ఓల్డ్ ట్రాఫోర్డ్ పిచ్ ఇంగ్లాండ్‌లో అత్యంత వేగవంతమైన వికెట్లలో ఒకటి. పేసర్లు ఇక్కడ బాగా ప్రభావం చూపుతారు. బ్యాటర్లు తొలి సెషన్లలో జాగ్రత్తగా ఆడాల్సిందే. బ్యాటింగ్ మరీ కష్టమేమీ కాదు. కుదురుకుంటే పెద్ద స్కోర్లు చేయొచ్చు. మ్యాచ్‌కు వరుణుడు కొంత అంతరాయం కలిగించొచ్చు.

ఎడ్జ్‌బాస్టన్‌లో సాధించారు.. మరిక్కడ?

ఇంగ్లాండ్‌లో ఒక్క టెస్టూ గెలవని మైదానంగా ఎడ్జ్‌బాస్టన్‌లో పేలవ రికార్డును ఈ సిరీస్‌లో సవరించింది టీమ్ ఇండియా. రెండో టెస్టులో అక్కడ ఘనవిజయం సాధించిన భారత్.. తనకు పేలవ రికార్డున్న మరో మైదానంలో మ్యాచ్‌కు సిద్ధమైంది. మాంచెస్టర్‌లోని ఓల్డ్ ట్రాఫోర్డ్‌లోనూ భారత్ ఒక్క విజయమూ సాధించలేదు. ఇక్కడ 9 మ్యాచ్‌లు ఆడి 4 ఓడిన టీమ్‌ఇండియా.. 5 మ్యాచ్‌లను డ్రా చేసుకుంది. మరి ఇక్కడ కూడా రికార్డును సవరిస్తుందా?

తుది జట్లు

భారత్ (అంచనా): రాహుల్, జైస్వాల్, సాయి సుదర్శన్, శుభ్‌మన్ (కెప్టెన్), పంత్, కరుణ్ నాయర్, జడేజా, సుందర్/శార్దూల్, బుమ్రా, సిరాజ్, ప్రసిద్ధ్/అన్షుల్ కాంబోజ్; **ఇంగ్లాండ్:** క్రాలీ, డకెట్, రూట్, పోప్, బ్రూక్, స్టోక్స్ (కెప్టెన్), జేమీ స్మిత్, డాసన్, వోక్స్, కార్స్, ఆర్చర్.

భారత మహిళలదే వన్డే సిరీస్

- మూడో మ్యాచ్‌లో ఇంగ్లాండ్‌పై విజయం
- హర్మన్‌ప్రీత్ సెంచరీ
- విజృంభించిన క్రాంతి గౌడ్


హర్మన్‌ప్రీత్

చెస్టర్ లీ స్ట్రీట్: ఇంగ్లాండ్‌లో తొలిసారి టీ20 సిరీస్ చేజిక్కించుకున్న భారత మహిళల జట్టు వన్డే ఫార్మాట్లోనూ అదరగొట్టింది. వన్డే సిరీస్‌ను 2-1తో గెలుచుకుంది. కెప్టెన్ హర్మన్‌ప్రీత్ కౌర్ (102; 84 బంతుల్లో 14×4) మెరుపు శతకానికి క్రాంతి గౌడ్ (6/52) సూపర్ బౌలింగ్ తోడవడంతో మంగళవారం చివరిదైన మూడో మ్యాచ్‌లో భారత్ 13 పరుగుల తేడాతో ఇంగ్లాండ్‌పై విజయం సాధించింది. హర్మన్‌ప్రీత్‌తో పాటు జెమీమా రోడ్రిగ్స్ (50; 45 బంతుల్లో 7×4) మెరవడంతో మొదట భారత్ 5 వికెట్ల నష్టానికి 318 పరుగులు చేసింది. భారత్ టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకోగా.. ఓపెనర్లు స్మృతి మంధాన (45), ప్రతీక రావల్ (26) తొలి వికెట్‌కు 64 పరుగులు జోడించారు. ఇద్దరూ కొద్ది తేడాలో ఔటయ్యారు. అయితే హర్మన్‌ప్రీత్ కీలక ఇన్నింగ్స్ ఆడింది. హర్లీన్ డియోల్ (45)తో మూడో వికెట్‌కు 81 పరుగులు జోడించిన ఆమె.. జెమీమాతో నాలుగో వికెట్‌కు 77 బంతుల్లోనే 110 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పింది. అర్ధశతకం కోసం 54 బంతులు ఆడిన హర్మన్‌ప్రీత్.. మరో 28 బంతుల్లోనే శతకాన్నందుకోవడం విశేషం. ఆమె 49వ ఓవర్లో వెనుదిరిగింది. ఆఖర్లో రిచా ఘోష్ (38 నాటౌట్; 18 బంతుల్లో 3×4, 2×6) చెలరేగింది. ఛేదనలో ఇంగ్లాండ్ 49.5 ఓవర్లలో 305 పరుగులకు ఆలౌటైంది. క్రాంతి గౌడ్ అద్భుత బౌలింగ్‌తో ఆ జట్టుకు కళ్లెం వేసింది. శ్రీ చరణి రెండు వికెట్లు పడగొట్టింది. నాట్ సీవర్ (98; 105 బంతుల్లో 11×4) గొప్పగా ఆడినా.. ఇంగ్లాండ్‌ను గెలిపించలేకపోయింది. ఎమ్మా లాంబ్ (68), అలిస్ (44) రాణించారు.

క్రీడా పాలన బిల్లు పరిధిలోకి బీసీసీఐ

దిల్లీ: జాతీయ క్రీడా పాలన బిల్లు పరిధిలోకి బీసీసీఐ రానున్నట్లు తెలుస్తోంది. బుధవారం పార్లమెంటులో కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ప్రవేశపెట్టనుంది. ప్రభుత్వ నిధులపై ఆధారపడనప్పటికీ జాతీయ క్రీడా బోర్డు నుంచి బీసీసీఐ గుర్తింపు పొందాల్సి ఉంటుందని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి. "క్రీడా పాలన బిల్లు పార్లమెంటులో చట్టంగా మారితే అన్ని జాతీయ క్రీడా సమాఖ్య (ఎన్ఎస్ఎఫ్)ల మాదిరిగానే బీసీసీఐ నిబంధనల్ని పాటించాల్సి ఉంటుంది. ఇతర ఎన్ఎస్ఎఫ్‌ల మాదిరే స్వయం ప్రతిపత్తి కలిగిన సంస్థగానే కొనసాగొచ్చు. కాని వివాదాలు తలెత్తినప్పుడు జాతీయ క్రీడా ట్రైబ్యునల్ పరిధిలోకి వస్తుంది. బీసీసీఐతో సహా ఎన్ఎస్ఎఫ్‌ల ఎన్నికల నుంచి సెలక్షన్ వరకు వివాద పరిష్కార సంస్థగా ట్రైబ్యునల్ పనిచేస్తుంది. అయితే ఈ బిల్లు ద్వారా ఎన్ఎస్ఎఫ్‌లపై ప్రభుత్వ నియంత్రణ ఉండదు. క్రీడా సమాఖ్యల సుపరిపాలనకు సహాయకారిగా మాత్రమే ప్రభుత్వం వ్యవహరిస్తుంది" అని క్రీడా మంత్రిత్వ శాఖ వర్గాలు పేర్కొన్నాయి.

బోర్డు అధ్యక్షుడిగా కొనసాగనున్న బిన్నీ!

బీసీసీఐ అధ్యక్షుడిగా రోజర్ బిన్నీ కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. 70 ఏళ్ల నిబంధన నుంచి బిన్నీకి వెసులుబాటు లభించొచ్చని తెలుస్తోంది. ఈనెల 19న బిన్నీ 70 ఏళ్లు పూర్తి చేసుకున్నాడు. బీసీసీఐ నియమావళి ప్రకారం 70 ఏళ్లు పూర్తి చేసుకున్న కార్యవర్గ సభ్యులు పదవిలో కొనసాగేందుకు అనర్హులు. దీంతో బిన్నీ స్థానంలో సీనియర్ ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా తాత్కాలికంగా బాధ్యతలు చేపట్టొచ్చని కథనాలు వచ్చాయి. అయితే సెప్టెంబరులో వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) జరగనున్నందున, అప్పటి వరకు బిన్నీ అధ్యక్షుడిగా కొనసాగొచ్చని తెలుస్తోంది. మరోవైపు బుధవారం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న జాతీయ క్రీడా పాలన బిల్లు కూడా బిన్నీ కలిసొచ్చే అవకాశముందని సమాచారం. ఈ బిల్లు చట్టంగా మారితే మిగతా జాతీయ క్రీడా సమాఖ్యల మాదిరిగానే అన్ని నిబంధనల్ని బీసీసీఐ పాటించాల్సి ఉంటుంది. ఈ బిల్లులో జాతీయ క్రీడా సమాఖ్యల కార్యవర్గ సభ్యుల గరిష్ఠ వయసు 70 నుంచి 75 ఏళ్లకు పొడిగించే నిబంధన ఉండటం బిన్నీకి సానుకూలాంశం. దీంతో రెండు నెలల కోసం శుక్లాకు బాధ్యతలు అప్పగించాలా? లేదా బిల్లు పాసయ్యే వరకు ఎదురు చూడాలా? అన్న విషయంలో బీసీసీఐ పెద్దలు తర్జనభర్జన పడుతున్నారు.


ప్రణయ్

ప్రణయ్ ముందంజ

చాంగ్‌జౌ: చైనా ఓపెన్ ప్రపంచ టూర్ సూపర్ 1000 టోర్నీలో తొలిరోజు భారత్‌కు మిశ్రమ ఫలితాలు ఎదురయ్యాయి. అగ్రశ్రేణి ఆటగాడు హెచ్.ఎస్.ప్రణయ్ ప్రీక్వార్టర్‌ఫైనల్లోకి ప్రవేశించగా.. మరో స్టార్ షట్లర్ లక్ష్యసేన్ టోర్నీ నుంచి నిష్క్రమించాడు. మంగళవారం పురుషుల సింగిల్స్ తొలి రౌండ్లో ప్రణయ్ 8-21, 21-16, 23-21తో కొకి వతనబె (జపాన్)పై గెలుపొందాడు. గొప్పగా పోరాడిన ప్రణయ్.. అయిదు మ్యాచ్ పాయింట్లు కాపాడుకుని అద్భుత విజయంతో అదరగొట్టాడు. నిర్ణయాత్మక మూడో గేమ్‌లో 2-11తో వెనుకంజలో ఉన్న ప్రణయ్ వరుసగా 5 పాయింట్లతో లయను అందుకున్నాడు. అయినా అంతరం తగ్గకపోవడంతో వతనబె 20-15తో మ్యాచ్ పాయింటుకు చేరువయ్యాడు. మరొక్క పాయింటు గెలిచుంటే ప్రత్యర్థిదే మ్యాచ్. అయితే పోరాటస్ఫూర్తి కనబరిచిన ప్రణయ్ వరుసగా అయిదు మ్యాచ్ పాయింట్లను కాపాడుకుని 20-20తో స్కోరును సమం చేశాడు. 21-20తో ఆధిక్యంలోకి వచ్చిన ప్రణయ్.. మరో రెండు పాయింట్లు సాధించి చిరస్మరణీయ విజయాన్ని సొంతం చేసుకున్నాడు. లక్ష్యసేన్ 21-14, 22-24, 11-21తో అయిదో సీడ్ షి ఫెంగ్ (చైనా) చేతిలో పోరాడి ఓడాడు. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో అనుపమ ఉపాధ్యాయ 23-21, 11-21, 10-21తో లిన్ సియాంగ్ (చైనీస్ తైపీ) చేతిలో పరాజయం చవిచూసింది. మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్లో రోహన్ కపూర్- గద్దె రుత్విక శివాని జోడీ 27-25, 16-21, 14-21తో వాంగ్ తీన్- లిమ్ సీన్ (మలేసియా) జంట చేతిలో ఓటమి పాలయింది.

భారత్ అండర్-19 279 ఆలౌట్

చెమ్స్‌ఫోర్డ్: అండర్-19 యూత్ రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 279 పరుగులకే ఆలౌటైంది. ఓవర్‌నైట్ స్కోరు 51/1తో మూడో రోజు, మంగళవారం తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన భారత్ ఒక దశలో 170/1తో మెరుగైన స్థితిలో నిలిచినా.. తర్వాత తడబడి 300లోపు స్కోరుకే పరిమితమైంది. విహాన్ మల్హోత్రా (120) సెంచరీతో సత్తా చాటాడు. కెప్టెన్ ఆయుష్ మాత్రే (80) రాణించాడు. రాల్ఫీ ఆల్బర్ట్ (6/53) భారత్‌ను కట్టడి చేశాడు. తొలి ఇన్నింగ్స్‌లో 30 పరుగుల ఆధిక్యాన్ని అందుకున్న ఇంగ్లాండ్.. ఆట చివరికి రెండో ఇన్నింగ్స్‌లో వికెట్ కోల్పోకుండా 93 పరుగులు చేసింది. తొలి ఇన్నింగ్స్‌లో ఇంగ్లాండ్ 309 పరుగులు చేసింది.

హంపి, దివ్య గేమ్‌లు డ్రా

బటుమి (జార్జియా): ఫిడే మహిళల ప్రపంచ కప్ చెస్ టోర్నీ సెమీఫైనల్లో భారత క్రీడాకారిణులు కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ తమ తొలి గేమ్‌లను డ్రా చేసుకున్నారు. టింగ్జీ (చైనా)తో నల్లపావులతో ఆడిన హంపి.. త్వరగానే గేమ్‌ను డ్రాగా ముగించింది. మాజీ ప్రపంచ ఛాంపియన్ జాంగ్‌యి తాన్‌తో పోరులో నల్ల పావులతో బరిలో దిగిన దివ్య బలమైన డిఫెన్స్‌తో ప్రత్యర్థిని ఇబ్బంది పెట్టింది. ఈ గేమ్ కూడా చివరికి డ్రానే అయింది. రెండో గేమ్‌లో హంపి, దివ్య తెల్ల పావులతో ఆడతారు. ఈ గేమ్‌లో నెగ్గితే ఫైనల్ చేరతారు. ఒకవేళ మళ్లీ డ్రా అయితే.. టైబ్రేక్ తప్పదు.



యుఎస్ జట్టుకు ప్రత్యేక బహుమతి

2024 టీ20 ప్రపంచకప్‌లో మెరుగైన ప్రదర్శన చేసిన అమెరికా జట్టుకు ఐసీసీ వార్షిక సమావేశంలో ప్రత్యేక బహుమతి దక్కింది. సింగపూర్‌లో జరిగిన సమావేశంలో ఐసీసీ ఛైర్మన్ జై షా చేతుల మీదుగా యుఎస్ క్రికెట్ బోర్డు ఛైర్మన్ పి.సి.కె.వేణు, సీఈవో జొనాథన్ అట్కిన్సన్ ఈ బహుమతిని అందుకున్నారు.

అర్జున్ చాలా మంచి అబ్బాయి..


ఎల్లా

దిల్లీ: ప్రపంచ నంబర్‌వన్ మాగ్నస్ కార్ల్‌సన్ భారత చెస్ ఆటగాళ్లను ఎంతగా అభిమానిస్తాడో తెలిసిందే. అతడి భార్య ఎల్లా ఇప్పుడో ఆసక్తికర విషయం వెల్లడించింది. ప్రజ్ఞానంద ఆట తన ఆట లాగే ఉంటుందని కార్ల్‌సన్ భావిస్తాడని చెప్పింది. అర్జున్ ఇరిగేశి చాలా మంచి అబ్బాయని అంది. "ఆ ముగ్గురు (గుకేశ్, ప్రజ్ఞానంద, అర్జున్) భిన్నమైన ఆటగాళ్లు. కానీ ప్రజ్ఞానంద ఆట తన ఆటలా ఉంటుందని మాగ్నస్ చెబుతుంటాడు" అని ఎల్లా చెప్పింది. అర్జున్ గురించి మాట్లాడుతూ.. "అర్జున్ చక్కని కుర్రాడు. అతడితో మాట్లాడినప్పుడు అది తెలుస్తుంది. ఆడేటప్పుడు మాత్రం అర్జున్ చాలా దూకుడుగా ఉంటాడు. ప్రతి గేమ్‌లోనూ గెలవాలనే కసితో ఆడతాడు. చాలా ప్రమాదకర ఆటగాడు" అని పేర్కొంది.

మళ్లీ పడ్డ పాక్.. బంగ్లాదే సిరీస్

ఢాకా: శ్రీలంకలో శ్రీలంకపై టీ20 సిరీస్ సాధించిన బంగ్లా.. స్వదేశంలో పాకిస్థాన్‌కు షాకిచ్చింది. మూడు టీ20ల సిరీస్‌ను మరో మ్యాచ్ మిగిలుండగానే ఆ జట్టు 2-0తో చేజిక్కించుకుంది. మంగళవారం ఉత్కంఠభరితంగా సాగిన రెండో టీ20లో ఆ జట్టు 8 పరుగుల తేడాతో విజయం సాధించింది. మొదట అహ్మద్ డానియల్ (2/23), సల్మాన్ మీర్జా (2/17), అబ్బాస్ అఫ్రిది (2/37)ల ధాటికి బంగ్లా 133 పరుగులకే ఆలౌటైంది. జేకర్ అలీ (55), మెహిదీ హసన్ (33) పోరాడి జట్టుకు గౌరవప్రదమైన స్కోరునందించారు. అనంతరం షోరిఫుల్ ఇస్లామ్ (4/17), తంజిమ్ హసన్ (2/23), మెహిదీ హసన్ (2/25) విజృంభించడంతో పాక్ ఒక దశలో 47 పరుగులకే 7 వికెట్లు కోల్పోయింది. ఈ స్థితిలో ఫహీమ్ అష్రాఫ్ (51), అబ్బాస్ అఫ్రిది (19), డానియల్ (17) పోరాడినా జట్టును గెలిపించలేకపోయారు. పాక్ 19.2 ఓవర్లలో 125 పరుగులకు ఆలౌటైంది.

వైష్ణవికి పతకం ఖాయం

బెర్లిన్: భారత అమ్మాయి వైష్ణవి అడ్కర్ సత్తా చాటింది. ప్రపంచ యూనివర్సిటీ క్రీడల్లో టెన్నిస్‌లో సెమీఫైనల్ చేరడం ద్వారా పతకం ఖాయం చేసింది. మహిళల సింగిల్స్ క్వార్టర్‌ఫైనల్లో ఆమె 6-1, 6-4తో సినా హెర్మాన్ (జర్మనీ)పై విజయం సాధించింది. 1979 మెక్సికోలో జరిగిన ప్రపంచ యూనివర్సిటీ క్రీడల్లో టెన్నిస్‌లో నందన్ బాల్ పతకం గెలిచిన తర్వాత భారత్ తరఫున ఈ ఆటలో పతకం తెచ్చిన ఘనత వైష్ణవిదే. ఈ క్రీడల్లో టెన్నిస్‌లో సెమీస్ చేరిన వాళ్లకు పతకాలు దక్కుతాయి.


సర్ఫరాజ్

సర్ఫరాజ్ 17 కిలోలు తగ్గి..

ముంబయి: దేశవాళీలో అదరగొడుతున్నా అధిక బరువు యువ బ్యాటర్ సర్ఫరాజ్ ఖాన్ కెరీర్‌కు అడ్డంకిగా మారింది. తాజాగా ఇంగ్లాండ్‌తో సిరీస్‌లోనూ అతడికి టీమ్‌ఇండియాలో చోటు దక్కలేదు. ఐపీఎల్‌లోనూ ఏ జట్టూ అతడి పట్ల ఆసక్తిని ప్రదర్శించలేదు. పునరాగమనం చేయాలన్న కసితో ఉన్న ఈ బ్యాటర్.. రెండు నెలల నుంచి జిమ్‌లో కష్టపడి బరువును బాగా తగ్గించుకున్నాడు. ఒక్కసారిగా 17 కిలోలు తగ్గిపోయాడు. పాత రూపం మారి ఫిట్‌గా మారిన సర్ఫరాజ్.. జిమ్‌లో ఉన్న ఫొటోను సామాజిక మాధ్యమంలో పంచుకున్నాడు. "సర్ఫరాజ్ ఆహారంలో రోటీ, పంచదార, మైదా, బేకరీ పదార్థాలను పూర్తిగా నిషేధించాం. బ్రోకలి, క్యారెట్స్, సలాడ్స్, గ్రిల్డ్ చికెన్, చేపలు, ఉడకబెట్టిన గుడ్లు తదితర పదార్థాలను చేర్చాం" అని అతడి తండ్రి నౌషద్ ఖాన్ తెలిపాడు. ఇంగ్లాండ్‌తో సిరీస్‌లో ఆడే అవకాశం రాకపోయినా భారత్-ఎ తరఫున ఇంగ్లాండ్ లయన్స్‌పై అనధికారిక టెస్టుల్లో సర్ఫరాజ్ ఆడాడు. తొలి టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 92 పరుగులు చేశాడు.

మెరిసిన సీఫర్ట్

దక్షిణాఫ్రికాపై న్యూజిలాండ్ విజయం


సీఫర్ట్

హరారె (జింబాబ్వే): సీఫర్ట్ (66 నాటౌట్) మెరవడంతో ముక్కోణపు టీ20 సిరీస్‌లో మంగళవారం న్యూజిలాండ్ 7 వికెట్ల తేడాతో దక్షిణాఫ్రికాపై ఘనవిజయం సాధించింది. మొదట దక్షిణాఫ్రికా 8 వికెట్లకు 134 పరుగులే చేయగలిగింది. ఆడమ్ మిల్నె (2/21), శాంట్నర్ (2/26), డఫి (2/33) ఆ జట్టును కట్టడి చేశారు. హెండ్రిక్స్ (41) టాప్ స్కోరర్. సీఫర్ట్, మిచెల్ (20 నాటౌట్) రాణించడంతో లక్ష్యాన్ని కివీస్ 15.5 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి ఛేదించింది. ఈ రెండు జట్లే శనివారం ఫైనల్లో ఢీకొంటాయి. నామమాత్రమైన మ్యాచ్‌లో గురువారం న్యూజిలాండ్‌తో ఆతిథ్య జింబాబ్వే తలపడుతుంది.

భారత సైన్యానికి అపాచీలు



దిల్లీ: భారత సైనిక పోరాట సామర్థ్యానికి సానబెడుతూ మూడు అపాచీ పోరాట హెలికాప్టర్లు మంగళవారం మన దేశానికి చేరాయి. ఇది దేశ రక్షణ సత్తాను బలోపేతం చేసే దిశగా ముందడుగు అని రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. మొత్తం ఆరు అపాచీ ఏహెచ్-64ఈలు కొనుగోలుకు భారత్.. అమెరికాకు చెందిన బోయింగ్ సంస్థతో రూ.4,168 కోట్ల ఒప్పందాన్ని కుదుర్చుకుంది. మిగిలిన మూడు ఈ ఏడాది చివరిలోగా అందుతాయి. ఆధునిక క్షిపణులు, రాకెట్లతో కూడిన ఈ లోహవిహంగం.. ప్రతికూల ప్రాంతాల్లో భారత సైన్యంలోని విమానయాన విభాగం సామర్థ్యాన్ని మరింత మెరుగుపరుస్తుంది. భారత వాయుసేన వద్ద ఇప్పటికే 22 అపాచీ హెలికాప్టర్లు ఉన్నాయి.

మిగ్-21లకు వీడ్కోలు!



దిల్లీ: భారత వాయుసేనకు 60 ఏళ్లపాటు వెన్నెముకగా నిలిచిన మిగ్-21 యుద్ధవిమానాలను సర్వీసు నుంచి పూర్తిగా ఉపసంహరించనున్నట్లు అధికార వర్గాలు తెలిపాయి. సెప్టెంబరు 19న చండీగఢ్‌లోని వైమానిక స్థావరంలో జరిగే ఒక కార్యక్రమంలో వీటి సేవలకు లాంఛనంగా స్వస్తి పలకనున్నట్లు వివరించాయి. అక్కడి 23వ స్క్వాడ్రన్‌లో ఈ జెట్‌లు భాగంగా ఉన్నాయి.

ఎయిరిండియా విమానంలో మంటలు



దిల్లీ: హాంకాంగ్ నుంచి దిల్లీ విమానాశ్రయానికి చేరుకున్న కాసేపటికే ఎయిరిండియా విమానం ఆగ్జిలరీ పవర్ యూనిట్(ఏపీయూ)లో మంటలు చెలరేగాయి. మంగళవారం మధ్యాహ్నం జరిగిన ఈ ప్రమాదంలో ప్రయాణికులు, సిబ్బంది సురక్షితంగా బయటపడటంతో పెనుప్రమాదం తప్పింది. "ఏఐ 315 విమానం నుంచి ప్రయాణికులు దిగడం మొదలుపెట్టాక ఈ ఘటన జరిగింది. సిస్టం డిజైను ప్రకారం ఏపీయూ దానంతట అదే మూతపడింది. విమానం స్వల్పంగా దెబ్బతింది. ప్రయాణికులు, సిబ్బంది సాధారణంగానే దిగి సురక్షితంగా ఉన్నారు. దీనిపై తదుపరి దర్యాప్తు కోసం విమానాన్ని నిలిపివేశాం" అని ఎయిరిండియా 'ఎక్స్'లో పేర్కొంది.

యునెస్కో నుంచి మళ్లీ వైదొలగిన అమెరికా

2026 డిసెంబరులో అమల్లోకి

పారిస్: 'ఐక్యరాజ్యసమితి విద్య, విజ్ఞానిక సాంస్కృతిక సంస్థ' (యునెస్కో) నుంచి తాను మరోసారి వైదొలగుతున్నట్లు అమెరికా మంగళవారం ప్రకటించింది. సంస్థ ప్రదర్శిస్తున్న ఇజ్రాయెల్ వ్యతిరేకత కారణంగానే.. చేరిన రెండేళ్లకే వైదొలగుతున్నామని స్పష్టంచేసింది. "గత నవంబరులో జరిగిన ఎన్నికల్లో అమెరికన్లు ఏ విలువల కోసం ఓటేశారో వాటికి భిన్నంగా విభజన ధోరణులతో కూడిన సాంస్కృతిక, సామాజిక విషయాలకు మద్దతు తెలుపుతున్న యునెస్కో నుంచి అమెరికా వైదొలగాలని దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ నిర్ణయించారు" అని శ్వేతసౌధ ప్రతినిధి అన్నా కెల్లీ ఒక వార్తా ప్రకటనలో తెలిపారు. పారిస్ కేంద్రంగా పనిచేస్తున్న యునెస్కో నుంచి అమెరికా వైదొలగడం ఇది మూడోసారి. ట్రంప్ పాలనలో ఇలా జరగడం ఇది రెండోసారి. తాజా నిర్ణయం 2026 డిసెంబరు చివరినుంచి అమలులోకి వస్తుంది. 2017లో తన తొలి పదవీకాలంలో సైతం ట్రంప్ యునెస్కో ఇజ్రాయెల్ వ్యతిరేక విధానాలు అవలంబిస్తోందన్న కారణంగానే సంస్థ నుంచి వైదొలగారు.



మీ ఉద్యోగులు సాధికారత సాధించాలంటే..!

మీ ఉద్యోగులను నిజంగా సాధికారులుగా తీర్చిదిద్దాలనుకుంటున్నారా? అయితే ముందుగా వారిని విశ్వసించండి. బృంద నాయకుల అసలు బాధ్యత.. ఉద్యోగులను నియంత్రించడం కాదు. నాయకులు సంపూర్ణ విశ్వాసంతో బాధ్యతలు కట్టబెట్టినప్పుడే.. ఉద్యోగులు తమ విధుల్లో వినూత్నంగా ఆలోచిస్తారు. అప్పుడే వారి పూర్తిస్థాయి శక్తి సామర్థ్యాలు బయటికొస్తాయి.

– అమన్ సహోటా, లీడర్షిప్ కోచ్

ఓటర్ల జాబితాపై స్తంభించిన పార్లమెంటు

- ఉభయసభల్లో విపక్షాల నిరసనలు
- చర్చ.. రచ్చ ద్వంద్వవైఖరి: ప్రభుత్వం

దిల్లీ: ఎన్నికలకు ముందు బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక ముమ్మర సవరణ (ఎస్ఐఆర్) పార్లమెంటు ఉభయసభల్ని మంగళవారం స్తంభింపజేసింది. దీనిపై చర్చ చేపట్టాల్సిందేనని విపక్షాలు గట్టిగా డిమాండ్ చేసి, సభల్లో ఇతర కార్యకలాపాలు జరగకుండా అడ్డుకున్నాయి. చర్చ జరగాలని ఒకపక్క కోరుతూ మరోపక్క సభకు అంతరాయం కలిగించడం విపక్షాల ద్వంద్వవైఖరిని చాటుతోందని ప్రభుత్వం వ్యాఖ్యానించింది. ఎలాంటి చర్చ లేకుండానే ఉభయసభలూ బుధవారానికి వాయిదాపడ్డాయి. మధ్యాహ్న భోజన విరామంలోపే లోక్‌సభ రెండుసార్లు స్వల్ప విరామాలతో వాయిదా పడింది. మూడోసారి సమావేశమైనప్పుడూ ఇదే పరిస్థితి కొనసాగింది. విపక్ష సభ్యులు స్పీకర్ స్థానం వద్ద బైఠాయించారు. ఎస్ఐఆర్‌ను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ వైఖరిని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఖండించారు. "ఆపరేషన్ సిందూర్‌పై తొలుత చర్చ చేపట్టాలని సభా వ్యవహారాల సంఘం సమావేశంలో అంగీకారం కుదిరింది. నిబంధనలకు విరుద్ధంగా నినాద ఫలకాలతో సభకు రావడం తగదు. చర్చకు సిద్ధమేనని ప్రభుత్వం చెబుతున్నా సభను అడ్డుకోవడం ఏమిటి? ఈ ద్వంద్వ ప్రమాణాలు తప్పు. రగడ సృష్టించి పార్లమెంటు సమయాన్ని వృథా చేస్తున్నారు" అని మండిపడ్డారు. నినాదాలు, నినాద ఫలకాల ప్రదర్శనలు సభ గౌరవాన్ని దిగజారుస్తున్నాయని స్పీకర్ ఓంబిర్లా చెప్పారు.



రాజ్యసభకు అధ్యక్షత వహించిన హరివంశ్

బిహార్ ఎన్నికల జాబితా ఎస్ఐఆర్ సహా వివిధ అంశాలపై రాజ్యసభలోనూ విపక్షాలు గళమెత్తాయి. ప్రధాని సమక్షంలో ఆపరేషన్ సిందూర్‌పై చర్చించాలని డిమాండ్ చేశాయి. ఎస్ఐఆర్‌పై 12మంది సభ్యులు వాయిదా తీర్మాన నోటీసులు ఇచ్చారు. దానిని అనుమతించాలని పట్టుబట్టారు. మధ్యాహ్నంలోపు రెండుసార్లు సభ వాయిదాపడింది. మధ్యాహ్నం రెండు గంటలకు మూడోసారి సమావేశమై నిమిషాల్లోనే మరుసటిరోజుకు వాయిదాపడింది. తర్వాత పార్లమెంటు ప్రాంగణంలో మకరద్వారం వద్ద విపక్షాలు నిరసన ప్రదర్శన నిర్వహించి నినాదాలిచ్చాయి. ఛైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ సభాధ్యక్ష స్థానంలో ఆసీనులయ్యారు.

ధన్‌ఖడ్‌తో బలవంతంగా రాజీనామా: విపక్షాలు

దిల్లీ: ఉప రాష్ట్రపతిగా జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంపై కాంగ్రెస్‌సహా పలు ప్రతిపక్ష పార్టీలు అనుమానాలను వ్యక్తం చేశాయి. ఆయనకు అనారోగ్యం సమస్య కాదని, దాని వెనుక లోతైన కారణాలున్నాయని, అది బలవంతపు రాజీనామా అని కాంగ్రెస్ విమర్శించింది. ప్రధాని మోదీ సహృదయంతో ఉండాలని, రాజీనామాపై ప్రభుత్వం తరఫున వివరణ ఇప్పించాలని డిమాండు చేసింది. రైతు బిడ్డకు (కిసాన్ పుత్ర) కనీసం గౌరవమైన వీడ్కోలు కార్యక్రమమూ జరగలేదని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ విమర్శించారు.

■ 'ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షాలే ఈ పరిణామానికి కారణం చెప్పగలరు. ధన్‌ఖడ్ అనారోగ్య కారణంతో మాత్రం రాజీనామా చేయలేదన్న విషయం కచ్చితంగా తెలుస్తోంది' అని సీపీఐ ఎంపీ సంతోష్ కుమార్ పేర్కొన్నారు.


■ ధన్‌ఖడ్ అనూహ్యంగా రాజీనామా చేయడాన్ని ఆప్ 'తీవ్ర పరిణామం'గా పేర్కొంది. దీనిపై స్పష్టమైన వివరణ ఇవ్వాలని కేంద్రాన్ని ఆప్ నేత సంజయ్ సింగ్ డిమాండు చేశారు.

■ బిహార్ సీఎం నీతీశ్ కుమార్ సీటును అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే మార్చేందుకు వీలుగా ధన్‌ఖడ్‌తో భాజపా రాజీనామా చేయించిందని ఆర్జేడీ ఆరోపించింది.

■ ధన్‌ఖడ్ ఆరోగ్యం బాగానే ఉందని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ పేర్కొన్నారు. రాజీనామా వెనుక కంటికి కనిపించని కారణాలేవో ఉన్నాయని అభిప్రాయపడ్డారు.

రాష్ట్రపతికి గడువుపై మీ అభిప్రాయమేంటి?

- బిల్లుల ఆమోదంలో కేంద్రం, రాష్ట్ర ప్రభుత్వాలకు సుప్రీంకోర్టు నోటీసులు



దిల్లీ: శాసనసభలు ఆమోదించిన బిల్లులపై నిర్దిష్ట గడువులోగా నిర్ణయం తీసుకోవాలంటూ గవర్నర్లు, రాష్ట్రపతికి కోర్టులు నిర్దేశించవచ్చా అనే అంశంపై అభిప్రాయాలు చెప్పాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సర్వోన్నత న్యాయస్థానం నోటీసులు జారీ చేసింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు సభ్యుల రాజ్యాంగ ధర్మాసనం మంగళవారం విచారణను చేపట్టింది. ఈ నెల 29 నాటికి దీనిపై స్పందన తెలియజేయాలని ఆదేశించింది. 'రాజ్యాంగ వ్యాఖ్యానానికి సంబంధించిన సమస్యలు ఉన్నాయి. ఈ విషయంలో సాయం చేయాలని అటార్నీ జనరల్‌ను కోరుతున్నాం. కేంద్రంతోపాటు రాష్ట్ర ప్రభుత్వాలకు ఆదేశాలు జారీ చేశాం. కేంద్రం తరఫున విచారణకు సొలిసిటర్ జనరల్ హాజరు కావాలి. అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు సమాచారం అందించాం. సంబంధిత న్యాయవాదులు అందరికీ నోటీసులు జారీ చేశాం. తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేశాం' అని ధర్మాసనం పేర్కొంది. సీజేఐ జస్టిస్ బి.ఆర్.గవాయ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనంలో జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పి.ఎస్.నరసింహ, జస్టిస్ ఎ.ఎస్.చందూర్కర్ సభ్యులుగా ఉన్నారు. రాష్ట్రపతి సంధించిన 14 ప్రశ్నల అంశానికి విచారణ అర్హత లేదంటూ కేరళ, తమిళనాడు రాష్ట్రాల తరఫున హాజరైన సీనియర్ న్యాయవాదులు కె.కె.వేణుగోపాల్, పి.విల్సన్ అభ్యంతరం తెలిపారు. సీజేఐ జస్టిస్ గవాయ్ జోక్యం చేసుకుంటూ...మీ అభ్యంతరాలను ఆగస్టులో ప్రారంభమయ్యే వాదనల్లో వినిపించవచ్చని తెలిపారు. శాసనసభలు ఆమోదించిన బిల్లులపై ఆయా రాష్ట్రాల గవర్నర్లు, రాష్ట్రపతి ఒక కాల వ్యవధిలోగా చర్యలు తీసుకోవాలంటూ గత ఏప్రిల్‌లో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. దీనిపై స్పందించిన రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము తనకు రాజ్యాంగంలోని 143(1) అధికరణం ద్వారా సంక్రమించిన అధికారాలను ఉపయోగించుకొని 14 కీలక ప్రశ్నలను సుప్రీంకోర్టును అడిగారు. ఈ అంశంపై విచారణ షెడ్యూల్‌ను ఈ నెల 29న ఖరారు చేసి ఆగస్టులో విచారణ ప్రారంభించనున్నట్లు సుప్రీంకోర్టు తెలిపింది.

గాజాలో 20 ఆకలి చావులు

- ఇజ్రాయెల్ దాడుల్లో మరో 20 మంది బలి



గాజాలో మంగళవారం మానవతా సహాయం కింద వచ్చిన పిండి బస్తాలను తీసుకెళ్తున్న పాలస్తీనియన్లు

డెయిర్ అల్ బలా: ఇజ్రాయెల్ దిగ్బంధనంలో విలవిలలాడుతున్న గాజా ప్రాంతంలో ఆకలి చావుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. గడచిన 48 గంటల్లో ఈ ప్రాంతంలో 20 మంది ఆకలితో మరణించారని హమాస్ మంగళవారం ప్రకటించింది. ఇది కనీవినీ ఎరుగని పరిణామమని పాలస్తీనాలో హమాస్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆరోగ్యశాఖ డైరెక్టర్ మునీర్ అల్ బరష్ అన్నారు. గాజాలో యుద్ధం ప్రారంభమైన నాటి నుంచీ మొత్తం 88 మంది ఆకలి చావుకు గురయ్యారనీ, వారిలో 20 మంది గత రెండు రోజుల్లోనే మృతి చెందడం విషమిస్తున్న పరిస్థితికి అద్దం పడుతోందని ఆయన పేర్కొన్నారు. కాగా గాజాలో ఇప్పటివరకూ తీవ్ర పోరాటానికి దూరంగా ఉన్న ప్రాంతాల్లోకి ఇజ్రాయెల్ బలగాలు చొచ్చుకుపోతున్నాయి. మరోవైపు ఇజ్రాయెల్ యథేచ్ఛగా మారణహోమాన్ని కొనసాగిస్తోంది, తాజా దాడుల్లో 20 మంది పాలస్తీనీయులు మరణించారు. మరో 38 మంది గాయపడ్డారు. మరోవైపు గాజా నగరంలో ఆహారం కోసం ఎదురుచూస్తున్న సమూహంపై జరిగిన దాడిలో మరో 8 మంది మరణించారు.

సాధ్యమైనంత త్వరలోనే ఉప రాష్ట్రపతి ఎన్నిక!

- ఎన్డీయే విజయం సునాయాసమే..

దిల్లీ: జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా చేయడంతో ఖాళీ అయిన ఉప రాష్ట్రపతి పదవికి సాధ్యమైనంత త్వరగా ఎన్నికలు జరగనున్నాయి. రాజ్యాంగంలోని ఆర్టికల్ 68లో రెండో నిబంధన ప్రకారం.. ఉప రాష్ట్రపతి మరణించినా, రాజీనామా చేసినా, తొలగించినా, ఇతర కారణాలవల్ల ఖాళీ అయినా.. వెంటనే ఎన్నికలు జరగాల్సి ఉంది. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైనవారు మిగిలిన కాలానికి కాకుండా ఐదేళ్లపాటు పదవిలో ఉంటారు. పార్లమెంటు ఉభయ సభల్లోని సభ్యులు ఉప రాష్ట్రపతిని ఎన్నుకుంటారు. ఉప రాష్ట్రపతి ఎన్నికకు పార్లమెంటులో ఎన్డీయేకు స్పష్టమైన మెజారిటీ ఉంది. లోక్‌సభ, రాజ్యసభ సభ్యులతోపాటు రాజ్యసభలో నామినేటెడ్ సభ్యులకూ ఓటు హక్కు ఉంటుంది. ■ లోక్‌సభలో ప్రస్తుతం 542 మంది సభ్యులున్నారు. పశ్చిమ బెంగాల్‌లోని బసీర్‌హాట్ సీటు ఖాళీగా ఉంది. రాజ్యసభలో 240 మంది ఉన్నారు. 5 సీట్లు ఖాళీగా ఉన్నాయి. ■ నలుగురు నామినేటెడ్ సభ్యులతో కలిపి ఉభయ సభల మొత్తం సభ్యుల సంఖ్య ప్రస్తుతం 786గా ఉంది. ఇందులో మెజారిటీకి 394 మంది మద్దతు అవసరం. ■ లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో 129 మంది మద్దతుంది. మొత్తంగా 422 మంది సభ్యులు ఎన్డీయేకు అనుకూలంగా ఉన్నారు.

కొలను తవ్వకంలో బయల్పడిన పంచముఖి శివలింగం



బదాయూ (యూపీ): ఉత్తర్‌ప్రదేశ్‌లోని బదాయూ జిల్లా దాతాగంజ్ తహసీలు పరిధి సరాయ్ పిపరియా గ్రామంలో మంగళవారం కొలను తవ్వుతుండగా పంచముఖి శివలింగం బయటపడింది. ఇది దాదాపు 300 ఏళ్ల కిందటిది కావచ్చని స్థానిక బ్రహ్మదేవ్ మందిర పూజారి మహంత్ పరమాత్మా దాస్ మహరాజ్ తెలిపారు. అయిదు ముఖాల శివలింగాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పోటెత్తారు. కొలను తవ్వకం సమయంలో అక్కడే ఉన్న 'నర్మదా బచావో ఆందోళన్' కార్యకర్త, పర్యావరణవేత్త శిప్రా పాఠక్ మాట్లాడుతూ.. తన 13 ఎకరాల స్థలంలో తామర కొలను ఏర్పాటుకు ఈ తవ్వకాలు చేపట్టినట్లు తెలిపారు. ఈ జాగాలోనే 'పంచతత్వ పౌధ్‌శాల' పేరిట ఆమె నర్సరీని కూడా పెంచుతున్నారు. తన ఫౌండేషను ద్వారా ఏటా 5 లక్షల మొక్కల పంపిణీ లక్ష్యంగా పెట్టుకొన్న పాఠక్ శివలింగ ఆవిర్భావాన్ని భగవదనుగ్రహంగా అభివర్ణించారు. శివలింగం పరిశీలనకు పురావస్తుశాఖ అధికారులను పిలవనున్నట్లు దాతాగంజ్ సబ్ డివిజనల్ మెజిస్ట్రేట్ ధర్మేంద్ర కుమార్ సింగ్ తెలిపారు.

భారత్-పాక్ సరిహద్దులో డ్రోన్ స్క్వాడ్రన్

- ఏర్పాటు చేయనున్న బీఎస్ఎఫ్

దిల్లీ: భారత్ పాకిస్థాన్ సరిహద్దు వెంట తొలి డ్రోన్ స్క్వాడ్రన్ ఏర్పాటుపై సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) దృష్టి సారించింది. ఆపరేషన్ సిందూర్ నుంచి నేర్చుకున్న గుణపాఠాల నేపథ్యంలో మానవ రహిత వైమానిక వాహకాలను, డ్రోన్ దాడులను తిప్పికొట్టేందుకు చేపట్టిన పటిష్ఠమైన చర్యల్లో భాగంగా ఈ స్క్వాడ్రన్ ఏర్పాటుకు బీఎస్ఎఫ్ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. నిర్దిష్టమైన సరిహద్దు పోస్టుల వద్ద దీని స్థావరాలను ఏర్పాటు చేస్తారు. ఈ డ్రోన్‌లను సరిహద్దు వెంబడి నిఘా ఉంచడంతో పాటు, శత్రు సేనల కదలికల్ని గమనించడం, దాడుల్లో పాల్గొనడం వంటి కార్యకలాపాల్లో వినియోగిస్తారని అధికార వర్గాలు తెలిపాయి. ప్రత్యేకంగా శిక్షణ పొందిన సిబ్బంది వీటిని పర్యవేక్షిస్తారు. చండీగఢ్‌లోని బీఎస్ఎఫ్ పశ్చిమ కమాండ్ ప్రధాన కేంద్రం ఆధ్వర్యంలో ఈ స్క్వాడ్రన్ పని చేస్తుంది.

అమ్మను కొట్టాడని పదేళ్లు వెతికి మరీ హత్య

- ఉత్తర్‌ప్రదేశ్‌లోని లఖ్‌నవూలో ఘటన

లఖ్‌నవూ: తల్లిని కొట్టాడన్న కోపంతో ఓ తనయుడు పదేళ్లు వెతికి మరీ ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటన ఉత్తరప్రదేశ్‌లోని లఖ్‌నవూలో చోటుచేసుకుంది. సోను కశ్యప్ అనే యువకుడు తన స్నేహితులతో కలిసి లఖ్‌నవూలో కొబ్బరికాయల వ్యాపారం చేసే మనోజ్‌ను దారుణంగా హత్యచేశాడు. పోలీసుల కథనం ప్రకారం.. దాదాపు పదేళ్ల క్రితం జరిగిన ఓ వివాదంలో మనోజ్, సోను తల్లిని కొట్టి, అక్కడినుంచి పారిపోయాడు. తన తల్లిని కొట్టిన వ్యక్తిని ఎట్టి పరిస్థితుల్లో వదలకూడదనుకున్న సోను పదేళ్లుగా అతడి కోసం వెతుకుతున్నాడు. మున్షీపులియా ప్రాంతంలో మనోజ్ ఉన్నట్లు నిందితుడు మూడు నెలల క్రితం గుర్తించాడు. తన తల్లిని అవమానపరిచిన వ్యక్తిని హత్య చేయాలని సోను ప్రణాళిక రచించాడు. ఈ హత్య చేయడానికి సహకరిస్తే.. మందు పార్టీ ఇస్తానని తన స్నేహితులు రంజిత్, ఆదిల్, సలామ్, రెహ్మత్‌అలీలను ఒప్పించాడు. మనోజ్ ఒంటరిగా ఉన్న సమయంలో సోను తన స్నేహితులతో కలిసి అతడిని ఇనుప రాడ్‌లతో తీవ్రంగా కొట్టి పారిపోయాడు. బాధితుడిని స్థానికులు ఆసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మృతి చెందాడు. హత్య అనంతరం పార్టీ చేసుకుంటున్న ఫోటోలను నిందితులు సోషల్ మీడియాలో షేర్ చేయడంతో, సీసీ ఫుటేజీ ఆధారంగా మంగళవారం పోలీసులు వీరిని అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

విపక్షానిది గూండాగిరీ: భాజపా

దిల్లీ: పార్లమెంటులో విపక్షం గూండాగిరీ చేస్తోందని, బిహార్ ఎస్ఐఆర్‌ను అడ్డుకోవడం ద్వారా అక్రమ చొరబాటుదారులకు ఎన్నికల్లో ఓటుహక్కు లభించేలా చేయాలనుకుంటోందని భాజపా సీనియర్ నేత రవిశంకర్ ప్రసాద్ ఆరోపించారు. రాజ్యాంగం ప్రకారం ఎన్నికల్లో ఓటు హక్కు భారతీయులకే ఉంటుందని, దానిని తనిఖీ చేస్తే సమస్యేమిటని ప్రశ్నించారు. మన దేశం ధర్మసత్రం కాదన్నారు. బిహార్‌లోని కొన్ని జిల్లాల్లో జనాభా సంఖ్య కంటే ఆధార్ కార్డులే ఎక్కువగా ఉన్నాయని చెప్పారు. ఆ రాష్ట్రంలో ఎన్నికల సంఘం 'ఓటుబందీ' చేస్తోందని, దానిపై చర్చకు అనుమతించక పార్లమెంటును వాయిదా వేస్తున్నారని కాంగ్రెస్ ఆరోపించింది. పార్లమెంటు సమావేశానికంటే ముందు ఇండియా కూటమి నేతలు సమావేశమయ్యారు. ప్రధాని సభకు వచ్చి కీలకాంశాలకు సమాధానమిచ్చేలా ఒత్తిడి చేయాలని దానిలో నిర్ణయించారు.

నాకు రమ్మీ ఆడటమే తెలియదు

మహారాష్ట్ర మంత్రి మాణిక్‌రావ్ కోకాటే

నాసిక్: అసెంబ్లీ సమావేశాల్లో రమ్మీ ఆడారంటూ ఆరోపణలు ఎదుర్కొంటున్న మహారాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి మాణిక్‌రావ్ కోకాటే మంగళవారం దీనిపై స్పందించారు. తనకు అసలు ఆన్‌లైన్‌లో రమ్మీ ఆడటమే తెలియదన్నారు. "రమ్మీ ఆడాలంటే బ్యాంక్ ఖాతాతో లింక్ అయి ఉండాలి. నా నంబరు లింక్ అయిందో, లేదో చెక్ చేసుకోవచ్చు" అని మంత్రి తెలిపారు. రాజీనామా చేయాలంటూ ప్రతిపక్షాలు చేస్తున్న డిమాండ్లను ఆయన ఖండించారు. దీనిపై సమగ్ర విచారణ చేపట్టాలని.. దోషిగా తేలితే రాజీనామా చేస్తానని కోకాటే స్పష్టంచేశారు. లేదంటే ఆరోపణలు చేస్తున్న వారిపై పరువు నష్టం దావా వేస్తానని హెచ్చరించారు. ఆ వీడియోపై విచారణ జరిపించాలని కోరుతూ.. ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడణవీస్‌కు లేఖ రాస్తానని కోకాటే వెల్లడించారు.

అత్యాచారం చేశాడంటూ కట్టు కథలు..

పుణెలో సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై కేసు

పుణె: తనపై ఓ డెలివరీ బాయ్ అత్యాచారానికి పాల్పడినట్లు తప్పుడు ఆరోపణలు చేసిన ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగినిపై మంగళవారం పుణె పోలీసులు కేసు నమోదు చేశారు. డెలివరీ ఏజెంట్‌గా తన ఫ్లాట్‌లోకి చొరబడి తనపై మత్తుపదార్థాలు చల్లి స్పృహ కోల్పోయేలా చేసి, అత్యాచారం చేశాడంటూ పుణెకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని(22) ఈ నెల 3న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై విచారణ జరపగా అసలు విషయం బయటపడింది. ఫ్లాట్‌కు వచ్చిన డెలివరీ బాయ్ ఆ మహిళ స్నేహితుడేనని గుర్తించారు. ఆమెపై ఎలాంటి అత్యాచారం జరగలేదని, కావాలనే పోలీసులను తప్పుదోవ పట్టించేలా కేసు బనాయించినట్లు తేల్చారు. దీంతో తిరిగి ఆమె పైనే పోలీసులు కేసు నమోదు చేశారు.

ఐఎంఎఫ్ నుంచి వైదొలగనున్న గీతా గోపీనాథ్



న్యూయార్క్: అంతర్జాతీయ ద్రవ్యనిధి(ఐఎంఎఫ్)లో డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్‌గా పనిచేస్తున్న భారత మూలాలున్న ఆర్థికవేత్త గీతా గోపీనాథ్ ఆగస్టులో తన పదవి నుంచి వైదొలగనున్నారు. గీత తర్వాత ఈ పదవి చేపట్టే వ్యక్తి పేరును త్వరలోనే ప్రకటిస్తామని ఐఎంఎఫ్ చీఫ్ క్రిస్టలినా జార్జివా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పదవి నుంచి వైదొలగిన తర్వాత సెప్టెంబరు 1న ఆమె తిరిగి హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో ఆర్థికశాస్త్ర ప్రొఫెసర్‌గా చేరనున్నారు. 2019లో ఐఎంఎఫ్‌లో ప్రధాన ఆర్థికవేత్తగా బాధ్యతలు చేపట్టిన తొలి మహిళ అయిన గీత ఈ పదవిలో ఏడేళ్లు కొనసాగారు.

అక్కడ సహకారం.. ఇక్కడ వ్యతిరేకం

- బిహార్‌లో ఓటరు జాబితా సవరణలో పార్టీల తీరుపై ఈసీ

దిల్లీ: బిహార్‌లో చేపట్టిన ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో క్షేత్రస్థాయిలో క్రియాశీలంగా పాల్గొంటున్న రాజకీయ పార్టీలు సుప్రీంకోర్టులో ఆ ప్రక్రియను వ్యతిరేకిస్తున్నాయని ఎన్నికల సంఘం (ఈసీ) పేర్కొంది. అర్హులైన ఓటర్లను చేరేందుకు రాజకీయ పార్టీలు 1.5 లక్షల మంది బూత్ స్థాయి ఏజెంట్ (బీఎల్ఏ)లను నియమించాయని ఈసీ సుప్రీంకోర్టుకు సమర్పించిన కౌంటర్ అఫిడవిట్‌లో పేర్కొంది. భాజపా అత్యధికంగా 52,698 మంది బీఎల్ఏలను నియమించగా, ఆర్జేడీ 47,506 మందిని, జేడీయూ 35,799 మందిని, కాంగ్రెస్ 16,676 బీఎల్ఏలను నియమించాయని కమిషన్ తెలియజేసింది. ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ ఓటరు జాబితాలోంచి అనర్హుల ఏరివేతకు తోడ్పడి ఎన్నికల స్వచ్ఛతకు దోహదపడుతుందని సుప్రీంకోర్టుకు సమర్పించిన అఫిడవిట్‌లో ఎన్నికల సంఘం పేర్కొంది. బిహార్‌లో ప్రారంభమైన ఎస్ఐఆర్‌ను దేశవ్యాప్తంగా నిర్వహించాలంటూ గతనెల 24న వెలువడిన ఆదేశాలను సవాలు చేస్తూ దాఖలైన ఒక పిటిషన్‌పై స్పందిస్తూ ఈసీ ఈ మేరకు తన వాదన వినిపించింది. చట్టపరమైన పరిమితులకు లోబడి ఇప్పటికే బిహార్ ఎస్ఐఆర్‌లో ఆధార్, ఓటరు గుర్తింపుకార్డు, రేషన్ కార్డుల్ని గుర్తింపు పత్రాలుగా పరిగణిస్తున్నామని ఈసీ సుప్రీంకోర్టుకు తెలియజేసింది. "ఓటరు జాబితాలోంచి అనర్హుల్ని ఏరివేసి ఎన్నికల్లో స్వచ్ఛత తెచ్చేందుకు ఎస్ఐఆర్ ఉపకరిస్తుంది. రాజ్యాంగంలోని 326వ అధికరణం, ప్రజా ప్రాతినిధ్య చట్టంలోని సెక్షన్ 16, 19ల మేళవింపే ఓటుహక్కు..ఓటు వేయడానికి పౌరసత్వం, వయసు, నివాసం అనే అర్హతలుండాలని ఇవి సూచిస్తున్నాయి. అర్హతలేని వ్యక్తికి ఓటేసే హక్కులేదు. అనర్హులు తమ విషయంలో 19వ, 21వ రాజ్యాంగ అధికరణ ఉల్లంఘనకు గురైందని చెప్పడానికి వీల్లేదు" అని కమిషన్ తన సవివరమైన అఫిడవిట్‌లో పేర్కొంది. సుప్రీంకోర్టు ఈనెల 17న జారీ చేసిన ఆదేశాలను ప్రస్తావిస్తూ ఆధార్, ఓటరు గుర్తింపు కార్డు, రేషన్ కార్డుల్ని ఎస్ఐఆర్ ప్రక్రియలో గుర్తింపు మాత్రానికే పరిమితమైన పత్రాలుగా ఇప్పటికే పరిగణిస్తున్నామని కమిషన్ పేర్కొంది.



వనవాటులోని ఎఫేట్ ద్వీప తీరంలో హవన్నా హార్బర్ వద్ద సముద్రపు అడుగున ఆహారాన్వేషణలో ఓ తాబేలు. పెరుగుతున్న సముద్ర మట్టాలతో ఈ ప్రాంతం క్రమేపీ సాగరజలాల్లో మునిగిపోతోంది. ప్రపంచ సరాసరితో పోలిస్తే ఇక్కడ సముద్ర మట్టాల పెరుగుదల ఎక్కువగా ఉంది.

ముంబయి రైళ్ల పేలుళ్ల కేసుపై సుప్రీంలో పిటిషన్ దాఖలు

- హైకోర్టు తీర్పును సవాలు చేసిన మహారాష్ట్ర ప్రభుత్వం

దిల్లీ: దాదాపు రెండు దశాబ్దాల క్రితం 2006లో జరిగిన ముంబయి రైళ్ల పేలుళ్ల కేసులో నిందితులుగా ఉన్న 12 మందిని నిర్దోషులుగా ప్రకటిస్తూ బాంబే హైకోర్టు ఇచ్చిన తీర్పును మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. ఉగ్ర నిరోధక దళం(ఏటీఎస్) మంగళవారం దాఖలు చేసిన పిటిషన్‌ను సర్వోన్నత న్యాయస్థానం ఈ నెల 24న విచారించనుంది. ఇది అత్యంత తీవ్రమైన విషయమని, దీనిపై అత్యవసర విచారణ జరపాలని ఏటీఎస్ తరఫు సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అత్యున్నత న్యాయస్థానాన్ని కోరారు. దీన్ని పరిగణనలోకి తీసుకున్న ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్, జస్టిస్ ఎన్.వి.అంజారియాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం విచారణ జరపనుంది. హైకోర్టు తీర్పు తర్వాత 8 మంది నిందితులు విడుదలైనట్లు వచ్చిన నివేదికలను సీజేఐ జస్టిస్ గవాయ్ ప్రస్తావించారు. పేలుళ్ల ఘటనలో నిందితులను బాంబే హైకోర్టు నిర్దోషులుగా తేల్చడంపై బాధిత కుటుంబ సభ్యులు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇన్ని సంవత్సరాలు జైలులో ఉన్నవారు నేరస్థులు కాకపోతే.. ఈ ఘటనకు కారకులెవరని ప్రశ్నించారు. తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తిచేస్తున్నారు.



భారత్ వీడిన బ్రిటన్ ఫైటర్ జెట్

తిరువనంతపురం: బ్రిటన్ నౌకాదళానికి చెందిన సూపర్ ఫైటర్ జెట్ ఎఫ్-35 ఎట్టకేలకు మంగళవారం కేరళ నుంచి తిరుగు పయనమైంది. ఈ విమానం సాంకేతిక లోపంతో గత నెల 14న తిరువనంతపురం విమానాశ్రయంలో అత్యవసరంగా ల్యాండ్ అయిన విషయం తెలిసిందే. దీంతో సుమారు ఐదు వారాలుగా ఇది భారత్‌లోనే ఉండిపోయింది. గత నెల రోజులుగా ఫైటర్ జెట్ ఇక్కడ ఉండటంతో పార్కింగ్, ల్యాండింగ్ ఛార్జీల కింద దాదాపు రూ.5-6 లక్షల వరకు బ్రిటన్ చెల్లించినట్లు సమాచారం. ఈ ఫైటర్ జెట్ ఆస్ట్రేలియా దిశగా ప్రయాణిస్తుండగా.. మార్గమధ్యంలో ఇంధన సమస్య, ప్రతికూల వాతావరణ పరిస్థితులు ఎదురయ్యాయి. దీంతో తిరువనంతపురంలో అత్యవసరంగా దిగింది. మరమ్మతుల నిమిత్తం బ్రిటన్ నుంచి 14 మంది ఇంజినీర్ల బృందం భారత్‌కు వచ్చింది. చివరకు లోపాలు సవరించిన అనంతరం ఫైటర్ తిరిగి వెళ్లేందుకు సోమవారం అనుమతి లభించింది. మరమ్మతుల సమయంలో భారత అధికారులు అందించిన సహకారానికి బ్రిటన్ ప్రతినిధులు కృతజ్ఞతలు తెలిపారు.

ఢాకా విమాన ప్రమాదంలో 31కి చేరిన మృతుల సంఖ్య

ఢాకా, దిల్లీ: బంగ్లాదేశ్ రాజధాని ఢాకాలో పాఠశాలపై వైమానిక దళానికి చెందిన ఎఫ్-7 బీజీఐ శిక్షణ యుద్ధ విమానం కూలిన ఘటనలో మృతి చెందిన వారి సంఖ్య 31కి చేరింది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఇదిలా ఉంటే.. బాధిత కుటుంబాలకు నష్టపరిహారం చెల్లించాలని, బంగ్లాదేశ్ ఉపయోగించే కాలం చెల్లిన శిక్షణ విమానాలను నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఢాకాలో విద్యార్థులు ఆందోళన నిర్వహించారు. మరోవైపు.. ఈ ప్రమాదంలో మృతిచెందిన వారి జ్ఞాపకార్థం మంగళవారం సంతాప దినంగా బంగ్లా ప్రభుత్వం ప్రకటించింది.

భారత్ నుంచి వైద్య బృందం

మరోవైపు.. యుద్ధ విమానం కూలిన ఘటనలో గాయపడిన వారికి చికిత్స అందించేందుకు భారత్ నుంచి ప్రత్యేక వైద్య బృందం ఢాకా వెళ్లనుంది. ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన ప్రధాని మోదీ.. బంగ్లాకు తగిన సహాయ సహకారాలు అందిస్తామని ప్రకటించారు. ఈ నేపథ్యంలో మంటలతో గాయాలైన వారికి ప్రత్యేక చికిత్స అందించేందుకు వైద్య నిపుణులను ఢాకా పంపనున్నట్లు విదేశీ వ్యవహారాల మంత్రిత్వ శాఖ మంగళవారం పేర్కొంది.

శైలి మారితే మతిమరపు మాయం!


అమెరికాలోని సెడార్ సిటీకి చెందిన డాన్ జోన్స్ స్కాటిష్ కంట్రోల్ ఇన్‌స్ట్రక్టర్‌గా పనిచేసేవారు. బ్యాగ్‌పైప్ వాయిద్యాన్ని వాయించడం ఆయన అభిరుచి. స్థానిక మ్యూజిక్ బ్యాండ్‌లో సభ్యుడిగా ఉంటూ కచేరీలతో జనాన్ని అలరించేవారు.

56 ఏళ్ల వయసులో ఉండగా..



2021లో తన బుర్రలో ఏదో మార్పులు జరుగుతున్నట్లు జోన్స్‌కు అనిపించింది. జ్ఞాపకశక్తి క్రమంగా సన్నగిల్లుతోంది. రోజువారీ పనులను గుర్తుపెట్టుకోవడమూ కష్టమైంది. వాటిని రాసుకోవాల్సి వచ్చింది. సంగీత బాణీల్లోనూ తడబాటు వచ్చింది. ఆయనకు తీవ్ర మతిమరుపు (డిమెన్షియా) వచ్చినట్లు వైద్యపరీక్షల్లో తేలింది. దీంతో ఆయన జీవితంలో శూన్యం ఆవరించింది. బ్యాగ్‌పైప్స్‌కు స్వస్తి పలకాల్సి వచ్చింది.

ఆరంభదశలో ఉన్న అల్జీమర్స్, డిమెన్షియా వంటి వ్యాధులను ఆహారం, జీవనశైలి మార్పులతో నయం చేసుకోవడం లేదా తీవ్రం కాకుండా చూసుకోవడం సాధ్యమేనా అన్నదానిపై అమెరికాలోని ప్రివెంటివ్ మెడిసిన్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (పీఎంఆర్‌ఐ) సంస్థ ఓ అధ్యయనాన్ని ఉపక్రమించింది. ఈ విషయం తెలుసుకున్న జోన్స్ సతీమణి దర్నా.. భర్తను ఆ అధ్యయనంలో భాగం చేశారు. అధ్యయనం ప్రారంభమైన కొద్దినెలలకే జోన్స్ పరిస్థితి మారింది. తిరిగి బ్యాగ్‌పైప్స్ చేతబట్టి వీనులవిందైన సంగీతాన్ని అందించడం మొదలుపెట్టారు. జోన్స్ ఒక్కరికే కాదు.. పీఎంఆర్‌ఐ పరిశోధనలో పాల్గొన్న అనేకమందిలో మెదడు పనితీరు, విషయగ్రహణ సామర్థ్యం గణనీయంగా మెరుగుపడింది.



ఏమిటీ పరిశోధన?

పరిశోధనకు కోసం 51 మందిని ఎంపిక చేశారు. వీరికి డిమెన్షియా ఆరంభ దశలో ఉంది. వీరిని రెండు బృందాలుగా పరిశోధకులు వర్గీకరించారు. ఇందులో ఒక బృందం పాత జీవనశైలినే కొనసాగించింది. రెండోది.. శాస్త్రవేత్తలు సూచించిన ఆహార, జీవనశైలి విధానాలకు మారింది.

ఆహారం ఇలా..

★ చాలా తక్కువగా ప్రాసెస్ చేసిన శాకాహారాన్ని మాత్రమే ఇచ్చారు. మాంసాహారం వర్జించారు. ★ కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు ఎక్కువగా ఉండేలా చూశారు. ఇందులో పండ్లు, కూరగాయలు, ముతక ధాన్యాలు, బీన్స్, సోయా ఉత్పత్తులు, విత్తనాలు, నట్స్ ఎక్కువగా ఉన్నాయి. ★ హానికారక కొవ్వులు, స్వీట్లు, రిఫైన్డ్ కార్బోహైడ్రేట్లు చాలా తక్కువగా ఉన్నాయి. ★ కర్కుమిన్‌తో కూడిన ఒమెగా-3 ఫ్యాటీ ఆమ్లాలు వంటి సప్లిమెంట్లను ఇచ్చారు. పసుపులో సహజసిద్ధంగా ఉండే కర్కుమిన్.. ఇన్‌ఫ్లమేషన్, యాంటీఆక్సిడెంట్ ప్రక్రియలను, అల్జీమర్స్‌కు కారణమయ్యే అమైలాయిడ్ పేరుకుపోవడాన్ని లక్ష్యంగా చేసుకుంటుంది. మల్టీవిటమిన్, ఖనిజాలు వంటివి కూడా ఇచ్చారు.

శారీరక కసరత్తులు



ఒత్తిడి నియంత్రణ, యోగా: రోజుకు దాదాపు గంటపాటు స్వల్పస్థాయి యోగాసనాలు, శ్వాసతో ముడిపడిన వ్యాయామాలు చేశారు. రిలాక్సేషన్, ఏకాగ్రత, అవగాహన పెంచడం వీటి ఉద్దేశం. సరైన నిద్ర ఉండేలా కూడా చూశారు.

బృంద తోడ్పాటు: భావోద్వేగ, సామాజిక తోడ్పాటు, కమ్యూనికేషన్ నైపుణ్యాల మెరుగు పరుచుకోవడం కోసం కొంతమందిని ప్రత్యేకంగా నియమించారు.

ఏం తేలింది?

పరీక్ష ముగిశాక రెండు వర్గాల పరిస్థితుల్లో మెదడు పనితీరులో మార్పులను శాస్త్రవేత్తలు పరిశీలించారు. జీవనశైలి మార్పులు చేసుకున్న బృందంలోని 71 శాతం మందిలో పరిస్థితి మెరుగుపడటం కానీ...లేదా క్షీణించకపోవడం కానీ జరిగింది. సాధారణ బృందంలో ఎవరి పరిస్థితీ మెరుగుపడలేదు. పైగా 68 శాతం మందిలో పరిస్థితి క్షీణించింది.

త్వరగా మేల్కొంటే మేలు..

మనిషి సాధారణ, ఆరోగ్యకర జీవితకాలాలకు మధ్య వ్యత్యాసం పెరుగుతున్న తరుణంలో సగటు ఆయుర్దాయంతోపాటు మతిమరుపు సహా వార్ధక్య రుగ్మతలకు ఆస్కారం పెరుగుతోంది. దీన్ని కూడా జీవనశైలి మార్పులతో నియంత్రణలో ఉంచుకోవచ్చని శాస్త్రవేత్తలు చెబుతున్నారు.

- ఈనాడు ప్రత్యేక విభాగం

వైకుంఠం క్యూ కాంప్లెక్స్-3 నిర్మాణంపై కమిటీ

- ఒంటిమిట్టలో నిరంతరాయంగా అన్నప్రసాదాలు
- తితిదే ధర్మకర్తల మండలి తీర్మానాలను వెల్లడించిన ఛైర్మన్, ఈవో

ఈనాడు, తిరుపతి - న్యూస్‌టుడే, తిరుమల: తిరుమలకు ప్రతిరోజూ 80 వేల మందికి పైగా భక్తులు వస్తున్న పరిస్థితుల్లో వైకుంఠం మూడో క్యూకాంప్లెక్స్-3 నిర్మాణంపై అధ్యయనానికి నిపుణుల కమిటీని నియమిస్తామని తితిదే ఈవో శ్యామలరావు చెప్పారు. తిరుమల అన్నమయ్య భవనంలో మంగళవారం తితిదే ధర్మకర్తల మండలి సమావేశం నిర్వహించారు. అనంతరం ఛైర్మన్ బీఆర్ నాయుడుతో కలిసి బోర్డు నిర్ణయాలను శ్యామలరావు వెల్లడించారు. 'కల్యాణకట్టకు రోజూ 30 వేలమందికి పైగా వస్తున్నందున మెరుగైన సౌకర్యాల కల్పనకు ప్రణాళిక రూపొందిస్తాం. అలిపిరి, శ్రీవారి మెట్టు నడక మార్గాల్లో భక్తులకు మౌలిక వసతులు కల్పిస్తాం. వైద్యులు, ఐటీ అనుభవజ్ఞులు, వృత్తి నిపుణులను శ్రీవారి సేవకులుగా ఎంపిక చేసి శిక్షణ ఇస్తాం. సైబర్ నేరాల అడ్డుకట్టకు సైబర్ సెక్యూరిటీ ల్యాబ్‌ను నెలకొల్పుతాం' అని ఈవో వెల్లడించారు.

ఇతర నిర్ణయాలివీ...

★ ఆర్‌అండ్‌బీ, ఐఐటీ తిరుపతితో చర్చించి... పాత వసతి భవనాల తొలగింపు, కొత్త వాటి నిర్మాణం. ★ త్వరలో మరో 700 మంది వేద పారాయణుల నియామకం. ★ శ్రీవాణి, రూ.300 టికెట్లు తీసుకున్న భక్తులకు వసతి కేంద్రాల ఏర్పాటుపై అధ్యయనానికి కన్సల్టెన్సీ. ★ ఒంటిమిట్ట కోదండరామస్వామి ఆలయానికి వచ్చే భక్తులకు త్వరలో నిరంతరాయంగా అన్నప్రసాదాలు... యంత్ర సామగ్రి, వసతులకు రూ.4.35 కోట్లు. ★ ఇటీవల నూతనంగా నిర్మించిన 320 ఆలయాలకు రూ.79.82 లక్షలతో మైక్ సెట్లు. ★ తిరుమలలో అన్ని విభాగాలూ ఒకే చోట ఉండేలా నూతన పరిపాలనా భవనం నిర్మాణానికి ఆమోదం.



హెచ్‌డీపీపీ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న బీఆర్ నాయుడు. చిత్రంలో శ్యామలరావు, వెంకయ్యచౌదరి, సుచిత్ర ఎల్ల, పనబాక లక్ష్మి, ప్రశాంతిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, నరేష్, దివాకర్‌రెడ్డి తదితరులు

ఆగస్టు 8 నుంచి 'సౌభాగ్యం'

తితిదే హిందూ ధర్మప్రచార పరిషత్(హెచ్‌డీపీపీ) ఆధ్వర్యంలో రూపొందించిన నూతన కార్యక్రమాల బ్రోచర్‌ను బీఆర్ నాయుడు ఆవిష్కరించారు. మానవీయ, నైతిక విలువలపై విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు సద్గమయ కార్యక్రమాన్ని ఈ నెల 28న ప్రారంభించనున్నట్లు చెప్పారు. తితిదే ఆలయాల్లో మహిళలకు గాజులు, పసుపు, కుంకుమ, అక్షింతలు ఇచ్చే 'సౌభాగ్యం' కార్యక్రమాన్ని ఆగస్టు 8న ప్రారంభిస్తామన్నారు. అక్టోబరు 2న అక్షర గోవిందం, డిసెంబరు 1న భగవద్గీతానుసారం-బోధన, 16 సంవత్సరాలలోపు పిల్లలకు 2026 వేసవి సెలవుల్లో సంప్రదాయ భజన శిక్షణను చేపడతామన్నారు. బోర్డు సభ్యులు సుచిత్ర ఎల్ల, పనబాక లక్ష్మి, ప్రశాంతిరెడ్డి, జంగా కృష్ణమూర్తి, నరేష్, తుడా ఛైర్మన్ దివాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అన్నమయ్య భవనం ఎదుట అత్యాధునిక సదుపాయాలతో రూ.60 లక్షలతో నిర్మించిన శ్రీవాణి దర్శన టికెట్ల జారీ కేంద్రం భవనాన్ని బీఆర్ నాయుడు ప్రారంభించారు.

నెయ్యి నాణ్యత విశ్లేషణకు... అత్యాధునిక ల్యాబ్ ప్రారంభం

తిరుమల, న్యూస్‌టుడే: తిరుమలలో ఆహార నాణ్యత పరీక్షల కోసం ఏర్పాటు చేసిన పరిశోధనశాలను మంగళవారం ఈవో శ్యామలరావుతో కలిసి తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రారంభించారు. గతంలో స్వామివారి ప్రసాదాలు, నెయ్యి నాణ్యతను పరీక్షించేందుకు ఇతర రాష్ట్రాలకు నమూనాలను పంపాల్సి వచ్చేదని, ఇప్పుడు తిరుమలలోనే ల్యాబ్‌ను అందుబాటులోకి తెచ్చినట్లు ఛైర్మన్ చెప్పారు. ఈవో శ్యామలరావు మాట్లాడుతూ.. నెయ్యి నాణ్యతను తక్షణమే విశ్లేషించే సామర్థ్యం ఉన్న గ్యాస్ క్రోమోగ్రాఫ్, హై పెర్ఫామెన్స్ లిక్విడ్ క్రోమోగ్రాఫ్‌లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. రూ.75 లక్షల విలువైన ఈ పరికరాలను గుజరాత్‌లోని నేషనల్ డెవలప్‌మెంట్ బోర్డు విరాళంగా ఇచ్చినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆధ్వర్యంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ ల్యాబ్‌ను రూ.20 కోట్లతో ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. అదనపు ఈవో వెంకయ్యచౌదరి, సీవీఎస్‌వో మురళీకృష్ణ, బోర్డు సభ్యులు శాంతారాం, సదాశివరావు, నరేష్, సీఈ సత్యనారాయణ, డిప్యూటీ ఈవోలు భాస్కర్, సోమన్నారాయణ తదితరులు పాల్గొన్నారు.



ల్యాబ్ పరికరాల వద్ద బీఆర్ నాయుడు, శ్యామలరావు, వెంకయ్యచౌదరి తదితరులు

ఎస్ఎస్‌డీ భక్తులకు సిఫార్సు లేఖలపై తితిదే గదుల కేటాయింపు రద్దు!

తిరుమల, న్యూస్‌టుడే: తిరుపతిలో స్లాటెడ్ సర్వదర్శనం (ఎస్ఎస్‌డీ) టోకెన్లు పొందిన భక్తులకు తిరుమలలో సిఫార్సు లేఖలపై గదుల కేటాయింపును తితిదే రద్దు చేసినట్లు సమాచారం. తిరుపతిలోని విష్ణునివాసం, శ్రీనివాసం, భూదేవి కాంప్లెక్స్‌లో ఎస్ఎస్‌డీ టోకెన్లు జారీ చేస్తారు. భక్తులు ఆ సమయానికి చేరుకుని శ్రీవారిని దర్శించుకోవాల్సి ఉంటుంది. అయితే కొందరు ముందుగానే తిరుమలకు చేరుకుని గదులు పొందేందుకు సిఫార్సు లేఖలు పొందుతున్నారు. వీరి సంఖ్య ఇటీవల పెరగడంతో ఇతర భక్తులకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అదేవిధంగా రూ.300 టికెట్లు పొందిన సుదూర ప్రాంతాల భక్తులకు మాత్రమే సిఫార్సులపై గదుల ఇవ్వనున్నట్లు తెలిసింది. శ్రీవాణి టికెట్లు పొందిన భక్తులు రెండుమూడు గదులు పొందుతున్నట్లు గుర్తించిన నేపథ్యంలో కుటుంబ సభ్యుల సంఖ్యకు అనుగుణంగా గదులు కేటాయించనున్నారు.

తిరుమల కల్తీ నెయ్యి కేసు.. పిటిషన్ ఉపసంహరించుకున్న వైవీ సుబ్బారెడ్డి

ఈనాడు, దిల్లీ: తిరుమల లడ్డూ ప్రసాదం తయారీలో కల్తీనెయ్యి వినియోగించినట్లు వచ్చిన అభియోగాలపై సిట్ కొనసాగిస్తున్న దర్యాప్తును చట్టవిరుద్ధమైందిగా ప్రకటించాలని కోరుతూ దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను వైకాపా ఎంపీ, తితిదే బోర్డు మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఉపసంహరించుకున్నారు. ప్రస్తుత దర్యాప్తు సుప్రీంకోర్టు జారీచేసిన ఉత్తర్వులకు చట్టవిరుద్ధంగా ఉందని ప్రకటించాలని కోరుతూ ఆయన వేసిన రిట్ పిటిషన్ మంగళవారం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయి, జస్టిస్ వినోద్‌చంద్రన్, జస్టిస్ అంజారియాలతో కూడిన ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. సుబ్బారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ దవే వాదనలు కూడా మొదలుపెట్టకుండానే పిటిషన్ ఉపసంహరణకు అవకాశం ఇవ్వాలని కోరారు. 'మేం పిటిషన్‌ను ఉపసంహరించుకుంటున్నాం. అందుబాటులో ఉన్న ఇతర పరిష్కార మార్గాలను అన్వేషించేందుకు స్వేచ్ఛనివ్వాలని కోరుతున్నాం' అని కోరారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గవాయి అందుకు అంగీకరించారు.

నకిలీ మద్యం ముఠాలకు తెలంగాణ నుంచి స్పిరిట్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో నకిలీ మద్యం తయారు చేస్తున్న ముఠాలకు తెలంగాణలోని మేడ్చల్‌లో ఉన్న కృష్ణా ఫార్మా కంపెనీ నుంచి స్పిరిట్ సరఫరా అవుతున్నట్లు ఎక్సైజ్ శాఖ దర్యాప్తులో వెల్లడైంది. కరోనా సమయంలో శానిటైజర్ల ఉత్పత్తి కోసం లభించిన తాత్కాలిక అనుమతిని దుర్వినియోగం చేస్తూ అక్రమంగా ఇథనాల్‌ను సరఫరా చేస్తున్నట్లు తేలింది. ఆ కంపెనీ యజమాని మల్లికార్జునరావు, రత్తుల శ్రీనివాస్, చరణ్‌జీత్ సేఠీ అనేవారు వీటిని సరఫరా చేస్తున్నట్లు నిర్ధారణ అయింది. ఈ నేపథ్యంలో ఆ కంపెనీ లైసెన్సు రద్దు చేయాలని కోరుతూ తెలంగాణ ప్రభుత్వానికి లేఖ రాయాలని ఏపీ ఎక్సైజ్ శాఖ నిర్ణయించింది.



పార్లమెంటు సమావేశాలకు సైకిల్‌పై వచ్చిన తెదేపా ఎంపీ అప్పలనాయుడు

నగరమంతా కాలుష్యం.. అందుకే చిన్న ప్రయత్నం!

పార్లమెంటు సమావేశాలకు ఎప్పుడూ సైకిల్‌పైనే వెళ్తుంటారు విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు. మంగళవారం కుండపోతగా వర్షం కురుస్తున్నప్పటికీ రెయిన్‌కోటు ధరించి, సైకిల్‌పైనే పార్లమెంటుకు చేరుకున్నారు. దిల్లీలో వాయు కాలుష్యాన్ని తగ్గించేందుకు తన వంతు ప్రయత్నంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

– న్యూస్‌టుడే, విజయనగరం అర్బన్

విశాఖ, విజయవాడ మెట్రో ప్రాజెక్టులు కేంద్ర నిధులతో చేపట్టండి

- అమరావతి పనుల పూర్తికి సహకరించాలి
- కేంద్రమంత్రికి తెదేపా ఎంపీల వినతి

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌కు చెందిన పలు పట్టణ ప్రాజెక్టులపై తెదేపా ఎంపీలు మంగళవారం ఇక్కడ కేంద్ర పట్టణాభివృద్ధిశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిశారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు నేతృత్వంలో ఎంపీలంతా కేంద్రమంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. పట్టణ పేదల ఇళ్ల నిర్మాణం పూర్తిచేయడంలో ఉన్న సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని, అమరావతిలో వివిధ ప్రాజెక్టుల పూర్తికి సహకరించాలని, విజయవాడ, విశాఖపట్నాల్లో మెట్రోరైలు ప్రాజెక్టులను కేంద్ర నిధులతోనే చేపట్టాలని కోరారు. ''విజయవాడ, విశాఖపట్నం మెట్రోరైలు ప్రాజెక్టులకు కలిపి రూ.39,362 కోట్లు ఖర్చవుతుందని అంచనా. 2017 మెట్రోరైలు విధానం కింద దీనికి కేంద్రం 100% ఆర్థిక సాయం చేయాలి. జాతీయ రహదారి 16లో విశాఖపట్నంలో 20 కిలోమీటర్లు, విజయవాడలో 4.7 కి.మీ. మేర ఇంటిగ్రేటెడ్ డబుల్ డెకర్ ఫ్లైఓవర్, మెట్రో కారిడార్ల నిర్మాణానికి అనుమతివ్వాలి. ఈ ప్రాజెక్టుల డీపీఆర్ తయారీ, దానికయ్యే ఖర్చును ఎన్‌హెచ్ఏఐతో కలిసి పంచుకోవడంపై పట్టణాభివృద్ధిశాఖ నిర్ణయించాలి' అని కేంద్ర మంత్రిని ఎంపీలు కోరారు.



కేంద్రమంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్‌ను కలిసిన కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు, ఎంపీలు

అమరావతి ప్రాజెక్టులకు మద్దతు ఇవ్వండి

అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద సీఆర్డీయే సమర్పించిన ప్రతిపాదనలకు త్వరగా ఆమోదం తెలపాలని కేంద్ర మంత్రిని ఎంపీలు కోరారు. హరిత రవాణా, పునరుత్పాదక ఇంధనం తదితర ప్రాజెక్టులు కేంద్రప్రభుత్వ లక్ష్యసాధనకు అనుగుణంగా ఉన్నందున కేంద్రం 25% ఆర్థికసాయం చేయాలని కోరారు. కేంద్ర ప్రజాపనుల విభాగం సచివాలయం, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల ఇళ్ల కోసం సీఆర్డీయే కేటాయించిన 22.53 ఎకరాల్లో పనులు చేపట్టాలని విజ్ఞప్తిచేశారు. హడ్కోతో కుదుర్చుకున్న భూకేటాయింపుల ఒప్పందం ఖరారుకు కేంద్ర పట్టణాభివృద్ధి సాయం చేయాలని కోరారు. 'ప్రధానమంత్రి ఆవాస్ యోజన 2.0 అమలులో సాంకేతిక సమస్యలు పరిష్కరించాలి. 2029 నాటికల్లా అందరికీ ఇళ్ల లక్ష్యాన్ని చేరుకునేలా పూర్తిస్థాయిలో మ్యాపింగ్ చేసేందుకు వీలు కల్పించాలి' అని కోరారు. బృందంలో ఎంపీలు దగ్గుమళ్ల ప్రసాదరావు, తెన్నేటి కృష్ణప్రసాద్, కలిశెట్టి అప్పలనాయుడు, బైరెడ్డి శబరి, మాగుంట శ్రీనివాసులురెడ్డి, కేశినేని శివనాథ్, పుట్టా మహేష్‌కుమార్, హరీష్‌మాథుర్ బాలయోగి, మతుకుమిల్లి శ్రీభరత్, బస్తిపాటి నాగరాజు ఉన్నారు.

ఏపీలో భాజపాను బలోపేతం చేయండి

పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్‌కు అమిత్ షా దిశానిర్దేశం

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లో భాజపా బలోపేతానికి పూర్తిస్థాయిలో శ్రమించాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్‌కు కేంద్ర హోం మంత్రి అమిత్ షా దిశానిర్దేశం చేశారు. అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన తర్వాత తొలిసారి దిల్లీకి వచ్చిన మాధవ్ మంగళవారం ఇక్కడ పార్లమెంట్ భవనంలో అమిత్ షాతో భేటీ అయ్యారు. రాష్ట్రంలో పార్టీ పరిస్థితి, కూటమి ప్రభుత్వ స్థితిగతుల గురించి వివరించారు. హోంమంత్రి స్పందిస్తూ కింది స్థాయి వరకు పార్టీని తీసుకెళ్లాలని, ఇందుకోసం విస్తృతంగా పర్యటించాలని సూచించారు. మాధవ్ భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్, దిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా తదితరులనూ కలిశారు.



కేంద్ర హోం మంత్రి అమిత్‌షాతో ఏపీ భాజపా అధ్యక్షుడు మాధవ్

★ కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో భాజపా ఏపీ అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్, కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మలు మంగళవారం ఇక్కడ భేటీ అయ్యారు. కూటమి పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి, దానికి కేంద్ర సాయం, రాజధాని అమరావతి నిర్మాణం తదితర అంశాలపై వారు ఆర్థిక మంత్రితో చర్చించారు.

బెంగళూరులో 7 కిలోల కొకైన్ స్వాధీనం

ఇద్దరు మహిళల అరెస్టు

బెంగళూరు (గ్రామీణం), న్యూస్‌టుడే: సబ్బుల పెట్టెల్లో కొకైన్ తీసుకువస్తున్న ఇద్దరు మహిళలను డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ అధికారులు బెంగళూరు కెంపేగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో అరెస్టు చేశారు. నిందితులను మణిపూర్‌కు చెందిన లాల్జమ్లుమై, మిజోరాంకు చెందిన లాల్ థాంగ్లియానియాలుగా గుర్తించారు. వీరి నుంచి రూ.14.69 కోట్ల విలువైన 7 కిలోల కొకైన్‌ను జప్తు చేసుకుని విచారణ చేపట్టామని తెలిపారు.

ఎంఐఎస్ కింద మామిడి సేకరణకు కేంద్రం ఆదేశం

- 1,62,500 టన్నుల కొనుగోలుకు అంగీకారం

ఈనాడు, అమరావతి: మార్కెట్ జోక్య పథకం (ఎంఐఎస్) కింద తోతాపురి మామిడి కొనుగోలుకు కేంద్రం అంగీకారం తెలిపింది. క్వింటాల్ ధర రూ.1,490.73 చొప్పున 1,62,500 (మొత్తం ఉత్పత్తిలో 25%) టన్నులు సేకరించేందుకు అనుమతించింది. అమ్మకపు ధర, నిర్ణయించిన ధర మధ్య వ్యత్యాసం క్వింటాల్‌కు రూ.372.68 (నిర్ణీత ధరలో 25%) చొప్పున ఉంటుందని.. దీనిని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు 50:50 నిష్పత్తిలో భరించాలని పేర్కొంది. రైతులకు డీబీటీ ద్వారా నగదు జమ చేయాలి. ఖాతాల పరిశీలన తర్వాత సంబంధిత మొత్తాన్ని చెల్లిస్తామని పేర్కొంటూ కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమశాఖ డిప్యూటీ కమిషనర్ బినోద్ గిరి రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాశారు. మామిడి రైతులను ఆదుకోవాలని కోరుతూ జూన్ 23న ముఖ్యమంత్రి చంద్రబాబు, ఈ నెల 4, 15, 17 తేదీల్లో వ్యవసాయశాఖ రాసిన లేఖలను ఈ సందర్భంగా ఉటంకించారు.

కేంద్రం నుంచి రూ.130 కోట్లు

మామిడి రైతులను ఆదుకునేందుకు మార్కెట్ జోక్య పథకం (ఎంఐఎస్) కింద కేంద్ర ప్రభుత్వం రూ.130 కోట్లు చెల్లిస్తోందని కేంద్ర గ్రామీణాభివృద్ధి, కమ్యూనికేషన్స్ శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మామిడి రైతులను ఆదుకునేందుకు కిలోకు రూ.4 చొప్పున రాష్ట్ర ప్రభుత్వం రూ.260 కోట్లు విడుదల చేసి కొనుగోలు చేయించిందని.. కేంద్రం అందులో సగం మొత్తాన్ని తిరిగి చెల్లిస్తుందన్నారు. ఈ మేరకు ఆదేశాలు కూడా వెలువడ్డాయని మంగళవారం దిల్లీలోని తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరించారు. తోతాపురి మామిడి సేకరణకు తొలిసారిగా మార్కెట్ జోక్యం పథకం అమలు చేశారని పేర్కొన్నారు.

వచ్చే ఏడాది ఏప్రిల్ నాటికి రామాయపట్నం పోర్టు ప్రారంభం

ఈనాడు, దిల్లీ: రామాయపట్నం పోర్టులో వచ్చే ఏడాది ఏప్రిల్ 24 నాటి కల్లా వాణిజ్య కార్యకలాపాలు ప్రారంభించబోతున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం తెలిపిందని కేంద్ర నౌకాయానం, జలమార్గాల శాఖ మంత్రి శర్బానంద్ సోనోవాల్ తెలిపారు. ఆయన మంగళవారం రాజ్యసభలో తెదేపా సభ్యుడు బీద మస్తాన్‌రావు అడిగిన ప్రశ్నకు ఈ సమాధానమిచ్చారు.

ఐదు కొత్త వైద్య కళాశాలల్లో సీట్లు యథాతథం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో ఐదు కొత్త వైద్య కళాశాలల్లోని సీట్లపై నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. ఒక్కో కళాశాలకు 150 సీట్లను జాతీయ వైద్య కమిషన్ (ఎన్ఎంసీ) తాజాగా వెబ్‌సైట్‌లో చూపడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. విజయనగరం, రాజమహేంద్రవరం, ఏలూరు, మచిలీపట్నం, నంద్యాలలోని ప్రభుత్వ వైద్య కళాశాలల్లో 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు తగ్గట్టు బోధకులు, సౌకర్యాలు లేకపోవడంపై ఎన్ఎంసీ గతంలో అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ అంశంపై గత నెలలో దిల్లీ వెళ్లిన ఉన్నతాధికారులు పరిస్థితులు సరిదిద్దుతామని లిఖితపూర్వక హామీ ఇచ్చారు. దీనిపై సంతృప్తి చెందిన ఎన్ఎంసీ ఆయా కళాశాలల్లోని సీట్లను యథాతథంగా ఉంచుతూ వాటిని వెబ్‌సైట్‌లో చూపింది.

3 ప్రైవేట్ వైద్య కళాశాలలకు జరిమానా

రాష్ట్రంలోని మూడు ప్రైవేట్ వైద్య కళాశాలల్లో ఫ్యాకల్టీ, సౌకర్యాలు కొరవడ్డాయని ఎన్ఎంసీ గుర్తించింది. ఆ మేరకు వాటికి జరిమానా విధించింది. తిరుపతిలోని శ్రీబాలాజీ మెడికల్ కాలేజీ- హాస్పిటల్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌కు రూ.20 లక్షలు, విజయవాడలోని నిమ్రా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు రూ.15 లక్షలు, కడపలోని ఫాతిమా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్‌కు రూ.10 లక్షల చొప్పున జరిమానా విధించింది. రెండు నెలల్లో ఆయా కళాశాలల్లో లోపాలు సరిదిద్దకపోతే చర్యలు తప్పవని షరతు విధిస్తూ, 2025-26 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకు అనుమతి ఇచ్చింది.

కొత్త పట్టాదారు పాసు పుస్తకాలకు 'రాజముద్ర'!

ఆగస్టు 15న పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు





రాజముద్రతో కొత్త పట్టాదారు పాసు పుస్తకం ★ గతంలో ఇలా..

సత్తెనపల్లి, పెదకూరపాడు, న్యూస్‌టుడే: వైకాపా ప్రభుత్వంలో తొలివిడత రీసర్వే చేసిన గ్రామాల్లో రైతులకు జారీ చేసిన పట్టాదారు పాసు పుస్తకంలో (టైటిల్ డీడ్‌లో) ప్రతి పేజీలో అప్పటి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రం ఉండేది. పుస్తకం కవర్ పేజీపై ఆయన పెద్ద చిత్రంతోపాటు ప్రతి పేజీలోనూ నవరత్నాల చిహ్నం కూడా ఉండడంతో రైతులు ఆందోళన చెందారు. తమ భూముల రికార్డుల్లో ఇలా ఉండడాన్ని అన్నదాతలు ఆక్షేపించినా నాటి వైకాపా ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ పొరపాటును కూటమి ప్రభుత్వం సరిదిద్దింది. తొలివిడత రీసర్వే పూర్తయిన గ్రామాల్లోని రైతుల ఇబ్బందులు తొలగించేలా ఎవరి చిత్రాలూ లేకుండా కేవలం రాజముద్రతో భూమి యాజమాన్య హక్కు పత్రం, పట్టాదారు పాసు పుస్తకాలు ముద్రించింది. పల్నాడు జిల్లాలోని 12 మండలాల్లో 10 వేల మంది రైతులకు కొత్త పట్టాదారు పాసు పుస్తకాలు వచ్చాయి. రాష్ట్రవ్యాప్తంగా ఆగస్టు 15న వీటిని పంపిణీ చేసేందుకు రెవెన్యూ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు.

తీరంలో అక్రమ నిర్మాణాల కేసులో నేహారెడ్డి, రోహిత్‌రెడ్డి పేర్లు

ఈనాడు, విశాఖపట్నం: విశాఖపట్నం జిల్లా భీమిలి తీరంలో సీఆర్‌జడ్ నిబంధనల ఉల్లంఘనలపై ఏపీ కోస్టల్ జోన్ మేనేజ్‌మెంట్ అథారిటీ ఇటీవల భీమిలి కోర్టులో వేసిన కేసులో నేహారెడ్డి, ఆమె భర్త రోహిత్‌రెడ్డి పేర్లు తాజాగా వెలుగులోకి వచ్చాయి. తీరంలో ఎలాంటి ఉల్లంఘనలు చేశారో ప్రస్తావిస్తూ మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి కుమార్తె నేహారెడ్డి, అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీ, నేహారెడ్డి భర్త రోహిత్‌రెడ్డిని బాధ్యులుగా అథారిటీ పేర్కొంది. 'భీమిలి తీరంలో కొంత ఆస్తిని మొదట విజయసాయిరెడ్డి కుమార్తె కొనుగోలు చేశారు. 2021, 2023లో వేర్వేరు సేల్ డీడ్‌లతో అవ్యాన్ రియల్టర్స్ పేరుపైకి మార్చారు. సీఆర్‌జడ్ నిబంధనలు ఉల్లంఘిస్తూ తీరంలో 10 అడుగుల్లోతులో పునాదులు వేసి, కాంక్రీట్ నిర్మాణాలు చేపట్టారు' అని వెల్లడించింది.

స్పందించని జీవీఎంసీ: తీరంలో 588 మీటర్ల పొడవున నిర్మించిన పునాదులు పూర్తిగా తొలగించలేదు. ఇప్పటి వరకు తొలగింపునకు రూ.50 లక్షలు ఖర్చయింది. మిగిలిన పనులకు రూ.50 లక్షలు అవ్వొచ్చు. ఈ ఖర్చును అవ్యాన్ రియల్టర్స్ ఎల్ఎల్‌పీ నుంచి వసూలు చేయాలని కోర్టు ఆదేశాలున్నా...ఇప్పటి వరకు జీవీఎంసీ ఆ ప్రయత్నం చేయలేదు. ఈ నిర్మాణాలపై జనసేన కార్పొరేటర్ మూర్తి యాదవ్ హైకోర్టులో వేసిన ప్రజా ప్రయోజన వ్యాజ్యంపై ఈనెల 30న విచారణ జరగనుంది. ఈ విచారణ సమయానికి నిర్మాణాలు పూర్తిగా తొలగించి పర్యావరణ కేంద్ర కమిటీ నివేదికలు సమర్పించాలన్న ఆదేశాలున్నాయి.

★ మరోవైపు తీరంలో పర్యావరణానికి జరిగిన నష్టం అంచనా వేయటానికి ఏర్పాటైన కేంద్ర కమిటీ ఈనెల 25న విశాఖకు రానున్నట్లు సమాచారం.

జీవచ్ఛవాలతో సహవాసం చేయకండి




నేటి సమాజంలో చాలామంది జీవచ్ఛవాలుగా బతుకుతున్నారు. సహానుభూతి, భావోద్వేగపరమైన మేధస్సు, ఇతరులకు మంచి చేయాలనే సదుద్దేశం.. ఇవేవీ వారిలో ఉండవు. అవతలి వ్యక్తుల శక్తి సామర్థ్యాలను తమకు అనుకూలంగా వాడుకోవాలని చూసేవారు మీ చుట్టూ కనిపిస్తుంటారు. అలాంటి జీవచ్ఛవాలు, స్వార్థపరుల చేతుల్లో చిక్కుకోకండి. మంచి మనుషులతోనే సహవాసం చేయండి. మంచివారు కనిపించకపోతే ఒంటరిగానే మీ ప్రయాణాన్ని కొనసాగించండి.

– శ్రద్ధే కటియార్, వైద్యుడు

EENADU Vol: 51, Issue: 344 | Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. | Founder Ramoji Rao

ఆహార చట్టం కింద 79 లక్షల మంది లబ్ధిదారులను చేర్చుకోవచ్చు



దిల్లీ: జాతీయ ఆహార భద్రత చట్టం కింద అందించే ఆహార ధాన్యాల లబ్ధిదారుల్లో అనర్హులను తొలగించి, మరో 79 లక్షల మంది లబ్ధిదారులను చేర్చుకోవచ్చని కేంద్రం తెలిపింది. "ఈ పథకం 81.35 కోట్ల మంది కోసం ఉద్దేశించగా.. ప్రస్తుతం 80.56 కోట్ల మందికి ఆహార ధాన్యాలు అందుతున్నాయి. మరో 79 లక్షల మందిని చేర్చుకోవచ్చు" అని వినియోగదారుల వ్యవహారాలు, ఆహార ప్రజా పంపిణీశాఖ సహాయ మంత్రి నిముబెన్ జయంతిభాయ్ బంభానియా మంగళవారం రాజ్యసభకు తెలియజేశారు.

విదేశీ నల్లధన చట్టం: 163 ప్రాసిక్యూషన్లు దాఖలు

బ్లాక్‌మనీ ఫారిన్ ఇన్‌కం అండ్ అసెట్స్ అండ్ ఇంపోజిషన్ ఆఫ్ ట్యాక్స్ యాక్ట్- 2015 కింద జులై 1, 2015 నుంచి మార్చి 31, 2025 మధ్య పన్ను, జరిమానా, వడ్డీ కింద రూ.338 కోట్లను ప్రభుత్వం వసూలు చేసిందని ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి లోక్‌సభకు తెలిపారు. సుమారు రూ.35,105 కోట్లకు పైగా పన్ను, జరిమానా డిమాండ్లను పెంచినట్లు, మొత్తం 163 ప్రాసిక్యూషన్ ఫిర్యాదులు దాఖలు చేసినట్లు పేర్కొన్నారు.

ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్‌లు రద్దుచేసే యోచనలేదు

షెడ్యూల్ తెగలు లేదా షెడ్యూల్ కులాల విద్యార్థులకు అందించే పోస్ట్‌మెట్రిక్ స్కాలర్‌షిప్ పథకాన్ని నిలిపివేయాలనే ప్రతిపాదనలేదని సామాజిక న్యాయం, సాధికారత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథావలే లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో తెలియజేశారు. ఇది 2025-26 కూడా కొనసాగుతుందా లేదా అనే ఆందోళనలు ఉన్న నేపథ్యంలో మంత్రి ఈ వివరణ ఇచ్చారు.

త్రైమాసికంలో దాదాపు 10 లక్షల టన్నుల డీఏపీని దిగుమతి చేసుకున్నాం

దేశీయ డిమాండును తీర్చడానికి ఏప్రిల్ నుంచి జూన్ మధ్య 9.74 లక్షల టన్నుల డై-అమ్మోనియం ఫాస్ఫేట్ (డీఏపీ)ని భారత్ దిగుమతి చేసుకుందని ప్రభుత్వం తెలిపింది. రసాయనాలు, ఎరువులశాఖ సహాయ మంత్రి అనుప్రియ పటేల్ డీఏపీ దిగుమతుల డేటాను రాజ్యసభలో పంచుకున్నారు. దీని ప్రకారం ఏప్రిల్-2.89 లక్షల టన్నులు, మే-2.36 లక్షల టన్నులు, జూన్-4.49 లక్షల టన్నులు భారత్ దిగుమతి చేసుకుంది.

స్పీకర్ ఓంబిర్లాతో అమిత్‌షా భేటీ

- జస్టిస్ వర్మ అభిశంసనకు లోక్‌సభలోనే తొలిఅడుగు!

దిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మంగళవారం లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా నివాసానికి వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా భేటీ అయ్యారు. అవినీతి ఆరోపణలను ఎదుర్కొంటున్న అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ అభిశంసనకు పార్లమెంటు ఉభయ సభల్లో పలువురు సభ్యులు నోటీసులిచ్చిన నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. సోమవారమే కొందరు సీనియర్ మంత్రులు పార్లమెంటు సముదాయంలోని స్పీకర్ కార్యాలయంలో ఓంబిర్లాను కలిశారు. రాజ్యసభలోనూ విపక్షాల నేతృత్వంలో పలువురు సభ్యులు తీర్మానాన్ని ప్రతిపాదించిన విషయం తెలిసిందే. అందువల్ల ఉభయసభలూ దీనిపై కలిసి పనిచేయనున్నాయి. తీర్మానంపై తొలుత లోక్‌సభలోనే ముందడుగు పడే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి.

ఆ పత్రిక జర్నలిస్టును పక్కనపెట్టిన ట్రంప్

వాషింగ్టన్: తనకు వ్యతిరేకంగా కథనాలు రాసిన వార్తాసంస్థలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్ట్ ట్రంప్ కత్తి దూస్తున్నారు. తాజాగా ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంలో ప్రధాన నిందితుడు జెఫ్రీ ఎప్‌స్టీన్, ట్రంప్ మధ్య ఉన్న సంబంధంపై 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' అనే అంతర్జాతీయ వార్త పత్రిక కథనాన్ని ప్రచురించిన విషయం తెలిసిందే. దీంతో ఆ పత్రికపై ట్రంప్ 10 బిలియన్ డాలర్ల పరువునష్టం దావా వేశారు. అక్కడితో ఆగకుండా.. ఆ వార్తాసంస్థకు చెందిన ఓ పాత్రికేయుడిని త్వరలో జరగనున్న తన స్కాట్‌లాండ్ పర్యటనను కవరేజి చేయకుండా బహిష్కరించారు. ఈ విషయాన్ని శ్వేతసౌధం వెల్లడించింది. "అసత్య కథనం ప్రచురించిన కారణంగా ఈ వారాంతంలో అధ్యక్షుడు ట్రంప్ చేపట్టనున్న స్కాట్‌లాండ్ పర్యటనను కవరేజి చేసేందుకు తొలుత అనుమతినిచ్చిన 13 వార్తాసంస్థల నుంచి 'ది వాల్ స్ట్రీట్ జర్నల్'ను బహిష్కరిస్తున్నాం" అని శ్వేతసౌధం మీడియా కార్యదర్శి కరోలిన్ లీవిట్ తెలిపారు.



పంతులమ్మ పాటలు, హెడ్ మసాజ్!

లఖ్‌నవూ: తరగతి గదిలో ఓ మహిళా ఉపాధ్యాయురాలు సెల్‌ఫోను ద్వారా బాలీవుడ్ పాటలు చూస్తూ.. జడ విప్పుకొని తలకు నూనె మర్దన చేసుకొంటున్న వీడియో యూపీలో వైరల్‌గా మారింది. విద్యార్థులు చదువుపై శ్రద్ధ పెట్టకుండా పంతులమ్మను చూస్తూ కూర్చున్నారు. బులంద్‌శహర్ జిల్లా ఖుర్జా బ్లాకులోని ముండాఖేడా గ్రామ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల అది. విషయం తెలిసి అడిగేందుకు వచ్చిన కొంతమంది విద్యార్థుల తల్లులపై ఆ టీచరు ఏకంగా చేతికర్రతో దాడికి దిగారు. ఈ ఘటన ఉన్నతాధికారుల దృష్టికి వెళ్లడంతో ఆ టీచరును సస్పెండు చేసి విచారణ జరుపుతున్నట్లు డీఈవో లక్ష్మీకాంత్ పాండే తెలిపారు.

వ్యవస్థలపై నిశిత విమర్శలే ధన్‌ఖడ్ ఒరవడి



దిల్లీ: ఉప రాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన జగదీప్ ధన్‌ఖడ్‌ది వ్యవస్థలపై నిశిత విమర్శలు చేసే ధోరణి. ఆయన పలు వ్యవస్థలపై.. ముఖ్యంగా న్యాయ వ్యవస్థపై వివాదాస్పద వ్యాఖ్యలు చేస్తుంటారు. అనేక పర్యాయాలు ఆయన న్యాయ వ్యవస్థకు హద్దులు నిర్దేశించేలా మాట్లాడారు. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ ఇంట్లో నోట్ల కట్టలు లభ్యమైనప్పుడు ఆయన తన విమర్శలకు మరింత పదును పెట్టారు. న్యాయ వ్యవస్థలో జవాబుదారీతనం కొరవడిందంటూ తూర్పారబట్టారు. ఒకవైపు కోర్టుల్నీ, ప్రభుత్వాలకు వ్యతిరేకంగా అవి తీసుకున్న నిర్ణయాలనూ తీవ్రంగా విమర్శిస్తూనే.. మరోవైపు ఒక న్యాయవాదిగా పని చేసిన తాను న్యాయ వ్యవస్థ కోసం పని చేస్తున్న సైనికుడిలాంటి వాడినని చెప్పుకొనేవారు. కొలీజియం వ్యవస్థను తొలగించేందుకు ఉద్దేశించిందిగా భావించిన జాతీయ న్యాయ నియామకాల కమిషన్ చట్టాన్ని సుప్రీంకోర్టు కొట్టివేయడాన్ని ధన్‌ఖడ్ తీవ్రంగా విమర్శించారు. పార్లమెంటు రెండు సభలూ ఏకగ్రీవంగా ఆమోదించిన చట్టాన్ని సుప్రీంకోర్టు ఎలా కొట్టివేయగలదని ప్రశ్నించారు. సుప్రీం కోర్టు తీర్పుపై మౌనం దాల్చిన పార్లమెంటు సభ్యులను కూడా ఆయన అంతే తీవ్రంగా విమర్శించారు. రాష్ట్రాల శాసనసభలు ఆమోదించిన బిల్లుల్ని రాష్ట్రపతి ఒక గడువులోగా తేల్చాలంటూ సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పును ఆయన తప్పుబట్టారు. కోర్టు సుప్రీం పార్లమెంటులా ప్రవర్తించకూడదని వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్య శక్తులపై సుప్రీం కోర్టు అణు బాంబును ప్రయోగించడం తగదని పేర్కొన్నారు. 'మనకు చట్టాలు చేసే జడ్జీలున్నారు. వారే కార్యనిర్వాహక కార్యకలాపాలు చేపట్టడంతోపాటు సూపర్ పార్లమెంటుగా వ్యవహరిస్తున్నారు. వారు ఎవరికీ జవాబు చెప్పాల్సిన పనిలేదు. దేశ చట్టాలు వారికి వర్తించవు' అంటూ ధన్‌ఖడ్ ఎద్దేవా చేసిన తీరు అంతకు ముందెన్నడూ కనీవినీ ఎరుగనిది.

అధికార మార్పునకు సంకేతం: అశ్వినీ కుమార్

రాజకీయ ప్రాధాన్యాలకు, అధికార మార్పిడులకు జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా సంకేతమని కేంద్ర న్యాయ శాఖ మాజీ మంత్రి అశ్వినీ కుమార్ వ్యాఖ్యానించారు. రాజీనామా తర్వాతా ఆయన ప్రజా జీవితంలోనే ఉంటారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఆయనను రాజ్యసభ మిస్ అవుతుందని వ్యాఖ్యానించారు.

- ధన్‌ఖడ్ ఎప్పుడూ ఒత్తిళ్లకు తలొగ్గబోరని, ఆరోగ్య సమస్యలే ఆయన నిర్ణయానికి కారణమై ఉంటాయని ఆయన బావమరిది, న్యాయవాది ప్రవీణ్ బల్వాడా వ్యాఖ్యానించారు.
- గతంలో సభలో ధన్‌ఖడ్ వ్యవహరించిన తీరుతో విసిగిపోయిన ప్రతిపక్ష ఎంపీలు.. చివరకు అవిశ్వాస తీర్మానం పెట్టారు. అది చర్చకే రాలేదు. అలాంటి ఎంపీల్లో కొందరు ఇప్పుడు ఆయనను పొగుడుతున్నారు. రైతు బిడ్డకు అన్యాయం జరిగిందని ఆరోపిస్తున్నారు. వారిలో కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, జైరాం రమేశ్ తదితరులున్నారు. రాజ్యసభ సభ్యుడు కపిల్ సిబల్ అయితే.. ధన్‌ఖడ్‌ను ఏకంగా జాతీయవాది, పోరాటయోధుడు అని పొగిడారు.



మంగళవారం పార్లమెంటు ఆవరణలో ఆందోళన చేస్తున్న విపక్ష సభ్యులు

నేడు అచ్యుతానందన్ అంత్యక్రియలు

- ప్రియతమ నేతకు వేల మంది నివాళులు



తిరువనంతపురం: కేరళ మాజీ ముఖ్యమంత్రి, సీపీఎం వ్యవస్థాపక నేతల్లో ఒకరైన వి.ఎస్.అచ్యుతానందన్ (101) భౌతిక కాయానికి బుధవారం సాయంత్రం అళప్పుజలోని శ్మశానవాటికలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. తిరువనంతపురంలోని ఓ ఆసుపత్రిలో సోమవారం తుదిశ్వాస విడిచిన కమ్యూనిస్టు దిగ్గజ నేతను కడసారి చూసేందుకు వేల మంది అభిమానులు, పార్టీ కార్యకర్తలు, నేతలు తరలివచ్చారు. అశ్రునయనాలతో ప్రియతమ నేతకు నివాళులర్పించారు. ఎనిమిదిన్నర దశాబ్దాలకు పైగా కొనసాగిన సుదీర్ఘ రాజకీయ జీవితంలో ఆయన అందించిన సేవలను గుర్తు చేసుకున్నారు. సోమవారం రాత్రి తిరువనంతపురంలోని అచ్యుతానందన్ నివాసంలో ఉంచిన పార్థివదేహాన్ని ప్రజల సందర్శనార్థం మంగళవారం ఉదయం సచివాలయ ప్రాంగణంలోని దర్బార్ హాలుకు ఊరేగింపుగా తీసుకువచ్చారు. ముఖ్యమంత్రి పినరయి విజయన్, మంత్రులు, గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ ఆర్లేకర్, సీపీఎం అగ్రనేతలు ఎం.ఎ.బేబీ, ప్రకాశ్ కారట్, బృందాకారట్, సీపీఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా, కాంగ్రెస్, భాజపా నేతలు తదితరులు అచ్యుతానందన్‌కు నివాళులర్పించారు. అలంకరించిన వాహనంలోకి చేర్చిన భౌతిక కాయాన్ని దర్బార్ హాలు నుంచి ఊరేగింపుగా అళప్పుజకు తీసుకెళ్తున్నారు. మార్గమధ్యంలో ప్రజల దర్శనానికి అవకాశం కల్పిస్తారు.

ధన్‌ఖడ్‌కు ప్రభుత్వ బంగళా

దిల్లీ: ఉప రాష్ట్రపతి పదవి నుంచి వైదొలగిన జగదీప్ ధన్‌ఖడ్‌కు ప్రభుత్వం బంగళా కేటాయించనుంది. ప్రస్తుతం ఆయన పార్లమెంటు హౌస్‌కు సమీపంలోని చర్చి రోడ్డులో కొత్తగా నిర్మించిన అధికారిక నివాసంలో ఉంటున్నారు. ఇది సెంట్రల్ విస్టాలో భాగంగా నిర్మితమైంది. ఆయనకు లుట్యెన్స్ దిల్లీలోగానీ, మరో ప్రాంతంలోగానీ టైప్-8 బంగళాను కేటాయిస్తామని అధికార వర్గాలు మంగళవారం తెలిపాయి.

ఉక్రెయిన్‌పై రష్యా దాడి

- ఒకరి మృతి, 24 మందికి గాయాలు

కీవ్: ఉక్రెయిన్‌పై రష్యా మరోసారి దాడిచేసింది. కీవ్‌లోని 4నగరాలపై చేసిన ఈ దాడిలో ఓ చిన్నారి మృతి చెందగా.. మరో 24 మంది గాయపడ్డారు. రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్‌తో సమావేశమై యుద్ధం ముగిసే దిశగా చర్చలు జరపాలన్న తన ప్రతిపాదనను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీ మంగళవారం పునరుద్ఘాటించారు.

బ్రిటన్‌ను వీడుతున్న బిలియనీర్లు

- ఈ నరకంలో ఉండలేను: జాన్ ఫ్రెడ్రిక్‌సన్

ఇంటర్నెట్ డెస్క్: బిలియనీర్లు, మిలియనీర్లు భారీ సంఖ్యలో బ్రిటన్‌ను వీడుతున్నారు. 2024లో 10,800 మంది మిలియనీర్లు ఇతర దేశాలకు మకాం మార్చారు. అంతకుముందు ఏడాదితో పోలిస్తే ఆ సంఖ్య 157 శాతం అధికం. 2025లో అది 16,500గా ఉండొచ్చన్న హెచ్చరికలు ఆందోళన కలిగిస్తున్నాయి. ఇలా 2014 నుంచి కేవలం లండన్‌ను వీడినవారి సంఖ్యే 30,000 కావడం గమనార్హం. ఆర్థిక అనిశ్చితి, నాన్-డోమ్ పన్ను విధానం (విదేశాల్లో ఆర్జించే సొమ్ముపై పన్ను లేకపోవడం) రద్దు చేయడం, రాజకీయంగా నెలకొన్న పరిస్థితులు వారి నిష్క్రమణకు కారణమవుతున్నాయి. తాజాగా ఈ జాబితాలో మరో కుబేరుడు జాన్ ఫ్రెడ్రిక్‌సన్ (81) చేరుతున్నారు. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు మకాం మార్చుతున్న ఈయన రూ.2,900 కోట్ల విలువచేసే 300 ఏళ్లనాటి తన నివాసాన్ని అమ్మకానికి పెట్టారు. నార్వేలో జన్మించిన ఫ్రెడ్రిక్‌సన్ బ్రిటన్‌లో తొమ్మిదో అత్యంత సంపన్నుడు. ఈయన ఆస్తుల నికర విలువ దాదాపు రూ.లక్షన్నర కోట్లు (17.3 బిలియన్ డాలర్లు). ఈ షిప్పింగ్ టైకూన్ ప్రపంచ సంపన్నుల జాబితాలో 136వ స్థానంలో ఉన్నారు. లండన్‌లోని చెల్సియా ప్రాంతంలో 30 వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఓల్డ్ రెక్టరీ పేరిట ఉన్న విలాస భవంతిని 2001లో రూ.431 కోట్లకు ఈయన కొనుగోలు చేశారు. తర్వాత పునరుద్ధరణ పనులకు మరిన్ని కోట్లు వెచ్చించారు. లండన్‌లో ఇది మూడో అత్యంత ఖరీదైన భవనం. ఇప్పుడు దీనిని అమ్మకానికి పెట్టారు. ఆ విషయాన్ని వెల్లడిస్తూ మీడియాతో మాట్లాడిన ఫ్రెడ్రిక్‌సన్.. పాశ్చాత్య ప్రపంచం పతనం వైపు పయనిస్తోందని వ్యాఖ్యానించారు. బ్రిటన్ నరకంలా మారిందని, లండన్‌లోని తన సంస్థ కేంద్ర కార్యాలయంలో కార్యకలాపాలను నిలిపివేసినట్లు తెలిపారు.



తన సహచరితో బ్రిటన్ కుబేరుడు జాన్ ఫ్రెడ్రిక్‌సన్

- 226 ఏళ్ల నుంచి అమలులో ఉన్న నాన్-డోమ్ పన్ను వెసులుబాటును బ్రిటన్ ప్రభుత్వం తొలగించడం అక్కడ నివాసం ఉంటున్న సంపన్నులను ఆలోచనలో పడేసింది. వారు పన్ను మినహాయింపులకు స్వర్గధామంగా ఉండే ఇతర దేశాలపై దృష్టి సారిస్తున్నారు. దీంతోపాటు బ్రెగ్జిట్ (ఐరోపా యూనియన్ నుంచి బ్రిటన్ నిష్క్రమణ) ఇందుకు మరో ప్రధాన కారణం. దానివల్ల ఏర్పడిన ఆర్థిక అనిశ్చితి, పౌండు బలహీనపడటం, ఈయూ దేశాల్లో పర్యటించాలన్నా కఠినమైన వీసా నిబంధనలను అనుసరించాల్సి రావడం వంటివి ఇబ్బంది పెడుతున్నాయని విశ్లేషకులు వెల్లడిస్తున్నారు.

ఆ రాత్రి ట్రంప్ చూపులు భయం కలిగించాయి

- అమెరికన్ కళాకారిణి ఆరోపణ



మారియా ఫార్మర్

వాషింగ్టన్: ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంపై మొదటగా ఫిర్యాదు చేసిన మారియా ఫార్మర్ అనే అమెరికా కళాకారిణి తాజాగా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై సంచలన ఆరోపణలు చేశారు. ఓ సందర్భంలో ట్రంప్ తనను అసభ్యకరంగా చూశారని, తాను ఎంతో భయపడ్డానని పేర్కొన్నారు. నాటి చేదు అనుభవాన్ని ఇటీవల 'న్యూయార్క్ టైమ్స్' పత్రికతో మారియా పంచుకొన్నారు. 1995లో తాను ఎప్‌స్టీన్ కోసం పనిచేయాలనుకుంటున్న సమయంలో ఈ ఘటన జరిగిందని తెలిపారు. ఒక రోజు బాగా పొద్దుపోయాక ఎప్‌స్టీన్ తనను మన్‌హట్టన్‌లోని ఆఫీసులో కలవాలని ఫోన్ చేశాడని, దీంతో రన్నింగ్ షార్ట్స్‌లోనే వెంటనే అక్కడకు వెళ్లాల్సి వచ్చిందని మారియా పేర్కొన్నారు. అదే సమయంలో ట్రంప్ అక్కడికి వచ్చారని గుర్తు చేసుకొన్నారు. తనకు సమీపంలోనే నిలబడి.. తన కాళ్ల వైపు పదే పదే అభ్యంతరకరంగా చూశారని, దీంతో తనకు చాలా భయం వేసిందని ఆమె తెలిపారు. అప్పుడే వచ్చిన ఎప్‌స్టీన్... "ఆమె నీకోసం కాదు" అంటూ ట్రంప్‌ను అక్కడి నుంచి తీసుకెళ్లారన్నారు. ఈ ఘటన జరిగినప్పుడు తన వయసు 20 అని వివరించారు.

ఎప్‌స్టీన్ ప్రియురాలిని ప్రశ్నించనున్న న్యాయవిభాగం

జెఫ్రీ ఎప్‌స్టీన్ పాపాల్లో పాలుపంచుకున్న ఆయన ప్రియురాలు మ్యాక్స్‌వెల్‌ను ప్రశ్నించేందుకు అమెరికా న్యాయశాఖ ప్రయత్నిస్తోంది. సెక్స్ కుంభకోణం కేసులో మరిన్ని కీలక వివరాలను తెలుసుకునేందుకు మ్యాక్స్‌వెల్‌ను ప్రశ్నించాలని అనుకుంటున్నట్లు మంగళవారం డిప్యూటీ అటార్నీ జనరల్ టోడ్ బ్లాంచే వెల్లడించారు. కాగా ఈ కుంభకోణంలో మ్యాక్స్‌వెల్ దోషిగా తేలడంతో కోర్టు ఆమెకు 2022లో 20ఏళ్ల జైలు శిక్ష విధించింది.

రిటర్నుల దాఖలులో జాప్యం.. కాంగ్రెస్‌కు ఐటీ చిక్కులు

ఇంటర్నెట్ డెస్క్: ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీకి మరోసారి ఆదాయపన్ను చిక్కులు ఎదురయ్యాయి. రూ.199 కోట్ల విరాళాలపై పన్ను మినహాయింపు కోరుతూ పార్టీ చేసిన విజ్ఞప్తిని ఆదాయపన్ను అప్పీలేట్ ట్రైబ్యునల్ (ఐటీఏటీ) తోసిపుచ్చింది. ఆలస్యంగా రిటర్నులు దాఖలు చేయడం ఉల్లంఘన కిందకే వస్తుందని, చట్ట ప్రకారం మొత్తం ఆదాయానికి పన్ను చెల్లించాలని స్పష్టం చేసింది.

2017-18 సంవత్సరానికి సంబంధించి కాంగ్రెస్ పార్టీకి రూ 199.5 కోట్ల ఆదాయం విరాళాల రూపంలో లభించింది. దీనికి సంబంధించి ఆదాయపన్ను రిటర్నులు సమర్పించాల్సిన గడువు 2018, డిసెంబరు 31న ముగియగా..పార్టీ 2019 ఫిబ్రవరి 2న రిటర్నులు దాఖలు చేసిందని, నిర్ణీత గడువులో రిటర్నులు దాఖలు చేయడంలో కాంగ్రెస్ విఫలమైన కారణంగా ఆదాయ పన్ను మినహాయింపు పొందే వీలు లేదని, మొత్తం ఆదాయానికి పన్ను కట్టాలని ఐటీఏటీ తన ఆదేశాల్లో పేర్కొంది. రాజకీయ పార్టీలు ఒక వ్యక్తి నుంచి గరిష్ఠంగా రూ.2వేల వరకు మాత్రమే నగదు రూపంలో విరాళం తీసుకునే ఆస్కారం ఉండగా.. కాంగ్రెస్ రూ 14.49 లక్షల మేర నగదు విరాళాలు తీసుకున్నట్లు ఆదాయపన్ను అధికారులు గుర్తించారు.

పాకిస్థాన్‌లో మోర్టార్ పేలి ఇద్దరు చిన్నారుల మృతి

పెషావర్: పాకిస్థాన్‌లోని ఖైబర్ పంఖ్తుక్వా ప్రావిన్స్‌లో మోర్టార్ పేలి ఇద్దరు చిన్నారులు దుర్మరణం పాలయ్యారు. ఈ ఘటన టైంక్ జిల్లాలోని గోమల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. అరాఫత్, అమిర్ అనే ఆరేళ్ల చిన్నారులు తమ ఉపాధ్యాయులకు టీ తీసుకువెళ్తుండగా ఒక్కసారిగా మోర్టార్ పేలడంతో అక్కడికక్కడే మరణించారు.

పీవోకేలో వరదలు.. నలుగురు పర్యాటకుల మృతి

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్ (పీవోకే)లోని గిల్గిత్-బాల్టిస్థాన్‌లో వరదల కారణంగా నలుగురు పర్యాటకులు మృతి చెందారు. ఇద్దరు గాయపడ్డారు. మరో 15 మంది గల్లంతయ్యారు. దియామిర్ జిల్లాలో సోమవారం ఎనిమిది పర్యాటకుల వాహనాలు నీటిలో కొట్టుకుపోయిన సంగతి తెలిసిందే. వీరిలో ఓ మహిళ సహా నలుగురి మృతదేహాలను పోలీసులు వెలికితీశారు.

దుస్తుల్లో 28 కిలోల బంగారం దాచి..

- సూరత్ విమానాశ్రయంలో పట్టుబడ్డ జంట

సూరత్: దుస్తుల లోపల 28 కిలోల బంగారు మిశ్రమాన్ని దాచి, దుబాయ్ నుంచి అక్రమంగా తరలిస్తున్న ఓ జంటను సూరత్ విమానాశ్రయంలో కస్టమ్స్ అధికారులు పట్టుకున్నారు. గుజరాత్‌కు చెందిన దంపతులిద్దరు ఈ నెల 20న ఎయిరిండియా విమానంలో దుబాయ్ నుంచి సూరత్‌కి వచ్చారు. వారిద్దరూ సాధారణ దుస్తులు ధరించినప్పటికీ, నడక, ప్రవర్తనలో తేడా గమనించిన సీఐఎస్‌ఎఫ్ అధికారి ఆ జంటను అడ్డుకొని, వారి గురించి కస్టమ్స్ కార్యాలయానికి సమాచారం అందించారు. దంపతులను తనిఖీ చేసిన అధికారులు భార్య నుంచి 16 కిలోలు, భర్త నుంచి 12 కిలోల బంగారు మిశ్రమాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఉగ్రవాదం, ఖలిస్థాన్‌లపై స్టార్మర్‌తో చర్చించనున్న మోదీ

- నేడు బ్రిటన్ పర్యటనకు ప్రధాని



దిల్లీ: రెండు దేశాల పర్యటనలో భాగంగా బుధవారం బ్రిటన్ వెళ్లబోతున్న ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశ ప్రధాని కీర్ స్టార్మర్‌తో చర్చలు జరపనున్నారు. సీమాంతర ఉగ్రవాదంతో మనకు ఎదురవుతున్న సవాళ్లు, బ్రిటన్‌లో ఖలిస్థాన్ అనుకూల శక్తుల కార్యకలాపాలు, పలాయనంలో ఉన్న కొంత మంది బిలియనీర్ల అప్పగింత వంటి అంశాలు దీనిలో ప్రస్తావనకు రానున్నాయి. ద్వైపాక్షిక సంబంధాలు బలోపేతం చేసుకోవడం, భారత్-బ్రిటన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ)పై సంతకాలు వంటివి దీనిలో ఉంటాయి. ఆర్థిక నేరాల్లో నిందితులుగా ఉన్న విజయ్ మాల్యా, నీరవ్ మోదీ, లలిత్ మోదీ వంటివారి అప్పగింత గురించి మన ప్రతినిధి బృందం లేవనెత్తుతుందని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రం మిస్రీ వెల్లడించారు. ఎఫ్‌టీఏపై గురువారం సంతకాలు జరగనున్నాయని బ్రిటన్‌లో భారత హైకమిషనర్ విక్రం దొరైస్వామి తెలిపారు. 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని 12,000 కోట్ల డాలర్లకు చేర్చడం దీని ఉద్దేశమని చెప్పారు. బ్రిటన్ రాజు ఛార్లెస్-3తోనూ మోదీ భేటీ అవుతారు. ప్రధాని గౌరవార్థం స్టార్మర్ విందు ఇస్తారు. ఈ నెల 25, 26 తేదీల్లో మోదీ మాల్దీవుల్లో ఉంటారు. అధ్యక్షుడు ముయిజ్జుతో చర్చలు జరుపుతారు. ఆ దేశ స్వాతంత్ర్య వేడుకల్లో పాల్గొంటారు.

ఇంధన భద్రతకు భారత్ అధిక ప్రాధాన్యం

- విదేశీ వ్యవహారాల కార్యదర్శి విక్రమ్ మిస్రీ




విక్రమ్ మిస్రీ

దిల్లీ: దేశ అవసరాలకు సరిపడే ఇంధన భద్రతకు భారత్ అధిక ప్రాధాన్యమిస్తోందని విదేశీ వ్యవహారాల శాఖ కార్యదర్శి విక్రమ్ మిస్రీ పేర్కొన్నారు. అలాగే ప్రపంచ విస్తృత ఇంధన వాణిజ్యంపై కూడా స్పష్టమైన అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని ఆయన తెలిపారు. ఇలాంటి విషయంలో ద్వంద్వ వైఖరి అవసరం లేదని స్పష్టం చేశారు. రష్యా చమురు రంగాన్ని లక్ష్యంగా చేసుకుంటూ ఐరోపా సమాఖ్య(ఈయూ) ఇటీవల పలు ఆంక్షలు విధించింది. దీని ప్రభావం గుజరాత్‌లోని వాడినార్ చమురు శుద్ధి కర్మాగారంపైనా పడింది. బ్రిటన్, మాల్దీవులలో ప్రధాని మోదీ నాలుగురోజుల పర్యటన గురించి తాజాగా విక్రమ్ మిస్రీ మీడియాకు వివరించారు. ఈ సందర్భంగా రష్యా చమురు ఉత్పత్తులపై ఈయూ విధించిన ఆంక్షలపై విలేకర్లు లేవనెత్తిన ప్రశ్నలకు ఆయన పై విధంగా సమాధానమిచ్చారు. బ్రిటన్ ప్రధాని కీర్ స్టార్మర్‌తో చర్చల సందర్భంగా ఇంధన భద్రతకు సంబంధించిన అంశాలపై ప్రధాని మోదీ ఏమైనా మాట్లాడతారా అన్న ప్రశ్నకు మిస్రీ స్పందిస్తూ.. "ఇంధన భద్రత విషయంలో మేం ఏం చేయాలో అది చేస్తాం. దానిపై మాకు స్పష్టత ఉంది. చమురు ఉత్పత్తులు ఎక్కడ ఉంటాయో తెలిసి ఉండటం, అవి ఏ సమయంలో ఎవరికి అవసరం అనే విషయాలపై అవగాహన కలిగి ఉండటం ముఖ్యం. ఈ విషయంలో ద్వంద్వ వైఖరి అవసరం లేదు" అని చెప్పారు.

వినియోగదారుడే రారాజు

- ఇష్టమైనది ఎంచుకునే స్వేచ్ఛ వారి సొంతం
- సుప్రీంకోర్టు ధర్మాసనం వ్యాఖ్య



దిల్లీ: భోజనం చేయడానికి ఏ హోటల్‌ను ఎంచుకోవాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ వినియోగదారులకే ఉంటుందని, ఆ విషయంలో వారే రారాజులని సుప్రీంకోర్టు పేర్కొంది. గతంలో మాంసాహారాన్ని అందుబాటులో ఉంచిన హోటల్.. వ్యాపారాభివృద్ధి కోసం శాకాహారాన్నీ సరఫరా చేస్తుంటే అక్కడకు వెళ్లాలో వద్దో నిర్ణయించుకోవాల్సింది వినియోగదారులేనని తెలిపింది. దీనికి సంబంధించిన సమాచారాన్ని తెలియజేయాల్సిన బాధ్యత హోటల్ నిర్వాహకులపై ఉంటుందని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటీశ్వర్ సింగ్ ధర్మాసనం అభిప్రాయపడింది. ఉత్తర్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లలో కావడి యాత్రా మార్గం వెంబడి హోటళ్ల యజమానులు తమ వివరాలు తెలిపే క్యూఆర్ కోడ్‌లను ప్రదర్శించాలని ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను పాటించాలని మంగళవారం స్పష్టం చేసింది. క్యూఆర్ కోడ్ ద్వారా హోటల్ యజమానుల లైసెన్సులు, రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్ వివరాలు వినియోగదారులకు తెలిసిపోతాయి. శ్రావణ మాసంలో భక్తులు కావళ్లలో గంగా జలాన్ని తీసుకుని శివాలయాలలో అభిషేకాలు చేస్తారు. ఈ మాసంలో చాలామంది భక్తులు మాంసాహారం భుజించరు. ఉల్లి, వెల్లుల్లి కలిసిన శాకాహారాన్ని కూడా తీసుకోరనే విషయాన్ని ధర్మాసనం పరిగణనలోకి తీసుకుంది. మంగళవారం కావడి యాత్ర ముగింపు దినం కాబట్టి హోటల్ యజమానులు ప్రభుత్వ ఉత్తర్వులను పాటించాల్సిందేననీ, ఇతర అంశాల జోలికి తాము ఇప్పుడు పోదలచుకోలేదని తెలిపింది. ఒక హోటల్ యజమాని గతంలో మాంసాహారం వడ్డించి, కావడి యాత్రా సందర్భంగా వ్యాపారం పెంచుకోవడానికి శాకాహారం వడ్డించవచ్చనీ, అలాంటి హోటల్‌లో ఆహారం తీసుకోవాలా వద్దా అన్నది తేల్చుకునే హక్కు, అధికారం వినియోగదారుకు ఉండాలని జస్టిస్ ఎం.ఎం.సుందరేశ్ పేర్కొన్నారు. కావడి యాత్రా మార్గం వెంబడి మైనారిటీలు నడిపే హోటళ్లపై రాష్ట్ర ప్రభుత్వం క్యూఆర్ కోడ్ ఉత్తర్వు ద్వారా దుర్విచక్షణ ప్రదర్శిస్తోందని పిటిషనర్ల న్యాయవాది అభిషేక్ మను సింఘ్వి ఆరోపించారు.

పార్టీల జెండాల్లో త్రివర్ణంపై పిల్‌ను తిరస్కరించిన సుప్రీంకోర్టు

రాజకీయ పార్టీలు తమ జెండాల్లో త్రివర్ణ పతాకాన్ని వాడుకుంటుండటంపై చర్య తీసుకోవాలని కోరుతూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్)ను పరిగణనలో తీసుకునేందుకు సుప్రీంకోర్టు తిరస్కరించింది. కాంగ్రెస్, నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ చీలికవర్గాలు వంటివి జాతీయ పతాకాన్ని కాస్త తేడాతో తమ జెండాల్లో వాడుతున్నాయని, అశోక చక్రం బదులు పార్టీ గుర్తులను చేరుస్తున్నాయని సంజయ్ భీమ్‌శంకర్ థోబ్డే అనే వ్యక్తి దీనిని దాఖలుచేసి స్వయంగా వాదనలు వినిపించడానికి హాజరయ్యారు. జాతీయ పతాకాన్ని గౌరవించే చట్టాన్ని ఈ పార్టీలు ఉల్లంఘిస్తున్నాయని చెప్పారు. స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి కొన్ని పార్టీలు ఇలాగే చేస్తున్నాయని ధర్మాసనం వ్యాఖ్యానించి పిల్ స్వీకరణకు నిరాకరించింది.

మాజీలు ప్రభుత్వ బంగళాను పట్టుకు వేలాడకూడదు

ప్రభుత్వ భవనాల్లో జీవితాంతం నివాసం ఉంటామంటే కుదరదని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. ప్రభుత్వ బంగళాను ఖాళీచేయకుండా తిష్ఠ వేసినందుకు గాను జరిమానాగా రూ.20.98 లక్షల అద్దె చెల్లించాలన్న డిమాండ్ నోటీసును బిహార్ మాజీ శాసనసభ్యుడు కోర్టులో సవాల్ చేశారు. ఈ పిటిషన్‌ను స్వీకరించడానికి సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్ ధర్మాసనం నిరాకరించింది. పట్నా హైకోర్టు తన పిటిషన్‌ను కొట్టివేయడంతో బిహార్ మాజీ ఎమ్మెల్యే అవనీశ్ కుమార్ సింగ్ సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. చట్టం అనుమతించిన మేరకు అవనీశ్ కుమార్ సింగ్‌పై తదుపరి చర్యలు తీసుకోవచ్చని సుప్రీం ధర్మాసనం స్పష్టం చేసింది. సింగ్ ఐదుసార్లు బిహార్ శాసనసభకు ఎన్నికయ్యారు. 2014లో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేసిన తరవాత కూడా ప్రభుత్వ బంగళాలోనే నివాసముంటున్నారు. అలా నివసించే హక్కు ఆయనకు లేదని పట్నా హైకోర్టు పేర్కొంది.

ఎన్నికను సవాల్ చేసిన పిటిషన్‌పై బఘేల్ హైకోర్టుకు వెళ్లవచ్చు: సుప్రీం

దిల్లీ: పటాన్ అసెంబ్లీ స్థానంలో తన ఎన్నికను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేశ్ బఘేల్ హైకోర్టుకు వెళ్లవచ్చని సర్వోన్నత న్యాయస్థానం తెలిపింది. అలాంటి పిటిషన్ ఏదైనా హైకోర్టు ముందు ఉంటే వాదనలు వినిపించే అవకాశాన్ని అవతలి పక్షానికి కూడా ఇవ్వాలని, ఆ తర్వాతే కేసు విచారణ అర్హత ఆధారంగా న్యాయస్థానం ముందుకెళ్లాల్సి ఉంటుందని జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం తెలిపింది. భూపేశ్ మేనల్లుడు, భాజపా ఎంపీ విజయ్ బఘేల్ దాఖలు చేసిన పిటిషన్‌పై ఎన్నికల ట్రైబ్యునల్ కూడా అయిన హైకోర్టును ఆశ్రయించేందుకు అనుమతించింది. విజయ్ పిటిషన్‌పై హైకోర్టు వ్యాఖ్యలు భూపేశ్ పిటిషన్ విచారణకు అవరోధం కాబోవని తెలిపింది. పటాన్ అసెంబ్లీ నియోజకవర్గ ఎన్నికల ప్రచార సందర్భంగా నిశ్శబ్ద సమయంలో (సాయంత్రం 5 గంటల తర్వాత) భూపేశ్ ర్యాలీ నిర్వహించారని, ఇది ఎన్నికల నియమావళిని ఉల్లంఘించడమేనని విజయ్ బఘేల్ తన పిటిషన్‌లో ఆరోపించారు. దీనికి గాను భూపేశ్ ఎన్నికను రద్దు చేసి ఆరేళ్ల పాటు పోటీకి అనర్హుడిగా ప్రకటించాలని హైకోర్టును అభ్యర్థించారు. ఆ ఎన్నికల్లో విజయ్ ఓడిపోయారు.



సోషల్ బ్రహ్మలు!

సామాజిక మాధ్యమాలు రోజువారీ జీవితంలో భాగమయ్యాయి. ఆహార, విహారాల వంటి జీవనశైలి అంశాల దగ్గరి నుంచి వ్యక్తిత్వ వికాసం వరకూ అన్నింటికీ ఇవే ఇప్పుడు మార్గ నిర్దేశం చేస్తున్నాయి. వినూత్నమైన అంశాలతో అలరిస్తున్నాయి. అందుకే సోషల్ మీడియా వేదికల నిర్వాహకులు కొత్త పోకడలనూ అనుసరిస్తున్నారు. కృత్రిమ మేధ (ఏఐ) టూల్స్‌నూ వాడుకుంటున్నారు. పోస్టుల ప్లానింగ్, షెడ్యూలింగ్, మాటిమాటికీ చేసే పనులను ఆటోమేట్ చేయటం.. చివరికి కంటెంట్‌ను సృష్టించటానికీ వీటిని ఉపయోగించుకుంటున్నారు. అంటే ఇవి అపర బ్రహ్మలుగా 'సోషల్' సృష్టికర్తల రాతలనూ రాసేస్తున్నాయన్నమాట. అంతర్జాలంలో ఇలాంటి జనరేటివ్ ఏఐ టూల్స్ వేలాదిగా ఉన్నాయి. అలాంటి కొన్ని ఇవిగో..

CapCut క్యాప్‌కట్

కంటెంట్ క్రియేటర్లు, ఇన్‌ఫ్లుయెన్సర్లు ఎక్కువగా వాడుతున్న, బాగా ఆదరణ పొందిన ఏఐ టూల్స్‌లో ఇదొకటి. ఎందుకంటే దీంతో ఎవరైనా కంటెంట్‌ను క్రియేట్ చేయొచ్చు, సవరించుకోవచ్చు, షేర్ చేసుకోవచ్చు. అదీ చాలా తేలికైన పద్ధతిలో. ఇందులో అత్యంత శక్తిమంతమైన జనరేటివ్ ఏఐ ఫీచర్లెన్నో ఉన్నాయి. మేధోమథన ఉపాయాలు, ఇమేజ్ లేదా వీడియోలో కనిపించే క్యాప్షన్స్, ప్రత్యేక అవతార్ల వంటివెన్నో సృష్టించుకోవచ్చు. చివరికి స్క్రిప్ట్ నుంచి ఏఐ వీడియోలనూ రూపొందించుకోవచ్చు. ఒక్క ఫోన్‌తోనే అన్ని పనులు చేసుకోవటానికి వీలు కల్పించటం వల్ల ఇన్‌ఫ్లుయెన్సర్లూ దీన్ని ఎంతగానో ఇష్టపడుతుంటారు. అధునాతన వీడియో ఎడిటింగ్ ఫీచర్లు, సౌలభ్యాలు ఉండటం మూలంగా సోషల్ మీడియా నిర్వాహకులకూ ఎంతగానో నచ్చుతోంది. కీలక ఫీచర్లు ఇవీ..

- ఆటో క్యాప్షన్స్
- స్క్రిప్ట్ టు వీడియో
- మల్టీక్యామ్ ఎడిటింగ్
- కలర్ గ్రేడింగ్
- ట్రాన్సిషన్స్ అండ్ యానిమేషన్స్
- మ్యూజిక్ లైబ్రరీ
- ఏఐ టెక్స్ట్ ఛేంజర్
- ఏఐ స్క్రిప్ట్ జనరేటర్
- నో వాటర్ మార్క్స్

కాన్వా మేజిక్ స్టుడియో Canva Magic Studio

సోషల్ మీడియా నిర్వాహకులు, కంటెంట్ క్రియేటర్లు ఇప్పటికే కాన్వాను విరివిగా వాడుకుంటున్నారు. దీనికి మేజిక్ స్టుడియోను జత చేయటంతో మరింత ఆదరణ పొందింది. సామాజిక మాధ్యమాల కంటెంట్ పనులను సులభతరం చేయటానికి తోడ్పడే ప్రత్యేకమైన టూల్స్ సముదాయంతో దీన్ని డిజైన్ చేశారు. మేజిక్ రైట్, మేజిక్ మీడియా ఫీచర్లకు ప్రాంప్ట్ అందిస్తే చాలు. టెక్స్ట్, ఇమేజ్‌లను చిటికెలో ముందుంచుతాయి. వేర్వేరు ఛానళ్లు, నెట్‌వర్క్‌లకు అనుగుణంగా వీటిని సృష్టించుకోవచ్చు. తేలికైన కమాండ్స్‌తోనే కంటెంట్‌ను సవరించుకోవచ్చు. ఆయా అవసరాలకు అనుగుణంగా మార్చుకోవచ్చు. ఇతరులతో కలిసి పనిచేసే అవకాశమూ ఉండటం వల్ల బృంద వ్యవహారాలకూ ఉపయోగపడుతుంది. దీని కీలక ఫీచర్లు ఇవీ..

- మేజిక్ రీసైజర్
- డ్రాగ్ అండ్ డ్రాప్
- మేజిక్ గ్రాబ్
- బ్యాక్‌గ్రౌండ్ రిమూవర్
- మేజిక్ మార్ఫ్
- మేజిక్ ఎక్స్‌పాండ్
- మేజిక్ యానిమేట్

బఫర్ Buffer

తక్కువ సమయంలో మరింత ఎంగేజింగ్ కంటెంట్‌ను సృష్టించుకోవటానికిది బాగా తోడ్పడుతుంది. దీనిలోని ఉచిత ఏఐ అసిస్టెంట్ సాయంతో ఐడియాలను జనరేట్ చేసుకోవచ్చు. ఫేస్‌బుక్, ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, లింక్డ్‌ఇన్ వంటి వేర్వేరు వేదికలకు కంటెంట్‌ను తిరిగి రాసుకోవచ్చు. పోస్టింగ్ షెడ్యూల్‌నూ మెరుగు పరచుకోవచ్చు. అంటే కంటెంట్‌ను సిద్ధం చేశాక ఏయే సమయాల్లో పోస్ట్ చేయాలో నిర్ణయించుకుంటే చాలన్నమాట. ఎంచుకున్న సమయానికి పోస్ట్ చేస్తుంది. ఏఐ సూచనల సాయంతో నెల మొత్తానికీ సరిపడ సోషల్ మీడియా కంటెంట్‌ను ఒకేసారి సృష్టించుకోవచ్చు. బఫర్‌లో బిల్టిన్‌గా ఉండే ఓపెన్‌ఏఐ సాంకేతిక పరిజ్ఞానం లాంగ్వేజ్ ప్రాసెసింగ్‌ను చాలా కచ్చితంగా చేస్తుంది. ఇంటర్ఫేస్ చాలా సులభంగా ఉండటం వల్ల ఎవరైనా దీని మీద పట్టు సాధించొచ్చు. సోషల్ మీడియా కన్సల్టెంట్లు బయటి నుంచి సహకారం లేకుండానే క్లయింట్ల పరిధిని విస్తరించుకోవచ్చు. దీని కీలక ఫీచర్లు ఇవీ..

- ఏఐ అసిస్టెంట్
- షెడ్యూలింగ్ అండ్ పబ్లిషింగ్
- అనలిటిక్స్ అండ్ రిపోర్టింగ్
- కంటెంట్ క్యాలెండర్
- టీమ్ కొలాబరేషన్
- మల్టీ-ప్లాట్‌ఫామ్ సపోర్టు

ఒకోయా Ocoya

ఏఐ అసిస్టెంట్‌తో కూడిన ఇదో ప్రత్యేకమైన సోషల్ మీడియా టూల్. ఐడియాలను జనరేట్ చేయటానికి, ప్రస్తుత కంటెంట్‌ను ఇతర అవసరాలకూ వాడుకోవటానికి తోడ్పడుతుంది. ప్రాంప్ట్ లేదా టెక్స్ట్ ఇన్‌పుట్ ద్వారా ఏఐ ఇమేజ్‌లను సృష్టించుకోవచ్చు. దీనిలోని ఏఐ అసిస్టెంట్ సాయంతో క్యాప్షన్లు, మెసేజ్‌లు రాసుకోవచ్చు. సమంజసమైన హ్యాష్‌ట్యాగ్‌లను సృష్టించుకోవచ్చు. ఏఐ ఆధారిత కాపీ జనరేటర్‌ను ఉపయోగించుకొని వేర్వేరు భాషల్లో నకలు రూపాలనూ తయారుచేసుకోవచ్చు. కంటెంట్‌ను మాన్యువల్‌గా పోస్ట్ చేసుకోవచ్చు. కావాలంటే దాన్ని ఆటోమేట్ చేసుకోవచ్చు. ఇందులో పర్‌ఫార్మెన్స్‌ను తనిఖీ చేసుకోవటానికి అనలిటిక్స్ టూల్స్ కూడా ఉన్నాయి. పొడవైన యూఆర్‌ఎల్స్‌ను పొట్టి లింక్‌గానూ మార్చుకోవచ్చు. కీలక ఫీచర్లు ఇవీ..

- ఏఐ కంటెంట్ క్రియేషన్
- పోస్ట్ షెడ్యూలింగ్
- హ్యాష్‌టాగ్ అండ్ క్యాప్షన్ అసిస్టెంట్
- మల్టీ-ప్లాట్‌ఫామ్ ఇంటిగ్రేషన్

నరేటో ఏఐ Narrato AI

వినూత్నమైన సోషల్ మీడియా ఐడియాలను, కంటెంట్‌ను సృష్టించుకోవాలని అనుకునేవారికిది చేదోడుగా నిలుస్తుంది. దీనిలోని బిల్టిన్ టెంప్లేట్లతోనే చాలా పనులు చేసుకోవచ్చు. వ్యాకరణ దోషాలను సవరించటంతో పాటు కంటెంట్ సారాంశాలనూ ముందుంచుతుంది. దీనిలో ఎడిటర్ ఫీచర్‌లోనే ఏఐ అసిస్టెంట్ సమ్మిళితమై ఉంటుంది. దీని ద్వారా కంటెంట్‌ను సృష్టించుకోవచ్చు, సవరించుకోవచ్చు. ఏఐ ఇమేజ్ జనరేటర్‌తో దృశ్యాలనూ రూపొందిస్తుంది. వీటిని ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, లింక్డ్‌ఇన్ వంటి సోషల్ మీడియా వేదికల్లో నేరుగా పబ్లిష్ చేయగలదు. కీలక ఫీచర్లు ఇవీ..

- ఏఐ టెంప్లేట్లు
- ఏఐ కంటెంట్ ఐడియా జనరేటర్
- ఏఐ రైటింగ్ అసిస్టెంట్ అండ్ కాపీరైటర్
- ఏఐ సోషల్ మీడియా పోస్ట్ జనరేటర్
- ఏఐ బ్లాగ్ రైటర్ అండ్ ఈమెయిల్ రైటర్
- ఏఐ యాడ్ జనరేటర్

కంటెంట్ స్టుడియో ContentStudio

ఇది మరో శక్తిమంతమైన ఆల్-ఇన్-వన్ సామాజిక మాధ్యమ కంటెంట్ వేదిక. సోషల్ పోస్టుల విశ్లేషణ, షెడ్యూల్, క్రాఫ్టింగ్ కోసం ఇందులో సొల్యూషన్లు ఎన్నో ఉన్నాయి. ఫాలోయర్లను కట్టిపడేయటానికి తోడ్పడే పోస్టులు, క్యాప్షన్స్ సృష్టించేలా దీనిలోని ఏఐ అసిస్టెంట్‌ను తీర్చిదిద్దారు. ఇలాంటి పనులు చేసి పెట్టే టూల్స్ చాలానే ఉన్నప్పటికీ తేలికగా వాడుకోగల సింగిల్ డ్యాష్‌బోర్డ్ దీనికి ప్రత్యేకతను తెచ్చిపెట్టింది. దీంతో నేరుగా ఏఐ ఆధారిత ప్రచారాలను రూపొందించుకోవచ్చు. వేర్వేరు వేదికలకు అనుగుణంగానూ సృష్టించుకోవచ్చు. కంటెంట్‌పెన్ అనే కొత్త ఫీచరూ దీనికి తోడైంది. ఇది ఆయా అవసరాలకు అనుగుణంగా బ్లాగ్స్‌ను సృష్టించి పెడుతుంది. కీలక ఫీచర్లు ఇవీ..

- కంటెంట్ డిస్కవరీ
- ఆర్‌ఎస్‌ఎస్ ఫీడ్ ఇంటిగ్రేషన్
- కంటెంట్ ప్రివ్యూ
- ఏఐ-పవర్డ్ క్యాప్షన్స్
- మీడియా లైబ్రరీ
- బల్క్ షెడ్యూలింగ్
- ఆటో-ఫస్ట్ కామెంట్
- క్యాలెండర్ వ్యూ

విద్యార్థులకు ఉచితంగా గూగుల్ ఏఐ ప్రొ



సంక్లిష్టమైన అంశాలు అర్థం చేసుకోవటానికి కష్టపడుతున్నారా? ఉద్యోగ ఇంటర్వ్యూకు సిద్ధపడుతున్నారా? అయితే గూగుల్ ఏఐ ప్రొ సాయం తీసుకోండి. అదీ ఉచితంగా. మనదేశంలోని విద్యార్థుల కోసం గూగుల్ ప్రత్యేకంగా ఈ అవకాశాన్ని కల్పించింది. మామూలుగానైతే దీనికి నెలకు రూ.1,950 కట్టాలి. కానీ విద్యార్థులకు ఏడాది వరకూ ఉచిత సభ్యత్వాన్ని ఇవ్వనున్నట్టు గూగుల్ ప్రకటించింది. ఏఐ టూల్స్‌తో విద్యార్థులు మరింత బాగా నేర్చుకోవటానికి, వారిలోని సృజనాత్మకతను వెలికి తీయటానికి తోడ్పడటం దీని ఉద్దేశం. ఏఐ ప్రొ ప్లాన్‌తో గూగుల్‌కు చెందిన జెమినీ 2.5 ప్రొ, డీప్ రిసెర్చ్ టూల్స్‌ను ఒకే వేదికపై ఉపయోగించుకోవచ్చు. వీటి సాయంతో హోంవర్క్ అపరిమితంగా చేసుకోవచ్చు, పరీక్షలకు సిద్ధం కావొచ్చు. ఈ ప్లాన్‌తో అధునాతన ఏఐ టూల్స్ యాక్సెస్ కూడా లభిస్తుంది డీప్ రిసెర్చ్ వ్యక్తిగత పరిశోధనలకు సాయపడుతుంది. నోట్‌బుక్‌ఎల్‌ఎంలో 5రెట్లు ఎక్కువగా నోట్స్‌ను ఆర్గనైజ్ చేసుకోవచ్చు. జెమినీ లైవ్‌తో మేధోమథనం నిర్వహించొచ్చు. టెక్స్ట్ లేదా ఫొటోలతో జెమినీ, ఫ్లో వేదికల్లో వియో 3 సాయంతో వీడియోలను సృష్టించుకోవచ్చు. ఈ ప్లాన్‌లో నమోదు చేసుకున్న విద్యార్థులకు నెలకు వెయ్యి ఏఐ క్రెడిట్స్ కూడా లభిస్తాయి. వీటిని ఫ్లో, విస్క్ వేదికల్లో టెక్స్ట్, ఇమేజ్, వీడియోలను సృష్టించటం వంటి పనులకు వాడుకోవచ్చు. అంతేకాదు, పెద్ద ప్రాజెక్ట్ ఫైళ్లు, భాగస్వామ్య పనుల్లో చేదోడుగా నిలవటానికి విద్యార్థులకు 2టీబీ క్లౌడ్ స్టోరేజీ సైతం లభిస్తుంది. దీన్ని డ్రైవ్, జీమెయిల్, ఫొటోస్ వంటి యాప్స్‌లో ఉపయోగించుకోవచ్చు.

- కనీసం 18 ఏళ్లు నిండిన విద్యార్థులు ఏఐ ప్రొ ఉచిత సబ్‌స్క్రిప్షన్ పొందటానికి అర్హులు. మనదేశంలోనే నివసిస్తూ ఉండాలి. గూగుల్ వ్యక్తిగత ఖాతా కలిగుండాలి. ఈ ప్లాన్ అర్హత, సైనప్ కోసం https://gemini.google/students/?gl=IN పేజీని చూడొచ్చు. అర్హత కలిగిన విద్యార్థులు సెప్టెంబరు 15 లోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి.

ఎలా పొందాలి?

- ఆఫర్ పేజీలో గెట్ ఆఫర్ మీద క్లిక్ చేసి గూగుల్ ఖాతాతో సైన్‌ఇన్ కావాలి.
- వెరిఫై ఎలిజబిలిటీ బటన్ మీద క్లిక్ చేయాలి.
- పేరు, స్కూలు లేదా కాలేజీ, విద్యాసంస్థ ఇచ్చిన ఈమెయిల్ అడ్రస్ వంటి వివరాలను నమోదు చేయాలి. ప్రత్యామ్నాయంగా వ్యక్తిగత గూగుల్ ఖాతానూ వాడుకోవచ్చు.
- తర్వాత పేజీ చివరన ఉండే వెరిఫై స్టుడెంట్ స్టేటస్ మీద క్లిక్ చేయాలి. అప్పుడు మీ స్కూలు లేదా కాలేజీ వెబ్ పోర్టల్‌తో లాగిన్ కావాలని గూగుల్ అడుగుతుంది. ఇక్కడ స్కూల్ లేదా కాలేజీ ఐడీ, క్లాస్ షెడ్యూల్, ట్యూషన్ రసీదు వంటి రుజువులను అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది.
- ఒకసారి వీటిని నమోదు చేశాక పత్రాల విశ్వసనీయతను గూగుల్ సమీక్షిస్తుంది. ఇందుకు సుమారు అరగంట పడుతుంది. ఒకవేళ వెంటనే పత్రాలను అప్‌లోడ్ చేయొద్దనుకుంటే గూగుల్ మీరు ఇచ్చిన ఈమెయిల్‌కు లింక్‌ను పంపిస్తుంది. దాని సాయంతో రిజిస్ట్రేషన్ పేజీలోకి తిరిగి రావొచ్చు.

విద్యార్థుల రక్షణకు మానసిక ఆరోగ్య టూల్

విద్యార్థుల ఆత్మహత్యలపై ఆందోళన పెరుగుతున్న నేపథ్యంలో ఐఐటీ ఖరగ్‌పూర్ తమ క్యాంపస్‌లో ఏఐ ఆధారిత భావోద్వేగ ఆరోగ్య టూల్‌ను ఇన్‌స్టాల్ చేయాలని సంకల్పించింది. ఇది విద్యార్థుల మూడ్‌ను ట్రాక్ చేస్తుంది. వారి ప్రవర్తన, మాట తీరు ఆధారంగా ముందస్తు హెచ్చరికలపై అప్రమత్తం చేస్తుంది. మానసిక వైద్య నిపుణుల సహకారంతో తీర్చిదిద్దిన దీన్ని హాస్టళ్లలో, తరగతి గదుల్లో సమ్మిళితం చేస్తారు. ముప్పు పొంచి ఉన్న విద్యార్థులను అఘాయిత్యానికి పాల్పడే ముందే గుర్తించటానికి, వారికి అవసరమైన సాయం చేయటానికిది తోడ్పడగలదని భావిస్తున్నారు. చదువుల ఒత్తిడి అధికంగా ఉండే విద్యాసంస్థల్లో మానసిక ఆరోగ్యాన్ని తరచూ నిర్లక్ష్యం చేస్తున్న నేపథ్యంలో ఇది గొప్ప ముందడుగు కాగలదని ఆశిస్తున్నారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యాసంస్థలకు ఈ ప్రయోగాత్మక కార్యక్రమం ఆదర్శంగా నిలిచే అవకాశమూ ఉంది.

కిండిల్‌లో టైమ్

కిండిల్‌లో పుస్తకం చదువుతున్నప్పుడు సమయం మీద దృష్టి పెట్టాలని అనుకుంటున్నారా? అయితే బుక్‌లో ఏఏ గుర్తు మీద క్లిక్ చేసి.. మోర్‌లోకి వెళ్లాలి. అక్కడ షో క్లాక్ వైల్ రీడింగ్ ఆప్షన్‌ను ఆన్ చేసుకోవాలి. అప్పుడు తెర పైభాగాన టైమ్ కనిపిస్తుంది. ఎంత సేపట్నుంచి పుస్తకం చదువుతున్నారో ఇట్టే తెలిసిపోతుంది.

డాక్స్‌లో వాయిస్ టైపింగ్

గూగుల్ డాక్స్‌లో మాటలను అక్షరాలుగా మార్చాలనుకుంటే కంట్రోల్, షిఫ్ట్, ఎస్ మీటలను కలిపి నొక్కండి. వాయిస్ టైపింగ్ ఆన్ అవుతుంది. అదే మ్యాక్‌లోనైతే కమాండ్, షిఫ్ట్, ఎస్ మీటలు ఒకేసారి నొక్కాలి.

మెటా 'ఇమాజిన్ మీ'

మీరు సూపర్‌మ్యాన్ వేషం వేస్తే ఎలా ఉంటారు? నచ్చిన హీరో దుస్తులు ధరిస్తే ఎలా కనిపిస్తారు? ఊహించుకోవటానికి బాగానే ఉంది గానీ ఎలా సాధ్యమని అనుకుంటున్నారా? ఇమాజిన్ మీ ఫీచర్‌తో సాధ్యమే. మెటా సంస్థ ఇటీవలే మనదేశంలో దీన్ని అధికారికంగా పరిచయం చేసింది. మామూలు టెక్స్ట్ ప్రాంప్ట్స్‌తో సృజనాత్మక, వ్యక్తిగత ఇమేజ్‌లను సృష్టించే ఇది ఇన్‌స్టాగ్రామ్, మెసేంజర్, వాట్సప్ చాట్స్‌లో అందుబాటులో ఉంటుంది. వ్యక్తిగత లేదా బృంద చాట్స్‌లో నేరుగా మెటా ఏఐతో సంభాషించటం ద్వారా దీని సేవలు పొందొచ్చు. పాతకాలం హీరో లేదా కామిక్ సినిమా హీరోలా 'ఇమాజిన్ మీ' అని ప్రాంప్ట్ అందిస్తే చాలు. కోరుకున్నట్టుగా ఏఐ సృష్టించిన ఇమేజ్ ప్రత్యక్షమవుతుంది.


ఎలా పనిచేస్తుంది?

ఇమాజిన్ మీని వాడుకోవాలంటే ముందుగా ఇన్‌స్టాగ్రామ్, మెసెంజర్, వాట్సప్‌లలో ఏదో ఒకదాంట్లో @Meta AI తో సంభాషణ మొదలెట్టాలి. తొలిసారి వాడేటప్పుడు యూజర్లను కొన్ని సెటప్ ఫొటోలను అప్‌లోడ్ చేయాలని అడుగుతుంది. వీటి ద్వారా ముఖ కవళికలను, శరీర ఆకారాన్ని అర్థం చేసుకుంటుంది. అనంతరం కోరిన విధంగా ఇమేజ్‌లను సృష్టిచేస్తుంది. ఇది టెక్స్ట్‌నే కాకుండా ఫొటోలనూ ప్రాంప్టులుగా తీసుకుంటుంది. సెటప్ ఫొటోలను మెటా ఏఐ సెటింగ్స్ ద్వారా ఎప్పుడైనా అప్‌డేట్ చేయొచ్చు లేదా తొలగించుకోవచ్చని మెటా హామీ ఇస్తోంది. ప్రిఫరెన్స్‌లనూ మార్చుకోవచ్చు. ఇమేజ్‌లను తిరిగి తీసుకోవచ్చు. మొత్తంగా వద్దనుకుంటే ఈ ఫీచర్‌ను డిసేబుల్ చేసుకోవచ్చు కూడా.

ఓపెన్ ఏఐ పీఏ

ఓపెన్ ఏఐ తాజాగా కొత్త చాట్‌జీపీటీ ఏజెంట్‌ను పరిచయం చేసింది. బిల్టిన్ 'వర్చువల్ కంప్యూటర్' సాయంతో మీ తరఫున పనులు పూర్తి చేయటం దీని ప్రత్యేకత. ఒకరకంగా ఇది పర్సనల్ అసిస్టెంట్ మాదిరిగా పనిచేస్తుందన్నమాట. జూమ్ మీటింగ్ అప్‌డేట్, సరకుల ఆర్డర్, చివరికి వేసుకునే దుస్తులను సూచించటం వరకూ రకరకాల పనులు చేసి పెడుతుంది. ప్రస్తుతమున్న ఆపరేటర్, డీప్ రిసెర్చ్ టూల్స్ సామర్థ్యాలను ఇది సమ్మిళితం చేస్తుందని డెవలపర్లు చెబుతున్నారు. అలాగని యూజర్ కంట్రోల్ అసలే ఉండదని కాదు. మెయిల్ పంపటం వంటి పనులు చేసే ముందు ప్రత్యేకంగా అనుమతి కోరుతుంది. దానికి అంగీకరిస్తేనే పని చేసి పెడుతుంది.

రూటర్ మొరాయిస్తోందా?



రూటర్ సరిగా పనిచేయనప్పుడు రీస్టార్ట్ చేయటం మంచిది. కాకపోతే దీన్ని సక్రమమైన పద్ధతిలో చేయాలి. ముందు మోడెమ్, రూటర్ రెండింటిని అన్‌ప్లగ్ చేయాలి. అర నిమిషం ఆగాలి. తర్వాత మోడెమ్ ప్లగ్‌ను సాకెట్‌లో పెట్టాలి. లైట్లు తిరిగి వెలిగేంత వరకూ నిమిషం సేపు ఆగాలి. అనంతరం రూటర్ ప్లగ్‌ను సాకెట్‌లో పెట్టి, రెండు నిమిషాలు ఆగాలి. ఇంటర్నెట్ కనెక్షన్ రీస్టార్ట్ అవుతుంది. అప్పటికీ ఫలితం కనిపించకపోతే ఇంటర్నెట్ ప్రొవైడర్‌కు ఫోన్ చేయాల్సిందే.

మ్యాక్‌లో టైమ్ ఆదా

మ్యాక్‌లో విండోను మినిమైజ్ చేయటానికి ఎల్లో చుక్క మీద క్లిక్ చేస్తున్నారా? మాటిమాటికీ మౌజ్‌తో క్లిక్ చేయటం ఇబ్బందిగా అనిపిస్తోందా? అయితే **కమాండ్, ఎం** మీటలను కలిపి నొక్కండి. వెంటనే విండో మినిమైజ్ అవుతుంది. ప్రస్తుతం పనిచేస్తున్న విండో తప్ప మిగతా అన్నింటినీ చిటికెలో కనుమరుగు చేసుకునే మార్గమూ ఉంది. **కమాండ్, ఆప్షన్, హెచ్** మీటలను కలిపి ఒకేసారి నొక్కండి. మౌజ్‌తో మినిమైజ్ చేయటం కన్నా దీంతో త్వరగా పని పూర్తవుతుంది.

మరో సెర్చ్ ఇంజిన్

క్రోమ్ వాడుతున్నారా? ఎప్పుడూ గూగుల్ సెర్చింజనే వాడాల్సిన పనిలేదు. దీన్ని మార్చుకునే వెసులుబాటు ఉంది. బింగ్, యాహూ, డక్‌డక్‌గో, యాండెక్స్ సెర్చ్ ఇంజిన్ల ఆప్షన్లనూ క్రోమ్ కల్పిస్తుంది. స్మార్ట్‌ఫోన్‌లో ముందుగా సెటింగ్స్‌లోకి వెళ్లి సెర్చ్ ఇంజిన్ మీద క్లిక్ చేసి ఇష్టమైన దాన్ని ఎంచుకుంటే సరి. డెస్క్‌టాప్ మీదా సెటింగ్స్ ద్వారా సెర్చ్‌ఇంజిన్‌ను మార్చుకొని సెట్ యాజ్ డిఫాల్ట్‌గా పెట్టుకోవచ్చు.

అయస్కాంతం ప్రత్యామ్నాయం


రిఫ్రిజిరేటర్ తీసే కూనిరాగం దగ్గరి నుంచి స్మార్ట్‌ఫోన్ లోపల మెమరీ వరకూ అయస్కాంతాలు నిశ్శబ్దంగా పనిచేస్తూనే ఉంటాయి. ఆధునిక సాంకేతిక జీవనంలో గుండెకాయగానూ నిలుస్తున్నాయి. ఇప్పుడు కొత్త తరగతికి చెందిన ప్రత్యామ్నాయ అయస్కాంతాలు (ఆల్టర్‌మ్యాగ్నెట్స్) సైతం మేమున్నామంటూ చేయందిస్తున్నాయి. ఇవి భవిష్యత్ తరం ఎలక్ట్రానిక్ పరికరాల తయారీ, వాటికి శక్తిని అందించే తీరును గణనీయంగా మార్చనున్నాయి.

అయస్కాంతాలు అనగానే ఫ్రిజ్ మీద అతికించుకునే చిన్న బొమ్మలు లేదా పరిశ్రమల్లో వాడే సాధనాలే ముందుగా గుర్తుకొస్తాయి. కానీ చాలా సాంకేతిక పరిజ్ఞానాల్లో ఇవి కీలక పాత్ర పోషిస్తాయి. డేటా స్టోరేజీ, ఎలక్ట్రిక్ మోటార్లు, జనరేటర్లు, ఎంఆర్ఐ యంత్రాలు, మ్యాగ్నెటిక్ సెన్సర్లు.. చివరికి మనం రోజూ పాటలు వినే స్పీకర్లకూ వెన్నెముక ఇవే. ఉదాహరణకు- కంప్యూటర్లలోని హార్డ్‌డ్రైవ్‌లు బైనరీ డేటాను నిల్వ చేయటానికి ఫెర్రోమ్యాగ్నెట్స్‌ను వాడుకుంటాయి. స్మార్ట్‌ఫోన్లలోనూ హ్యాప్టిక్స్, కాంపాస్, మైక్రోఫోన్, వైబ్రేషన్ అలర్ట్స్‌కు చిన్న చిన్న అయస్కాంతాలే కారణం. ఇక భవిష్యత్ మెమరీ టెక్నాలజీ అయిన మ్యాగ్నెటోరెసిస్టివ్ ర్యాండమ్-యాక్సెస్ మెమరీ (ఎంర్యామ్) అయితే ఎలక్ట్రిక్ ఆవేశాలకు బదులు అయస్కాంత స్థితులను తారుమారు చేయటం ద్వారానే డేటాను స్టోర్ చేస్తుంది. ప్రస్తుతం పరికరాలు రోజురోజుకీ చిన్నగా అవుతున్నాయి. వాటి సామర్థ్యం, పనితీరు గణనీయంగా పుంజుకుంటున్నాయి. అదీ తక్కువ శక్తిని వాడుకోవటంతోనే. ఈ వేగాన్ని అందుకోవటానికే శాస్త్రవేత్తలు చాలాకాలంగా కొత్త అయస్కాంత పదార్థాలను కనుక్కోవటం మీద దృష్టి సారించారు. ఇక్కడే ఆల్టర్‌మ్యాగ్నెట్స్ ప్రాధాన్యం సంతరించుకుంటున్నాయి?

స్వచ్ఛ, ఆచరణీయ మార్గంగా

క్రోమియం యాంటీమోనైడ్ శక్తిమంతమైంది మాత్రమే కాదు, ఆచరణీయ మార్గాన్నీ చూపగలదు. ఇది భూమిలోనే దొరుకుతుంది. పుష్కలంగా అందుబాటులో ఉంటుంది. కాబట్టి పర్యావరణ హితం కూడా. గది ఉష్ణోగ్రత కన్నా రెట్టింపు వేడి వాతావరణంలోనూ ఇది స్థిరంగా ఉంటుంది. అత్యధిక ఆల్టర్‌మ్యాగ్నెటిక్ గుణాన్నీ ప్రదర్శిస్తుండటం విశేషం. అందుకే స్పింట్రానిక్ పరికరాల తయారీని గతి తిప్పగలదని భావిస్తున్నారు. తక్కువ శక్తితోనే అతి వేగంగా పనిచేసే పరికరాలను తయారుచేసే అవకాశముంది. అదీ మెమరీ తగ్గని విధంగా. ఫలితంగా డేటా ప్రాసెసింగ్ ప్రక్రియ వేగంగా సాగుతుంది.

ప్రత్యామ్నాయ అయస్కాంతాలంటే?



ఆల్టర్‌మ్యాగ్నెట్స్ అనేవి కొత్త తరగతికి చెందిన అయస్కాంత పదార్థాలు. వీటిని అర్థం చేసుకోవాలంటే ముందు ఫెర్రోమ్యాగ్నెట్స్, యాంటీఫెర్రోమ్యాగ్నెట్స్ గురించి తెలుసుకోవాలి. ఇనుప వస్తువులకు అయస్కాంతాన్ని తాకిస్తే అది అంటుకుంటుంది కదా. మనం ఫ్రిజ్ తలుపు మీద అలంకరణ కోసం అతికించే చిన్న చిన్న బొమ్మలు ఇలాంటివే. వీటిల్లో ఉండేవి ఫెర్రోమ్యాగ్నెట్స్. ఇవి తమ వెలుపల బలమైన అయస్కాంత క్షేత్రం కలిగుంటాయి. వీటికి వ్యతిరేకమైనవి యాంటీఫెర్రోమ్యాగ్నెట్స్. ఇవి తమ అయస్కాంత శక్తిని తామే రద్దు చేసుకుంటాయి. ఈ రెండు లక్షణాల కలబోతే ఆల్టర్‌మ్యాగ్నెట్స్. వీటి వెలుపల అయస్కాంత క్షేత్రం తటస్థంగా ఉంటుంది. కానీ లోపల వాటి ఎలక్ట్రాన్లు చాలా క్రమబద్ధంగా అమరి ఉంటాయి. అందువల్ల ఇవి అధునాతన స్పింట్రానిక్స్ రంగంలో బాగా ఉపయోగపడతాయి. ఎలక్ట్రాన్లను ఛార్జ్ చేయటానికి బదులు వాటి సుడిని మార్చటం ద్వారా డేటాను స్టోర్, పంపిణీ చేయటం స్పింట్రానిక్స్ ప్రత్యేకత. దీంతో ఎలక్ట్రానిక్ పరికరాలు చాలా త్వరగా ఛార్జ్ అవుతాయి. సమర్థంగానూ పనిచేస్తాయి. బయటి నుంచి ఎలాంటి అయస్కాంత ప్రభావం లేకపోయినా అయస్కాంత క్రమాన్ని సమ్మిళితం చేయటం వల్ల ఆల్టర్‌మ్యాగ్నెట్స్ పరికరాల డిజైన్, పనితీరులో కొత్త అవకాశాలకు వీలు కల్పిస్తుందని అనుకుంటున్నారు.

ఎందుకీ ప్రాధాన్యం?

రోజురోజుకీ క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ అవసరాలు వేగంగా పెరిగిపోతున్నాయి. పెరిగిపోతున్న డేటా డిమాండ్ల కింద ప్రస్తుత డిజిటల్ సదుపాయాలు నలిగిపోతున్నాయి. ఇక్కడే సీఆర్‌ఎస్‌బీ కొత్త పరిష్కార మార్గంగా కనిపిస్తోంది. దీని ప్రత్యేక గుణాలు ఆల్-ఇన్-వన్ చిప్స్.. తక్కువ ఇంధనంతోనే ఎక్కువ మెమరీ సాధించటం, స్టోరేజీ చిక్కులను పరిష్కరించటం.. వైద్య, పరిశ్రమల కోసం అధునాతన మ్యాగ్నెటిక్ సెన్సర్ల వంటి వినూత్న ఆవిష్కరణలకు దారిచూపగలదు.

గొప్ప మలుపు

ఆల్టర్‌మ్యాగ్నెట్స్ భావన 2018లోనే పురుడు పోసుకుంది. లైబర్ మెజ్కల్ దీనికి బీజం వేశారు. ఆయన, తన బృందంతో కలిసి 2022లో ఓ పరిశోధన పత్రం సమర్పించారు. ఇవి నిజంగానే ఉన్నాయని స్విట్జర్లాండ్‌కు చెందిన జురాజ్ క్రెంపస్కీ 2024లో నిరూపించారు. మనదేశానికి చెందిన శాస్త్రవేత్తలు వీటి విషయంలో మరో ముందడుగు వేశారు. సైన్స్ అండ్ టెక్నాలజీ విభాగం ఆధ్వర్యంలో పనిచేసే ఎస్.ఎన్. బోస్ నేషనల్ సెంటర్ ఫర్ బేసిస్ సైన్సెస్ (ఎస్ఎన్‌బీఎన్‌సీబీఎస్) పరిశోధకులు క్రోమియం యాంటీమోనైడ్ (సీఆర్‌ఎస్‌బీ) అనే ప్రత్యామ్నాయ అయస్కాంత పదార్థం స్ఫటికంలో ఇంతకు ముందెన్నడూ చూడని ప్రవర్తనను గమనించారు. ప్రవాహ దిశను బట్టి ఎలక్ట్రాన్లు, రంధ్రాలు భిన్నంగా ప్రవర్తిస్తున్నట్టు కనుగొన్నారు. ఉదాహరణకు- సీఆర్‌ఎస్‌బీ స్ఫటికాన్ని పుస్తకంగా ఊహించుకున్నామనుకోండి. విద్యుత్ ప్రవాహం పేజీల గుండా సాగుతున్నప్పుడు, అది ఎలక్ట్రాన్ల ద్వారా ప్రసారమవుతుంది (ఎన్ రకం ప్రవర్తన). అదే ప్రవాహం పేజీలకు అడ్డంగా సాగుతున్నప్పుడు, అది రంధ్రాల ద్వారా ప్రసారమవుతుంది (పి రకం). సాధారణంగా సౌర కణాలు, డయోడ్లు, థర్మోఎలక్ట్రిక్స్ వంటి పరికరాల్లో ఎన్, పీ రకం రకాల గుణాలను సాధించటానికి ఇంజినీర్లు వేర్వేరు పదార్థాలను ఉపయోగిస్తుంటారు. అయితే సీఆర్‌ఎస్‌బీ పదార్థంలో సహజంగానే ఈ రెండూ ఉండటం గమనార్హం. ఇలాంటి ద్వంద్వ గుణాన్ని ప్రదర్శిస్తున్న ప్రత్యామ్నాయ అయస్కాంతాన్ని గుర్తించటం ఇదే తొలిసారి. సరళమైన, సమర్థమైన ఎలక్ట్రానిక్ పరికరాల తయారీకిది దారి చూపగలదని భావిస్తున్నారు.

ఈనాడు సినిమా

యుద్ధానికి సిద్ధం


'వార్ 2'

హృతిక్‌రోషన్.. ఎన్టీఆర్ - కథానాయకులుగా ఈ ఇద్దరి ప్రయాణం ఒకేసారి మొదలైంది. 25 ఏళ్ల సినీ ప్రయాణాన్ని పూర్తి చేసుకుంటున్నారు. ఈ దశలోనే ఈ ఇద్దరూ ఒకే సినిమాలో కలిసి నటించడం విశేషం. ఆ సినిమానే.. 'వార్ 2'. ప్రఖ్యాత యశ్‌రాజ్ ఫిల్మ్స్ సంస్థ తన స్పై యూనివర్స్‌లో భాగంగా రూపొందిస్తున్న చిత్రమిది. అయాన్ ముఖర్జీ దర్శకత్వం వహిస్తున్నారు. కియారా అడ్వాణీ కథానాయిక. ఈ సినిమా ట్రైలర్‌ని ఈ నెల 25న విడుదల చేస్తున్నట్టు సినీ వర్గాలు ప్రకటించాయి. "ఇద్దరు గొప్ప స్టార్ కథానాయకులు కలిసి నటించిన చిత్రమిది. వాళ్ల మధ్య సాగే పోరాటం అద్భుతంగా ఉంటుంది. ఇద్దరి కెరీర్‌కి సంబంధించిన అరుదైన ఈ క్షణాలు అభిమానులకి వేడుకలా ఉండేలా సినిమాని సిద్ధం చేశామ"ని సినీ వర్గాలు తెలిపాయి. ఆగస్టు 14న ఈ చిత్రం హిందీ, తెలుగు, తమిళ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆగస్టు నెలలో తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాకి సంబంధించిన వేడుకల్ని జరిపేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి.

'ఫైర్ అండ్ యాష్'... వరంగ్



● 'అవతార్ 3' ఫస్ట్ లుక్ విడుదల

ప్రముఖ హాలీవుడ్ దర్శకుడు జేమ్స్ కామెరూన్ తెరకెక్కించిన విజువల్ వండర్ 'అవతార్'. ప్రపంచవ్యాప్తంగా 'అవతార్' ఓ సంచలనం. ఒక గ్రహాన్ని సృష్టించి అందులోని ప్రకృతి అందాలను కళ్లు చెదిరే విజువల్ ఎఫెక్ట్స్‌తో చూపించి ప్రేక్షకుల్ని కట్టిపడేశారు దర్శకుడు. దాని సీక్వెల్‌గా వచ్చిన 'అవతార్: ది వే ఆఫ్ వాటర్' ప్రపంచవ్యాప్తంగా విడుదలై బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లను సాధించింది. ఈ ఫ్రాంఛైజీలో వస్తున్న మూడవ భాగం 'అవతార్: ఫైర్ అండ్ యాష్'. ఇది పంచభూతాల్లో ఒకటైన అగ్నికి సంబంధించిన కాన్సెప్ట్‌తో రానుంది. దీని కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్‌లుక్‌ని సామాజిక మాధ్యమాల వేదికగా విడుదల చేసింది చిత్రబృందం. ఊనా చాప్లిన్ పోషించిన వరంగ్ పాత్రను పరిచయం చేస్తూ ఆమె పోస్టర్‌ను పంచుకున్నారు. అలాగే ఈ సినిమా మొదటి ట్రైలర్‌ని ఈ నెల 25న 'ది ఫెంటాస్టిక్ ఫోర్: ఫస్ట్ స్టెప్స్' సినిమాతో పాటు విడుదల చేయనున్నట్లు తెలిపారు. డిసెంబరు 19న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది.

పాన్ ఇండియా స్థాయిలో


ఉన్ని ముకుందన్

మలయాళ నటుడు ఉన్ని ముకుందన్ తెలుగు ప్రేక్షకులకూ సుపరిచితుడే. 'జనతా గ్యారేజ్' సహా పలు తెలుగు సినిమాల్లో నటించారు. 'మార్కో' సినిమాతో అన్ని భాషల ప్రేక్షకులకూ ఆయన మరింతగా చేరువయ్యారు. ఆ సినిమా తర్వాత నుంచి ఉన్ని ముకుందన్ సినిమాలు మరింత భారీగా రూపొందుతున్నాయి. ప్రముఖ దర్శకుడు జోషీతో ఆయన ఓ భారీ యాక్షన్ సినిమా చేయనున్నారు. మంగళవారమే ఈ సినిమాని ప్రకటించారు. ఉన్ని ముకుందన్ ఫిల్మ్స్, ఐన్‌స్టీన్ మీడియా సంస్థలు సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. "ఉన్ని ముకుందన్‌ని ఓ సరికొత్త యాక్షన్ అవతారంలో ఆవిష్కరించనున్న చిత్రమిది. కొత్తతరహా కథ, కథనాలతో పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతుంది. బలమైన భావోద్వేగాలతో యువతరాన్ని, కుటుంబ ప్రేక్షకుల్నీ అలరిస్తుంద"ని సినీ వర్గాలు తెలిపాయి.

వీరమల్లు... ఆ ఇద్దరివల్లే!


క్రిష్

'హరి హర వీర మల్లు' సినీ పరిశ్రమలో ఎప్పటికీ గుర్తుండిపోయే చిత్రం అవుతుందని చెప్పారు క్రిష్ జాగర్లమూడి. ఎన్నో ఏళ్లుగా వేచి చూసిన సమయం వచ్చిందంటూ సినిమా విడుదల కానుండడంపై ఆనందం వ్యక్తం చేశారు. క్రిష్ దర్శకత్వంలోనే ఈ చిత్రం ప్రారంభమైన సంగతి తెలిసిందే. క్రిష్ ఈ ప్రాజెక్ట్ నుంచి బయటికొచ్చాక, జ్యోతికృష్ణ ఆ బాధ్యతల్ని తీసుకుని సినిమాని పూర్తి చేశారు. ఈ నెల 24న చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. 23 రాత్రి ప్రత్యేక ప్రదర్శనలతోనే సినిమా సందడి షురూ అవుతోంది. ఈ సందర్భంగా క్రిష్ ఎక్స్ ద్వారా స్పందిస్తూ ఈ సినిమా ప్రయాణాన్ని గుర్తు చేసుకున్నారు. "వీరమల్లు ప్రపంచంలోకి అడుగు పెడుతున్నాను. నిజ్జంగా కాకుండా, ఓ గొప్ప ఆశయంతో చరిత్రని ప్రజల ముందుకు తీసుకొస్తున్నాం. చరిత్రలో నిలిచిపోయే ఇద్దరు వ్యక్తుల కారణంగానే ఇది సాధ్యమైంది. వారు సినిమాల్లోనే కాదు, నిజ జీవితంలోనూ ఎంతోమందికి స్ఫూర్తి. వారిలో ఒకరు పవన్‌కల్యాణ్, మరొకరు ఎ.ఎం.రత్నం. అసాధారణ శక్తికి రూపం పవన్‌కల్యాణ్. ఆయన నిత్యం రగిలే ఓ అగ్ని కణం, ఎంతోమందికి ఆదర్శం. వెన్నెముకలా నిలుస్తూ ఈ సినిమాకి ప్రాణం పోసింది ఆయనే. ఎ.ఎం. రత్నం ఎంతో ఆత్మవిశ్వాసంతో ఈ సినిమాని నిర్మించారు. భారతీయ సినీ రంగంలో తనకంటూ గొప్ప అనుభవాల్ని పోగేసుకున్న ఓ శిల్పి ఆయన. ఇలాంటి సామర్థ్యం, పట్టుదల అరుదుగా ఉంటాయి. నాకెంతో ఉత్సాహాన్నిచ్చిన సినిమాల్లో ఇదొకటి. ఎన్నో జ్ఞాపకాల్ని ఇచ్చింది. దర్శకుడిగా మాత్రమే కాకుండా, ఈ సినిమా కథని రూపొందించడంలోనూ ఎన్నో విషయాల్ని తెలుసుకున్నా" అంటూ ఎక్స్‌లో తన భావాల్ని పంచుకున్నారు. పవన్‌కల్యాణ్‌కి, ఎ.ఎం. రత్నంకి ఈ సందర్భంగా కృతజ్ఞతలు చెప్పారు క్రిష్.

శ్లోక పాత్రలో


రాశీ ఖన్నా

అగ్ర కథానాయకుడు పవన్‌కల్యాణ్‌తో జోడీ కట్టింది రాశీ ఖన్నా. ఆమె 'ఉస్తాద్ భగత్ సింగ్' సినిమాలో ఓ కథానాయికగా ఎంపికైంది. ఈ విషయాన్ని చిత్రబృందం అధికారికంగా ఖరారు చేసింది. రాశీ ఖన్నా పోషిస్తున్న పాత్ర పేరుతోపాటు, సినిమాలోని ఆమె లుక్‌ని కూడా మంగళవారం విడుదల చేసింది. రాశి ఇందులో శ్లోక పాత్రలో సందడి చేయనున్నారు. హరీశ్‌శంకర్ దర్శకత్వంలో, మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై రూపొందుతున్న చిత్రమిది. పవన్ సరసన ఇద్దరు కథానాయికలు కనిపించనున్నారు. ఇప్పటికే ఓ కథానాయికగా శ్రీలీల ఎంపికయ్యారు. ఈ సినిమా చిత్రీకరణ శరవేగంగా సాగుతోంది.

నేను ఈ ప్రపంచాన్ని మార్చబోతున్నా



సిరీస్:	'వాషింగ్టన్ బ్లాక్'
నటీనటులు:	ఎర్నెస్ట్ కింగ్స్లీ జూనియర్, స్టెర్లింగ్ కె.బ్రౌన్, టామ్ ఎల్లిస్
విడుదల:	బుధవారం
ప్లాట్‌ఫామ్:	జియో హాట్‌స్టార్

కథాంశం: చాలా మంది తాము పుట్టిన ప్రదేశంలోనే పెరగరు. పరిస్థితుల ప్రభావం కారణంగా కొన్నిసార్లు ఒక చోట నుంచి మరొక ప్రాంతానికి మారుతుంటారు. అలా వెళ్లిన పదకొండేళ్ల బాలుడే జార్జ్ వాషింగ్టన్ బ్లాక్(ఎర్నెస్ట్). బార్బడస్‌లోని ఓ చెరకు తోటలో మొదలైన తన జీవితం పుట్టుకతోనే బానిసత్వంలో మగ్గుతుంది. కానీ ఆ ప్రాంతంలో తన తెలివితేటలతో అక్కడి వారందర్నీ ఆశ్చర్యపరుస్తుంటాడు జార్జ్. అనుకోకుండా ఓ రోజు తాను ఉండే ప్రదేశంలో ప్రాణానికి ముప్పు ఉందని తెలుస్తుంది. వెంటనే అక్కడి నుంచి వైల్డ్(టామ్ ఎల్లిస్)తో కలిసి వేరే ప్రాంతానికి వెళ్లిపోతారు. అలా ప్రపంచవ్యాప్తంగా తిరుగుతూ తనకు నచ్చినట్టు జీవిస్తుంటాడు. కానీ తన వెనుక ఉన్న ప్రమాదాలు మాత్రం ఎక్కడికి వెళ్లిన వెంటాడుతూనే ఉంటాయి. అయినా వాటిని ఎదుర్కొంటూ సాహసోపేతంగా ఉంటూనే "నేను ఈ ప్రపంచాన్ని మార్చబోతున్నాను" అంటున్న జార్జ్ కథేంటో మీరూ చూసేయండి. ఈ సిరీస్‌ని 'వాషింగ్టన్' అనే పుస్తకం ఆధారంగా దర్శకుడు సెల్విన్ సెయ్ఫు హిండ్స్ తెరకెక్కించారు.



యాక్షన్... ట్రిగ్గర్



సిరీస్:	'ట్రిగ్గర్'
నటీనటులు:	కిమ్ నామ్ గిల్, కిమ్ యంగ్ క్వాంగ్
విడుదల:	శుక్రవారం
ప్లాట్‌ఫామ్:	నెట్‌ఫ్లిక్స్

కథాంశం: మనుషుల ప్రాణాలు తీసే మారణాయుధాలు అందరికీ అందుబాటులో ఉంటే సమాజం పూర్తిగా నేరాలతో నిండిపోతుంది. ఇలాంటి ఓ సంఘటనే దక్షిణ కొరియా దేశంలో జరిగింది. ఇక్కడ దేశవ్యాప్తంగా ఉన్న పోలీసు స్టేషన్‌లలో నమోదైన చాలా కేసుల్లో గన్‌తో కాల్చడం వల్ల మరణించిన వారే ఉంటారు. అలానే నిందితులకు కావాల్సిన ఆ ఆయుధాలన్నీ ఎక్కడి నుంచి వస్తున్నాయో పోలీసులకు అంతుచిక్కని ప్రశ్న. ఈ నేపథ్యంలోనే అక్కడి నేర చరిత్రను దృష్టిలో ఉంచుకుని దక్షిణ కొరియా ప్రభుత్వం గన్‌ల వాడకాన్ని నిషేధిస్తుంది. కానీ మూన్ బేక్(కిమ్ యంగ్ క్వాంగ్) వాటిని అక్రమంగా దేశంలోకి తరలిస్తుంటాడు. దాని వల్ల అనేక మంది ప్రాణాలు కోల్పోతుంటారు. దీనిని ఎలాగైనా అరికట్టడానికి పోలీసు అధికారి లీడో(కిమ్ నామ్ గిల్) రంగంలోకి దిగుతాడు. ఆ తర్వాత ఏమైందనేది తెలియాలంటే ఈ సిరీస్‌ని చూడాల్సిందే. గన్ ట్రిగ్గర్ చేసే శబ్దాలతో ఉత్కంఠభరితంగా అదిరిపోయే యాక్షన్ సన్నివేశాలతో సాగే ఈ క్రైమ్ యాక్షన్ థ్రిల్లర్‌కు క్వాన్ ఓహ్ సెయుంగ్ దర్శకత్వం వహించారు.

అదే దేశంపై మన ప్రేమకు నిజమైన గుర్తు

ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా నేను భారతీయుడిని అని గర్వంగా చెపుతాను. అదే నిజమైన దేశభక్తి అని అన్నారు కథానాయకుడు పృథ్వీరాజ్ సుకుమారన్. ఆయన ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'సర్జమీన్' ఈ నెల 25న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఆయన ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ "దేశభక్తికి నా దగ్గర ఒకటే అర్థముంది. నేను నా దేశాన్ని ప్రేమిస్తున్నాను. భారతీయుడిగా పుట్టినందుకు గర్వంగా ఉంది. మీరు ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా.. ఏం చేస్తున్నా, మన దేశాన్ని ఎప్పుడూ గుర్తుపెట్టుకోవాలి. నేను కేరళ నుంచి వచ్చానా, మలయాళం మాట్లాడతానా, లేదంటే నేను మహారాష్ట్రకు చెందిన వాడినా, వీటన్నింటి కంటే ముందు మనందరం భారతీయులం. ప్రపంచంలో ఏ ప్రాంతానికి వెళ్లినా మీరు ఎక్కడినుంచి వచ్చారని ఎవరైనా అడిగితే నేను మా ఊరి పేరు చెప్పను. భారత్ నుంచి వచ్చానని చెబుతాను. అలా చెప్పడం నాకు గర్వంగా ఉంటుంది. అదే మన దేశంపై మనకున్న నిజమైన ప్రేమకు గుర్తు" అని అన్నారు పృథ్వీరాజ్. ఆయన సినిమా విషయానికొస్తే 'సర్జమీన్'లో ఆర్మీ ఆఫీసర్‌గా కనిపించనున్నారు.


పృథ్వీరాజ్ సుకుమారన్

ఇన్నాళ్లు ఎదురుచూసింది ఈ మార్పు కోసమే!

నటీమణులు యాక్షన్ పాత్రల్ని ఎంచుకుంటూ సాహసాలు చేయడం అభినందించదగిన విషయమని అంటోంది వాణీ కపూర్. ఇటీవలే 'రైడ్ 2'తో ప్రేక్షకుల్ని పలకరించిన ఈమె.. 'మండలా మర్డర్స్' సిరీస్‌తో డిటెక్టివ్‌గా నిందితుల్ని పరుగులు పెట్టించడానికి సన్నద్ధమవుతోంది. ఈ సిరీస్‌తో వాణి తొలిసారి ఓటీటీ వేదికగా సందడి చేయనుండటం విశేషం. యశ్ రాజ్ ఫిల్మ్స్ నిర్మిస్తున్న ఈ యాక్షన్ థ్రిల్లర్ సిరీస్ ఈ నెల 25న నెట్‌ఫ్లిక్స్‌లో విడుదల కానుంది. ఈ సందర్భంగా వాణి కొన్ని ఆసక్తికర సంగతులతో మన ముందుకొచ్చింది.


వాణీ కపూర్

❑ "బాలీవుడ్‌లో పేరు సంపాదించడం అంత సులభం కాదు. కొత్తవారు తరచూ కఠినమైన సవాళ్లు ఎదుర్కొంటారు. నా ప్రయాణం ప్రారంభం నుంచి సజావుగా సాగలేదు. సినిమాలో ఉన్నత స్థితికి ఎదగాలనే కలలు కన్నాను. దానికి ప్రతిభ ఉండాలి అనుకునేదానిని. కానీ ప్రతిభతోపాటు అందం మరింత ముఖ్యం అని తెలుసుకున్నాను. నా కెరీర్ ప్రారంభంలోని ఓ ప్రాజెక్ట్‌లో దర్శకుడు నన్ను తిరస్కరించారు. నాకు నేరుగా చెప్పలేదు కానీ, ఆ సమాచారం నాకు ఇతర వ్యక్తుల ద్వారా తెలిసింది. ఆ చిత్రనిర్మాత సినిమాలో పాత్రకి న్యాయం చేయలేనని, నేను మిల్కీ వైట్ కాదని అన్నారు. అందుకే నాకు నేనుగా ఆ సినిమాని నుంచి తప్పుకున్నాను. ఇది చాలా కాలం క్రితం జరిగింది".

❑ "ఇన్నేళ్ల నా ప్రయాణంలో ఎన్నో వైవిధ్యమైన పాత్రలతో తెరపై ప్రేక్షకుల్ని మెప్పించాను. ఇన్నాళ్లకు నాకు ఓటీటీ వేదికగా అలరించే మంచి అవకాశం దొరికింది. సంప్రదాయ పాత్రలకు దూరంగా.. సవాలుతో కూడిన శైలిని వెతుకుతున్న సమయంలోనే 'మండలా మర్డర్స్' లాంటి అద్భుతమైన కథ నా దగ్గరికొచ్చింది. ఈ థ్రిల్లర్ కథ కోసం శారీరకంగా. . మానసికంగా చాలా కష్టపడ్డాను. ఇంతకు ముందు నేను అన్వేషించని శైలి ఇది. ఇందులో డిటెక్టివ్ పాత్రలో కనిపిస్తా. ఈ కథతో నాలోని కొత్త నటిని ప్రేక్షకులకు పరిచయం చేయనున్నా. ఇలా నాలోని కొత్త కోణాన్ని బయటికి తీసి.. సవాలు విసిరే పాత్రలంటేనే నాకు ఆసక్తి ఎక్కువ".

❑ "నేను చాలా సన్నగా ఉంటానని.. బరువు పెరిగేలా చూసుకోవాలని వింటుంటాను. కానీ నన్ను నేను ఇలానే ఇష్టపడుతున్నాను. నాలో ఏమి మార్చుకోవాలనుకోవడం లేదు. నేను చాలా ఆరోగ్యంగా, ఫిట్‌గా ఉన్నాను. సాధారణంగా ఈ విషయాలతో నేను ఎప్పుడూ బాధపడలేదు"

❑ "మునుపటితో పోలిస్తే చిత్రపరిశ్రమలో పరిస్థితులు చాలా మారిపోయాయి. ప్రస్తుతం పరిశ్రమలో చాలా మంది నటీమణులు ఎన్నో అడ్డంకులను ఛేదిస్తూ.. బలమైన పాత్రలను పోషిస్తున్నారు. భారతీయ హీరోయిన్లు ఇప్పుడు నిర్భయంగా యాక్షన్ కథల్ని ఎంచుకుంటూ వాటిని ముందుండి నడిపిస్తున్నారు. ఈ విషయంలో సంతోషంగా ఉంది. ఈ మార్పు కోసమే ఇన్నాళ్లు ఎదురుచూశాం. ఎట్టకేలకు అది సాధ్యమైంది. భవిష్యత్తులో కూడా మహిళా ప్రాధాన్య చిత్రాల సంఖ్య పెరగాలని.. నటీమణులు యాక్షన్ సీక్వెన్స్‌తో అదరగొట్టాలని కోరుకుంటున్నా".

❑ "ఈ డిజిటల్ యుగంలో ఓటీటీలు కూడా ప్రేక్షకుల్ని సీటు అంచున కూర్చోబెట్టే కథలతో దూసుకెళ్తున్నాయి. అంతే కాదు.. దీని వల్ల నటీనటులకు శక్తిమంతమైన ప్రాజెక్టులు లభిస్తున్నాయి. నాకు కూడా ఓటీటీ వేదికగా నటించడమంటే చాలా ఇష్టం. ఎందుకంటే ఒక నటి తన నైపుణ్యాన్ని, ప్రతిభను తెరపై చూపించడానికి ఎన్నో ముఖ్యమైన చిత్రాలను, పాత్రలను ఈ వేదిక వల్లే పొందుతుంది. ఇక థియేటర్ సినిమాల విషయానికొస్తే.. నా దృష్టిలో అవి చాలా పరిమితం. ఎందుకంటే థియేటర్లలో ఎక్కువగా హీరోలే ప్రధాన కథాంశంగా రూపొందే చిత్రాలు విడుదలవుతుంటాయి".

యోగిబాబు నవ్వులు


యోగిబాబు

నరేష్ అగస్త్య, ఫరియా అబ్దుల్లా జంటగా తెరకెక్కుతున్న చిత్రం 'గుర్రం పాపిరెడ్డి'. హాస్యనటుడు యోగిబాబు ముఖ్యభూమిక పోషిస్తున్నారు. మురళీ మనోహర్ దర్శకత్వం వహిస్తున్నారు. వేణు సద్ది, అమర్ బూర, జయకాంత్ (బాబీ) నిర్మిస్తున్నారు. డా. సంధ్య గోలి సమర్పకులు. డార్క్ కామెడీ కథతో రూపొందిన ఈ సినిమాని త్వరలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్టు సినీ వర్గాలు తెలిపాయి. నటుడు యోగిబాబు పుట్టినరోజు సందర్భంగా మంగళవారం సినిమాలోని ఆయన లుక్‌ని విడుదల చేశారు. "హైదరాబాద్ నేపథ్యంలో సాగే కథ ఇది. వర్తమాన అంశాలకి అద్దం పడుతూ, కడుపుబ్బా నవ్విస్తుంది. యోగిబాబు ఇందులో ఉగ్రాజు అనే పాత్రని పోషిస్తున్నార"ని సినీ వర్గాలు తెలిపాయి. బ్రహ్మానందం, రాజ్‌కుమార్ కసిరెడ్డి, జీవన్ కుమార్, వంశీధర్ కోసిగి, జాన్ విజయ్, మొట్ట రాజేంద్రన్ తదితరులు నటిస్తున్నారు.

చెప్పకూడని కథ బందర్

● టొరంటో చిత్రోత్సవాల్లో ప్రదర్శితం కానున్న చిత్రం


బాబీ దేవోల్

ప్రముఖ నిర్మాత అనురాగ్ కశ్యప్ దర్శకత్వం వహించిన చిత్రం 'బందర్ (మంకీ ఇన్ ఎ కేజ్)'. నిజమైన సంఘటనల ఆధారంగా రూపొందించిన ఈ చిత్రంలో బాబీ దేవోల్ ప్రధాన పాత్రలో నటించారు. ఇందులో సన్యా మల్హోత్రా, సబా ఆజాద్, సప్నా పబ్బి కీలక పాత్రలు పోషించారు. మంగళవారం ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ని దేవోల్ స్వయంగా ఇన్‌స్టాలో పంచుకున్నాడు. "చెప్పకూడని కథ... 50వ టొరంటో అంతర్జాతీయ చలనచిత్రోత్సవం 2025లో అధికారికంగా ఎంపికైంది. నిజమైన సంఘటనల నుంచి ప్రేరణ పొందిన మా చిత్రం 'బందర్', 50వ టీఐఎఫ్ఎఫ్‌లో ప్రీమియర్ అవుతోంది" అనే వ్యాఖ్యను జోడించాడు. ఈ పోస్టర్‌లో అతను జైలు గదిలో కూర్చున్నట్లు, అతని చుట్టూ ఖైదీలు నిద్రపోతున్నట్లు కనిపిస్తుంది. ఈ సినిమాని టొరంటో అంతర్జాతీయ చలనచిత్రోత్సవం (టీఐఎఫ్ఎఫ్) 50వ ఎడిషన్‌లో భాగంగా ప్రదర్శించనున్నారు. సెప్టెంబరు 4 నుంచి 14 వరకు ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న ఈ కార్యక్రమంలో ప్రత్యేక ప్రదర్శన విభాగంలో ప్రీమియర్ కానుందీ చిత్రం.

ఈనాడు బిజినెస్

రూ.3200 పెడితే రూ.9800కు చేరింది



ఈనాడు, హైదరాబాద్: బంగారంలో పెట్టుబడి పెట్టినవారికి లాభాల సిరులు కురుస్తున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2018-19లో విడుదల చేసిన సార్వభౌమ పసిడి సిరీస్-5 బాండ్లు ఇప్పుడు విక్రయించేందుకు అవకాశం వచ్చింది. 2019 జనవరిలో జారీచేసిన ఒక్కో బాండు ధర (గ్రాము యూనిట్) రూ.3214కు అందించింది. దీనికి వార్షిక వడ్డీ రేటు 2.50% చొప్పున చెల్లించింది. సాధారణంగా ఈ బాండ్ల వ్యవధి 8 ఏళ్లు. కానీ, అయిదో సంవత్సరం తర్వాత ముందుగానే విక్రయించుకునే అవకాశం ఉంది. ఈ ప్రక్రియ మంగళవారం (ఈనెల 22) ప్రారంభమయింది. ఇప్పుడు దీని ధర రూ.9,820గా నిర్ణయించింది. దీంతో ఒక్కో యూనిట్‌పై రూ.6,606 లాభం (205.56%) వచ్చింది. ఇప్పటికే ప్రతి 6 నెలలకోసారి వచ్చిన వడ్డీ అదనం. బంగారం ధర పెరుగుతున్న నేపథ్యంలో, ఈ బాండ్లను వ్యవధి తీరేంత వరకూ కొనసాగించడమే మేలని నిపుణులు సూచిస్తున్నారు.

తొలిసారిగా లాభాల్లోకి పేటీఎం



దిల్లీ: పేటీఎం బ్రాండ్‌పై సేవలందిస్తున్న వన్97 కమ్యూనికేషన్స్ తొలిసారిగా ఒక త్రైమాసికంలో లాభాన్ని నమోదుచేసింది. ఏప్రిల్- జూన్‌లో రూ.122.5 కోట్ల నికర లాభాన్ని ప్రకటించింది. వ్యయాల నియంత్రణ, చెల్లింపుల ఆదాయంలో వృద్ధి ఇందుకు దోహదపడ్డాయి. గత ఆర్థిక సంవత్సరం ఇదే త్రైమాసికంలో రూ.840 కోట్ల నికర నష్టాన్ని చవిచూసింది. మొత్తం కార్యకలాపాల ఆదాయం రూ.1,501.6 కోట్ల నుంచి 28% పెరిగి రూ.1,917.5 కోట్లకు చేరింది. సమీక్షిస్తున్న త్రైమాసికంలో మార్కెటింగ్, ప్రచార వ్యయాలను కంపెనీ రూ.221.4 కోట్ల నుంచి రూ.99.8 కోట్లకు తగ్గించుకుంది. వన్97 కమ్యూనికేషన్స్ గ్రూప్ చీఫ్ ఫైనాన్షియల్ అధికారి (సీఎఫ్ఓ) మధుర్ దేవ్‌రా కంపెనీ బోర్డు నుంచి వైదొలగనున్నారు. పేటీఎం నాన్ ఎగ్జిక్యూటివ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ బిమల్ జుల్కా బోర్డుకు రాజీనామా చేశారు.

213% పెరిగిన వింటేజ్ కాఫీ లాభం



ఈనాడు, హైదరాబాద్: ఇన్‌స్టంట్ కాఫీ కంపెనీ వింటేజ్ కాఫీ అండ్ బెవరేజెస్ ఏప్రిల్- జూన్ త్రైమాసికంలో మెరుగైన ఫలితాలను నమోదు చేసింది. త్రైమాసిక ఆదాయం 133%, నికరలాభం 213% పెరగడం ప్రత్యేకత. ఏకీకృత ఖాతాల ప్రకారం ఈ సంస్థ రూ.101.61 కోట్ల త్రైమాసిక ఆదాయంపై రూ.14.23 కోట్ల నికరలాభాన్ని ఆర్జించింది. 2024-25 ఇదేకాలంలో ఆదాయం రూ.43.67 కోట్లు, నికరలాభం రూ.4.55 కోట్లు ఉన్నాయి. ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంపొందించుకోవడంతో పాటు, దేశీయ మార్కెట్‌తో పాటు విదేశాల్లో అధిక అమ్మకాలు నమోదు చేయడమే ఇందుకు కారణమని కంపెనీ సీఎండీ టి.బాలకృష్ణ తెలిపారు. కొత్తగా 5,000 టన్నుల ఫ్రీజ్-డ్రైడ్ కాఫీ ప్లాంట్ ఏర్పాటు చేయబోతున్నామని వెల్లడించారు.

కోడి గుడ్డు

23న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్)
(100కు రూపాయలలో)

హైదరాబాద్	480
వరంగల్	482
విజయవాడ	505
గోదావరి	505
విశాఖపట్నం	520
చిత్తూరు	543

ఉద్యోగం అంటే.. టాటా గ్రూప్‌లోనే చేయాలి

- ఆకర్షణీయ యాజమాన్యాల్లో అగ్రస్థానం
- తరవాత స్థానాల్లో గూగుల్, ఇన్ఫోసిస్
- ర్యాండ్‌స్టడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్- 2025



దిల్లీ: మన దేశంలో ఉద్యోగార్థులకు అత్యంత ఆకర్షణీయ యాజమాన్య సంస్థగా టాటా గ్రూప్ అగ్రస్థానంలో నిలిచింది. ర్యాండ్‌స్టడ్ ఎంప్లాయర్ బ్రాండ్ రీసెర్చ్- 2025 సర్వేలో ఈ విషయం వెల్లడైంది. ఈ జాబితాలో రెండు, మూడో స్థానాల్లో గూగుల్ ఇండియా, ఇన్ఫోసిస్ నిలిచాయి. ప్రపంచవ్యాప్తంగా 34 దేశాల్లో 1,70,000 మంది అభిప్రాయాలు సేకరించి ఈ జాబితాను ర్యాండ్‌స్టడ్ రూపొందించింది. వీరిలో 3,500 మంది భారత్ నుంచి ఉన్నారు.

భారత్‌లో 10 అత్యంత ఆకర్షణీయ యాజమాన్య సంస్థ బ్రాండులు

ర్యాంకు	కంపెనీ
1	టాటా గ్రూప్
2	గూగుల్ ఇండియా
3	ఇన్ఫోసిస్
4	శామ్‌సంగ్ ఇండియా
5	జేపీ మోర్గాన్‌ఛేజ్
6	ఐబీఎం
7	విప్రో
8	రిలయన్స్ ఇండస్ట్రీస్
9	డెల్ టెక్నాలజీస్
10	స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా

ర్యాంకులకు ఇవే కొలమానం
- కంపెనీ ఆర్థిక పరిపుష్టత
- కెరీర్ వృద్ధి అవకాశాలు
- కంపెనీ పరపతి

(ఈ మూడు అంశాల్లోనూ టాటా గ్రూప్ అత్యధిక స్కోరు సాధించింది)

కంపెనీని ఎంచుకోవడంలో ఉద్యోగులు చూసేది
- పని- జీవితం మధ్య సమతుల్యత
- సమానత్వం
- ఆకర్షణీయ వేతనాలు, ప్రయోజనాలు

ప్రస్తుత ధోరణులు ఇలా
- 2025 ప్రథమార్ధంలో ఉద్యోగం మారడానికే 47% మంది మొగ్గుచూపారు
- 1987-2012 మధ్య జన్మించిన జెన్‌జడ్ వారు 51% మంది, 1981-96 మధ్య పుట్టిన మిలీనియల్స్‌లో 50% మంది ఇదే ధృక్పథాన్ని వ్యక్తపరిచారు
- కృత్రిమ మేధ (ఏఐ) వినియోగిస్తున్న ఉద్యోగులు 61% మంది
- ఉద్యోగాలపై ఏఐ ప్రభావం ఉందని 38% మంది పేర్కొన్నారు.

రెండు రోజుల్లో రూ.1,700 కోట్లు

- పెరిగిన ఎటర్నల్ వ్యవస్థాపకుడి సంపద
- షేరు ధర 21% రాణించడం వల్లే



దీపిందర్ గోయల్

ఆన్‌లైన్‌లో ఆర్డర్లు తీసుకుని ఆహారం, సరకులు సరఫరా చేసే జొమాటో, బ్లింకిట్ కంపెనీల మాతృ సంస్థ ఎటర్నల్ షేరు మంగళవారం ఒకదశలో 15% పెరిగి రూ.311.25 వద్ద 52 వారాల రికార్డు గరిష్ఠ స్థాయిని తాకింది. అయితే మార్కెట్ ముగిసే సమయానికి 10.56% పెరిగి రూ.299.85 వద్ద స్థిరపడింది. సంస్థ మార్కెట్ విలువ రూ.2,89,365 కోట్లుగా నమోదైంది. సోమ, మంగళ వారాల్లో కలిపి ఈ షేరు ధర 21 శాతానికి పైగా పెరిగింది. షేరు ధర పెరుగుదల కారణంగా, ఎటర్నల్ వ్యవస్థాపకుడు, సీఈఓ దీపిందర్ గోయల్ నికర సంపద రూ.1,700 కోట్లకు పైగా పెరిగింది. షేరు గరిష్ఠ స్థాయిలో ఉన్నప్పుడు ఈయన సంపద విలువ రూ.2,000 కోట్లకు పైగా దూసుకెళ్లింది. జూన్ చివరికి చూస్తే, ఈయనకు సంస్థలో 3.83% వాటా ఉంది.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం జూన్ త్రైమాసికంలో ఎటర్నల్ రూ.7,167 కోట్ల ఆదాయాన్ని ఆర్జించింది. 2024-25 ఇదే కాలంలో ఇది రూ.4,206 కోట్లుగా ఉంది. జొమాటో ద్వారా ఆహార డెలివరీ, బ్లింకిట్ ద్వారా ఏదైనా సరే 10 నిమిషాల్లో అందించడంతో.. ఎటర్నల్ వ్యాపారం ఇటీవల బాగా పుంజుకుందన్నది నిపుణుల విశ్లేషణ.

అనుమతి ఉంటేనే అవాంఛిత కాల్స్

భారీ నమూనా ప్రాజెక్టులో ట్రాయ్



దిల్లీ: టెలికాం వినియోగదార్లకు అవాంఛిత వాణిజ్య కాల్స్, సంక్షిప్త సందేశాలు (ఎస్ఎమ్ఎస్) రాకుండా అడ్డుకునే భారీ నమూనా ప్రాజెక్టును చేపట్టినట్లు టెలికాం నియంత్రణాధికార సంస్థ ట్రాయ్ తెలిపింది. తనిఖీ లేని, ఆఫ్‌లైన్ అనుమతుల స్థానంలో ఒక సరికొత్త, భద్రమైన డిజిటల్ అనుమతుల వ్యవస్థను తీసుకురానున్నట్లు ట్రాయ్ వెల్లడించింది. స్పామ్, మోసపూరిత కాల్స్ చేసేందుకు టెలికాం మౌలిక వసతులు దుర్వినియోగం కాకుండా చూసేందుకు నియంత్రణ సంస్థల సంయుక్త కమిటీ ఒకటి రంగంలోకి దిగినట్లు తెలిపింది. ట్రాయ్ ఆధ్వర్యంలోని ఈ నమూనా ప్రాజెక్టులో ఆర్‌బీఐ, టెలికాం సర్వీసు ప్రొవైడర్లు, ఎస్‌బీఐ, పీఎన్‌బీ, ఐసీఐసీఐ బ్యాంక్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, యాక్సిస్ బ్యాంక్, కెనరా బ్యాంక్, కోటక్ మహీంద్రా బ్యాంక్ వంటి ప్రధాన బ్యాంకులు భాగస్వాములుగా ఉన్నాయి.

1600 నంబరు సిరీస్: బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా(బీఎఫ్ఎస్ఐ) రంగాల నుంచి వచ్చే లావాదేవీలు, సేవల కాల్స్‌కు 1600 సిరీస్ నంబరును తీసుకువచ్చేందుకు గడువును నిర్ణయించేందుకు సంయుక్త కమిటీ దిల్లీలో సమావేశమైనట్లు తెలిపింది. దశల వారీగా ఈ నంబరును అమల్లోకి తీసుకురావాలనుకుంటున్నట్లు వివరించింది.

✦ మోసగాళ్లు టెలికాం వనరులు వినియోగించుకుంటే కఠిన చర్యలు తీసుకునేందుకూ రంగం సిద్ధమైందని పేర్కొంది.

హైదరాబాద్‌లో మరో 2 జీసీసీలు!

- రహేజా మైండ్‌స్పేస్‌లో 'నేషన్‌వైడ్ మ్యూచువల్ ఇన్సూరెన్స్'
- హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలో 'కాస్ట్‌కో'

ఈనాడు - హైదరాబాద్

ఐటీ, ఐటీఈఎస్ రంగానికి చెందిన జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్) లను ఆకర్షించడంలో హైదరాబాద్ ఎంతో ముందుంటోంది. అమెరికాకు చెందిన మరో 2 దిగ్గజ సంస్థలు ఇక్కడ తమ జీసీసీలు ఏర్పాటు చేయబోతున్నాయని తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా తమ కార్యకలాపాలకు అవసరమైన ఐటీ సేవలు అందించేందుకే ఈ సంస్థలు తమ జీసీసీలను ఇక్కడ నెలకొల్పే యత్నాల్లో ఉన్నాయి. ఇందులో ఒకటి నేషన్‌వైడ్ మ్యూచువల్ ఇన్సూరెన్స్ అనే సంస్థ కాగా, మరొకటి రిటెయిల్ సంస్థ కాస్ట్‌కో. హైదరాబాద్‌లో తమకు అనువైన భవనాలను గుర్తించి, తగిన ఏర్పాట్లు చేసుకోవడంలో ఈ సంస్థలు నిమగ్నమైనట్లు తెలుస్తోంది.

నేషన్‌వైడ్ మ్యూచువల్ ఇన్సూరెన్స్

దాదాపు 90 ఏళ్లగా యూఎస్‌లో బీమా, ఆర్థిక సేవలు అందిస్తున్న సంస్థ ఇది. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అతిపెద్ద బీమా సంస్థల్లో ఒకటి. 2026 ప్రారంభంలో ఈ సంస్థ హైదరాబాద్‌లో తన జీసీసీని ప్రారంభించాలని భావిస్తున్నట్లు సమాచారం. ఈ సంస్థ 500 నుంచి 1000 మందికి ఉద్యోగావకాశాలు కల్పిస్తుందని తెలుస్తోంది. ఇప్పటి వరకు యూఎస్‌లోని కొలంబస్, డెస్ మోయిన్స్, స్కాట్స్‌డేల్‌లలో ఈ సంస్థ కార్యాలయాలున్నాయి.



హైదరాబాద్‌లో బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, బీమా (బీఎఫ్ఎస్ఐ) రంగాలకు చెందిన మాస్‌మ్యూచువల్, వాన్‌గార్డ్, వెల్స్‌ఫార్గో.. తదితర సంస్థలు ఇప్పటికే తమ జీసీసీలను నిర్వహిస్తుండటం గమనార్హం.

కాస్ట్‌కో హోల్‌సేల్ కార్ప్

అమెరికా రిటెయిల్ దిగ్గజ సంస్థ కాస్ట్‌కో హోల్‌సేల్ కార్ప్, తన తొలి జీసీసీని హైదరాబాద్‌లో ఏర్పాటు చేయనుంది. ఐటీ సేవలతో పాటు సాంకేతికత పరిశోధన, అభివృద్ధి.. అంతర్జాతీయ బృందాలకు అవసరమైన సహకారాన్ని హైదరాబాద్ జీసీసీ అందించనుంది. ఈ కేంద్రంలో దాదాపు 1,000 మంది నిపుణులకు ఉద్యోగాలు రానున్నాయని సమాచారం. క్రమేణా ఉద్యోగుల సంఖ్య పెరిగే అవకాశం ఉంది. కాస్ట్‌కో లాంటి రిటెయిల్ సంస్థల రాకతో జీసీసీలను ఆకర్షించడంలో హైదరాబాద్ స్థానం సుస్థిరం అవుతుందని నిపుణులు భావిస్తున్నారు.

త్వరలో మరికొన్ని కంపెనీలు

హైదరాబాద్‌లో మరికొన్ని అగ్రగామి సంస్థలు తమ జీసీసీలను ఏర్పాటు చేయబోతున్నాయని స్థానిక పరిశ్రమ వర్గాల్లో ప్రచారంలో ఉంది. ఆర్ఎంజడ్ ఎకోవరల్డ్, బాగ్‌మేన్ కేపిటల్, ఎంబసీ టెక్ విలేజ్ కంపెనీలు ఇక్కడ తమ జీసీసీలను త్వరలో ఆవిష్కరించనున్నట్లు తెలుస్తోంది.


హ్యూలెట్ ప్యాకర్డ్‌కు రూ.8,000 కోట్లు రావాల్సిందే

లండన్: హ్యూలెట్ ప్యాకర్డ్ ఎంటర్‌ప్రైజ్ (గతంలో హెచ్‌పీఈ)కు బ్రిటిష్ టెక్ దిగ్గజం మైక్ లించ్‌కు చెందిన ఎస్టేట్, ఆయన మాజీ ఆర్థిక డైరెక్టర్ సుసోవాన్ హుసేన్ 700 మిలియన్ పౌండ్ల (943 మి. డాలర్లు లేదా దాదాపు రూ.8000 కోట్ల)కు పైగా పరిహారం చెల్లించాలని బ్రిటన్ హైకోర్టు తీర్పునిచ్చింది. లించ్‌తో పాటు ఆయన కుమార్తె, మరో అయిదుగురు గతేడాది ఆగస్టు 19న జరిగిన పడవ ప్రమాదం (తుపాను కారణంగా మునిగింది)లో మరణించిన సంగతి తెలిసిందే.

ఏమిటీ కేసు: లించ్‌కు చెందిన ఆటోనామీ కార్ప్‌ను 11 బి.డాలర్లతో హెచ్‌పీఈ కొనుగోలు చేసింది. అయితే కొనుగోలు ధరను కావాలనే పెంచి చూపి మోసం, కుట్ర చేశారని ఆరోపిస్తూ 4 బి. డాలర్ల పరిహారాన్ని కోరింది. 2022లోనే హైకోర్టు హెచ్‌పీఈకి అనుకూలంగా తీర్పునిచ్చినా, కంపెనీ కోరుతున్నదాని కంటే పరిహారం తక్కువగా ఉండాలని అభిప్రాయపడింది. అయితే లించ్ మరణం కారణంగా తీర్పు ఆలస్యమైంది.

రూ.కోటి లోపు ఫ్లాట్ల అమ్మకాలు 32% తగ్గాయ్

- ఈ ఏడాది జనవరి-జూన్‌పై జేఎల్ఎల్ నివేదిక
- ఖరీదైన ఇళ్ల అమ్మకాల్లో 5% వృద్ధి



దిల్లీ: దేశంలోని 7 ప్రధాన నగరాల్లో రూ.కోటి కన్నా తక్కువ ధర కలిగిన ఫ్లాట్ల అమ్మకాలు 32% తగ్గినట్లు స్థిరాస్తి కన్సల్టెంట్ జేఎల్ఎల్ ఇండియా తెలిపింది. హైదరాబాద్, దిల్లీ, కోల్‌కతా, చెన్నై, బెంగళూరు, పుణె, ముంబయిలలో కలిపి ఈ ఏడాది జనవరి-జూన్‌లో మొత్తం 1,34,776 ఫ్లాట్లు విక్రయమయ్యాయి. గతేడాది ఇదే సమయంలో విక్రయమైన ఫ్లాట్లతో పోలిస్తే ఇవి 13% తక్కువ. ఇందులో మధ్యతరగతికి అందుబాటులో ఉండే రూ.కోటి కంటే తక్కువ విలువైనవి 51,804 అమ్ముడయ్యాయి. ఏడాది క్రితం ఇదే సమయంతో పోలిస్తే ఈ అమ్మకాలు 32% తగ్గాయి. రూ.కోటి కంటే విలువైన ప్రీమియం ఫ్లాట్ల అమ్మకాలు మాత్రం 6% వృద్ధితో 82,972కు చేరాయి. మొత్తం ఫ్లాట్ల అమ్మకాల్లో ప్రీమియం వాటానే 62 శాతానికి చేరింది. ఏడాది క్రితం ప్రీమియం వాటా 51 శాతమే కావడం గమనార్హం. విశాలమైన, అధిక సదుపాయాలున్న ఫ్లాట్ల కోసం ఎక్కువ మొత్తం చెల్లించే స్తోమత గల కుటుంబాల సంఖ్య పెరుగుతోందనడానికి ఈ గణాంకాలు నిదర్శనమని నివేదిక పేర్కొంది.

జీసీసీల కోసం ఎనేబ్లర్

ఆవిష్కరించిన కోవాసెంట్

ఈనాడు, హైదరాబాద్: జీసీసీలను స్థాపించడం దగ్గర్నుంచి, వాటి కార్యకలాపాలు సాగించేవరకూ ఎదురయ్యే సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేకమైన ఏఐ ఆధారిత సాంకేతికత 'ఎనేబ్లర్'ను ఆవిష్కరించినట్లు కోవాసెంట్ టెక్నాలజీస్ వెల్లడించింది. ముఖ్యంగా ఏఐ, డేటా ఇంజినీరింగ్, క్లౌడ్, సైబర్ సెక్యూరిటీ, ప్రోడక్ట్ ఇంజినీరింగ్ లాంటి వాటిల్లో కొత్తగా ప్రవేశించిన సంస్థలకు ఇది సహాయకారిగా ఉంటుందని పేర్కొంది. జీసీసీలు సంస్థల విజయానికి ఎంతో కీలకంగా మారుతున్న దశలో, వాటికి నిర్ణయాత్మక సేవలను అందించేందుకు ఈ సాంకేతిక సిద్ధంగా ఉంటుందని ఎనేబ్లర్ ఛైర్మన్, ఎండీ సీవీ సుబ్రమణ్యం తెలిపారు.

ఐటీఐల నవీకరణ ప్రాజెక్ట్ రేసులో
రిలయన్స్, అదానీ, మహీంద్రా

విలువ రూ.60,000 కోట్లు



దిల్లీ: పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)ల నవీకరణ కోసం కేంద్ర ప్రభుత్వం నుంచి రూ.60,000 కోట్ల విలువైన ప్రాజెక్టును దక్కించుకోవడానికి కనీసం డజనుకు పైగా కార్పొరేట్ దిగ్గజ సంస్థలు పోటీపడుతున్నాయి. ఇందులో 8 కంపెనీలు- రిలయన్స్ గ్రూప్, అదానీ గ్రూప్, మహీంద్రా గ్రూప్, జేకే సిమెంట్, జిందాల్ గ్రూప్, టయోటా ఇండియా, ష్నైడర్ ఎలక్ట్రిక్, ఆర్సెలార్‌మిత్తల్ నిప్పన్ స్టీల్.. ఇప్పటికే నైపుణ్యాభివృద్ధి, ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ మంత్రిత్వ శాఖకు తమ ప్రాధాన్య రాష్ట్రాలు, రంగాల వివరాలను సమర్పించాయి. ఈ ప్రాజెక్టుకు ప్రతిపాదనలు సమర్పించిన కంపెనీల్లో ఎల్ అండ్ టీ, బజాజ్ ఆటో, ఆదిత్య బిర్లా గ్రూప్‌తో పాటు ప్రభుత్వ రంగ సంస్థలు భెల్, మజగావ్ డాక్ షిప్‌బిల్డర్స్, హిందుస్థాన్ ఏరోనాటిక్స్ కూడా ఉన్నాయని తెలుస్తోంది. పరిశ్రమకు అవసరమైన నైపుణ్యాల శిక్షణ అందించేందుకు అవసరమైన 'హబ్, స్పోక్ ఐటీఐ'లను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వంతో ఈ సంస్థలు భాగస్వామ్యం కుదుర్చుకుంటాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. హబ్, స్పోక్ మోడల్ కింద శిక్షణ, వనరులకు ప్రధాన కేంద్రాలుగా ఐటీఐలు వ్యవహరిస్తాయి.

✦ ఈ ఏడాది మేలో కేంద్ర మంత్రివర్గం ఈ పథకాన్ని ఆమోదించింది. ఇందులో భాగంగా 1000 ఐటీఐలను నవీకరించడం, అయిదేళ్లలో 20 లక్షల మంది యువతకు శిక్షణ ఇవ్వాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకానికి అవసరమైన నిధుల్లో కేంద్రం రూ.30,000 కోట్లు, రాష్ట్రాలు రూ.20,000 కోట్లు, పరిశ్రమలు రూ.10,000 కోట్లు ఇస్తాయి.. కేంద్ర ప్రభుత్వ వాటాను ప్రపంచ బ్యాంక్, ఆసియా అభివృద్ధి బ్యాంక్ 50:50 నిష్పత్తిలో సమకూర్చనున్నాయి.

కొచ్చర్-వీడియోకాన్ కేసులో మనీలాండరింగ్ జరిగింది

- ప్రాథమికంగా నిర్ధారణ అయింది
- అప్పిలేట్ ట్రైబ్యునల్ వెల్లడి



దిల్లీ: ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈఓ - ఎండీ చందాకొచ్చర్, ఆమె భర్తపై విచారణ జరుగుతున్న అవినీతి కేసులో మనీలాండరింగ్ జరిగినట్లు ప్రాథమికంగా నిర్ధారణ అయిందని అప్పిలేట్ ట్రైబ్యునల్ ఒకటి పేర్కొంది. వీరిద్దరికి చెందిన ముంబయిలోని రూ.కోట్ల విలువైన ఒక ఫ్లాట్‌ను అటాచ్ చేస్తూ జారీ అయిన 2020 నాటి ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ) ఆదేశాలను సమర్థించింది. వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్ (వీఐఈఎల్)కు జారీ చేసిన రూ.300 కోట్ల రుణం విషయంలో 'క్విడ్ ప్రో కో' జరిగిందన్న ఈడీ ఆరోపణల్లో 'విషయం' ఉందని భావిస్తున్నట్లు జులై 3న జారీ చేసిన ఆదేశాల్లో ట్రైబ్యునల్ తెలిపింది. ఈ రుణం జారీ తర్వాత వీడియోకాన్ గ్రూప్ నుంచి ఆమె భర్త దీపక్ కొచ్చర్‌కు చెందిన ఎన్ఆర్‌పీఎల్‌కు రూ.64 కోట్లు బదిలీ అయ్యాయని వివరించింది.

అమెరికాలో ఔషధ ఉత్పత్తికి 50 బి.డా.: ఆస్ట్రజెనేకా నిర్ణయం



దిల్లీ: అమెరికా అధ్యక్షుడు ట్రంప్ విధిస్తున్న సుంకాల భారం అగ్రశ్రేణి ఫార్మా కంపెనీల వ్యాపార ప్రణాళికలను ప్రభావితం చేస్తోంది. బ్రిటిష్ ఫార్మా దిగ్గజ సంస్థ ఆస్ట్రజెనేకా ఫార్మా అమెరికాలో 50 బిలియన్ డాలర్ల పెట్టుబడితో మందుల తయారీ సదుపాయాలను విస్తరించాలని నిర్ణయించింది. ఇందులో భాగంగా వర్జీనియాలో అతిపెద్ద ఔషధ ప్లాంట్ ఏర్పాటు చేస్తారు. 2030 నాటికి ఈ సంస్థ ఆదాయాల్లో 50% అమెరికా నుంచే లభిస్తుందని అంచనా. ఫార్మా దిగుమతులపై 200% పన్ను విధించనున్నట్లు ట్రంప్ ఇటీవల పేర్కొన్న విషయం విదితమే.

అమెజాన్ కోసం ఏఐ నెట్‌వర్క్

రూ.430 కోట్లు వెచ్చిస్తున్న టాటా కమ్యూనికేషన్స్

భారత్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌కు (ఏడబ్ల్యూఎస్) కృత్రిమ మేధ ఆధారిత నెట్‌వర్క్‌ను టాటా కమ్యూనికేషన్స్ అభివృద్ధి చేయనుంది. ఇందుకోసం టాటా రూ.430 కోట్ల మూలధనాన్ని వెచ్చించనుంది. 2025-26 చివరికల్లా ఇది పూర్తికావచ్చు. ఏడబ్ల్యూఎస్‌కు ముంబయి, హైదరాబాద్‌లలో డేటా కేంద్రాలు, చెన్నైలో ఏడబ్ల్యూఎస్ డైరెక్ట్ కనెక్ట్, ఏడబ్ల్యూఎస్ ఎడ్జ్ నెట్‌వర్క్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఉన్నాయి. ప్రతిపాదిత ప్రాజెక్టు కింద ఏడబ్ల్యూఎస్‌కు చెందిన ఈ 3 మౌలిక ప్రాంతాల అనుసంధానానికి అధిక సామర్థ్యం (సెకనుకు 7.2 టెరాబిట్స్), అధిక దూరం (18,000 కి.మీల కేబుల్) నెట్‌వర్క్‌ను టాటా కమ్యూనికేషన్స్ అభివృద్ధి చేయనుంది.

ఫిర్యాదులు పెరుగుతున్నా బ్యాంకర్లు పట్టించుకోవట్లేదు

ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్



ముంబయి: వినియోగదార్ల నుంచి ఫిర్యాదుల సంఖ్య పెరుగుతున్నా, బ్యాంకర్లలో వారిపై సానుభూతి ఉండడం లేదని ఆర్‌బీఐ డిప్యూటీ గవర్నర్ స్వామినాథన్ ఆందోళన వ్యక్తం చేశారు. 'ముఖ్యంగా డిజిటల్ మార్గాల్లో వినియోగదార్ల నుంచి ఫిర్యాదులు బాగా పెరిగాయి. సోషల్ ఇంజినీరింగ్ మోసాల నుంచి, సమస్యల పరిష్కారం పెద్దగా లేకపోవడం వరకు ఇందులో ఉన్నాయి. ప్రజలకు జరుగుతున్న నష్టం నిజం. వారిలో పెరుగుతున్న నిరుత్సాహం నిజం. సాంకేతికత వల్ల లావాదేవీ మాత్రమే జరుగుతుంది. కానీ సత్సంబంధాలు మీతోనే సాధ్యం. వినియోగదారుకు బ్యాంకుపై ఉన్న విశ్వాసాన్ని మీరే పొందాలి. అదే ఒక యాప్‌నకు, బ్యాంకరుకు మధ్య ఉన్న వ్యత్యాసమ'ని అన్నారు.

సైయెంట్ డీఎల్ఎం లాభాల్లో క్షీణత

ఈనాడు, హైదరాబాద్: ఎలక్ట్రానిక్ ఉత్పత్తుల కంపెనీ సైయెంట్ డీఎల్ఎం, ఈ ఆర్థిక సంవత్సరం మొదటి త్రైమాసికానికి రూ.278.4 కోట్ల ఆదాయం, రూ.7.5 కోట్ల నికరలాభం ఆర్జించింది. 2024-25 ఇదేకాలంతో పోల్చినప్పుడు ఆదాయం 8% పెరిగినా, నికరలాభం 29.6% తగ్గింది. నికరలాభాల మార్జిన్ 2.7 శాతంగా నమోదైంది. ఎబిటా మార్జిన్ 9% ఉంది. కంపెనీ చేతిలో రూ.2131 కోట్ల విలువైన ఆర్డర్లు ఉన్నాయి.

స్తబ్దుగా ముగిసిన సూచీలు



చమురు-గ్యాస్, ఐటీ షేర్ల డీలా

ఎఫ్ఐఐ విక్రయాలు.. రూ.3548.92 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు.. రూ.5239.77 కోట్లు

సెన్సెక్స్ ▼ 14 — 82187
నిఫ్టీ ▼ 30 — 25061

డాలరు.. రూ.86.38 (-7 పైసలు)
బ్రెంట్ ముడి చమురు.. 68.53 డాలర్లు (-0.98%)

ఒడుదొడుకుల మధ్య సాగిన ట్రేడింగ్‌లో సూచీలు పెద్దగా మార్పులేకుండా స్తబ్దుగా ముగిశాయి. చమురు-గ్యాస్, ఐటీ షేర్లు నష్టపోయినా.. ఎటర్నల్, ప్రైవేట్ బ్యాంకింగ్ షేర్ల లాభాలు సూచీలపై ఆ ప్రభావాన్ని పరిమితం చేశాయి. అమెరికా- భారత్ మధ్య వాణిజ్య ఒప్పందంపై స్పష్టత లేకపోవడంతో.. విదేశీ సంస్థాగత మదుపర్లు (ఎఫ్ఐఐ) లాభాలు స్వీకరించడం కొంత ప్రభావం చూపింది.

✦ బీఎస్ఈలోని నమోదిత కంపెనీల మార్కెట్ విలువ రూ.1.44 లక్షల కోట్లు తగ్గి రూ.458.45 లక్షల కోట్ల (5.31 లక్షల కోట్ల డాలర్ల)కు పరిమితమైంది.

లాభంతో ఆరంభించి...: బీఎస్ఈ సెన్సెక్స్ (క్రితం ముగింపు 82,200.34) 327.09 పాయింట్ల లాభంతో 82,527.43 పాయింట్ల వద్ద ఆరంభమైంది. క్రమంగా లాభాలు తగ్గుతూ, నష్టాల్లోకి జారుకుంది. ఒక దశలో 82,110.63 పాయింట్ల వద్ద ఇంట్రాడే కనిష్ఠాన్ని చేరినా, చివరకు 13.53 పాయింట్ల నష్టంతో 82,186.81 పాయింట్ల వద్ద ముగిసింది. ఎన్ఎస్ఈ నిఫ్టీ 29.80 పాయింట్లు నష్టపోయి 25,060.90 పాయింట్ల వద్ద స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 25,182.00 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని, 25,035.55 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని నమోదుచేసింది.

13 కంపెనీల షేర్లు రాణింపు: బీఎస్ఈలోని 30 షేర్లలో 13 కంపెనీల షేర్లు లాభపడగా.. మిగతా 17 నష్టపోయాయి. ఎటర్నల్ షేరు 10.56% పెరిగి రూ.299.85 వద్ద ముగిసింది. క్విక్ కామర్స్‌లో మరిన్ని పెట్టుబడులు పెడతామని సంస్థ యాజమాన్యం చేసిన ప్రకటనే ఇందుకు కారణం. టైటన్ 1.08%, మారుతీ సుజుకీ 0.76%, బెల్ 0.72%, హిందుస్థాన్ యునిలీవర్ 0.65%, ఐసీఐసీఐ బ్యాంక్ 0.53%, మహీంద్రా అండ్ మహీంద్రా 0.39% పెరిగాయి. టాటా మోటార్స్ 2.04%, అదానీ పోర్ట్స్ 1.93%, ఎస్‌బీఐ 1.12%, రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.08% చొప్పున నష్టపోయాయి.

✦ **ఐకియా ఇండియా**కు ముఖ్య కార్యనిర్వహణ అధికారిగా ప్యాట్రిక్ ఆంటోని నియమితులయ్యారు. ఈయన నియామకం ఈ ఏడాది ఆగస్టు నుంచి అమల్లోకి రానుంది.

✦ వచ్చే అయిదేళ్లలో విదర్భలోని గడ్చిరోలి జిల్లాలో ఉక్కు ప్లాంటు, ఇతర విభాగాల ఏర్పాటు నిమిత్తం రూ.40,000 కోట్లను పెట్టుబడిగా పెట్టాలని **లాయిడ్స్ మెటల్స్ అండ్ స్టీల్** లక్ష్యంగా పెట్టుకుంది.

✦ 14 రంగాల్లో ఉత్పత్తి అనుసంధానిత ప్రోత్సాహకాల (పీఎల్ఐ) పథకాల కింద 806 దరఖాస్తులకు ఆమోదం తెలిపినట్లు కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రి జితిన్ ప్రసాద లోక్‌సభకు ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంలో పేర్కొన్నారు.

నేటి బోర్డు సమావేశాలు: ఇన్ఫోసిస్, కోఫోర్జ్, డాక్టర్ రెడ్డీస్, పెర్సిస్టెంట్ సిస్టమ్స్, సఫైర్ ఫుడ్స్, సింజీన్, టాటా కన్జూమర్, వెస్ట్‌లైఫ్, సిగ్నిటీ

సంక్షిప్తంగా..

✦ ప్రభుత్వం, రిజిస్ట్రార్ ఆఫ్ కంపెనీస్, కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖ నుంచి అనుమతులు రావడంతో జిందాల్ స్టీల్ అండ్ పవర్ పేరును ఈ నెల 22న **జిందాల్ స్టీల్ లిమిటెడ్**గా మార్చినట్లు ఎక్స్ఛేంజీలకు కంపెనీ తెలిపింది. కొత్త పేరుతో పబ్లిక్ లిమిటెడ్ కంపెనీగానే కార్యకలాపాలు నిర్వహించడాన్ని జిందాల్ స్టీల్ కొనసాగించనుంది.

✦ వ్యవసాయ కమొడిటీ ట్రేడింగ్ సంస్థ **ఐఎఫ్ఎల్** ఎంటర్‌ప్రైజెస్‌లో 12% వరకు వాటా కొనుగోలు చేసేందుకు సింగపూర్‌కు చెందిన యూనిక్ గ్లోబల్ మేనేజ్ సర్వీసెస్ ఆఫర్ ఇచ్చింది. ఈ ప్రతిపాదనపై చర్చించి నిర్ణయం తీసుకునేందుకు ఐఎఫ్ఎల్ బోర్డు ఆగస్టు 1న సమావేశం కానుంది.

✦ పసిడి ఆభరణాల తయారీ సంస్థ **శాంతి గోల్డ్ ఇంటర్నేషనల్** తొలి పబ్లిక్ ఆఫర్‌కు (ఐపీఓ) ధరల శ్రేణిని రూ.189-199గా నిర్ణయించారు. ఇష్యూ ఈనెల 25న మొదలైన 29న ముగియనుంది. ఈ ఇష్యూ ద్వారా కంపెనీ రూ.360 కోట్లు సమీకరించాలని అనుకుంటోంది.

ఏప్రిల్ - జూన్ త్రైమాసిక ఫలితాలు (రూ.కోట్లలో)

కంపెనీ	నికర లాభం/(నష్టం) 2025-26	నికర లాభం/(నష్టం) 2024-25	మొత్తం ఆదాయం 2025-26	మొత్తం ఆదాయం 2024-25
కోల్గేట్ పామోలివ్	320.62	363.98	1,420.64	1,485.76
జీ ఎంటర్‌టైన్‌మెంట్	143.7	118.1	1,849.8	2,149.5
క్రిసిల్	171.6	150.1	866.6	815.4
డీసీఎం శ్రీరామ్	113.82	100.30	3,477.4	3,098.90
దాల్మియా భారత్	395	145	3,636	3,621
ఐఆర్ఎఫ్‌సీ	1,746	1,577	6,918	6,766
మహీంద్రా ఫైనాన్స్	529	497	4,438	---
డిక్సన్ టెక్నాలజీస్	280.02	113.36	12,835.66	6,579.80
యునైటెడ్ బ్రూవరీస్	184.03	173.80	5,380.78	5,811.28



కరెంట్ అఫైర్స్

■ భారతీయ రచయిత్రి బాను ముస్తాక్ ఏ భాషలో రచించిన చిన్న కథల సంకలనం 'హార్ట్ ల్యాంప్'కు 2025 అంతర్జాతీయ బుకర్ బహుమతి లభించింది?



జ: కన్నడ (కన్నడ భాషా రచనకు ఈ ప్రతిష్ఠాత్మక పురస్కారం లభించడం ఇదే తొలిసారి. దీపా భస్తి ఆంగ్లంలోకి అనువదించిన ఈ పుస్తకం దక్షిణ భారతదేశంలోని ముస్లిం మహిళలు ఎదుర్కొంటున్న సవాళ్లు, పోరాటాల గురించి వివరిస్తుంది.)

మాదిరి ప్రశ్నలు

■ మొదటి గ్లోబల్ పాండెమిక్ ట్రీటీ (ప్రపంచ మహమ్మారి ఒప్పందం)ను ఇటీవల ఏ అంతర్జాతీయ సంస్థ అధికారికంగా ఆమోదించింది?

జ: ప్రపంచ ఆరోగ్య సంస్థ (జెనీవాలో జరిగిన వార్షిక డబ్ల్యూహెచ్ఓ సమావేశంలో ఈ ఒప్పందాన్ని 124-0 ఓట్ల తేడాతో సభ్య దేశాలు ఆమోదించాయి.)

■ గుజరాత్‌లోని వడోదర సమీపంలో ఏ నదిపై ఉన్న వంతెన కూలి చాలామంది మరణించారు?

జ: మహిసాగర్


మరింత సమాచారం

■ 2025, జులై 9న నరేంద్ర మోదీ ఏ దేశ పార్లమెంట్‌లో ప్రసంగించారు?

జ: నమీబియా

పరిమాణాల పోలిక.. సమానత్వ సూచిక!

కేక్ లేదా బ్రెడ్ తయారు చేసేటప్పుడు పిండి, చక్కెర, వెన్నలను అవసరమైనంత భాగాల్లో కలపాలి. లేకపోతే రుచి, ఆకృతి మారిపోతాయి. దీనినే తగిన నిష్పత్తిలో కలపడం అంటారు. భవనాలను కట్టేటప్పుడు ముందుగా సిద్ధం చేసుకునే నమూనాలు, వాస్తవ పరిమాణాలకు సరిపోయే రీతిలో అంటే అనుపాతంలో ఉండే విధంగా చూసుకోవాలి. భిన్నంగా ఉంటే నిర్మాణంలో తేడా వచ్చేస్తుంది. రెండు పరిమాణాల మధ్య సంబంధాలను పోల్చడానికి, అర్థం చేసుకోడానికి నిష్పత్తి, అనుపాతం భావనలు ఉపయోగపడతాయి. రెండు లేదా అంత కంటే ఎక్కువ పరిమాణాలను పోల్చడమే నిష్పత్తి, అదే విధంగా రెండు నిష్పత్తుల మధ్య సమానత్వాన్ని తెలియజేయడమే అనుపాతం. వీటిపై పట్టు పెంచుకోవాలంటే ప్రాథమిక భావనలను అధ్యయనం చేయాలి. భిన్నాలు, దశాంశాలపై అవగాహన పెంచుకోవాలి. నిష్పత్తులను సరళీకరించడం, రెండు లేదా అంత కంటే ఎక్కువ నిష్పత్తులను కలపడం నేర్చుకోవాలి.



జనరల్ స్టడీస్ - అరిథ్‌మెటిక్

నిష్పత్తి - అనుపాతం

నిష్పత్తి: ఏవైనా రెండు రాశులు ఒకే ప్రమాణాలను కలిగి ఉండి, మొదటి దానిని రెండోది భాగిస్తే నిష్పత్తి అంటారు.

★ a, b లు రెండు రాశులు ఒకే ప్రమాణాలను కలిగి ఉంటే వాటి మధ్య నిష్పత్తి $\frac{a}{b}$ (లేదా) a : b అంటారు.

★ ఇందులో a ని పూర్వపదం, b ని పరపదం అంటారు.

★ ఒక నిష్పత్తిని ఒక స్థిరసంఖ్యతో భాగించినా లేదా గుణించినా దాని విలువ మారదు.

★ a : b నిష్పత్తికి విలోమ నిష్పత్తి $\frac{1}{a}:\frac{1}{b}$ (లేదా) b : a

★ a : b : c కి విలోమ నిష్పత్తి $\frac{1}{a}:\frac{1}{b}:\frac{1}{c}$ (లేదా) bc : ca : ab

అనుపాతం: రెండు నిష్పత్తులు సమానమైతే అందులోని పదాలు అనుపాతంలో ఉంటాయి.

a : b = c : d

★ a, d లను అంత్యాలు; b, c లను మధ్యమాలు అంటారు.

★ అంత్యాల లబ్ధం = మధ్యమాల లబ్ధం

ad = bc

నాలుగో అనుపాతం: a : b :: c : d లో d ని నాలుగో అనుపాతం అంటారు.



$ad = bc \Rightarrow d = \frac{bc}{a}$

మూడో అనుపాతం: a : b :: b : c లో c ని మూడో అనుపాతం అంటారు.

$ac = b^2 \Rightarrow c = \frac{b^2}{a}$

మధ్య అనుపాతం: a : b:: b : c లో b ని మధ్య అనుపాతం అంటారు.

$b^2 = ac \Rightarrow b = \sqrt{ac}$



బహుళ లేదా మిశ్రమ నిష్పత్తి:

a : b, c : d, e : f ల బహుళ నిష్పత్తి

$\frac{a}{b}\times\frac{c}{d}\times\frac{e}{f}$ (లేదా) ace : bdf

మాదిరి ప్రశ్నలు

1. 23, 39, 32, 56ల నుంచి x తీసివేస్తే అవి అనుపాతంలో ఉంటాయి. అయితే (x + 4), (3x + 1) యొక్క మధ్య అనుపాతం ఎంత?

1) 15 2) 10 3) 12 4) 14

వివరణ: (23 – x) (56 – x) = (39 –x) (32 – x)

$1288 - 23x - 56x + x^2 = 1248 - 39x - 32x + x^2$

1288 – 1248 = 79x – 71x

$40 = 8x \Rightarrow x = \frac{40}{8} = 5$

మధ్య అనుపాతం: $\sqrt{(x+4)(3x+1)}$

$= \sqrt{(5+4)(15+1)} = \sqrt{9\times16} = 3\times4 = 12$

సంక్షిప్త పద్ధతి: 23, 29 32, 56

+16 24

2 3



$x = \frac{69-64}{3-2} = 5$

మధ్య అనుపాతం = $\sqrt{(x+4)(3x+1)}$

$= \sqrt{(5+4)(15+1)} = \sqrt{9\times16}$

$= 3\times4 = 12$ **జ: 3**

2. (2x + 1), (x + 2), 2, 5 అనుపాతంలో ఉన్నాయి. అయితే 3.5 (1 – x), 8 (1 + x) ల మధ్య అనుపాతం ఎంత?

1) 5.5 2) 4.25 3) 5.25 4) 4.5

వివరణ: అనుపాతం అంటే అంత్యాల లబ్ధం = మధ్యమాల లబ్ధం

(2x + 1)5 = (x + 2)2

$10x + 5 = 2x + 4 \Rightarrow 10x - 2x = 4 - 5$

$8x = -1 \Rightarrow x = \frac{-1}{8}$

మధ్య అనుపాతం: $\sqrt{3.5(1-x)8(1+x)}$

$= \sqrt{3.5\left(1+\frac{1}{8}\right)8\left(1-\frac{1}{8}\right)}$

$= \sqrt{\frac{7}{2}\times\frac{9}{8}\times8\times\frac{7}{8}} = \frac{7\times3}{4} = \frac{21}{4} = 5.25$ **జ: 3**

3. (a + b) : (b + c) : (c + a) = 5 : 7 : 6, 2a – 3b + 4c = 66 అయితే c విలువ ఎంత?

1) 12 2) 18 3) 24 4) $\frac{132}{7}$

వివరణ: a + b + b + c + c + a = 5 + 7 + 6

$2(a+b+c) = 18 \Rightarrow a+b+c = \frac{18}{2} = 9$

a విలువ కావాలంటే a + b + c నుంచి b + c ను తీసివేయాలి. ఇదేవిధంగా b, c లు కూడా a : b : c = 2 : 3 : 4 అవుతాయి.

2a – 3b + 4c = 66

2(2) – 3(3) + 4(4) = 4 – 9 + 16 = 11 × 6 = 66

అప్పుడు c = 4 × 6 = 24 అవుతుంది. **జ: 3**

4. $\frac{a+b}{c} = \frac{23}{12}, \frac{b+c}{a} = \frac{17}{8}$ అయితే $\left(\frac{a+c}{b}\right)$ విలువ ఎంత?

1) $\frac{9}{5}$ 2) $\frac{116}{59}$ 3) $\frac{107}{68}$ 4) $\frac{16}{11}$

వివరణ: a + b + c = 23 + 12 = 35 → 5

LCM → 175

a + b + c = 17 + 8 = 25 → 7

$\frac{a+b}{c} = \frac{23\times5}{12\times5} = \frac{115}{60}$

$\frac{b+c}{a} = \frac{17\times7}{8\times7} = \frac{119}{56}$



$\frac{a+c}{b} = \frac{(56+60)}{175-(56+60)} = \frac{116}{59}$ **జ: 2**

5. 5x = 4y అయితే 2y : 3x విలువ ఎంత?

1) 15 : 8 2) 5 : 6 3) 3 : 4 4) 4 : 5

వివరణ: $5x = 4y \Rightarrow \frac{x}{y} = \frac{4}{5}$

2(5) : 3 (4) = 10 : 12 = 5 : 6 **జ: 2**

6. $12^{35}, 3^{12}, 4^{12}$ ల నాలుగో అనుపాతం ఎంత?

1) 12^{-23} 2) 3^{24} 3) 12^{-11} 4) 4^{24}

వివరణ: నాలుగో అనుపాతం $d = \frac{bc}{a}$

$d = \frac{3^{12}\times4^{12}}{12^{35}} = \frac{3^{12}\times4^{12}}{(3\times4)^{35}}$



$= 3^{12}\times4^{12}\times3^{-35}\times4^{-35}$

$= 3^{-23}\times4^{-23} = (12)^{-23}$ **జ: 1**

7. 2 సంఖ్యల మధ్య నిష్పత్తి 3 : 5 ప్రతి సంఖ్యకు 10 కలిపితే వాటి మధ్య నిష్పత్తి 5 : 7 అయితే ఆ సంఖ్యలు ఏవి?

1) 30, 50 2) 45, 60 3) 15, 25 4) 36, 60

వివరణ: $\frac{3x+10}{5x+10} = \frac{5}{7}$

$21x + 70 = 25x + 50 \Rightarrow 25x - 21x = 70 - 50$

$4x = 20 \Rightarrow x = \frac{20}{4} = 5$

ఆ సంఖ్యలు 3x, 5x

= 3 × 5 = 15, 5 × 5 = 25



సంక్షిప్త పద్ధతి: ③: 5 + 10

5 : 7

2

$= \frac{3\times2\times10}{5\times5-7\times3} = \frac{3\times2\times10}{4} = 15, 5\times5 = 25$ **జ: 3**

8. p : q : r = 1 : 2 : 4 అయితే $\sqrt{5p^2+q^2+r^2}$ విలువ ఎంత?

1) 5 2) 2q 3) 5p 4) 4r

వివరణ: p = k, q = 2k, r = 4k విలువలను ప్రతిక్షేపించగా

$= \sqrt{5(k)^2+(2k)^2+(4k)^2}$

$= \sqrt{5k^2+4k^2+16k^2} = \sqrt{25k^2} = 5k = 5p$ **జ: 3**

9. ఒక కాలేజీలో బాలురు, బాలికల మధ్య నిష్పత్తి m : n. అందులో 35% మంది బాలురు 45% బాలికలు పాసయ్యారు. అయితే ఫెయిలైనవారి శాతం ఎంత?

1) $\frac{13m+11n}{m+n}$ 2) $\frac{5(11m+13n)}{m+n}$

3) $\frac{5(13m+11n)}{m+n}$ 4) $\frac{mn}{m+n}$

వివరణ: ఫెయిలైనవారి శాతం

బాలురు = 100 – 35 = 65%, బాలికలు = 100 – 45 = 55%

$\frac{\frac{65m+55n}{100}}{m+n}\times100$

$= \frac{65m+55n}{100(m+n)}\times100 = \frac{5(13m+11n)}{m+n}$ **జ: 3**

గత పరీక్షల్లో అడిగిన ప్రశ్నలు

1. 2 సంఖ్యల మధ్య నిష్పత్తి $1\frac{1}{2}:2\frac{2}{3}$. ప్రతి సంఖ్యకు 15 కలిపితే వాటి మధ్య నిష్పత్తి $1\frac{2}{3}:2\frac{1}{2}$ అయితే అందులో పెద్ద సంఖ్య ఎంత?

1) 27 2) 36 3) 48 4) 64

2. 52, 47, 20, 19ల నుంచి x ను తీసివేస్తే అనుపాతంలో ఉంటాయి. (x + 13) (x – 8) ల మధ్య అనుపాతం ఎంత?

1) 12 2) 10 3) 15 4) 9

3. $a^3 + b^3 : a^3 - b^3 = 185 : 158$ అయితే a : b విలువ ఎంత?

1) 5 : 4 2) 7 : 3

3) 2 : 3 4) 10 : 2

సమాధానాలు: 1-3; 2-2; 3-2.



రచయిత: బిజ్జుల విష్ణువర్ధన్ రెడ్డి

ఇండియన్ పాలిటీ

భారత రాజ్యాంగం - చారిత్రక పరిణామక్రమం

'ఆ చట్టం కచ్చితంగా పిచ్చిది.. సమూలంగా చెడ్డది'

సిపాయిల తిరుగుబాటు అనంతరం భారతదేశంలో కంపెనీ పాలనను తొలగించి బ్రిటిష్ ప్రభుత్వం నేరుగా అధికారాన్ని చేపట్టింది. పాలనా వ్యవస్థల ఏర్పాటు, నియంత్రణకు పలు చట్టాలను చేసింది. ఉద్ధృతమైన జాతీయోద్యమాన్ని నిలువరించేందుకు సైమన్ కమిషన్ ఏర్పాటు మొదలు వేవెల్ ప్రణాళిక వరకు ఎప్పటికప్పుడు కొత్త ప్రతిపాదనలు, సంస్కరణలతో ముందుకు వచ్చింది. స్వాతంత్ర్యానంతరం ఇవన్నీ భారత రాజ్యాంగ రచనపై ప్రభావాన్ని చూపాయి. వీటితో పాటు నెహ్రూ రిపోర్ట్, రౌండ్ టేబుల్ సమావేశాలు, గాంధీ-ఇర్విన్, గాంధీ- అంబేడ్కర్‌ల మధ్య కుదిరిన ఒప్పందాలు, క్రిప్స్ రాయబారం, కాంగ్రెస్-ముస్లింలీగ్ మధ్య వివిధ సందర్భాల్లో జరిగిన రాజీ యత్నాలు, కీలకమైన భారత ప్రభుత్వ చట్టం - 1935 గురించి పోటీ పరీక్షార్థులకు అవగాహన ఉండాలి. వలస చట్టాలు, ప్రతిపాదిత సంస్కరణల ఉద్దేశాలు, వాటిపై జాతీయ నాయకుల అభిప్రాయాలు, చేసిన వ్యాఖ్యలను గుర్తుంచుకోవాలి.



గాంధీజీ ఇర్విన్

1. 'సైమన్ కమిషన్' సిఫార్సులకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.

ఎ) ప్రావిన్సుల్లో (బ్రిటిష్ పాలిత రాష్ట్రాల్లో) ద్వంద్వ పాలనకు బదులుగా బాధ్యతాయుత ప్రభుత్వాలను ఏర్పాటు చేయాలి.

బి) కేబినెట్ సభ్యులను ఎంపిక చేసుకోవడానికి గవర్నర్ జనరల్‌కు సంపూర్ణ అధికారం ఉండాలి.

సి) సమాఖ్య స్వభావం ఉన్న నూతన రాజ్యాంగ పునర్నిర్మాణం జరగాలి.

డి) భారతదేశం నుంచి బర్మాను వేరుచేయాలి.

1) ఎ, బి, సి 2) ఎ, సి, డి


3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

2. 'భారతీయులకు స్వయంగా రాజ్యాంగాన్ని రూపొందించుకునే సత్తా లేదు' అని బ్రిటిష్ పార్లమెంట్‌లో హేళన చేసిన అప్పటి భారత రాజ్యకార్యదర్శి ఎవరు?

1) లార్డ్ బిర్కెన్‌హెడ్ 2) లార్డ్ మార్లే

3) లార్డ్ విల్కిన్సన్ 4) చార్లెస్ మెట్‌కాఫ్

3. నెహ్రూ రిపోర్ట్ – 1928కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.



ఎ) మోతీలాల్ నెహ్రూ అధ్యక్షుడిగా ఎనిమిది మంది సభ్యులతో 1928, ఆగస్టు 10న రాజ్యాంగ రచన కోసం ఏర్పాటు చేసిన ఉపసంఘం.

బి) దీనికి జవహర్‌లాల్ నెహ్రూ కార్యదర్శిగా వ్యవహరించారు.

సి) మొదటిసారిగా ప్రాథమిక హక్కులను సూచించారు.

డి) భారతదేశానికి డొమినియన్ అంటే స్వయంప్రతిపత్తి కల్పించాలని పేర్కొంది.

1) ఎ, బి, డి 2) ఎ, సి, డి

3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

4. లార్డ్ ఇర్విన్ దీపావళి ప్రకటనను ఎప్పుడు వెలువరించారు?

1) 1929, అక్టోబరు 31 2) 1929, నవంబరు 29

3) 1930, జనవరి 11 4) 1930, జనవరి 31

5. లార్డ్ ఇర్విన్ వెలువరించిన దీపావళి ప్రకటనలోని అంశాన్ని గుర్తించండి.

ఎ) భారత్‌కు భవిష్యత్తులో స్వయంప్రతిపత్తి కల్పిస్తుంది.

బి) సైమన్ కమిషన్ సిఫార్సులపై లండన్‌లో రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహిస్తారు.

సి) లండన్‌లో జరిగే రౌండ్ టేబుల్ సమావేశాలకు అన్ని రాజకీయ పార్టీలు హాజరుకావాలి.

డి) ఈ ప్రకటన అనంతరం క్రిప్స్ రాయబారాన్ని బ్రిటిష్ ప్రధాని రాంసేమ్యూర్ భారత్‌కు పంపారు.

1) ఎ, బి, సి 2) ఎ, సి, డి

3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

6. లండన్‌లో జరిగిన మూడు రౌండ్ టేబుల్ సమావేశాలకు సంబంధించి సరైన జవాబు గుర్తించండి.

ఎ) మొదటి సమావేశం - 1930, నవంబరు 12 నుంచి 1931, జనవరి 19 వరకు.

బి) రెండో రౌండ్ టేబుల్ సమావేశం - 1931, సెప్టెంబరు 9 నుంచి 1931, డిసెంబరు 7 వరకు.

సి) మూడో రౌండ్ టేబుల్ సమావేశం -1932, నవంబరు 17 నుంచి 1932, డిసెంబరు 24 వరకు.

డి) రెండో రౌండ్ టేబుల్ సమావేశం - 1931, ఆగస్టు 19 నుంచి 1931 నవంబరు 30 వరకు.

1) ఎ, సి, డి 2) ఎ, బి, డి

3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

7. మొదటి రౌండ్ టేబుల్ సమావేశానికి సంబంధించి సరైన జవాబుని గుర్తించండి.

ఎ) ఈ సమావేశానికి అప్పటి బ్రిటన్ ప్రధాని రాంసే మెక్‌డొనాల్డ్ అధ్యక్షత వహించారు.

బి) ఈ సమావేశానికి 89 మంది ప్రతినిధులు హాజరయ్యారు.

సి) సంపూర్ణ స్వరాజ్ ప్రాతిపదికన సమావేశం కొనసాగించడానికి వైస్రాయ్ అంగీకరించకపోవడంతో జాతీయ కాంగ్రెస్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది.

డి) ఈ సమావేశంలో క్లెమెంట్ అట్లీ కీలకపాత్ర పోషించారు.

1) ఎ, సి, డి 2) ఎ, బి, సి

3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

8. గాంధీ – ఇర్విన్ ఒడంబడిక ఎప్పుడు కుదిరింది?

1) 1931, ఫిబ్రవరి 5 2) 1931, మార్చి 5

3) 1931, ఏప్రిల్ 11 4) 1931, మే 18

9. గాంధీ – ఇర్విన్ ఒప్పందం జరగడానికి ఎవరు మధ్యవర్తిత్వం వహించారు?

1) సర్ తేజ్ బహదూర్ సప్రూ, ఎం.ఆర్.జయకర్

2) ఎం.ఆర్.జయకర్, దాదాభాయ్ నౌరోజీ

3) ఫిరోజ్ మెహతా, సర్ తేజ్ బహదూర్ సప్రూ

4) సత్యేంద్ర నాథ్ సిన్హా, ఎం.ఆర్.జయకర్

10. గాంధీ – ఇర్విన్ ఒప్పందంలోని అంశాన్ని గుర్తించండి.

ఎ) సత్యాగ్రహుల నుంచి స్వాధీనం చేసుకున్న ఆస్తిని వారికి తిరిగివ్వడం.

బి) శాసనోల్లంఘన ఉద్యమంలో భాగంగా తీసుకొచ్చిన ఆర్డినెన్సుల ఉపసంహరణ.


సి) ఉప్పు తయారీపై ఆంక్షలు తొలగించడం.

డి) హింసకు పాల్పడినవారిని మినహాయించి మిగతా రాజకీయ ఖైదీల విడుదల.

1) ఎ, బి, సి 2) ఎ, సి, డి

3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

11. లండన్‌లో జరిగిన రెండో రౌండ్ టేబుల్ సమావేశానికి భారత జాతీయ కాంగ్రెస్ తరఫున హాజరైన ప్రతినిధి ఎవరు?



1) గాంధీజీ 2) జవహర్‌లాల్ నెహ్రూ

3) గోపాలకృష్ణ గోఖలే 4) అనిబిసెంట్

12. కమ్యూనల్ అవార్డు – 1932కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.

ఎ) బ్రిటన్ ప్రధాని రాంసే మెక్‌డొనాల్డ్ షెడ్యూల్డ్ కులాలకు ప్రకటించిన ప్రత్యేక నియోజకవర్గాలను వివరిస్తుంది.

బి) దీనికి వ్యతిరేకంగా గాంధీజీ పుణెలోని ఎరవాడ జైలులో నిరాహారదీక్ష చేపట్టారు.

సి) కమ్యూనల్ అవార్డును అంబేడ్కర్ సమర్థించారు.

1) ఎ, బి 2) ఎ, సి 3) బి, సి 4) ఎ, బి, సి

13. మదన్‌మోహన్ మాలవ్య, రాజాజీలు జరిపిన మధ్యవర్తిత్వం ఫలితంగా 1932లో ఎవరి మధ్య పూనా ఒప్పందం కుదిరింది?

1) గాంధీజీ - అంబేడ్కర్

2) అంబేడ్కర్ - రాంసే మెక్‌డొనాల్డ్

3) గాంధీజీ - మహ్మద్ అలీ జిన్నా

4) అంబేడ్కర్ - మహ్మద్ అలీ జిన్నా

14. కింది అంశాల్లో సరైన జవాబును గుర్తించండి.

ఎ) కమ్యూనల్ అవార్డు ద్వారా దళితులకు 71 స్థానాలు కేటాయించారు.

బి) పూనా ఒప్పందం ద్వారా దళితులకు 147 స్థానాలు కేటాయించారు.

సి) మూడు రౌండ్ టేబుల్ సమావేశాలకు హాజరైన వారు అంబేడ్కర్, మహ్మద్ అలీ జిన్నా.

1) ఎ, సి 2) ఎ, బి

3) బి, సి 4) ఎ, బి, సి

15. లార్డ్ లిన్‌లిత్‌గో సారథ్యంలోని జాయింట్ సెలక్ట్ కమిటీ రిపోర్టు ఆధారంగా బ్రిటిష్ పార్లమెంట్ ఏ చట్టాన్ని ఆమోదించింది?

1) భారత ప్రభుత్వ చట్టం - 1935

2) ప్రీవి కౌన్సిల్ చట్టం -1942

3) ఇంపీరియల్ లెజిస్లేటివ్ చట్టం - 1935

4) వేవెల్ ప్రణాళికా చట్టం - 1944

16. భారత ప్రభుత్వ చట్టం – 1935కు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.

ఎ) ఈ చట్టం 1937, ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చింది.

బి) ఈ చట్టంలో 321 ప్రకరణలు, 10 షెడ్యూళ్లు, 14 భాగాలు ఉన్నాయి.

సి) ఈ చట్టం భారత రాజ్యాంగానికి ప్రధాన ఆధారం.

డి) ఈ చట్టం అఖిల భారత సమాఖ్యను ప్రతిపాదించింది.

1) ఎ, బి, సి 2) ఎ, సి, డి

3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

17. భారత ప్రభుత్వ చట్టం – 1935 ప్రకారం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాల విభజనకు సంబంధించి సరికానిది ఏది?

1) కేంద్ర జాబితా - 59 అంశాలు

2) రాష్ట్ర జాబితా - 54 అంశాలు

3) ఉమ్మడి జాబితా - 36 అంశాలు

4) అవశిష్ట జాబితా - 42 అంశాలు

18. భారత ప్రభుత్వ చట్టం – 1935లోని అంశాలను గుర్తించండి.

ఎ) రాష్ట్రాల్లో ఉన్న ద్వంద్వ పాలనను రద్దు చేసి, కేంద్రంలో ప్రవేశపెట్టారు.

బి) మొదటిసారిగా రాష్ట్రాల్లో ప్రజాస్వామ్య ప్రభుత్వాల ఏర్పాటుకు అవకాశం కల్పించింది.

సి) ద్విసభా విధానాన్ని ఆరు రాష్ట్రాల్లో ప్రవేశపెట్టారు.

డి) ఒడిశా, సింధు రాష్ట్రాలను నూతనంగా ఏర్పాటు చేశారు.

1) ఎ, సి, డి 2) ఎ, బి, డి

3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి

19. భారత ప్రభుత్వ చట్టం – 1935లోని అంశాలకు సంబంధించి సరైన జవాబును గుర్తించండి.

ఎ) దేశంలో కరెన్సీ నియంత్రణకు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేశారు.

బి) దిల్లీలో ఫెడరల్ కోర్టును ఏర్పాటు చేశారు.

సి) ఫెడరల్ కోర్టులో ఒక ప్రధాన న్యాయమూర్తి, ఆరుగురు ఇతర న్యాయమూర్తులు ఉంటారు.

డి) ఫెడరల్ కోర్టు ఇచ్చిన తీర్పులను ఇంగ్లాండ్‌లోని ప్రీవి కౌన్సిల్‌లో అప్పీలు చేయవచ్చు.

1) ఎ, బి, సి 2) ఎ, సి, డి


3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

20. దిల్లీలో ఏర్పాటు చేసిన ఫెడరల్ కోర్టుకు తొలి ప్రధాన న్యాయమూర్తిగా ఎవరు వ్యవహరించారు?

1) సర్ ఎలిజా ఇంఫే 2) సర్ మారిస్ గ్వేయర్

3) సర్ మాన్సన్ 4) సర్ విలియంకే

21. ఈ చట్టం "కచ్చితంగా పిచ్చిది, సమూలంగా చెడ్డది, మొత్తానికి అంగీకారం కానిది" అని భారత ప్రభుత్వ చట్టం – 1935ను ఎవరు విమర్శించారు?



1) సర్ సయ్యద్ అహ్మద్‌ఖాన్

2) మహాత్మా గాంధీ

3) మహ్మద్ అలీ జిన్నా 4) మదన్‌మోహన్ మాలవ్య

22. 1940, ఆగస్టు 8న 'ఆగస్టు ప్రతిపాదన'ను ఎవరు చేశారు?

1) లార్డ్ లిన్‌లిత్‌గో 2) లార్డ్ వేవెల్

3) పెథిక్ లారెన్స్ 4) స్టాఫర్డ్ క్రిప్స్

23. ఆగస్టు ప్రతిపాదన, 1940లోని అంశాలను గుర్తించండి.

ఎ) రెండో ప్రపంచ యుద్ధానంతరం భారతదేశానికి అధినివేశ ప్రతిపత్తి కల్పించారు.

బి) రక్షణ, ఆర్థిక, హోంశాఖలు మినహా మిగతా శాఖలన్నింటినీ భారతీయులకు ఇస్తారు.

సి) వైస్రాయ్ కార్యనిర్వాహక మండలిలోని సభ్యుల సంఖ్యను 8 నుంచి 12కు పెంచడం.

డి) అల్పసంఖ్యాక వర్గాల డిమాండ్‌కు తగిన ప్రాధాన్యం ఇవ్వడం.

1) ఎ, బి, డి 2) ఎ, సి, డి


3) ఎ, బి, సి 4) ఎ, బి, సి, డి



రచయిత: బంగారు సత్యనారాయణ

సమాధానాలు

1-4; 2-1; 3-4; 4-1; 5-1; 6-3; 7-2; 8-2; 9-1; 10-4; 11-1; 12-4; 13-1; 14-4; 15-1; 16-4; 17-4; 18-4; 19-4; 20-2; 21-3; 22-1; 23-4.



గజిబిజి బంధం చిత్రరూపంతో సరళం

రక్తసంబంధం అనేది ఇద్దరు లేదా అంతకంటే ఎక్కువ వ్యక్తుల మధ్య సంబంధాన్ని సూచిస్తుంది. అమ్మవైపు సంబంధాలను మాతృసంబంధాలు, తండ్రివైపు సంబంధాలను పితృసంబంధాలు అంటారు. మన జీవితంలోని రక్తసంబంధాల గురించి సరైన అవగాహన ఉంటే ఈ అంశం నుంచి వచ్చే ప్రశ్నలను సులువుగా పరిష్కరించే అవకాశం ఉంటుంది. ప్రశ్నా సరళి గజిబిజిగా ఉన్నట్లయితే, దత్తాంశాన్ని చిత్రరూపంలోకి మార్చుకుని జవాబు కనిపెట్టేందుకు ప్రయత్నించాలి.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
రీజనింగ్

రక్తసంబంధాలు

1. సాత్విక్ అనే వ్యక్తి తన తల్లి తండ్రి కొడుకుకి ఏమవుతాడు?
1) తండ్రి 2) మేనమామ 3) మేనల్లుడు 4) తమ్ముడు

సాధన: తండ్రి
|
కూతురు — కొడుకు (సాత్విక్‌కు మేనమామ)
|
సాత్విక్

సాత్విక్ తల్లి తండ్రి అంటే సాత్విక్‌కు తాత. ఆ తాత కొడుకు సాత్విక్‌కు మేనమామ (తల్లి సోదరుడు) అవుతాడు. అంటే ప్రశ్న ప్రకారం ఇక్కడ సాత్విక్ మేనల్లుడు.

సమాధానం: 3

2. X అనే వ్యక్తి Y కి కొడుకు, Z అనే వ్యక్తి P కి తల్లి, X కి భార్య. అయితే Z అనే వ్యక్తి Y కి ఏమవుతాడు?
1) తల్లి 2) మరదలు
3) కోడలు 4) సోదరి

సాధన: Y
|
$X^{(+)} \Leftrightarrow Z^{(-)}$
|
P

X అనే వ్యక్తి Yకి కొడుకు, Z అనే వ్యక్తి X కి భార్య. కాబట్టి Z అనే వ్యక్తి Y కి కోడలు అవుతుంది.

సమాధానం: 3

3. X అనే వ్యక్తి Y కి సోదరుడు. Y అనే వ్యక్తి Z కి కూతురు. అయితే Z అనే వ్యక్తి X కి ఏమవుతారు? (ఇక్కడ ఇద్దరు పురుషులు ఉన్నారు)
1) అల్లుడు 2) మామ
3) కొడుకు 4) తండ్రి

సాధన: $Z^{(+)}$
|
$Y^{(-)} — X^{(+)}$

X అనే వ్యక్తి సోదరి తండ్రి Z. కాబట్టి Z అనే వ్యక్తి Xకి కూడా తండ్రి అవుతాడు.

సమాధానం: 4

4. రోహన్ ఒక వ్యక్తిని చూపిస్తూ, 'ఆ వ్యక్తి తండ్రి మా అమ్మకు ఒకేఒక కొడుకు' అని అన్నాడు. అయితే రోహన్ ఆ వ్యక్తికి ఏమవుతాడు?
1) తండ్రి 2) తాత
3) సోదరి/సోదరుడి కొడుకు 4) అల్లుడు

సాధన: అమ్మ
|
ఒకేఒక కొడుకు (రోహన్)
|
వ్యక్తి

పటం నుంచి రోహన్ వాళ్ల అమ్మ ఒకే ఒక కొడుకు రోహన్ అవుతాడు. అప్పుడు ఆ వ్యక్తి నాన్న రోహన్ అవుతాడు.

సమాధానం: 1

సూచన (ప్ర. 5 – 8): దిగువ ఇచ్చిన దత్తాంశాన్ని పరిశీలించి, కింది ప్రశ్నలకు సమాధానాలు గుర్తించండి.

ఒక కుటుంబంలో P, Q, R, S, T, U అనే వ్యక్తులు ఉన్నారు. ఆ కుటుంబంలో వివాహమైన జంట ఒకటే ఉంది. P అనే వ్యక్తికి ఇద్దరు కొడుకులు ఉన్నారు. Q అనే వ్యక్తి R కి తల్లి. S అనే వ్యక్తి P సోదరుడు. T అనే వ్యక్తి Q అనే వ్యక్తికి మరదలు (లేదా వదిన).

5. U అనే వ్యక్తి Q కి ఏ విధంగా బంధువు అవుతాడు?
1) తల్లి 2) కూతురు 3) కుమారుడు 4) చెప్పలేం

సాధన: దత్తాంశం ప్రకారం, పటం గీయాలి

$T^{(-)} — S^{(+)} — P^{(+)} \Leftrightarrow Q^{(-)}$
|
$R^{(+)} — U^{(+)}$

పటం నుంచి U అనే వ్యక్తి Q కి కుమారుడు.

సమాధానం: 3

6. S అనే వ్యక్తి U అనే వ్యక్తికి ఏ విధంగా సంబంధం కలిగి ఉంటాడు?
1) పెదనాన్న లేదా చిన్నాన్న (నాన్న సోదరుడు)
2) అల్లుడు 3) తమ్ముడు 4) చెప్పలేం

సాధన: పై చిత్రం నుంచి, U అనే వ్యక్తికి P తండ్రి. S అనే వ్యక్తి P కి సోదరుడు కాబట్టి S అనే వ్యక్తి U అనే వ్యక్తికి పెద్దనాన్న లేదా చిన్నాన్న అవుతాడు.

సమాధానం: 1

7. దత్తాంశం ప్రకారం కుటుంబంలో ఎంతమంది మహిళలు ఉన్నారు?
1) నలుగురు 2) ఇద్దరు 3) ముగ్గురు 4) నిర్ణయించలేం

సాధన: పై చిత్రాన్ని పరిశీలిస్తే కుటుంబంలో ఇద్దరు మహిళలు ఉన్నారు. ఒకరు P భార్య అయిన Q. మరొకరు P సోదరి T

సమాధానం: 2

8. కింద ఇచ్చిన ఐచ్ఛికాల్లో విభిన్నమైంది ఏది?
1) P 2) T 3) U 4) S

సాధన: ఇచ్చిన ఐచ్ఛికాల్లో P, U, S లు పురుషులు. T మహిళ.

సమాధానం: 2

9. ఒక కోడ్ భాషలో A + B అంటే A అనే వ్యక్తి B కి కుమారుడు.
A – B అంటే A అనే వ్యక్తి B కి సోదరుడు
A × B అంటే A అనే వ్యక్తి B కి భార్య
A ÷ B అంటే A అనే వ్యక్తి B కి తండ్రి అని అర్థం.
$S - D \times F + G \div H$ అనే కోడ్‌లో G అనే వ్యక్తి D కి ఏమవుతారు.?
1) భార్య తమ్ముడు 2) భర్త తండ్రి
3) సోదరుడి భార్య తండ్రి 4) సోదరుడి సోదరుడు

సాధన: ఇచ్చిన కోడ్ ప్రకారం,

$G^{(+)}$
|
$S^{(+)} — D^{(-)} \Leftrightarrow F^{(+)} — H$

S, D కి సోదరుడు, D, F కి భార్య, F, G కి కుమారుడు అంటే G అనే వ్యక్తి Dకి భర్త తండ్రి అవుతారు.

సమాధానం: 2

10. MK అనే వ్యక్తి కుమార్తెలు VK, NY. MZ ను VK వివాహం చేసుకున్నారు. అయితే NYకు MZ ఏమవుతారు?
1) కజిన్ 2) సోదరుడు 3) బావ/మరిది 4) వదిన/మరదలు

సాధన: MK
|
$NY^{(-)} — VK^{(-)} \Leftrightarrow MZ^{(+)}$

MZ అనే వ్యక్తి VK ను పెళ్లి చేసుకున్నాడు.
VK, NY ఇద్దరు అక్కచెల్లెళ్లు. కాబట్టి MZ అనే వ్యక్తి NY కి బావ లేదా మరిది అవుతారు.

సమాధానం: 3

11. ఒక కుటుంబంలో A, B, C, D, E, F, G అనే వ్యక్తులు ఉన్నారు. వీరిలో A అనే వ్యక్తి Bకి తల్లి. B అనే వ్యక్తి C అనే వ్యక్తి సోదరి కుమారుడు. C అనే వ్యక్తి D కి ఒకే ఒక కొడుకు. D అనే వ్యక్తి B కి అమ్మమ్మ. E అనే వ్యక్తి Fకి అల్లుడు. ఒకవేళ F అనే వ్యక్తికి ఒకే కుమార్తె ఉండి, అతడు D కి భర్త అయితే E అనే వ్యక్తి A కి ఏమవుతాడో కనుక్కోండి?
1) కుమారుడు 2) భర్త 3) తల్లి సోదరుడు 4) సోదరి భర్త

సాధన: $D^{(-)} \Leftrightarrow F^{(+)}$
|
$C^{(+)} — A^{(-)} \Leftrightarrow E^{(+)}$
|
$B^{(+)}$

చిత్రం నుంచి E అనే వ్యక్తి A కి భర్త అవుతాడు.

సమాధానం: 2

12. ఫొటోలోని వ్యక్తిని చూపిస్తూ మహిత 'ఆ వ్యక్తి మా నాన్న ఏకైక కుమార్తె తమ్ముడి అమ్మ' అని అన్నారు. అయితే ఫొటోలోని వ్యక్తి మహితకు ఏమవుతారు?
1) తల్లి 2) అక్క 3) చెల్లి 4) అత్త

సాధన: మా నాన్న ఏకైక కూతురు అంటే మహిత, ఆమె తమ్ముడి అమ్మ అంటే ఆమెకి కూడా అమ్మ అవుతారు.

సమాధానం: 1



రచయిత
రాజేశ్ మధు,
విషయ నిపుణులు

719 Word of the Day

Voluble

Telugu meaning: అనర్గళమైన, నిష్ణాతులు

English meaning: The word voluble (వాల్యుబుల్) is an adjective that describes someone who speaks fluently, readily, and at length.

Synonyms: Talkative, Loquacious

Antonyms: Reserved, Silent

Usage: **1.** The voluble host kept the audience entertained throughout the event.
2. She is known for her voluble nature and energetic storytelling.


కరెంట్ అఫైర్స్



ఉపరాష్ట్రపతి పదవికి జగదీప్ ధన్‌ఖడ్ 2025, జులై 21న రాజీనామా చేశారు. రాజ్యసభ ఛైర్మన్ హోదాలో ఉన్న ఆయన రాజీనామా లేఖను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు పంపారు. అనారోగ్య కారణాల వల్ల తాను పదవి నుంచి వైదొలగుతున్నట్లు అందులో పేర్కొన్నారు. ఆయన రాజీనామాతో రాజ్యసభ సమావేశాలను ప్రస్తుతానికి డిప్యూటీ ఛైర్మన్‌గా ఉన్న జేడీయూ నేత హరివంశ్ నడిపించనున్నారు.
- దేశ 14వ ఉపరాష్ట్రపతిగా 2022 ఆగస్టు 11న ఉపరాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్ పదవీ కాలం 2027 ఆగస్టు వరకూ ఉంది.



కేరళ మాజీ ముఖ్యమంత్రి వి.ఎస్.అచ్యుతానందన్ (101) 2025, జులై 21న తిరువనంతపురంలో మరణించారు. ఆయన అయిదేళ్లపాటు (2006-11) కేరళ ముఖ్యమంత్రిగా ఉన్నారు. 1967 నుంచి ఏడుసార్లు కేరళ అసెంబ్లీకి ఎన్నికయ్యారు. రెండు దఫాలు శాసనసభలో విపక్ష నేతగా కొనసాగారు. 1964లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో చీలిక రాగా సీపీఎంను స్థాపించిన 32 మంది కీలక నేతల్లో అచ్యుతానందన్ ఒకరు.




శత్రుదేశాల జలాంతర్గాములను ధ్వంసం చేసే 'అజయ్' యుద్ధ నౌక 2025, జులై 21న భారత నావికాదళంలో చేరింది. ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ (జీఆర్ఎస్ఈ) దీన్ని నిర్మించింది. యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్ క్రాఫ్ట్స్‌గా వీటిని వ్యవహరిస్తుంటారు. దీని పొడవు 77.6 మీటర్లు, వెడల్పు 10.5 మీటర్లు.

దేశంలో ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలోనూ 1,200 మంది కంటే తక్కువ ఓటర్లను కలిగి ఉన్న తొలి రాష్ట్రంగా బిహార్ అవతరించిందని ఎన్నికల సంఘం (ఈసీ) 2025, జులై 21న వెల్లడించింది. ఓటింగ్ రోజున పోలింగ్ స్టేషన్‌ల వద్ద ప్రజలు ఎక్కువ సమయం బారులు తీరకుండా చూసేందుకు ఈసీ కొంతకాలంగా చర్యలు తీసుకుంటోంది. ఇందులో భాగంగా బిహార్‌లోని పోలింగ్ కేంద్రాల పరిధిలో ఓటర్ల సంఖ్యను గరిష్ఠంగా 1,200కు తగ్గించేందుకు కసరత్తులు చేపట్టినట్లు తెలిపింది.

మరిన్ని కరెంట్ అఫైర్స్ కోసం క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

జాతీయ ప్రసార దినోత్సవం

జులై 23
చరిత్రలో ఈనాడు



మన దేశంలో రేడియో ప్రసారం అధికారికంగా ప్రారంభమైన రోజును పురస్కరించుకుని ఏటా జులై 23న 'జాతీయ ప్రసార దినోత్సవం'గా (National Broadcasting Day) నిర్వహిస్తారు. టెలివిజన్, ఇతర డిజిటల్ మాధ్యమాల ఆవిర్భావానికి ముందు రేడియో ఏకైక ప్రసార సాధనంగా పనిచేసింది. జాతీయోద్యమ సమయంలో స్వాతంత్ర్య కాంక్షను పెంపొందించడంలో, ఉద్యమాన్ని వ్యాప్తి చేయడంలో ఇది ముఖ్యపాత్ర పోషించింది. నేటికీ ఆల్ ఇండియా రేడియో, ఎఫ్ఎం రేడియో ప్రసారాలను ప్రజలు ఆస్వాదిస్తూనే ఉన్నారు. ఒక కమ్యూనికేషన్ సాధనంగా భారతీయ సమాజంపై రేడియో చూపిన ప్రభావాన్ని గుర్తించడంతోపాటు దాని ప్రాముఖ్యతను ప్రజలకు తెలియజేయడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

- పూర్వం రేడియో ఒక్కటే కమ్యూనికేషన్ సాధనంగా ఉండేది. 1960 దశాబ్దం వరకు దీని గుత్తాధిపత్యమే నడిచింది. ఆ కాలాన్ని రేడియోలకు స్వర్ణయుగంగా పేర్కొంటారు.
- స్వాతంత్ర్యోద్యమ సమయంలో నేతాజీ ఆజాద్ హింద్ రేడియో, కాంగ్రెస్ రేడియో భారతీయులను బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా ప్రేరేపించడంలో సాయం చేశాయి. స్వాతంత్ర్యానంతరం అక్షరాస్యత, ఆరోగ్య అవగాహన, వ్యవసాయ జ్ఞానాన్ని పెంపొందించడంలో కీలకంగా పనిచేసింది.

చారిత్రక నేపథ్యం:


1923, జూన్‌లో బొంబాయి ప్రెసిడెన్సీలో రేడియో క్లబ్ ఆఫ్ బొంబాయి దేశంలో మొదటిసారి ప్రసారాన్ని ప్రారంభించింది. 1923, జులై 23న దేశంలో మొట్టమొదటి రేడియో సంస్థగా ఇండియన్ బ్రాడ్‌కాస్టింగ్ కంపెనీ (ఐబీసీ) ఉనికిలోకి వచ్చింది. దేశంలో వ్యవస్థీకృత రేడియో ప్రసారాలు అప్పుడే ప్రారంభమయ్యాయి. ఈ తేదీనే ఏటా 'జాతీయ ప్రసార దినోత్సవం'గా నిర్వహిస్తున్నారు.

- 1936, జూన్ 8న 'ఐబీసీ'ని బ్రిటన్ స్వాధీనం చేసుకుని, దీని పేరును ఆల్ ఇండియా రేడియో (ఏఐఆర్)గా మార్చింది.
- 1956లో భారత ప్రభుత్వం దీనికి 'ఆకాశవాణి' అనే పేరు పెట్టింది. ప్రస్తుతం ఇది దేశవ్యాప్తంగా 591 స్టేషన్లతో 23 భాషల్లో ప్రసారాలను అందిస్తోంది.
- 1959, సెప్టెంబరు 15న దూరదర్శన్ ప్రారంభమైంది. 1977, జులై 23న మొదటి ఎఫ్ఎం ప్రసారాన్ని చెన్నైలో ప్రారంభించారు. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 100 నగరాల్లో 388 ఎఫ్ఎం స్టేషన్లు ఉన్నాయి.

జనరల్ స్టడీస్ - బయాలజీ

పర్యావరణ వ్యవస్థ - క్రియాత్మక అంశాలు

ఆవరణ వ్యవస్థ అనేది జీవాన్ని నిలబెట్టేందుకు సంఘర్షణ చెందే జీవసంబంధమైన, నిర్జీవాత్మక కారకాలతో కూడిన ఒక గతిక వ్యవస్థ. పర్యావరణ వ్యవస్థ క్రియాత్మక అంశాలుగా శక్తి ప్రవాహం, భూ జీవరసాయన వలయాలు, పర్యావరణ ఉత్పాదకతను చెప్పవచ్చు. ఇది జీవ ప్రక్రియల స్థిరత్వం, ఉనికిని నిర్ధారిస్తుంది.



శక్తి ప్రవాహం దశలు

- మొదటి దశ
- రెండో దశ
- మూడో దశ
- నాలుగో దశ

శక్తి ప్రవాహం ప్రాముఖ్యత

పర్యావరణ వ్యవస్థలో శక్తి ప్రవాహం అనేది మనుగడలో భాగంగా జరుగుతుంది. జీవులన్నీ పనిచేయడానికి శక్తిపైనే ఆధారపడతాయి. ఆ శక్తిని పొందడానికి పర్యావరణ వ్యవస్థలో తమ తోటి జీవులపై ఆధారపడతాయి.

బయోజియోకెమికల్ సైకిల్స్

బయోజియోకెమికల్ సైకిల్స్ ప్రధానంగా బయోటిక్, అబయోటిక్ కారకాల మధ్య పోషకాలు, ఇతర మూలకాల కదలికను సూచిస్తాయి.

- నీటి చక్రం
- కార్బన్ చక్రం
- నైట్రోజన్ చక్రం
- ఆక్సిజన్ చక్రం
- ఫాస్పరస్ చక్రం
- సల్ఫర్ చక్రం

పర్యావరణ వ్యవస్థల్లో శక్తి ప్రవాహం

పర్యావరణ వ్యవస్థలో శక్తి ప్రవాహం అనేది ఆహార గొలుసులో జరిగే శక్తి బదిలీ, వినియోగాన్ని సూచిస్తుంది. పర్యావరణ వ్యవస్థలో పోషక చక్రాలు, శక్తి ప్రవాహం జీవ, నిర్జీవ భాగాలను ఒకదానితో ఒకటి బంధిస్తాయి.

ట్రోఫిక్ స్థాయుల సోపాన క్రమం, శక్తి ప్రవాహ నియంత్రణ నియమాలు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Teaching Posts

The Employees' State Insurance Corporation (ESIC) Medical College & Hospital, K.K. Nagar, Chennai, is conducting interviews for the recruitment of Medical Teaching Faculty posts on a contractual basis in Super Specialty Departments. The total no. of posts is 47. The application fee is Rs.500. Eligible candidates can appear for the interview on 29 July 2025.

Civil Assistant Surgeon Posts

Tirumala Tirupati Devasthanam in Tirupati has issued a notification for the recruitment of 8 Civil Assistant Surgeon posts on a contract basis. Eligible candidates can apply online before 7 August 2025.

Senior Consultant Posts

EdCIL (India) Limited invites applications, on behalf of Airports Authority of India (AAI), for the position of Senior Consultant on contract basis. The total no. of posts is 10. The last date for online applications is 1 August 2025.

Did You Apply..?

Today (July 23) is the last date for the following Jobs

- Indian Coast Guard Assistant Commandant Recruitment 2027 - 170 posts. ***Eligibility:*** Graduate Degree.
- Consultant posts in NDMA. ***Eligibility:*** PG.

For more information and other notifications - scan QR code


Sentence Rearrangement

Directions (Qs. 1 - 5): *Rearrange the given six sentences/group of sentences (A), (B), (C), (D), and (E) in a proper sequence so as to form a meaningful paragraph and then answer the given question:*

A. As a result, oxygen is released as a byproduct, which is essential for the survival of most life forms on Earth.
B. During photosynthesis, plants also take in carbon dioxide from the atmosphere and water from the soil.
C. Photosynthesis is a biochemical process in which green plants convert light energy into chemical energy, primarily in the form of glucose.
D. This process not only supports plant growth but also plays a key role in maintaining atmospheric balance and the global carbon cycle.
E. The process takes place in the chloroplasts of plant cells, where chlorophyll absorbs sunlight to drive the reaction.

1. Which of the following should be the **THIRD** sentence after the rearrangement?
A) B B) A C) D D) E E) C

2. Which of the following should be the **SECOND** sentence after the rearrangement?
A) B B) E C) A D) C E) D



3. Which of the following should be the **FIFTH (last)** sentence after the rearrangement?
A) C B) E C) D
D) B E) A

4. Which of the following should be the **FIRST** sentence after the rearrangement?
A) E B) D C) A
D) C E) B

5. Which of the following should be the **FOURTH** sentence after the rearrangement?
A) D B) B C) C
D) E E) A

Bank Exams

English

Directions (Qs. 6 - 10): *Rearrange the following sentences in the proper sequence to form a meaningful paragraph, then answer the following questions.*

A. Financial literacy refers to the ability to understand and effectively use various financial skills, including budgeting, investing, and managing debt.
B. Without financial literacy, individuals may fall into debt traps, make poor investment choices, or fail to save for emergencies and retirement.
C. It empowers people to make informed decisions about money, contributing to greater financial stability and independence.
D. In today's increasingly complex financial world, financial literacy is no longer optional but a necessary life skill.
E. Governments and institutions are now focusing on financial education programs to help citizens become more financially aware and responsible.

6. Which of the following should be the **FIRST** sentence after the rearrangement?
A) D B) A C) E
D) B E) C

7. Which of the following should be the **FOURTH** sentence after the rearrangement?
A) C B) A C) E
D) B E) D

8. Which of the following should be the **FIFTH (last)** sentence after the rearrangement?
A) C B) B C) E
D) D E) A

9. Which of the following should be the **SECOND** sentence after the rearrangement?
A) D B) B C) A
D) E E) C

10. Which of the following should be the **THIRD** sentence after the rearrangement?
A) B B) A C) D
D) E E) C

Scan the QR code for Key

Writer: *P. Manoj Kumar, Subject Expert*

పైపుల తుప్పు.. మేల్కోపోతే ముప్పు!

- ప్రధాన నగరాల్లో మురుగు కాలువల్లోనే తాగునీటి పైపులు
- వర్షాలతో కలుషితమవుతున్న తాగునీరు
- నగరపాలక సంస్థల్లో కొరవడిన ముందస్తు ప్రణాళిక

◆ గత ఏడాది జూన్‌లో విజయవాడలోని మొగల్రాజపురంలో కలుషిత నీరు కారణంగా పది మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 150 మంది ఆసుపత్రుల్లో చేరారు. మురుగు కాలువ పక్కన ఉన్న పాడైన తాగునీటి పైపుల్లోకి మురుగు వెళ్లి నీరు కలుషితమైంది. ప్రాణాంతకమైన క్లెబ్సియెల్లా బ్యాక్టీరియా కారణంగా నీరు తాగిన ప్రజలు మృత్యువాత పడ్డారు. గుంటూరులోని శారదాకాలనీలోనూ గత ఏడాది మార్చిలో కలుషిత నీటితో ఇంకో పది మంది మరణించారు. అనేకమంది ఆసుపత్రుల్లో చేరారు.



గుంటూరులో బారాఇమాంపంజాలో మురుగు కాల్వలో తాగునీటి పైప్‌లైన్ ◆కడపలో మురుగు కాలువ మధ్యలో తాగునీటి పైపు

ఈనాడు, అమరావతి: వర్షాకాలంలో కలుషిత నీరు కారణంగా ప్రజలు ఏటా అనారోగ్యంతో మంచాన పడుతున్నా పుర, నగరపాలక సంస్థలు మేల్కొనడం లేదు. వర్షాకాలం మొదలైనా ఇప్పటికీ పాడైన తాగునీటి పైపుల స్థానంలో కొత్తవాటి ఏర్పాటు మొదలు కాలేదు. కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక సీఎఫ్ఎంఎస్‌తో సంబంధం లేకుండా నిధులు ఖర్చు చేసే వెసులుబాటు కమిషనర్లకు కల్పించినా ముందస్తు ప్రణాళిక కొరవడింది.

ప్రధాన నగరాల్లో ఇలా

◆ విజయవాడలో భవానీపురం హౌసింగ్‌బోర్డు కాలనీ, చిట్టినగర్, సింగ్‌నగర్, వాంబేకాలనీ, బర్మాకాలనీ, శాంతినగర్, ప్రకాశ్‌నగర్, కండ్రిక, కృష్ణలంక తదితర ప్రాంతాల్లో తాగునీరు కలుషితమవుతోంది. నీరు రంగు మారడంతోపాటు కొన్ని చోట్ల దుర్వాసన వస్తోంది. పైపులైన్లు మురుగు కాలువల్లో ఉండటం, ఇంకొన్ని చోట్ల యూజీడీ పైపుల పక్కనే ఉన్నందున సమస్య తలెత్తుతోంది.

◆ గుంటూరులో పాత బస్టాండ్, చిన్నబజార్, బారా ఇమామ్ పంజా ప్రాంతాల్లో మురుగు కాలువల్లో తాగునీటి పైపెలైన్లు ఉన్నా, అధికారులకు పట్టడం లేదు. నెహ్రూనగర్, సంజీవయ్యనగర్ ప్రాంతాల్లో పైపులైన్ల లీకేజీలతో తాగునీరు కలుషితమవుతోంది. నగరంలో పలు చోట్ల నీరు రంగు మారుతోంది. గత ఐదేళ్లలో కలుషిత నీటితో 14 మంది మృత్యువాత పడినా పాడైన తాగునీటి పైపులపై నగరపాలక సంస్థ దృష్టి సారించడం లేదు.

◆ విశాఖలోని రెల్లివీధి, అల్లిపురం, స్ప్రింగ్ రోడ్డు, పూర్ణామార్కెట్, మున్సిపల్ స్టేడియం, తాటిచెట్లపాలెం, కంచరపాలెం తదితర ప్రాంతాల్లో తాగునీరు కలుషితమవుతోంది. కాలువలు, గెడ్డల మీదుగా ఉన్న 370 పైపులైన్లు ఇటీవల తొలగించి వేరే మార్గంలో వేశారు. కలుషిత నీటి సమస్య తీవ్రంగా ఉన్న ప్రాంతాలపై అధికారులు దృష్టి సారించాలి.

◆ చిత్తూరులోని మిట్టూరు, రామనగర్‌కాలనీ, టెలిఫోన్ కాలనీ, గిరింపేట, మరాఠీవీధి, వన్నియర్ బ్లాక్, డీఐ రోడ్డు, మార్కెట్ చౌక తదితర ప్రాంతాల్లో తాగునీటి పైపులైన్లు మురుగు కాలువలపైనే ఉన్నాయి. అనేక చోట్ల పైపులు, వాల్వ్‌లు దెబ్బతిని తాగునీరు లీకవుతోంది.

◆ కడపలో బీకేఎం వీధి, నాగరాజు పేట, మోచంపేట తదితర ప్రాంతాల్లో మురుగు కాలువల్లో తాగునీటి పైపులైన్లు ఉన్నాయి. ఇక్కడ తాత్కాలిక చర్యలు తప్పితే శాశ్వత పరిష్కారం చూపడం లేదు.

◆ నెల్లూరులో పాత పైపులైన్లకు రంధ్రాలు పడుతున్న కారణంగా నీరు కలుషితమవుతోంది. పొదలకూరు రోడ్డులో ప్రధాన పైపులైనులో తరచూ లీకులు ఏర్పడుతున్నాయి. కోటమిట్ట, ఈద్గా మిట్ట, వెంగళరావు నగర్, కొత్తూరు, అంబాపురం, వైఎస్ఆర్ నగర్, తదితర ప్రాంతాల్లో కలుషిత నీటి సమస్య ఉంది. 9.5 కిలో మీటర్ల మేర తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల నుంచి వెళుతున్నాయి.

◆ ఏలూరులో వన్ టౌన్, టూ టౌన్, త్రీ టౌన్ ప్రాంతాల్లో కుళాయిల నుంచి మురుగునీరు వస్తోంది. అత్యధిక చోట్ల తాగునీటి పైపులైన్లు మురుగు కాలువల మీదుగా ఉన్నాయి.

◆ శ్రీకాకుళంలోని తాగునీటి పైపులైన్లు మురుగు కాలువలను ఆనుకుని ఉన్నందున నీరు కలుషితమవుతోంది. నగరపాలక సంస్థ కార్యాలయానికి ఆనుకుని ఉన్న వీధుల్లో సైతం ఇళ్లకు నీరు సరఫరా చేసే పైపులు కాలువల్లో ఉన్నా పట్టించుకోవడం లేదు.

ఆ ప్రతిపాదనలు అమలు చేస్తే శాశ్వత పరిష్కారం

2014-19 మధ్య తెదేపా ప్రభుత్వహయాంలో నగరాలు, పట్టణాల్లో 5,034 కిలో మీటర్ల మేర పాడైన తాగునీటి పైపులైన్ల స్థానంలో రూ.700 కోట్లతో కొత్తవి ఏర్పాటుకు చేసిన ప్రతిపాదనలను వైకాపా ప్రభుత్వం పక్కన పెట్టింది. కేవలం 150 కిలో మీటర్ల మేర కొత్తవి వేశారు. కూటమి ప్రభుత్వం మిగతా 550 కిలో మీటర్ల పాత పైపులైన్ల స్థానంలో కొత్తవి వేయిస్తే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుంది.

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

ఆంధ్రప్రదేశ్‌లో 17,41,362 మంది లఖ్‌పతి దీదీలు

దేశంలో రెండో స్థానం

ఈనాడు, దిల్లీ: కేంద్ర ప్రభుత్వం దీన్‌దయాళ్ అంత్యోదయ యోజన-నేషనల్ రూరల్ లైవ్లీహుడ్ మిషన్ కింద ప్రారంభించిన లఖ్‌పతి దీదీ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌లో 17,41,362 మంది మహిళలు కేంద్ర ప్రభుత్వ లక్ష్యాన్ని సాధించి లఖ్‌పతి దీదీలుగా ఎదిగినట్లు కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన లోక్‌సభలో ఒక ప్రశ్నకు సమాధానంగా ఈ విషయం వెల్లడించారు. మహారాష్ట్ర (22,69,981 మంది) తర్వాత అత్యధిక మంది లఖ్‌పతి దీదీలు ఏపీలో ఉన్నట్లు చెప్పారు. ఈ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు రూ.414.06 కోట్లు కేంద్ర ప్రభుత్వం విడుదల చేసింది.

పీఎం ఫసల్ బీమా యోజన కింద ఏపీలో రూ.2,565 కోట్ల క్లెయిమ్‌లు పెండింగ్

పీఎం ఫసల్ బీమా యోజన కింద ఆంధ్రప్రదేశ్ నుంచి రూ.2,565 కోట్ల విలువైన క్లెయిమ్‌లు పెండింగ్‌లో ఉన్నట్లు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ తెలిపారు. లోక్‌సభలో తెదేపా ఎంపీలు బైరెడ్డి శబరి, కలిశెట్టి అప్పలనాయుడు అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిచ్చారు. ఇందులో 2022-23 రబీకి సంబంధించి రూ.105.85 కోట్లు, 2023 ఖరీఫ్‌వి రూ.1,344.91 కోట్లు, 2023-24 రబీవి రూ.890.21 కోట్లు, 2024 ఖరీఫ్‌కు సంబంధించి రూ.224.87 కోట్ల చొప్పున క్లెయిమ్‌లు ఉన్నట్లు చెప్పారు. అత్యధికంగా అనంతపురం జిల్లాలో రూ.421 కోట్లు, కర్నూలు జిల్లాలో రూ.352.52 కోట్లు పెండింగ్‌లో ఉన్నట్లు వివరించారు. ఈ ఏడాది జూన్ 30వ తేదీ వరకు ఫసల్ బీమా యోజన కింద ఏపీ నుంచి 4.35 కోట్ల మంది రైతులకు చెందిన 1.94 కోట్ల హెక్టార్ల పంట భూమికి బీమా చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు 66.1 లక్షల మంది రైతులకు రూ.5,395.8 కోట్ల క్లెయిమ్‌లు చెల్లించినట్లు వివరించారు.

ఉపాధి హామీ కింద రూ.2,864 కోట్ల బకాయిలు

ఉపాధి హామీ పథకం కింద ఆంధ్రప్రదేశ్‌కు ఈనెల 16వ తేదీ వరకు రూ.2,864 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉన్నట్లు మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ లోక్‌సభలో వెల్లడించారు. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు అన్ని రాష్ట్రాలకూ కలిపి రూ.44,323 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఇందులో గతేడాది బకాయిలు కూడా ఉన్నట్లు చెప్పారు. కూలీల వేతనాలను కేంద్ర ప్రభుత్వమే నేరుగా వారి ఖాతాల్లో జమ చేస్తోందన్నారు.

ప్రకృతి వైపరీత్యాలతో ఈ ఏడాది 258 మంది మృతి

ప్రకృతి వైపరీత్యాల కింద ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి జులై 16 వరకు ఆంధ్రప్రదేశ్‌లో 258 మంది మృతి చెందినట్లు కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి నిత్యానందరాయ్ తెలిపారు. ఆయన లోక్‌సభలో ఓ ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు చెప్పారు. దేశవ్యాప్తంగా విపత్తుల కారణంగా 1,297 మరణాలు సంభవించగా, అందులో అత్యధికం ఆంధ్రప్రదేశ్‌లోనే ఉన్నట్లు వెల్లడించారు. ఆ తర్వాతి స్థానాల్లో హిమాచల్‌ప్రదేశ్ (171), మధ్యప్రదేశ్ (148), బిహార్ (101) ఉన్నట్లు తెలిపారు.

ఏపీ రాష్ట్ర వినియోగదారుల కమిషన్ పోస్టులు ఖాళీ

ఆంధ్రప్రదేశ్ వినియోగదారుల ఫిర్యాదుల పరిష్కార రాష్ట్ర కమిషన్ ప్రెసిడెంట్, రెండు మెంబర్ పోస్టులు ఖాళీగా ఉన్నట్లు కేంద్ర వినియోగదారుల వ్యవహారాల శాఖ సహాయమంత్రి బీఎల్ వర్మ తెలిపారు. రాజ్యసభలో భాజపా సభ్యుడు ఆర్.కృష్ణయ్య అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానం ఇచ్చారు.

ఏపీలో 2,708 కంపెనీలు మూత

ఏపీలో ఎలాంటి కార్యకలాపాలూ లేని 2,708 కంపెనీలను మూసేసినట్లు కేంద్ర కార్పొరేట్ వ్యవహారాలశాఖ సహాయమంత్రి హర్ష్ మల్హోత్ర తెలిపారు. దేశవ్యాప్తంగా 97,179 కంపెనీలు మూసేసినట్లు వెల్లడించారు.

పీఏసీఎస్‌ల ఏర్పాటు ఏమైంది?

లోక్‌సభలో ప్రశ్నించిన ఎంపీ బాలశౌరి

ఈనాడు డిజిటల్, మచిలీపట్నం: కొత్తగా ప్రతి పంచాయతీ పరిధిలో ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల(పీఏసీఎస్) ఏర్పాటుకు చర్యలు ఎంతవరకు వచ్చాయి... అని ఎంపీ బాలశౌరి మంగళవారం లోక్‌సభలో ప్రశ్నించారు. దీనికి కేంద్ర సహకార శాఖ మంత్రి అమిత్‌షా లిఖితపూర్వక వివరణ ఇచ్చారు. 'ఈ ప్రణాళికను 2023లో ప్రభుత్వం ఆమోదించింది. దీని ప్రకారం ఐదేళ్లలో దేశంలోని అన్ని పంచాయతీల పరిధిలో కొత్తగా 2 లక్షల ఏపీసీఎస్(పాడి, మత్స్య)లను ఏర్పాటు చేయాలి. ఇందులో డెయిరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ ఫండ్, నేషనల్ ప్రోగ్రాం ఫర్ డెయిరీ డెవలప్‌మెంట్, ప్రధాన మంత్రి మత్స్యసంపద తదితర పథకాలు ఉంటాయి. 2023 నుంచి 2025 జూన్ వరకు ఏపీలో 9,149 పాడి, 200 మత్స్యకార సంఘాలు ఏర్పాటయ్యాయి' అని వివరించారు. భారత్-యూకే మధ్య స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు ఎప్పుడు అమల్లోకి వస్తాయని బాలశౌరి ప్రశ్నించగా... 'ఈ ఏడాది మేలో భారత్-యూకేల మధ్య ఎఫ్‌టీఏపై చర్చలు జరిగాయి. ఇరుదేశాలూ సంతకాలు చేశాక అమలులోకి వస్తాయి' అని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద బదులిచ్చారు.

ఏపీని పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయడంపై చర్చించాం: మంత్రి లోకేశ్

ఈనాడు, అమరావతి: భారతదేశం, ఆగ్నేయ ఆసియాలో ఆంధ్రప్రదేశ్‌ను ఒక కీలక పారిశ్రామిక కేంద్రంగా అభివృద్ధి చేయడంపై విస్తృత స్థాయిలో చర్చలు జరిపామని మంత్రి నారా లోకేశ్ ఎక్స్‌లో ట్వీట్ చేశారు. 'సీఎం చంద్రబాబుతో కలిసి యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) ఆర్థిక మంత్రి హెచ్.ఇ.అబ్దుల్లా బిన్ టౌక్ అల్ మార్రీ, లులు ఇంటర్నేషనల్ ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ యూసఫ్‌అలీ ఎం.ఎ, లులు ఫైనాన్షియల్ హోల్డింగ్స్ మేనేజింగ్ డైరెక్టర్ అదీబ్ అహ్మద్‌లను హృదయపూర్వకంగా ఆహ్వానించాం. సాంకేతిక రంగం(ఐటీ), తయారీ, పర్యాటక, వ్యవసాయ వ్యాపారం, లాజిస్టిక్స్ వంటి రంగాల్లో పెట్టుబడి అవకాశాల గురించి చర్చించాం' అని తెలిపారు.

మామిడి రైతులకు ఎన్డీయే అండ

ఈనాడు, అమరావతి: తోతాపురి మామిడి రైతులకు కేంద్ర ప్రభుత్వం అండగా నిలిచిందని భాజపా రాష్ట్ర శాఖ వెల్లడించింది. నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతుల పక్షపాతి అని ఎక్స్‌లో పోస్టు చేసింది. 'తోతాపురి మామిడి ధరకు కేంద్ర ప్రభుత్వం మద్దతు ప్రకటించి రైతులకు మద్దతుగా నిలిచింది. 1.62 లక్షల మెట్రిక్ టన్నుల వరకు కొనుగోలుకు అంగీకారం తెలిపింది' అని పేర్కొంది.

ప్రతిభ ఆధారంగానే జిల్లా క్రీడా కార్యదర్శుల నియామకం

ఈనాడు, అమరావతి: జిల్లాస్థాయి క్రీడా కార్యదర్శులను ప్రతిభ ఆధారంగా నియమించేందుకు పాఠశాల విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది. ఎంపికైన వారు రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. గతంలో కార్యదర్శిగా పనిచేసిన వారికి ఈసారి అవకాశం ఇవ్వరు. కార్యదర్శులుగా ఎంపిక కావడానికి వంద మార్కులకు పాయింట్లు ఇస్తారు. సర్వీసుకు ఏడాదికి ఒక పాయింటు చొప్పున గరిష్ఠంగా 25 పాయింట్లు ఇస్తారు. అర్హతలకు ఐదు, అదనపు అర్హతలకు ఐదు, వ్యక్తిగతంగా క్రీడల్లో సాధించిన పతకాలకు 20, గతంలో క్రీడల నిర్వహణలో చూపిన నైపుణ్యాలకు ఐదు, విద్యార్థులు సాధించిన విజయాలపరంగా 30, పాఠశాల అభివృద్ధికి చేసిన కృషికి ఐదు, పాఠశాల విధుల్లో చూపిన నిబద్ధతకు ఐదు పాయింట్ల చొప్పున కేటాయిస్తారు. మహిళా టీచర్లకు ప్రోత్సాహకంగా అదనంగా 10 పాయింట్లు ఇస్తారు. ఈ పాయింట్లలో ఎక్కువ సాధించిన వారిని జిల్లాస్థాయి క్రీడా కార్యదర్శులుగా నియమించాలని జిల్లా విద్యాధికారులను డైరెక్టర్ విజయరామరాజు ఆదేశించారు. ఎంపికైన వారి జాబితాను ఆగస్టు 8లోపు డైరెక్టరేట్‌కు సమర్పించాలని పేర్కొన్నారు.

14 వేల మందికి జీతాల సమస్య: ఎంటీఎఫ్

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో 14 వేల మంది పురపాలక ఉపాధ్యాయులకు జూన్ నెల జీతాలు అందలేదని పురపాలక ఉపాధ్యాయ సమాఖ్య అధ్యక్షుడు రామకృష్ణ తెలిపారు. 'రాష్ట్ర వ్యాప్తంగా పురపాలక ఉన్నత పాఠశాలల్లో ఆన్‌లైన్ లాగిన్ అయితే కేడర్ స్ట్రెంత్ ఎక్కడా కనిపించడం లేదు. కొందరి పొజిషన్ ఐడీలూ కనుమరుగయ్యాయి. జులై నెల జీతాలు సమర్పించేందుకు అవకాశం లేకుండా పోయింది' అని పేర్కొన్నారు.

మహాశక్తి పథకంపై మంత్రి వ్యాఖ్యలు హాస్యాస్పదం: షర్మిల

ఈనాడు, అమరావతి: మహాశక్తి పథకం అమలుపై మంత్రి అచ్చెన్నాయుడు చేసిన వ్యాఖ్యలు హాస్యాస్పదమని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు షర్మిల ఆక్షేపించారు. ఎన్నికల్లో హామీలిచ్చి ఇప్పుడేమో పథకం కోసం రాష్ట్రాన్ని అమ్మాలని అంటారా అని ఆమె మంగళవారం ఒక ప్రకటనలో ప్రశ్నించారు. 'మహిళలకు హామీ ఇచ్చే ముందు ఈ విషయం తెలియలేదా? ఆర్థిక అంచనా లేకుండా రూ.వేల కోట్ల హామీని ఎలా ఇచ్చారు? దీనిపై సీఎం చంద్రబాబు సమాధానం చెప్పాలి' అని డిమాండ్ చేశారు.

విజయవాడలో నేడు బీసీవై పార్టీ ఆవిర్భావ వేడుకలు

ఈనాడు, అమరావతి: భారత చైతన్య యువజన(బీసీవై) పార్టీ ఆవిర్భావ వేడుకలను బుధవారం విజయవాడలో నిర్వహించనున్నారు. ఉదయం కలెక్టర్ కార్యాలయం ఎదురుగా ఉన్న హోటల్ నుంచి బెంజి సర్కిల్ మీదుగా వేడుకలు జరిగే కల్యాణ మండపం వరకు ర్యాలీ నిర్వహించనున్నారు. ఆవిర్భావ వేడుకల సందర్భంగా పార్టీ సిద్ధాంత పత్రాన్ని విడుదల చేయనున్నట్లు ఆ పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్ తెలిపారు.

పవన్‌పై క్రిమినల్ రివిజన్ కేసుకు నంబరివ్వండి

- రిజిస్ట్రీకి హైకోర్టు ఆదేశం

ఈనాడు, అమరావతి: వారాహి యాత్ర సందర్భంగా జనసేన అధినేత పవన్ కల్యాణ్ వాలంటీర్లపై చేసిన వ్యాఖ్యల విషయంలో దాఖలైన క్రిమినల్ రివిజన్ కేసుకు నంబరు కేటాయించాలని రిజిస్ట్రీని హైకోర్టు ఆదేశించింది. నిఘా వర్గాల సమాచారం మేరకు.. వాలంటీర్లు సేకరిస్తున్న సమాచారం కొంతమంది అసాంఘిక శక్తుల చేతుల్లోకి వెళ్లి మహిళలను అపహరిస్తున్నారన్నారని అప్పట్లో పవన్ కల్యాణ్ వ్యాఖ్యానించారు. ఈ వ్యాఖ్యలపై నాటి వైకాపా ప్రభుత్వం గతేడాది ఫిబ్రవరిలో గుంటూరు న్యాయస్థానంలో క్రిమినల్ కేసు దాఖలు చేసింది. కేసు వేయడానికి అప్పట్లో ఆమోదం తెలిపిన ఐదుగురు వాలంటీర్లు.. పవన్ కల్యాణ్ వ్యాఖ్యలతో తమ ప్రతిష్ఠకు భంగం కలగలేదంటూ తాజాగా అఫిడవిట్ వేశారు. వైకాపా నేతలు తమ నుంచి సంతకాలు తీసుకొని కోర్టులో పిటిషన్ వేశారంటూ న్యాయాధికారి ఎదుట వాంగ్మూలం కూడా ఇచ్చారు. ఈ నేపథ్యంలో పవన్ కల్యాణ్‌పై ప్రాసిక్యూషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతించాలని పబ్లిక్ ప్రాసిక్యూటర్ గుంటూరు కోర్టులో పిటిషన్ వేశారు. విచారణ జరిపిన గుంటూరు నాలుగో అదనపు జిల్లా జడ్జి.. అందుకు అనుమతిస్తూ గతేడాది నవంబర్ 18న ఉత్తర్వులిచ్చారు. దీన్ని సవాలు చేస్తూ కె.సరళ, మరో ముగ్గురు హైకోర్టులో క్రిమినల్ రివిజన్ కేసు దాఖలు చేశారు. ఈ పిటిషన్‌కు నంబరు కేటాయించేందుకు హైకోర్టు రిజిస్ట్రీ నిరాకరించడంతో వ్యవహారం న్యాయమూర్తి వద్దకు చేరింది. మంగళవారం విచారణలో పిటిషనర్ల తరఫున న్యాయవాది జడ శ్రావణ్‌కుమార్ వాదనలు వినిపించారు. అనంతరం వ్యాజ్యానికి నంబరు కేటాయించాలని రిజిస్ట్రీని న్యాయమూర్తి ఆదేశించారు.

పేర్ని నానిపై తొందరపాటు చర్యలొద్దు: హైకోర్టు

ఈనాడు, అమరావతి: కృష్ణా జిల్లా పామర్రులో ఈ నెల 11న వైకాపా కార్యకర్తల సమావేశంలో రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేసిన కేసులో మాజీ మంత్రి, వైకాపా నేత పేర్ని వెంకటరామయ్య (నాని)పై గురువారం వరకు తొందరపాటు చర్యలొద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది. వాదనలు వినిపించేందుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్ హాజరు కానున్నారని సహాయ పీపీ నీలోత్పల్ చేసిన అభ్యర్థనను పరిగణనలోకి తీసుకొని పిటిషన్‌పై విచారణను గురువారానికి వాయిదా వేసింది. హైకోర్టు సింగిల్ జడ్జి మంగళవారం ఈ ఉత్తర్వులిచ్చారు. 'చెప్పి కాదు చెప్పకుండా నరికివేయాలి.. తప్పు చేసిన వాడు ఎవరైనా ఉంటే మన ప్రభుత్వం వచ్చాక వేసేయండి' అంటూ పేర్ని నాని రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేశారంటూ కేసు నమోదైంది. దీన్ని కొట్టేయాలంటూ ఆయన హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు.

◆ ఇదే వ్యవహారంలో తనపై నమోదు చేసిన కేసును కొట్టేయాలని పామర్రు మాజీ ఎమ్మెల్యే కె.అనిల్‌కుమార్ వేసిన వ్యాజ్యంపైనా హైకోర్టు విచారణ జరిపింది. అనిల్‌కుమార్ విషయంలో తొందరపాటు చర్యలొద్దని స్పష్టం చేసింది. అంతకుముందు పిటిషనర్ల తరఫున సీనియర్ న్యాయవాది సి.రఘు వాదనలు వినిపిస్తూ.. పోలీసులు నమోదు చేసిన సెక్షన్లన్నీ ఏడేళ్లలోపు శిక్ష పడేవేనన్నారు. తదుపరి విచారణ వరకు అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని కోరారు.

పది పట్టణాల్లో ప్రత్యేక అధికారుల పాలన పొడిగింపు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలోని పది పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ఉన్న ప్రత్యేక అధికారుల పదవీకాలం మరో ఆరు నెలలు పొడిగిస్తూ పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి ఎస్.సురేశ్‌కుమార్ మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. కందుకూరు, ఆముదాలవలస, నరసరావుపేట, పొన్నూరు, కావలి, వైఎస్సార్ తాడిగడప పురపాలక సంఘాల్లో, చింతలపూడి, పొదిలి, అల్లూరు, బి.కొత్తకోట నగర పంచాయతీల్లో ప్రత్యేక అధికారుల పదవీకాలం గత రెండు నెలల వ్యవధిలోని వివిధ తేదీల్లో ముగిసింది. ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేక పాలన కొనసాగుతుందని పురపాలక శాఖ పేర్కొంది.

కేజీబీవీ టీచర్ల కృషి అభినందనీయం: ఎస్పీడీ

ఈనాడు, అమరావతి: కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాల్లోని విద్యార్థినులు మంచి ఫలితాలు సాధించడానికి టీచర్లు చేసిన కృషి అభినందనీయమని సమగ్ర శిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు కొనియాడారు. విజయవాడలో మంగళవారం నిర్వహించిన కేజీబీవీ రిసోర్సు పర్సన్ల శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. 'కేజీబీవీల్లో చదువుతున్న విద్యార్థులంతా పేద, అనాథ, తల్లిదండ్రుల్లో ఒక్కరే ఉన్నవారు, మైనారిటీ బాలికలు. వారిని సొంత పిల్లల్లా భావించి నాణ్యమైన విద్యను అందిస్తూ బంగారు భవితకు బాటలు వేయాలి. బోధనలో వెనుకబడిన టీచర్లకు రిసోర్సు పర్సన్లు శిక్షణ ఇవ్వాలి' అని సూచించారు.

వర్జీనియాలో ఆషాఢం సంబరాలు

- ఉత్సాహంగా పాల్గొన్న మహిళలు



వర్జీనియా: ఆషాఢం నేపథ్యంలో అమెరికాలోని వర్జీనియాలో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) 'ఆడపడుచులకు గోరింటాకు పండగ'ను ఘనంగా నిర్వహించింది. వేడుకగా సాగిన కార్యక్రమంలో స్థానిక తెలుగు మహిళలు పాల్గొని, గోరింటాకు పెట్టుకున్నారు. ఏ దేశంలో ఉన్నా సంస్కృతి, సంప్రదాయాలు కాపాడుకోవడంలో తెలుగు మహిళలు ప్రధాన పాత్ర పోషిస్తారని తానా సాంస్కృతిక విభాగ సమన్వయకర్త సాయిసుధ పాలడుగు అన్నారు. మన సంప్రదాయాలు భావి తరాలకు తెలియజేయాలనే ఈ వేడుక నిర్వహించినట్లు తెలిపారు. తానా అధ్యక్షుడు నరేన్ కొడాలి మాట్లాడుతూ.. సుదీర్ఘ ప్రయాణంలో తానా ఎన్నో ఆటుపోట్లు తట్టుకొని సగర్వంగా నిల్చొని, ఎందరికో స్ఫూర్తినిచ్చిందన్నారు. 'ఈనాడు' తెలంగాణ సంపాదకులు డీఎన్ ప్రసాద్, గుంటూరు మిర్చి యార్డ్ మాజీ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు ముఖ్య అతిథులుగా పాల్గొని తానా కృషి అభినందించారు.







ఠాణాల్లో సీసీటీవీ కెమెరాల పనితీరు పరిశీలన

- అడ్వొకేట్ కమిషనర్‌ను నియమించిన హైకోర్టు

ఈనాడు, అమరావతి: పోలీస్‌స్టేషన్లలో సీసీటీవీ కెమెరాల ఏర్పాటు, వాటి పనితీరును పరిశీలించేందుకు అడ్వొకేట్ కమిషన్‌ను హైకోర్టు ఏర్పాటుచేసింది. న్యాయవాది ఎమ్మార్కే చక్రవర్తిని కమిషనర్‌గా నియమించింది. స్టేషన్లలో కెమెరాలు ఏర్పాటుచేశామని, ప్రాంగణం మొత్తం కనిపిస్తుందని రాష్ట్రవ్యాప్తంగా డీఎస్పీలు హైకోర్టుకు నివేదికలు ఇచ్చారు. దీంతో క్షేత్రస్థాయిలో పరిశీలించి వాస్తవాలను నిగ్గుతేల్చేందుకు అడ్వొకేట్ కమిషన్‌ను నియమించింది. పిటిషనర్ సూచించిన ఆరు పోలీస్‌స్టేషన్లను సందర్శించి సుప్రీంకోర్టు మార్గదర్శకాలకు అనుగుణంగా సీసీ కెమెరాలున్నాయా, లేవా? స్టేషన్లో మొత్తం ఎన్ని కెమెరాలున్నాయి? అవి పనిచేస్తున్నాయా? ఫుటేజ్ స్టోర్ అవుతోందా? సీసీ కెమెరాల్లో పోలీసుస్టేషన్ల ప్రాంగణం మొత్తం కనిపిస్తోందా? తదితర వివరాలను పరిశీలించి నివేదిక ఇవ్వాలని ఆదేశించింది. న్యాయమూర్తులు జస్టిస్ ఆర్.రఘునందన్‌రావు, జస్టిస్ జె.సుమతితో కూడిన ధర్మాసనం మంగళవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది. విచారణను ఆగస్టు 12కి వాయిదా వేసింది. హైకోర్టు ఆదేశాల మేరకు పోలీస్‌స్టేషన్లలో సీసీటీవీ కెమెరాలు లేవంటూ న్యాయవాది తాండవ యోగేష్ హైకోర్టులో కోర్టుధిక్కరణ వ్యాజ్యం వేశారు. కెమెరాలు ఏర్పాటుచేశామని, ఠాణాతో పాటు ప్రాంగణమంతా కనిపిస్తుందని ధ్రువీకరిస్తూ డీఎస్పీలు ఇటీవల నివేదికలు ఇచ్చారు. అవి అన్నీ ఒకేలా ఉండటంపై ధర్మాసనం సందేహం వ్యక్తం చేసింది. అడ్వొకేట్ కమిషన్ ద్వారా పరిశీలించేందుకు కొన్ని స్టేషన్ల పేర్లు ఇవ్వాలని పిటిషనర్‌కు సూచించింది. మంగళవారం జరిగిన విచారణలో 12 పోలీస్‌స్టేషన్ల వివరాలను న్యాయవాది యోగేష్ కోర్టు ముందు ఉంచారు. వాటిలో ఆరు స్టేషన్లను పరిశీలించి నివేదిక ఇవ్వాలని అడ్వొకేట్ కమిషన్‌ను న్యాయస్థానం ఆదేశించింది.

బోగస్ ధ్రువీకరణ పత్రాలు రద్దు

వైకల్యశాతం మారిన వారికి 25 నుంచి సచివాలయాల్లో 'సదరం'

ఈనాడు, అమరావతి: అర్హత లేకున్నా దివ్యాంగుల క్యాటగిరీలో పింఛను పొందుతున్న 1.08 లక్షల మంది బోగస్ సదరం ధ్రువీకరణ పత్రాలు రద్దు కానున్నాయి. తదుపరి వీరి పింఛన్లను తొలగించనున్నారు. వైద్య బృందాలను నియమించి ప్రభుత్వం చేపడుతున్న తనిఖీలో వైకల్యశాతం ప్రస్తుతం ఉన్న దాని కంటే మారిన వారికి కొత్తగా మళ్లీ సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేయనున్నారు. ఈ నెల 25వ తేదీ నుంచి గ్రామ, వార్డు సచివాలయాల్లో తాజాగా వైద్యులు నిర్ధారించిన వైకల్యశాతంతో కూడిన సదరం ధ్రువీకరణ పత్రాలు అందుబాటులో ఉండనున్నాయి. ఉచితంగానే వీటిని లబ్ధిదారులకు అందించనున్నారు. పింఛను అందించేందుకు ప్రభుత్వం నిర్దేశించిన 40 శాతం కంటే తక్కువ వైకల్య శాతం ఉన్నట్లు తనిఖీలో నిర్ధారించిన వారికి అసెస్‌మెంట్ రిపోర్టును అందిస్తారు. ఈ మేరకు వైద్య ఆరోగ్యశాఖ, గ్రామ, వార్డు సచివాలయాలశాఖకు ప్రభుత్వం నుంచి ఆదేశాలు అందాయి.

త్వరలో చేనేత సంఘాల ఎన్నికల నోటిఫికేషన్

మంత్రి సవిత వెల్లడి

ఈనాడు డిజిటల్, అనకాపల్లి: రాష్ట్రంలో చేనేత సహకార సంఘాల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోందని, త్వరలోనే నోటిఫికేషన్ విడుదల కానుందని రాష్ట్ర బీసీ, ఈడబ్ల్యూఎస్ సంక్షేమ, చేనేత, జౌళి శాఖ మంత్రి ఎస్.సవిత వెల్లడించారు. అనకాపల్లిలో మంగళవారం సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి.. ఆయా శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. అర్హులైన నేతన్నలకు వర్క్‌షెడ్లు నిర్మించి ఇవ్వాలని, అందులో సోలార్ లైటింగ్ యూనిట్లు ఏర్పాటుచేయాలని అధికారులను ఆదేశించారు. వసతిగృహాల అభివృద్ధికి కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్), జిల్లా మినరల్ ఫండ్ నుంచి నిధులు సేకరించాలని అధికారులకు నిర్దేశించారు. ఖాదీ గ్రామీణాభివృద్ధి శాఖ ద్వారా యువత ఉపాధి కల్పనకు రాయితీ రుణాలతో యూనిట్లు నెలకొల్పాలన్నారు. ఖాదీ గ్రామీణాభివృద్ధి బోర్డు ద్వారా ఏర్పాటుచేసే స్వయం ఉపాధి యూనిట్లను యువత వినియోగించుకునేలా చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు.

220 మంది అతిథి అధ్యాపకులకు అనుమతి

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 220 మంది అతిథి అధ్యాపకుల నియామకానికి అనుమతిస్తూ పాఠశాల విద్యా శాఖ కార్యదర్శి కోన శశిధర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటికే కళాశాలల్లో పని చేస్తున్న 957 మందికి వీరు అదనమని తెలిపారు. గతంలో అతిథి అధ్యాపకులకు ఉన్న నిబంధనలే వీరికి వర్తిస్తాయని తెలిపారు.

మోహన్‌బాబు, మంచు విష్ణు కేసుల్లో తీర్పు రిజర్వ్

తిరుపతి కోర్టులో తదుపరి విచారణ ప్రక్రియపై స్టే

ఈనాడు, దిల్లీ: ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం ధర్నా చేస్తున్న తమపై రాష్ట్ర ప్రభుత్వం నమోదు చేసిన కేసును కొట్టేయాలని కోరుతూ సినీనటులు మంచు మోహన్‌బాబు, విష్ణులు దాఖలు చేసిన పిటిషన్‌లో సుప్రీంకోర్టు తీర్పు రిజర్వు చేసింది. ఈ కేసులో తిరుపతి 4వ అదనపు సివిల్‌జడ్జి కోర్టు ముందున్న తదుపరి విచారణ ప్రక్రియపై స్టే విధించింది. ఈ మేరకు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌లతో కూడిన ధర్మాసనం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో ఇరుపక్షాల న్యాయవాదులు తమ వాదనలను శుక్రవారంలోపు లిఖితపూర్వకంగా సమర్పించాలని నిర్దేశించింది. ఫీజు రీయింబర్స్‌మెంట్ కోసం మోహన్‌బాబు, విష్ణులు 2019 మార్చి 22న తమ విద్యాసంస్థకు చెందిన సిబ్బంది, విద్యార్థులతో కలిసి శ్రీవిద్యానికేతన్ నుంచి తిరుపతి, మదనపల్లె రోడ్డు మీదుగా ర్యాలీ నిర్వహించి ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించడంతో పాటు అప్పట్లో అమల్లో ఉన్న ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించారని పోలీసులు కేసు నమోదు చేశారు. దానిపై 2021లో ఛార్జిషీట్ దాఖలు చేశారు. అయితే తాము శాంతియుతంగా ధర్నా చేసినప్పటికీ పోలీసులు తప్పుడు అభియోగాలు నమోదు చేసినందున వాటిని కొట్టేయాలని మోహన్‌బాబు, విష్ణు హైకోర్టులో క్వాష్ పిటిషన్ వేశారు. మోహన్‌బాబుపై నమోదు చేసిన అభియోగాలకు సంబంధించి వీడియో ఆధారాలున్నందున వాటిని కొట్టేయరాదని రాష్ట్ర ప్రభుత్వం కోర్టుకు విన్నవించింది. ఇరువురి వాదనలు విన్న హైకోర్టు ఇందులోని నిజానిజాలు ట్రయల్‌కోర్టులో సాక్ష్యాల విచారణ ద్వారానే తేలాల్సి ఉందన్న కారణంతో ఆ పిటిషన్‌ను కొట్టేసింది. దానిపై వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

హోదాను అడ్డుపెట్టుకుని తప్పించుకునే యత్నాలు

'ధర్మస్థల'పై బెంగళూరు సిటీ సివిల్ కోర్టు ఆదేశాలను సుప్రీంలో సవాలు చేసిన 'థర్డ్ ఐ'

బెంగళూరు (గాంధీనగర), న్యూస్‌టుడే: కర్ణాటక రాష్ట్రంలోని ప్రముఖ ఆధ్యాత్మిక కేంద్రం- ధర్మస్థలలో పలు అనుమానాస్పద హత్యలు, అత్యాచారాలు జరిగాయని వస్తున్న ఆరోపణలపై శ్రీక్షేత్రం ధర్మాధికారి వీరేంద్ర హెగ్గడే సోదరుడు హర్షేంద్రకుమార్‌పై ఎటువంటి కథనాలనూ ప్రసారం చేయవద్దని బెంగళూరు సిటీ సివిల్ కోర్టు ఇచ్చిన ఆదేశాలను సవాలు చేస్తూ 'థర్డ్ ఐ యూట్యూబ్ ఛానెల్' సుప్రీంకోర్టును ఆశ్రయించింది. కొందరు బాధితుల కుటుంబసభ్యులు చెబుతున్న పేర్లను ప్రసారం చేయవద్దని నిర్బంధించేందుకు పుష్కరకాలంగా ప్రయత్నాలు జరుగుతున్నాయని 'థర్డ్ ఐ' ప్రతినిధులు అభ్యంతరం తెలిపారు. ప్రతిసారీ తమ హోదాను, ఆలయ ప్రతిష్ఠను అడ్డుపెట్టుకుని కొందరు తప్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని, పత్రికా స్వేచ్ఛకు భంగం కలిగిస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు.



అలుపెరగని ఫైటర్‌కు శాశ్వత విశ్రాంతి!

ఆరు దశాబ్దాలపాటు భారత గగనతల రక్షణలో కీలక భూమిక వహించిన మిగ్‌-21 యుద్ధవిమానం శాశ్వతంగా విశ్రాంతి తీసుకోనుంది. అనేక యుద్ధాల్లో మన దేశం తరఫున పోరాడిన ఈ ఫైటర్ జెట్ ఇక చరిత్ర పుటలకు పరిమితం కానుంది. 'వయోభారం'తో కొన్నేళ్లుగా ఊపిరాడిస్తున్న ఈ లోహవిహంగం భారత అమ్ములపొది నుంచి వైదొలగనుంది. సెప్టెంబరు 19న చండీగఢ్ వైమానిక స్థావరంలో జరిగే ఒక కార్యక్రమంలో మిగ్‌-21కు భారత వాయుసేన ఘనంగా వీడ్కోలు పలకనుంది.

ఇదీ చరిత్ర..

మిగ్‌-21 యుద్ధవిమానాన్ని రష్యా (నాటి సోవియట్ యూనియన్)కు చెందిన మికోయన్‌-గురేవిచ్ సంస్థ రూపొందించింది. ఇది 1955 జూన్ 16న మొదట గగనవిహారం చేసింది. 1959 నుంచి 1985 వరకు వీటి ఉత్పత్తి సాగింది.

గరిష్ఠ వేగం: గంటకు 2,230 కిలోమీటర్లు

ఆయుధాలు
- 23 ఎంఎం ట్విన్ బ్యారెల్ క్యానన్
- ఆర్‌-60, ఆర్‌-73 క్షిపణులు

- మిగ్‌-21ను తొలుత ఇంటర్‌సెప్టర్ యుద్ధవిమానంగా అభివృద్ధి చేశారు. ఆ తర్వాత భూతల దాడులు సహా ఎలాంటి బాధ్యతలనైనా నెరవేర్చగల బహుళ ప్రయోజనకర యుద్ధవిమానంగా ఆధునికీకరించారు.
- ఈ జెట్‌కు ప్రత్యేకతను తెచ్చిపెట్టింది.. దాని ముందు భాగంలో పెన్సిల్ కొన లాంటి ఆకృతే. అవసరానికి అనుగుణంగా ఆది సర్దుబాటు కాగలదు. ఆ భాగం పూర్తిగా లోపలికి పోతే.. విమాన వేగం మాక్ 1.5 (ధ్వని వేగం కన్నా ఒకటిన్నర రెట్లు వేగం)లోపు ఉంటుంది. పూర్తిస్థాయిలో వెలుపలికి వస్తే మాక్ 1.9 కన్నా ఎక్కువ వేగాన్ని సాధిస్తుంది.
- ప్రపంచవ్యాప్తంగా 60కిపైగా దేశాలకు ఇవి సేవలు అందించాయి. మొత్తంమీద 11,496 మిగ్‌-21లను రష్యా ఉత్పత్తి చేసింది. ప్రపంచంలోనే అత్యంత ఎక్కువ సంఖ్యలో ఉత్పత్తయిన సూపర్‌సోనిక్ యుద్ధవిమానంగా ఇది చరిత్ర సృష్టించింది. అలాగే ఎక్కువ యుద్ధాల్లో పాల్గొన్న ఫైటర్ జెట్‌గా కూడా గుర్తింపు పొందింది.
- చౌకగా, చాలా సులువుగా ఉత్పత్తి చేయగలిగేలా మిగ్‌-21ను రష్యా డిజైన్ చేసింది. ఫలితంగా భారీగా ఉత్పత్తి చేయడానికి వీలైంది.

వాయుసేనలోకి..

మిగ్‌-21లు 1963లో భారత వైమానిక దళంలో మొదట చేరాయి. ఇది భారత తొలి సూపర్‌సోనిక్ యుద్ధవిమానం. మొత్తం మీద ఈ తరగతికి చెందిన 874 జెట్లను మన దేశం సమకూర్చుకుంది. ఇందులో దాదాపు 660 యుద్ధవిమానాలను భారత్‌లోనే నిర్మించారు. ఇంత పెద్ద సంఖ్యలో భారత వైమానిక దళంలో చేరిన యుద్ధవిమానం మరొకటి లేదు.

- మన దేశం ప్రధానంగా మిగ్‌-21కు సంబంధించి టైప్‌-77, టైప్‌-96, బిస్, బైసన్ వేరియంట్లను సమకూర్చుకుంది.
- బైసన్.. చివరి అప్‌గ్రేడ్ రకం. గత మూడు దశాబ్దాల్లో దాదాపు 100కుపైగా మిగ్‌-21లను ఈ తరగతికి భారత్ ఆధునికీకరించింది.

పోరాటాల్లో..

వైమానిక దళంలో చేరినప్పటి నుంచి.. భారత్ తరఫున అన్ని యుద్ధాల్లో మిగ్‌-21 జెట్‌లు పాల్గొన్నాయి. పాకిస్థాన్‌తో జరిగిన 1965, 1971 యుద్ధాలు, 1999 నాటి కార్గిల్ పోరులో సేవలు అందించాయి.

- 1971 యుద్ధంలో ఇవి పాక్‌కు సంబంధించిన స్థావరాలపై అత్యంత కచ్చితత్వంతో దాడులు జరిపింది. వైరిపక్ష విమానాలను నేలకూల్చింది. ఫలితంగా తూర్పు పాకిస్థాన్ (నేటి బంగ్లాదేశ్) గగనతలంపై ఆధిపత్యాన్ని మన దేశం సాధించగలిగింది.
- 1999లో భారత గగనతలంలోకి ప్రవేశించిన పాకిస్థాన్‌కు చెందిన సముద్ర గస్తీ విమానాన్ని భారత వాయుసేనకు చెందిన మిగ్‌-21లు కూల్చేశాయి.
- 2019 ఫిబ్రవరి 27న బాలాకోట్ దాడుల అనంతరం పాక్ విమానాలు జమ్మూకశ్మీర్‌లో చొరబడితే.. వాటిని తరిమేందుకు మిగ్‌-21లు రంగంలోకి దిగాయి. నాడు మన పైలట్ అభినందన్ వర్ధమాన్.. తన మిగ్‌-21 బైసన్ సాయంతో పాక్ ఎఫ్‌-16 జెట్‌ను కూల్చేశారు.
- మొన్నటి ఆపరేషన్ సిందూర్‌లోనూ మిగ్‌-21 జెట్‌లు పోరాట సన్నద్ధత స్థితిలో ఉన్నాయి.



ఎగిరే శవపేటికలు..

మిగ్‌-21కు భారత వాయుసేనలో మిశ్రమ చరిత్ర ఉంది. 1960లు, 70లలో దేశానికి వ్యూహాత్మక ఆధిపత్యాన్ని కట్టబెట్టాయి. ఆ తర్వాత ఎక్కువ సంఖ్యలో కూలిపోవడం వల్ల అవి.. 'ఎగిరే శవపేటికలు'గా ముద్రపొందాయి. భారత వాయుసేనకు చెందిన దాదాపు 500 మిగ్‌-21లు కూలిపోయాయి. ఫలితంగా 200 మందికిపైగా పైలట్లు, కొందరు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. చివరిసారిగా 2023 మే 8న రాజస్థాన్‌లోని సూరత్‌గఢ్ వద్ద ఒక మిగ్‌-21 కూలింది. దీనివల్ల ముగ్గురు పౌరులు ప్రాణాలు కోల్పోయారు. ఈ జెట్‌లకు కాలం చెల్లడమే ఇందుకు కారణం. ప్రత్యామ్నాయ యుద్ధవిమానాలు పెద్ద సంఖ్యలో వాయుసేనలో చేరకపోవడం వల్ల మిగ్‌-21లను సుదీర్ఘకాలం కొనసాగించాల్సి వచ్చింది.

తగ్గుతున్న స్క్వాడ్రన్లు

కాలం చెల్లిన నేపథ్యంలో దశలవారీగా భారత్ మిగ్‌-21లకు వీడ్కోలు పలికింది. ప్రస్తుతం వాయుసేన వద్ద 36 మిగ్‌-21 బైసన్‌లు ఉన్నాయి. 3వ, 23వ స్క్వాడ్రన్లలో ఇవి సేవలు అందిస్తున్నాయి. వీటికి వీడ్కోలు పలికాక వాయుసేనలో ఫైటర్ జెట్‌ల సంఖ్య 29 స్క్వాడ్రన్లకు పడిపోతుంది. 1960ల తర్వాత ఇంత తక్కువకు వీటి సంఖ్య పడిపోవడం ఇదే మొదటిసారి. 1965 యుద్ధసమయంలోనూ వాయుసేన వద్ద 32 స్క్వాడ్రన్లు ఉన్నాయి. నిజానికి మనకు ఉండాల్సింది 42 స్క్వాడ్రన్లు. మిగ్‌-21ల స్థానంలో స్వదేశీ యుద్ధవిమానం 'తేజస్'ను ప్రవేశపెడుతున్నారు. అయితే వాటి ఉత్పత్తిలో జాప్యం జరుగుతోంది.

- ఈనాడు ప్రత్యేక విభాగం

ఇంధన స్విచ్‌ల వ్యవస్థలో లోపాల్లేవు

- బోయింగ్ విమానాలపై ఎయిరిండియా ప్రకటన

ముంబయి: ఇంధన స్విచ్ లాకింగ్ వ్యవస్థకు సంబంధించి తమ వద్ద ఉన్న బోయింగ్ 787, 737 విమానాల్లో ఎటువంటి సమస్యలను గుర్తించలేదని ఎయిరిండియా వెల్లడించింది. అహ్మదాబాద్‌లో ఇటీవల జరిగిన దుర్ఘటనకు ఫ్యూయల్ స్విచ్ వ్యవస్థలో తలెత్తిన సమస్యలే కారణమని ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) తన నివేదికలో పేర్కొన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బోయింగ్ 787, 737 విమానాల్లో ఫ్యూయల్ స్విచ్ లాకింగ్ వ్యవస్థను తనిఖీ చేయాలని డీజీసీఏ అన్ని విమానయాన సంస్థలను ఆదేశించింది. ఈ మేరకు తనిఖీలు నిర్వహించిన ఎయిరిండియా.. తమ విమానాల్లో సదరు వ్యవస్థ బాగానే పని చేస్తోందని, సమస్యలు లేవని మంగళవారం ఓ ప్రకటనలో పేర్కొంది. డీజీసీఏ నిర్దేశించిన వ్యవధిలోనే తనిఖీలు పూర్తి చేశామని, నివేదికను సమర్పించామని వెల్లడించింది.

మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌పై ఎఫ్‌బీఐ పత్రాల విడుదల



వాషింగ్టన్: అమెరికాలో నల్లజాతి హక్కుల కోసం పోరాడి 1968లో ఒక జాత్యహంకారి తూటాలకు బలైన మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్‌పై ఇదివరకు అమెరికా దర్యాప్తు సంస్థ- ఎఫ్‌బీఐ నిఘాకు సంబంధించిన అధికారిక రికార్డులను ట్రంప్ యంత్రాంగం ప్రజా పరిశీలన కోసం బహిరంగపరిచింది. సుమారు 2.4 లక్షలకు పైగా పేజీలు కలిగిన ఈ సమాచారాన్ని 1977 నుంచి కోర్టు ఆదేశాల మేరకు గోప్యంగా ఉంచారు. ఎఫ్‌బీఐ సేకరించిన ఈ పత్రాలను ఆనాటి నుంచీ జాతీయ ప్రాచీనపత్ర భాండాగారంలో భద్రపరిచారు. ప్రభుత్వ చర్యపై మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ పిల్లలైన మార్టిన్- 3, బెర్నిస్ సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు. బహిర్గతం చేసిన ఈ సమాచారాన్ని అప్పటి పరిస్థితులకు అన్వయించుకోవాలని వారు పిలుపునిచ్చారు. "డాక్టర్ కింగ్ హత్య మాకెంతో వ్యక్తిగత వ్యథకు కారణమైంది. 57 ఏళ్లుగా ఆ శూన్యత అనుభవిస్తున్నాం. ఆయనకు సంబంధించిన రహస్య పత్రాలు విడుదల చేస్తున్న సహాసోపేతానికి, గౌరవంతో ఆ పనిచేయాలి. మా కుటుంబ వ్యథను గౌరవించాల్సిందిగా అభ్యర్థిస్తున్నాం" అని పేర్కొన్నారు. రహస్య పత్రాల విడుదల ఒక అపూర్వ ముందడుగు అని అమెరికా జాతీయ నిఘా విభాగ డైరెక్టర్ తులసీ గబ్బార్డ్ పేర్కొన్నారు.

పాకిస్థాన్‌లో అధికార కూటమికి భారీ ఆధిక్యం

- రాజ్యాంగ సవరణకు సమకూరిన బలం

ఇస్లామాబాద్: పాకిస్థాన్ ప్రధాన మంత్రి షెహబాజ్ షరీఫ్ నాయకత్వంలోని సంకీర్ణ ప్రభుత్వానికి సెనెట్‌లో మూడింట రెండు వంతుల మెజారిటీ లభించింది. పాక్ పార్లమెంటులో ఎగువసభ సెనెట్‌కు సభ్యులను రాష్ట్రాల శాసనసభలు పరోక్షంగా ఎన్నుకుంటాయి. సోమవారం ఖైబర్ పఖ్తూన్‌క్వా రాష్ట్ర అసెంబ్లీ 11 మంది సెనెటర్లను ఎన్నుకోగా, వాటిలో ఆరు స్థానాలను మాజీ ప్రధాని ఇమ్రాన్ ఖాన్‌కు చెందిన పాకిస్థాన్ తెహ్రీక్ ఇ ఇన్సాఫ్ (పీటీఐ) గెలుచుకుంది. దీంతో 96 మంది సభ్యులు గల సెనెట్‌లో పీటీఐ, దాని మిత్ర పక్షాల సంఖ్యాబలం 24కు చేరింది. అయితే, పాలక సంకీర్ణానికి మొత్తం 64 మంది సభ్యులున్నారు. కూటమి భాగస్వామ్యపక్షమైన పాకిస్థాన్ ముస్లిం లీగ్-నవాజ్ (పీఎంఎల్-ఎన్)కు 20 మంది, పాకిస్థాన్ పీపుల్స్ పార్టీ (పీపీపీ)కి 26 మంది, ఇతర భాగస్వాములకు 12 మంది సభ్యులున్నారు. ఆరుగురు స్వతంత్రుల మద్దతు కూడా కలుపుకొంటే పాలక పక్షం బలం 64కు చేరింది. అంటే సెనెట్‌లో మూడింట రెండువంతుల మెజారిటీ లభించిందన్నమాట. దిగువ సభ నేషనల్ అసెంబ్లీలో కూడా పాలక సంకీర్ణానికి మూడింట రెండు వంతుల మెజారిటీ ఉన్నందున రాజ్యాంగాన్ని సవరించే అధికారం ప్రభుత్వానికి దఖలుపడింది.

బిహార్‌లో 52 లక్షల మంది ఓటర్ల పేర్లు గల్లంతు?

ఇంటర్నెట్ డెస్క్: బిహార్‌లో ఎన్నికల సంఘం చేపట్టిన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) లో అధికారులు ఆసక్తికరమైన విషయాలు గుర్తిస్తున్నారు. రాష్ట్రంలో 52 లక్షల మంది ఓటర్లు వారు పేర్కొన్న చిరునామాల్లో లేరని కనుగొన్నారు. 18 లక్షల మంది ఓటర్లు చనిపోగా, 26 లక్షల మంది ఇతర నియోజకవర్గాలకు మారినట్లు ఈసీ తెలిపింది.

వివాదాల శాంతియుత పరిష్కారంపై మండలిలో పాక్ తీర్మానం ఆమోదం

ఇస్లామాబాద్ / ఐరాస: 'వివాదాల శాంతియుత పరిష్కారం కోసం యంత్రాంగాలను బలోపేతం చేసుకోవడం' అనే అంశంపై పాకిస్థాన్ ప్రాయోజిత తీర్మానాన్ని మంగళవారం ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి ఏకగ్రీవంగా ఆమోదించింది. పాక్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ భేటీకి అధికారిక పర్యటనలో ఉన్న ఆ దేశ విదేశాంగ మంత్రి ఇషాక్ దర్ అధ్యక్షత వహించారు.

ఇండో-పాక్ ఉద్రిక్తతలను అడ్డుకొన్నాం: అమెరికా

భద్రతా మండలిలోనూ అమెరికా పాత పాటే పాడింది. ఇండో-పాక్ ఉద్రిక్తతలను ట్రంప్ సారథ్యంలోని అమెరికా ప్రభుత్వం అడ్డుకొన్నట్లు ఆ దేశ దౌత్యవేత్త డొరోతి షే మంగళవారం భద్రతా మండలి సమావేశంలో మరోమారు చెప్పారు. ప్రపంచవ్యాప్తంగా ఎక్కడ అవసరమైనా మధ్యవర్తిత్వానికి, వివాదాల శాంతియుత పరిష్కారానికి అమెరికా కట్టుబడి ఉంటుందన్నారు.

శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాలో మెరుగుపడిన భారత్

ఇంటర్నెట్ డెస్క్: శక్తిమంతమైన పాస్‌పోర్టుల జాబితాలో భారత్ గతేడాదితో పోలిస్తే మరింత మెరుగుపడింది. నిరుడు 80వ స్థానంలో ఉండగా ప్రస్తుతం 77వ స్థానానికి చేరుకుంది. అయితే, వీసా రహిత ప్రయాణాలను అనుమతించే దేశాల సంఖ్య మాత్రం 59కి పరిమితమైంది. గతంలో ఇది 62 దేశాలుగా ఉన్న విషయం తెలిసిందే. గతేడాది ఫ్రాన్స్, జర్మనీ, ఇటలీ, జపాన్, సింగపూర్, స్పెయిన్ సంయుక్తంగా అగ్రస్థానంలో నిలవగా.. ఈసారి ఒక్క దేశం మాత్రమే తొలి స్థానంలో నిలిచింది. వీసా రహిత ప్రయాణాలను అనుమతించే దేశాల సంఖ్య ఆధారంగా పాస్‌పోర్టు శక్తిని లెక్కిస్తారు. ఇందుకు సంబంధించి హెన్లీ పాస్‌పోర్టు సూచీ -2025 విడుదలైంది. ఇందులో సింగపూర్ తొలిస్థానంలో నిలిచింది. ఈ పాస్‌పోర్టుతో 193 దేశాలకు వీసా-ఫ్రీ ప్రయాణానికి అవకాశం ఉంటుంది. రెండో స్థానంలో ఉన్న జపాన్, దక్షిణకొరియాల పాస్‌పోర్టుతో 190 దేశాలు చుట్టిరావచ్చు. డెన్మార్క్, ఫిన్లాండ్, ఫ్రాన్స్, జర్మనీ, ఐర్లాండ్, ఇటలీ, స్పెయిన్‌లు మూడో స్థానంలో ఉన్నాయి. ఈ జాబితాలో 77వ స్థానంలో ఉన్న భారత్ పాస్‌పోర్టుతో 59 దేశాలు వీసా లేకుండా ప్రయాణించవచ్చు. మలేసియా, ఇండోనేసియా, మాల్దీవులు, థాయ్‌లాండ్ వంటి దేశాలు వీసారహిత ప్రయాణాలకు అనుమతిస్తున్నాయి. శ్రీలంక, మకావు, మయన్మార్ తదితర దేశాలు మాత్రం అక్కడ దిగిన తర్వాత వీసాలు మంజూరు చేస్తున్నాయి. ఈ జాబితాలో అఫ్గానిస్థాన్ చివరి స్థానంలో ఉంది. ఇక్కడి పాస్‌పోర్టుతో కేవలం 25 దేశాలకు మాత్రమే వీసా ఫ్రీ ఎంట్రీ ఉంటుంది.

ఇరాన్ అణు కార్యక్రమంపై చర్చలు

టెహ్రాన్: తమ అణు కార్యక్రమం గురించి ఈ వారం ఐరోపా దేశాలతో చర్చలు పునరుద్ధరించనున్నట్లు ఇరాన్ ప్రకటించింది. తుర్కియే మధ్యవర్తిగా ఇస్తాంబుల్‌లో శుక్రవారం చర్చలు జరుగుతాయి. ఇరాన్ అణు కేంద్రాలపై ఇజ్రాయెల్, అమెరికాల దాడి తర్వాత చర్చలు ఇదే మొదటిసారి. ఇస్తాంబుల్‌లో బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీ ప్రతినిధులతో ఇరాన్ చర్చిస్తుంది. తమపై విధించిన ఆంక్షలను ఎత్తివేయడం, శాంతియుత ప్రయోజనాలకు అణుశక్తిని వినియోగించడంపై చర్చలు జరుగుతాయని ఇరాన్ వివరించింది. 2015లో ఆంక్షలు ఎత్తివేయడానికి బదులుగా తన అణు కార్యక్రమంపై అంతర్జాతీయ పరిమితులను ఇరాన్ అంగీకరించింది. కానీ ఆ ఒప్పందం నుంచి డొనాల్డ్ ట్రంప్ నేతృత్వంలోని అమెరికా వైదొలగి ఇరాన్‌పై మళ్లీ కొన్ని ఆంక్షలు విధించింది. ఇరాన్ చేతిలోకి అణ్వస్త్రం రాకూడదని పట్టుదలగా ఉన్న బ్రిటన్, ఫ్రాన్స్, జర్మనీలు తాము కూడా ఇరాన్‌పై మళ్లీ ఆంక్షలు విధిస్తామని హెచ్చరించాయి.

వాట్సప్‌లో పోస్ట్‌కు మద్దతు పలికాడని హత్య

- కుల సంఘం ఎన్నికల నేపథ్యంలో ఘటన
- తెలంగాణలో దారుణం



కృపాకర్

సూర్యాపేట నేరవిభాగం, న్యూస్‌టుడే: కుల సంఘం వాట్సప్ గ్రూప్‌లో పెట్టిన పోస్ట్‌కు మద్దతు పలికాడనే కారణంతో ఓ వ్యక్తిని హత్య చేశారు. ఈ దారుణ ఘటన మంగళవారం తెలంగాణలోని సూర్యాపేట పట్టణంలో జరిగింది. జిల్లా పద్మశాలీ సంఘానికి సంబంధించిన ఎన్నికలే హత్యకు దారితీశాయని పోలీసులు నిర్ధారించారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. పద్మశాలీ సంఘం ఎన్నికల ప్రక్రియలో భాగంగా నామినేషన్ల ఘట్టం సోమవారం పూర్తయింది. వచ్చే నెల 3న ఎన్నికలు నిర్వహించనుండగా.. మంగళవారం నామినేషన్ల ఉపసంహరణ ఉంది. ఈ నేపథ్యంలోనే సంఘం అధ్యక్షునిగా గతంలో పనిచేసిన అప్పం శ్రీనివాస్ నిధులను కాజేశారంటూ శ్రీరాముల రాములు అనే వ్యక్తి పోస్ట్ పెట్టాడు. ఇందుకు బదులుగా అప్పం శ్రీనివాస్ వివరణ ఇచ్చారు. సూర్యాపేట భగత్‌సింగ్ నగర్‌కు చెందిన మానుపురి కృపాకర్ (54) వివరణ పోస్టుకు మద్దతు పలుకుతూ క్లాప్స్ ఎమోజీని సోమవారం సాయంత్రం పెట్టారు. ఆ గ్రూపునకు అడ్మిన్‌గా ఉన్న రాములు.. కృపాకర్ పెట్టిన ఎమోజీని తొలగించాడు. అనంతరం ఫోన్ చేసి దుర్భాషలాడాడు. మనస్తాపానికి గురైన కృపాకర్ మంగళవారం ఎన్నికల అధికారికి ఫిర్యాదు చేసేందుకు కస్తూరి బజారులోని పద్మశాలీ భవనానికి వెళ్లారు. అక్కడే ఉన్న రాములు, అతని కుమారుడు ధనుంజయ్‌తోపాటు స్నేహితులు కృపాకర్‌పై దాడికి పాల్పడ్డారు. తీవ్రంగా గాయపడిన ఆయన్ని ఆసుపత్రికి తరలిస్తుండగానే ప్రాణాలు కోల్పోయారు. చెప్పుల దుకాణం నిర్వహించే కృపాకర్‌కు భార్య విజయలక్ష్మి, కుమారుడు, కుమార్తె ఉన్నారు. భార్య ఫిర్యాదుతో రాములు, ధనుంజయ్‌తోపాటు మరి కొందరిపై కేసు నమోదు చేసినట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య తెలిపారు.

పెట్టుబడి పేరుతో రూ.కోట్లు కొల్లగొట్టిన కేటుగాడు

మంగళూరు, న్యూస్‌టుడే: ప్రముఖ నేతలు, పారిశ్రామికవేత్తలతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయని దేశంలోని పలు ప్రాంతాల్లో ఉంటున్న శ్రీమంతులను పెట్టుబడి పేరుతో మోసం చేసి రూ.కోట్లు దోచుకున్న కేటుగాడు ఇటీవల పోలీసులకు చిక్కాడు. అతడిని మంగళూరుకు చెందిన రోషన్ సల్డానాగా గుర్తించారు. ఈ కేసు దర్యాప్తును సీఐడీకి అప్పగించామని నగర పోలీసు కమిషనర్ సుధీర్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్‌కు చెందిన ఒక పారిశ్రామికవేత్త నుంచి రూ. 1 కోటి బదిలీ చేయించుకున్న కేసు చిత్రదుర్గలో నమోదైంది. ఏపీకి చెందిన మరో వ్యక్తి నుంచి రూ.4 కోట్లు, మహారాష్ట్రకు చెందిన పారిశ్రామికవేత్త నుంచి రూ.5 కోట్లు, అస్సాంకు చెందిన వ్యక్తి నుంచి రూ.20 లక్షలను బ్యాంకు ఖాతాకు బదిలీ చేయించుకున్నాడని ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. అన్నింటినీ ఒకే కేసుగా పరిగణించి దర్యాప్తు బాధ్యతలను సీఐడీకి అప్పగించామన్నారు.

సిగాచీ.. కోటి కష్టాలు మిగిల్చి!

పరిహారం కోసం మృతుల కుటుంబీకుల పడిగాపులు



కడప జిల్లా పెనికలపాడుకు చెందిన నిఖిల్‌కుమార్‌రెడ్డి, ఆయన భార్య రమ్యశ్రీ సిగాచీ పరిశ్రమలో జరిగిన అగ్ని ప్రమాదంలో మరణించారు. తల్లి మాధవీలత, తండ్రి ప్రసాద్‌రెడ్డిలతోపాటు సోదరుడు నిశాంత్‌రెడ్డిలకు నిఖిల్ నెలవారీగా పంపే డబ్బే జీవనాధారం. ఇప్పుడు ఆ మొత్తం అందక.. పరిహారం లభించక ఆ కుటుంబం మానసికంగా.. ఆర్థికంగా కుదేలైంది.



చిత్తూరు జిల్లా పాకాలకు చెందిన హేమసుందర్ తల్లి ఇంద్రాణికి కుమారుడు పంపే డబ్బులే ఆధారం. సిగాచీ ఘటనలో కుమారుడు మరణించడంతో ఆమె బతుకు దుర్భరమైంది.



సిగాచీ పరిశ్రమలో ప్రమాదం జరిగిన సమయంలో సహాయక చర్యలు

ఈనాడు, సంగారెడ్డి: సిగాచీ పరిశ్రమ అగ్నిప్రమాద బాధిత కుటుంబాల్లో ఒక్కొక్కరిదీ ఒక్కో దీనగాథ. అండగా ఉన్నవారిని కోల్పోయి.. పరిహారం అందక సతమతమవుతున్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారం సిగాచీ పరిశ్రమలో జూన్ 30న జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో 46 మంది కార్మికులు మరణించారు. గాయపడిన 29 మంది ఆసుపత్రుల్లో చికిత్స పొంది కోలుకున్నారు. తొమ్మిది మంది స్వల్పంగా గాయపడ్డారు. మరో ఎనిమిది మంది ఆచూకీ లభించలేదు. మృతుల కుటుంబాలకు పరిశ్రమ యాజమాన్యం నుంచి రూ.కోటి పరిహారం అందిస్తామని ముఖ్యమంత్రి ప్రకటించారు. తీవ్రంగా గాయపడిన వారికి రూ.10 లక్షలు, స్వల్పగాయాలైన వారికి రూ.5 లక్షలు ఇస్తామని పేర్కొన్నారు. అయితే, ఘటన జరిగి 20 రోజులు దాటినా మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందలేదు.

ఇచ్చింది తక్షణ పరిహారమే

మరణించిన 46 మంది కుటుంబాలకు తక్షణ పరిహారం కింద రూ.లక్ష మాత్రమే అందించారు. రూ.కోటి పరిహారం పంపిణీ చేస్తామని కంపెనీ యాజమాన్యం సైతం పత్రికా ప్రకటనలో పేర్కొంది. 15 రోజుల వ్యవధిలో అందిస్తామని అధికారులు తెలిపారు. మృతుల కుటుంబాల సమగ్ర సమాచారం రెవెన్యూ యంత్రాంగం వద్ద ఉన్నా.. పంపిణీ చేయకపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది.

పది రోజుల్లో మరో రూ.10 లక్షలు

మరణించిన కార్మికుల కుటుంబాలకు మరో పది రోజుల్లో రూ.10 లక్షల చొప్పున అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నాం. దశలవారీగా ఎక్స్‌గ్రేషియా పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. ఆచూకీ లభించని వారి సమాచారం ప్రభుత్వానికి నివేదించాం.

– చంద్రశేఖర్, అదనపు కలెక్టర్, సంగారెడ్డి

రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు

మరణించిన వారిలో ఉత్తరాది రాష్ట్రాల వారే ఎక్కువ. రెక్కాడితేగానీ డొక్కాడని కుటుంబాలు వీరివి. మరణించిన ఒడిశా కార్మికుడి భార్య 7 నెలల గర్భిణి. ఉత్తర్‌ప్రదేశ్‌కు చెందిన మరో కార్మికుడి తల్లికి కళ్లు కనపడవు. ఆచూకీ లభించకుండా పోయిన 8 మందిని గుర్తించేందుకు డీఎన్‌ఏ పరీక్షలు నిర్వహించినప్పటికీ ఫలితం లేకపోవడంతో ఆయా కుటుంబాలకు తక్షణ సాయంగా రూ.15 లక్షల చొప్పున అందజేసి స్వస్థలాలకు పంపించారు. ఈ ఘటనను ప్రత్యేక కేసుగా గుర్తించి కేంద్ర హోంమంత్రిత్వ శాఖతో మాట్లాడితేనే వారికి మరణ ధ్రువపత్రాలు జారీ అయ్యే అవకాశాలున్నాయి.

సరూర్‌నగర్ కిడ్నీ రాకెట్ సూత్రధారి అరెస్ట్

- శ్రీలంకలో కేసినో నిర్వహణ.. భారత్‌లో కిడ్నీమార్పిళ్ల దందా
- గతంలో వైజాగ్‌లో తన స్థానంలో మరొకరిని జైలుకు పంపిన ఘనుడు

ఈనాడు, హైదరాబాద్: సంచలనం సృష్టించిన సరూర్‌నగర్ కిడ్నీరాకెట్ కేసులో సూత్రధారి పవన్ ఎలియాస్ లియోన్ ఎట్టకేలకు తెలంగాణ సీఐడీ పోలీసులకు చిక్కాడు. నగరంలోని ఎల్‌బీనగర్ ప్రాంతంలో సీఐడీ బృందం అతడిని మంగళవారం అరెస్ట్ చేసింది. సరూర్‌నగర్‌లోని అలకనంద సహా పలు ఆసుపత్రులలో అక్రమంగా కిడ్నీ మార్పిళ్లకు పాల్పడిన ముఠాకు పవన్‌ను సూత్రధారిగా గుర్తించారు. ఈకేసులో ఇప్పటికే పదిమందికిపైగా వైద్యులు, ఆసుపత్రుల నిర్వాహకులు, దళారులను అరెస్ట్ చేశారు. పవన్ మాత్రం శ్రీలంకకు పారిపోయాడు. గతంలోనూ శ్రీలంక, బెంగళూరు, విశాఖపట్నం, చెన్నైల్లో అతడు కిడ్నీరాకెట్ నిర్వహించాడు. తొలుత రాచకొండ పోలీసులు నమోదు చేసిన కేసును తర్వాత సీఐడీకి బదిలీ చేశారు. ఈ వ్యవహారం వెలుగు చూడకముందు పవన్ ఓవైపు శ్రీలంకలో కేసినో నిర్వహిస్తూనే భారత్‌లో కిడ్నీ దందా సాగించినట్లు వెల్లడైంది. గతంలోనే సీఐడీ అతడి కారును స్వాధీనం చేసుకుంది. అతడి కుటుంబసభ్యులపై నిఘా ఉంచింది. ఈక్రమంలోనే అనూహ్యంగా అతడు ఎల్‌బీనగర్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో గాలించి పట్టుకొంది.

ఒక్కో ఆపరేషన్‌కు రూ.30 లక్షల వరకు గిట్టుబాటయ్యేలా...

సీఐడీ దర్యాప్తులో పవన్‌కు సంబంధించి విస్తుపోయే అంశాలు వెలుగులోకి వచ్చాయి. విశ్వసనీయ సమాచారం ప్రకారం.. పవన్ గతంలో కిడ్నీ రాకెట్ వలకు చిక్కి తానే స్వయంగా కిడ్నీ అమ్ముకున్నాడు. ఈదందాలో దళారులకే ఎక్కువగా లాభం వస్తుందని గ్రహించి అతడూ రంగంలోకి దిగాడు. ఆర్థిక ఇబ్బందులతో సతమతమయ్యే వారిని గుర్తించేందుకు ఏజెంట్లను నియమించుకుని కిడ్నీ గ్రహీతల సమాచారాన్ని సేకరించాడు. ఇబ్బందులు ఎదుర్కొంటున్న చిన్న ఆసుపత్రుల యజమానులను గుర్తించి వారిపై వలేశాడు. అలా కిడ్నీదందాలో సొంతంగా నెట్‌వర్క్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఒక్కో కిడ్నీమార్పిడికి గ్రహీతల నుంచి రూ.50లక్షల నుంచి రూ.60లక్షలను వసూలు చేసి. . దాతలకు సుమారు రూ.5లక్షలు ఇవ్వడం ఆరంభించాడు. శస్త్రచికిత్స చేసిన వైద్యులకు.. సహకరించిన ఆసుపత్రుల నిర్వాహకులకు రూ.15లక్షల వరకు ఇచ్చేవాడు. అలా ఒక్కో ఆపరేషన్‌కు రూ.30లక్షల వరకు గిట్టుబాటయ్యేలా చూసుకునేవాడు. ఒక చోట కేసు నమోదైతే మరో చోటకు మకాం మార్చేవాడు. అలా గతంలో వైజాగ్‌లో ఒక కేసులో పవన్‌ను పోలీసులు నిందితుడిగా గుర్తించారు. అయితే పోలీసులకు అతడి ఆనవాళ్లు తెలియకపోవడంతో పవన్ పేరుతో ఉన్న మరో వ్యక్తిని తన స్థానంలో పంపాడు. అతడే సూత్రధారి పవన్ అనుకొని వైజాగ్ పోలీసులు అరెస్ట్ చేసి జైలుకు పంపారు. తాజాగా సీఐడీ దర్యాప్తులో ఆ విషయం వెలుగు చూసింది.

పీజీ మెడికల్ ఇన్‌సర్వీస్ కోటా నిర్ధారణపై తర్జనభర్జన!

ఈనాడు, అమరావతి: ప్రస్తుత విద్యా సంవత్సరం (2025- 26)లో పీజీ వైద్య విద్యలో ఇన్‌సర్వీస్ కోటాలో సీట్ల సంఖ్య ఖరారుపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖలో తర్జనభర్జనలు సాగుతున్నాయి. ఈ విద్యా సంవత్సరంలో ప్రవేశాలు పొందే ఎంబీబీఎస్ వైద్యులను పీజీ వైద్య విద్య ముగించిన తర్వాత.. 2028-29 సంవత్సరంలో ఉత్పన్నమయ్యే స్పెషాల్టీ వైద్యుల ఖాళీ పోస్టుల్లో నియమించాలి. దీని ప్రకారం పరిశీలిస్తే అప్పటికి రేడియాలజీ, ఎమర్జెన్సీ మెడిసిన్, పీడియాట్రిక్స్ విభాగాల్లో 23 స్పెషలిస్టు, 6 నాన్ క్లినికల్ విభాగాల్లో 80 పోస్టులు ఖాళీగా ఉంటాయని అంచనా వేశారు. ఉద్యోగ విరమణలు అనుసరించి ఈ లెక్క తేల్చారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేసే ఎంబీబీఎస్ వైద్యులకు ఇన్‌సర్వీస్ కోటాలో సీట్లు పొందే అవకాశం ఉంది. ఈ క్రమంలో 2024-25 విద్యా సంవత్సరంలో 14 క్లినికల్ విభాగాల్లో ఇన్‌సర్వీసు కోటా కింద 20 శాతం సీట్లు భర్తీ చేశారు. 272 సీట్లకు 259 మంది వైద్యులు ఇన్‌సర్వీసు కోటాలో సీట్లు పొందారు. నాన్ క్లినికల్ విభాగాల్లో 30 శాతం కింద 105 సీట్లు ఉన్నా 53 మందే ప్రవేశాలు పొందారు. స్థూలంగా 2024-25లో 378 సీట్లకు 312 మంది ప్రవేశాలు పొందారు. ఈ పరిస్థితుల్లో సీట్ల భర్తీలో ఇన్‌సర్వీస్ కోటా కింద 30 శాతం క్లినికల్, 50 శాతం నాన్ క్లినికల్ కోటా కొనసాగింపుపై స్పష్టత రావాల్సి ఉంది. అయితే యథావిధిగా ఈ కోటా కొనసాగించాలని ప్రభుత్వ వైద్యులు డిమాండ్ చేస్తున్నారు. అలాగైతే తమకు సీట్లు తగ్గుతాయని వైద్య విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేతనాల పెంపుతో పుర కార్మికులకు ఊరట

ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం

ఈనాడు, అమరావతి: పట్టణ స్థానిక సంస్థల్లో ఔట్ సోర్సింగ్ ఇంజినీరింగ్ కార్మికుల వేతనాలు పెంచుతూ తీసుకున్న నిర్ణయం ఊరట కలిగించిందని ప్రభుత్వ ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాణ్యం వేణు, అల్లం సురేశ్‌బాబు మంగళవారం ఓ ప్రకటనలో ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు. ఇతర ప్రభుత్వ శాఖల్లోని ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల వేతనాలూ పెంచాలని విజ్ఞప్తి చేశారు. 'పట్టణ స్థానిక సంస్థల్లో పారిశుద్ధ్య, పారిశుద్ధ్యేతర కార్మికులకు వేతనాల విషయంలో జరిగిన అన్యాయంపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించి కార్మికులను మూడు కేటగిరీలుగా విభజించి రూ.3000 నుంచి రూ.3,500 వరకు వేతనాలు పెంచడం సంతోషించదగ్గ విషయమ'ని పేర్కొన్నారు.

జల జీవన్ నీటి సరఫరా సంస్థ ఏర్పాటు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో జల జీవన్ మిషన్ పెండింగ్ పనుల పూర్తికి, ఆ పథకాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు, బ్యాంకుల నుంచి రుణాల సమీకరణకు వీలుగా ఏపీ జల జీవన్ నీటి సరఫరా సంస్థను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ సంస్థ ఛైర్మన్‌గా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పియూష్‌కుమార్ డైరెక్టర్‌గా ఉంటారని తెలిపింది. వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన ఏడుగురు ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శుల్ని డైరెక్టర్లుగా నియమించింది. గ్రామీణ తాగునీటి సరఫరా విభాగం చీఫ్ ఇంజినీర్ ఆధ్వర్యంలో మరో 22 మంది ఇంజినీర్లు, సిబ్బంది ఏర్పాటుకు ఆదేశించింది. ఈ సంస్థ ద్వారా బ్యాంకుల నుంచి రూ.10 వేల కోట్ల రుణం సమీకరించి జల జీవన్ మిషన్ పనులు పూర్తి చేయాలన్నది ప్రభుత్వ ధ్యేయం.

స్థానికులకు 95% ఉద్యోగాలు ఇవ్వాలి: నిరుద్యోగ ఐకాస

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో స్థానికులకు 95%, స్థానికేతరులకు 5% చొప్పున ఉద్యోగాలు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని నిరుద్యోగ ఐకాస రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ సీఎం చంద్రబాబును కోరారు. ఈ మేరకు మంగళవారం సచివాలయంలో సీఎంను కలిసి, వినతిపత్రం సమర్పించారు. తెలంగాణలోని ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థానికులకు 95% రిజర్వేషన్ అమలు చేస్తున్నారని, దీన్ని ఏపీలోనూ అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. మెగా డీఎస్సీ, జగన్ హయాంలో భర్తీ చేయకుండా వదిలేసిన 6,100 కానిస్టేబుల్ ఉద్యోగాలను కూటమి ప్రభుత్వం భర్తీ చేయడంపై కృతజ్ఞతలు తెలిపారు.